ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
బుధవారం 9 ఆగస్టు 2017 • 16


జలదీక్షతో నిరసన



ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలంటూ కిర్లంపూడి మండలం వేలంకలో జలదీక్ష చేపడుతున్న కాపు నేతలు

7లో

గెలుపుపై ధీమా!



అమాత్యులకు రెఫరెండం
మేయర్ పీఠం గెలుస్తామంటూ... సీఎంకు హామీ ఇచ్చిన మంత్రులు
గెలిపించలేకపోతే.. వచ్చే ఎన్నికల్లో టికెట్లు అడగమంటున్న ఎమ్మెల్యేలు!
కాకినాడ నగర పాలక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీడీపీ నేతలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి-కాకినాడ

"మూడేళ్లలో మనం చేసిన అభివృద్ధి, సంక్షేమాలే మనల్ని గెలిపిస్తాయి. కాకినాడ నగరంలో..ఇంత చేసి కూడా గెలవకపోతే అది ఇక్కడ నాయకుల తప్పిదమే అవుతుంది తప్ప పార్టీది, ప్రభుత్వానిది కాదు.. "

హైదరాబాద్‌లో టీడీపీ ప్రముఖులు, అమరావతిలో పరిశీలకులు, చెబుతున్న మాట ఇది..

ఈ మాటలతో జిల్లాలో మంత్రులు, కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తాము చేసిన అభివృద్ధి నేపథ్యంలో సదరు నేతలు గెలుపుపై ధీమాగా ఉన్నారు. కాకినాడ కార్పొరేషన్‌లో గెలిచి తీరతామంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ఘంటాపథంగా ఢంకా భజాయించి మరీ చెబుతున్నారు.

కాకినాడను స్మార్ట్‌సిటీగా ఎంపిక చేయడం నుంచి రోడ్లు, డ్రైన్లు వంటి పలు అభివృద్ధి పనులతో ప్రజల మన్ననలు పొందామని గెలుపునకు ఇవన్నీ దోహదపడతాయంటున్నారు.. జిల్లా మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చిన రాజప్ప, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలూ ఇదే ధీమాతో ఉండటం విశేషం.

కాకినాడ కార్పొరేషన్‌లో గెలవలేకపోతే.. రాబోయే రోజులలో జిల్లాలో పంచాయతీ, మున్సిపల్, మండల పరిషత్, 2019 అసెంబ్లీ ఎన్నికలపై ఉంటుందన్న అభిప్రాయం టీడీపీ నేతలలో బలంగా ఉంది. కేబినెట్‌లో కీలకమైన ఆర్థిక, హోంశాఖ మంత్రులు గెలుపు బాధ్యత తీసుకోవడమే తమకు తొలి విజయమని టీడీపీ కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యనమల, రాజప్ప

తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో జరుగుతున్న మొదటి ప్రత్యక్ష ఎన్నిక కావడంతో కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు టీడీపీకి, జిల్లా మంత్రులకు రెఫరెండంగా భావిస్తున్నారు. ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు కాకినాడ రూరల్ నియోజకవర్గం తిమ్మాపురంలో, అక్కడకు కిలోమీటరు దూరంలోని అచ్చంపేటలో డిప్యూటీ సీఎం చినరాజప్ప ఇళ్లలు నిర్మించుకున్నారు. ఇద్దరు మంత్రులు కాకినాడలో పార్టీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉండటం టీడీపీకి కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ఎప్పటికప్పుడు ఎన్నికల స్థితిగతులను పరిశీలించుకోవడం, ఇబ్బందులు ఉంటే సరిచేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ పరిణామం అనుకూల అంశంగా చెబుతున్నారు.

గెలిపించి తీరుతామంటున్న ఎమ్మెల్యేలు..

కార్పొరేషన్ ఎన్నికలలో టీడీపీని మెజార్టీతో గెలిపించిన తర్వాతే వచ్చే ఎన్నికలలో టికెట్లు అడుగుతామని కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు పిల్లి అనంత లక్ష్మి, వనమాడి కొండబాబు పార్టీ ముఖ్యనేతలకు ఇప్పటికే మాటిచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. టీడీపీకి (మిగతా 15లో)

కాకినాడ న'గరం'




'కాపులకే'.. మేయర్.. సీటు

రేపు నామినేషన్లు దాఖలు
బీజేపీతో పొత్తు ఉంటుంది..
అధిష్టానానికి జాబితా పంపాం
29న జరిగే కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో..మాదే విజయం
డిప్యూటీ సీఎం రాజప్ప

కాకినాడ సిటీ: కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని కాపులకు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 29న జరిగే నగర పాలక ఎన్నికల్లో టీడీపీ విజయకేతనం (మిగతా 15లో)

లోపలి పేజీల్లో



గృహ నిర్మాణ శాఖ అధికారులు

పరుగులు



అధికారులే శంకుస్థాపనలు చేస్తున్న వైనం
యుద్ధప్రాతిపదికన ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి
ముహూర్తాలు లేకపోవడంతో వెనుకడుగు వేస్తున్న లబ్ధిదారులు
గ్రామస్థాయిలో ఇళ్ల నిర్మాణ లక్ష్యాల నిర్దేశం

ఆంధ్రజ్యోతి-అమలాపురం

ప్రభుత్వం గృహనిర్మాణశాఖ లబ్ధిదారులను పరుగులు పెట్టిస్తోంది. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాల్లో అత్యంత ఆకర్షణీయమైన గృహనిర్మాణ పథకం ఎక్కడా అమలుకు నోచుకోని తీరు లబ్ధిదారుల్లో అసంతృప్తిని కలిగించింది. దాంతో ప్రభుత్వం గృహనిర్మాణశాఖ పథకాల్ని ఆఘమేఘాలపై అమలుచేసేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ముహూర్తాలతో సంబంధం లేకుండా లబ్ధిదారులను వెతికి పట్టుకుని దగ్గరుండి మరీ ఇళ్లకు శంకుస్థాపన చేయిస్తున్నారు. గ్రామాల వారీగా హౌసింగ్ నిర్మాణాలు వేగవంతమయ్యేలా గ్రామస్థాయిలో వివిధ శాఖల అధికారులతో కమిటీలు వేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో గృహనిర్మాణశాఖ పథకాలు లబ్ధిదారులకు అందని ద్రాక్షలా మిగిలాయి. దాంతో ప్రభుత్వ తీరుపై వ్యక్తమవుతున్న అసంతృప్తిని సర్వేల ద్వారా అవగతం చేసుకున్న ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గృహనిర్మాణాలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశాలు ఇచ్చి జిల్లా యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తోంది. దాంతో కలెక్టర్ నుంచి గృహనిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ వరకు గ్రామాలబాట పట్టి ఎంపికైన లబ్ధిదారులతో శంకుస్థాపనలు చేయించడంతోపాటు ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసేలా ప్రణాళికల అమలుకు శ్రీకారం చుట్టారు. వివిధ (మిగతా 15లో)

'లాజిస్టిక్ హబ్'?



- 89 ఎకరాల్లో మల్టీ మోడల్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంపై నోరు మెదపని అధికారులు
- రూ. 450 కోట్లతో కార్యాచరణ ఉత్తుత్తిదేనా!
- ఏపీ, కాంకర్ సంయుక్త నిర్వహణలో.. కనిపించని అభివృద్ధి

ఆంధ్రజ్యోతి, కాకినాడ... వివరాలు...15లో



అన్నవరం సమాచారం

అన్నవరం సత్యదేవుని సన్నిధిలో మంగళ వారం 351 వ్రతాలు జరిగాయి. వివిధ విభా గాల ద్వారా రూ.5లక్షలు ఆదాయం లభించగా అన్నదాన పథకానికి రూ.34వేలు విరాళంగా సమకూరింది. దేవస్థానం విచారణ కార్యా లయం నెంబరు 08868-238163.

- అన్నవరం

సత్రం వివరం	గదులు	ఖాళీలు
సీతారామ సత్రం	93	23
ఓల్డ్‌సీసీ	47	20
న్యూసీసీ	47	12
ప్రకాశ్‌సదన్	86	15
ఎస్‌జీహెచ్	59	18
హరిహరసదన్	140	85
సత్యనికేతన్	60	30
వనదుర్గ	12	4



అంతర్వేది సమాచారం

అంతర్వేది: శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్యాన్నదానానికి మంగళ వారం 445మంది భక్తులు విచ్చే యగా విరాళంగా రూ.18596 ప్రత్యే క టిక్కెట్ల ద్వారా రూ.12130 వచ్చిన ట్టు ఇన్‌చార్జి ఆలయసహాయ కమిష నర్ ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్	(రూ.)
ఫారం	63
రిటైల్	77
విత్‌స్కిన్	108
స్కిన్‌లెస్	127

నెక్.. కోడి గుడ్డు

గోదావరి జోన్ రైతు ధర రూ.3.28
తూ.గో.జోన్ రైతు ధర రూ.3.28

డిటెన్షన్.. అటెన్షన్..!



అమలుకు కేంద్రం సన్నాహాలు.. విద్యాహక్కుచట్టానికి విఘాతం అంటున్న ఉపాధ్యాయులు

డ్రాప్‌అవుట్స్ పెరుగుతాయంటూ అనుమానాలు.. వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

సామర్లకోట: పాఠశాలస్థాయిలో డిటెన్షన్ విధానం తీసుకురావాలని కేంద్రప్రభుత్వం భావిస్తోంది. 5, 8 తర గతులకు డిటెన్షన్ విధానం అమలు చేస్తామని కేంద్ర మంత్రి ప్రకాష్‌జావదేకర్ తాజాగా ప్రకటించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 1 నుంచి 8 తరగతుల వరకు ఒక సబ్జెక్టులో విద్యార్థులు తప్పితే పైతరగతులకు ఎటు వంటి అడ్డంకులు లేకుండా ప్రమోట్ అవుతున్నారు. అన మానతలు ఉన్నచోట ప్రమాణాలు పేరిట ఒక సబ్జెక్టు ఫెయిల్ అయినా ప్రమోట్ చేయకపోవడం తగదని విద్యారంగ నిపుణులు అంటున్నారు. పాఠశాలస్థాయిలో డిటెన్షన్ విధానం అమలు చేయడంవల్ల విద్యాప్రమా ణాలు మెరుగుపడతాయనే అభిప్రాయం కూడా ఉంది. ప్రస్తుతం పాఠశాల విద్యారంగంలో అనేక సమస్యలు ఉన్నాయి. తరగతి గదులు, ఉపాధ్యాయులు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కొరత వంటి సమస్యలు వేధిస్తు న్నాయి. ముందు వీటిని సరిచేయకుండా డిటెన్షన్ విధా నాన్ని ప్రవేశపెట్టడం ఏంటి అనే ప్రశ్నలు నలువైపులా నుంచి వినవస్తున్నాయి.

అమలు సాధ్యమేనా?

ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన దేశాల్లో పాఠ శాలస్థాయిలో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయడం కష్టం. ప్రజలు పేదరికంలో ఉండడం ప్రభుత్వం విద్యా రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం వల్ల విద్యారంగంలో తీవ్ర అసమానతలు ఉన్నాయి. బతుకు దెరువు కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఒకచోట నుంచి మరోచోటకు వలస వెళ్తుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థుల ప్రతిభను పరీక్షల్లో మార్కులతో కొలవడం అశాస్త్రీయమని విద్యావేత్తలు అంటున్నారు. డిటెన్షన్ అనేది విద్యాహక్కునకు విఘాతమని వాదిస్తున్నారు.

విద్యాహక్కు చట్టం ఏం చెబుతుందంటే..

విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం 14ఏళ్ల వయస్సు వరకు బాలబాలికలకు నిర్బంధ విద్యాహక్కు కల్పించి ది. 1నుంచి 8వ తరగతి వరకు ప్రతి సంవత్సరం విద్యా ర్థులను పైతరగతికి ప్రమోట్ చేయాలనే నిబంధన ఉంది. డిటెన్షన్ విధానంవల్ల కింది తరగతి పరీక్షల్లో పాసైతేనే పైతరగతికి ప్రమోట్ చేస్తారు. ఫెయిల్ అయితే అదే తరగతిలో కూర్చోబెడతారు. ఈ విధానం వల్ల పేద విద్యార్థులు బడి మానివేస్తారు.


డిటెన్షన్ విధానం ప్రయోజనాలు...



- విద్యార్థుల్లో కనీస సామర్థ్యం పెరిగే అవకాశం ఉంది.
- ఉపాధ్యాయుల్లో మరింత బాధ్యత పెరుగుతుంది.
- ప్రస్తుతం 6వ తరగతిలో ప్రవే శించే విద్యార్థుల్లో చాలామందికి కనీసస్థాయి అభ్యసన ఉండడం లేదు. డిటెన్షన్‌తో ఈ సమస్య తీరుతుంది.
- విద్యా ప్రమాణాలు పెరిగి పిల్లల భవిష్యత్‌కు దోహదపడుతుంది.
- అభ్యసన స్థాయిలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశా లల విద్యార్థుల మధ్య వ్యత్యాసం తగ్గుతుంది. త ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి.
- విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు దోహద పడుతుంది.

-కె.అరుణ గణితోపాధ్యాయురాలు

విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకం...



డిటెన్షన్ విధానం విద్యాహక్కు చట్టం 2009కి వ్యతిరేకం. 1నుంచి 8వ తరగతి వరకు ప్రతి సంవత్సరం విద్యార్థులు పరీ క్షల్లో తప్పినా పైతరగతులకు ప్రమోట్ చేయాలి. 14ఏళ్ల వరకు నిర్బంధ విద్య అమలు చేయాలి. డిటెన్షన్ విధానం అమలు చేసే ముందు మేధావులు, విద్యావేత్తలు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి. లేకుంటే వ్యతిరేకత వస్తుంది.

-కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయుడు

డ్రాప్‌అవుట్ సంఖ్య పెరుగుతుంది...



పాఠశాల స్థాయిలో డిటెన్షన్ విధానం అమలు చేస్తే విద్యాప్రమాణాలు పెరు గుతాయి. కానీ.. మనదేశంలో నిరక్షరా స్యులు అధికంగా ఉన్నారు. బతుకుదెరు వుకోసం ఉన్నప్రాంతం వదిలి వలస వె ళ్తున్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో హాజరుశాతం తక్కు వే. డిటెన్షన్ విధానం అమలు చేస్తే డ్రాప్ అవుట్స్ పెరిగి బాలకార్మికులుగా మారే ప్రమాదం ఉంది.

-యు.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు

డిటెన్షన్ విధానాన్ని స్వాగతిస్తున్నాం



డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టాలనే ఆ లోచనను స్వాగతిస్తున్నాం. దీనివల్ల వి ద్యార్థుల్లోను, ఉపాధ్యాయుల్లోను జవాబు దారీతనం పెరుగుతుంది. కనీస అభ్యస నస్థాయి మెరుగుపడుతుంది. ఈ విధానం విజయవంతం కావాలంటే ముందుగా ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి. ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని కేటాయించాలి.

-కె.ఎస్.వాణి, ప్రగతి డీఈడీ కళాశాల ప్రిన్సిపాల్

రాజమహేంద్రవరంలో రూ.కోటిపైనే పాత కరెన్సీ పట్టివేత

పదిమంది అరెస్టు.. ఒక కారు, ఐదు బైక్‌లు, పది సెల్‌ఫోన్‌లు స్వాధీనం.. పట్టుబడిన వారంతా రియల్ ఎస్టేట్ వ్యాపారులే... అర్బన్ ఎస్పీ రాజకుమారి

రాజమహేంద్రవరం సిటీ: కమిషన్ పద్ధతిపై పాత నోట్లను మార్చేందుకు ప్రయత్నిస్తున్న ఒక ముఠాను రాజ మహేంద్రవరం అర్బన్ జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ అతిథి గృహంలో ఎస్పీ రాజకుమారి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి పాతనోట్ల ముఠా వివరాలను వెల్లడించారు. హౌసింగ్‌బోర్డుకాలనీ సత్యసాయి అపార్టుమెంట్‌లో రా యుడు నాగకుమార్‌కి చెందిన ఫ్లాట్‌కు పదిమంది గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి వెళ్తున్నారని వచ్చిన సమాచారం మేరకు తూర్పు మండల డీఎస్పీ రమేష్‌బాబు ఆధ్వర్యం లో బొమ్మూరు పోలీసులు ఆ అపార్టుమెంట్‌పై దాడి చే శారని చెప్పారు. అక్కడ దాచిపెట్టిన పాత రూ.వెయ్యి, రూ.500 నోట్లు రూ.కోటి16లక్షల35వేలను, కొత్త రూ.రెండు వేల నోట్లు రూ.55 వేలను, ఒక కారు, పది ఫోన్లు, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ నోట్లను కమి షన్ పద్ధతిపై మార్చేందుకు ప్రయత్నిస్తున్న రాజమహేం



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎస్పీ రాజకుమారి

ద్రవరం మహాలక్ష్మీ టెంపుల్ వీధికి చెందిన గుద్ద తారక ప్రసన్నకుమార్, సత్యసాయి అపార్టుమెంట్‌లో ఫ్లాట్ కలి గిన రాయుడు నాగకుమార్, గోరక్షణపేటకు చెందిన సో మి జగదీష్, ఏవీఏ రోడ్ శ్రీనివాసనగర్‌కు చెందిన వాం ద్రాసి వీర వెంకట సత్యనారాయణ, యామగిరి చిరంజీవి, సీటీఆర్‌ఐ భాస్కర్‌నగర్‌కు చెందిన గొలకోటి నాగేశ్వర రావు, సుబ్రహ్మణ్యనగర్‌కు చెందిన తోరం శ్రీనివాస్‌లతో పాటు నిడిగట్లకు చెందిన మేడిశెట్టి శివరామ్, పశ్చిమగో దావరి జిల్లా భూపన్నపట్టణానికి చెందిన కడలి వీర వెం కట శ్రీరామచంద్రమూర్తి, కొవ్వూరు అచ్చియ్యమ్మకాలనీకి చెందిన మునునూరి తేజో లక్ష్మీనారాయణప్రసాద్‌లను అ రెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. వీరిని కోర్టుకు తరలిస్తా మన్నారు. ఈ నగదును సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తామని తెలిపారు. పట్టుబడినవారంతా రియల్ ఎస్టేట్ నిర్వహి చేవారని, ఆదాయపు పన్నుల పరిధిలోకి రాని ఈ పాత క రెన్సీ వీరికి చెందిందేనని దాన్ని మార్చే ప్రయత్నం చేస్తూ పట్టుపడ్డారని తెలిపారు. ఎన్నాళ్లైనా ఈనెల 17వ తేదీ వరకు పాత నగదు మార్చుకునే అవకాశం ఉన్నందున ఆ దిశగా ప్రయత్నం చేస్తూ రద్దు చేసిన పాత కరెన్సీని నిల్వ చేశారని ఎస్పీ చెప్పారు. ఏఎస్పీ రెడ్డి గంగాధర్, డీఎస్పీలు రమేష్‌బాబు, రామకృష్ణ, బొమ్మూరు సీఐ కెవెన్ మోహన్ రెడ్డి, ఏజీఎస్ బృందం పాల్గొన్నారు.

0884-2362000

ప్రతి గురువారం డయల్ యువర్ ఎస్పీ

కాకినాడ క్రైం: జిల్లా ప్రజలు ఎవరికి ఏ సమస్య ఎదురైనా ఆయా పోలీస్‌స్టేషన్‌లో సమస్య పరిష్కారం కాకపోతే తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ విశాల్‌గున్ని వెల్లడించారు. ప్రతి గురువారం కాకినాడ లోని తన కార్యాలయంలో 'డయల్ యువర్ ఎస్పీ' ని ర్వహించనున్నామన్నారు. జిల్లా ప్రజలు ప్రతి గురు వారం 0884- 2362000 నెంబర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను నేరుగా విన్నవించుకోవచ్చన్నారు. ఈ నెంబర్‌ను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు వినియోగించుకోవాలన్నారు.

'జ్ఞానభూమి' వెబ్ పోర్టల్‌లోనే ఉపకార వేతనాల నమోదు

కాకినాడ(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు ఆయా కేటగిరీలకు చెందిన విద్యార్థులు ఏపీ ఈ-పాస్ వెబ్‌సై ట్‌లో వివరాలు నమోదు చేసుకుని ఉపకారవేతనాలు పొందేవారని సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకు రాలు ఎంఎస్ శోభారాణి అన్నారు. ఈ విద్యా సంవ త్సరం(2017-18) నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, వికలాంగ కేటగిరీల విద్యార్థులు తమ రెన్యువల్, ఫ్రెష్ పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి 'జ్ఞానభూమి' వెబ్ పోర్టల్‌లో సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ లాగిన్‌లో మాత్రమే దరఖాస్తు చేసి ఆధార్ అథెంటికేషన్‌తో సంక్షేమ శాఖలకు పంపాలన్నారు. ఇకనుంచి విద్యార్థులు ప్రిన్సిపాల్స్ లాగిన్స్‌లో కళాశాలల్లో మాత్రమే ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ప్రైవేట్ నెట్ సెంట ర్లలో నమోదు చేయించవద్దని సూచించారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం

మెగా రికవరీ శిబిరంలో కార్పొరేషన్ బ్యాంకు సీజీఎం వర్మ

కాకినాడ(ఆంధ్రజ్యోతి): పంట రుణాలు తీసుకుని, సకాలంలో తీర్చలేని రైతులకు రాయితీ ఇచ్చి ఆదుకోవా లనే ఉద్దేశంతో తమ ఉన్నతాధికారులు ముందుకు వచ్చా రని కార్పొరేషన్ బ్యాంకు సర్కిల్ జనరల్ మేనేజరు రాజే ష్కుమార్ వర్మ స్పష్టం చేశారు. జిల్లాలోని 11 శాఖల పరి ధిలో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని 500 మంది రైతులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ అమలు చేశారు. మంగళవారం కాకినాడ భానుగుడి సెంటర్లో ఉన్న బ్యాంకుకు రైతులను పిలిపించి అక్కడికక్కడే మొత్తం అప్పును రూ.రెండు కోట్లకు సెటిల్ చేశారు. అనంతరం వర్మ మాట్లాడుతూ రైతుల శ్రేయస్సే తమ బ్యాంకు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీజీఎం మీనాక్షీసుందరం, ఏజీఎం డీవీ శ్రీనివాస్, బ్రాంచి మేనే జరు ఎంఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.



సీజీఎం రాజేష్‌కుమార్‌వర్మ నుంచి రుణ విమోచన పత్రం తీసుకుంటున్న రైతు

ఉత్తమ విద్యా ప్రమాణాలతో బోధన: హోంమంత్రి

పండూరు(ప్రతాప్‌నగర్):విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రమాణాలతో కూడిన బోధనను ఆనంద లహరి అభ్యసన ద్వారా అందించవచ్చని హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండలం పండూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్వశిక్షా భియాన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆనందలహరి అభ్యసన (ఆఅ) కార్యక్రమం ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి ఆలోచన మేరకు రిషీ వ్యాలీలో అమలు చేస్తోన్న విద్యా విధానాన్ని రాష్ట్రంలోని 1372 పాఠశాలల్లో తొలి దశలో అమలు చేస్తున్నామన్నారు. ఈ విద్యా విధానాన్ని ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన పాఠ్య పుస్తకాలలో పొందుపరిచినట్టు తెలిపారు. దీని ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, ట్యాబ్‌ల వినియోగం ద్వారా వారిలో ఆసక్తిని పెంపొందించే విధంగా బోధిస్తారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్లే స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సర్వశిక్షాభియాన్ పీవో శేషగిరి మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశలో ఏడు రెవెన్యూ డివిజన్‌లో ఒక్కొక్క పాఠశాలలో ఆనందలహరి అభ్యసన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే అనంతలక్ష్మి మాట్లాడుతూ మొదటి, రెండవ తరగతుల్లోని విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగం ద్వారా సాంకేతికతతో కూడిన విద్యను అందించవచ్చన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సత్తిబాబు,


పండూరులో ఆనందలహరి అభ్యసన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం

రాజమహేంద్రవరం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జయప్రకాష్, సర్వశిక్షాభియాన్ ఈఈ రాంబాబు, సర్పంచ్ వీరబాబు, ఉపసర్పంచ్ బావిశెట్టి శ్రీను, ఎంఈవో గణేష్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీని వాస్, కార్యదర్శి బీబీ పాల్గొన్నారు.

పింఛన్ల అవకతవకలపై కమిషనరు విచారణ

● రికార్డుల పరిశీలన

పిఠాపురం: ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా పిఠాపురం పురపాలక సంఘం పరిధిలో పింఛన్ల మంజూరులో జరిగిన అవకతవకలపై భీమవరం మునిసిపల్ కమిషనర్ నాగనరసింహారావు మంగళవారం విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు బాధ్యులైన సిబ్బందిని విచారించారు. నిబంధనలు పాటించనట్లు గుర్తించారు. పిఠాపురం పట్టణ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా గత ఫిబ్రవరి నెలలో 321మందికి పింఛన్లు మంజూరు చేశారు. వీటిలో పలు అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. భర్త బతికే ఉన్నా చనిపోయినట్లు చూపించి వితంతు పింఛన్లు మంజూరు చేయడం, ఇతర కులాల వారిని చేనేత, కల్లుగీత కార్మికుల కేటగిరీగా చూపి వారికి చేనేత, కల్లు గీత పెన్షన్లు ఇవ్వడం, తగిన ధృవీకరణ పత్రాలు లేకుండా వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్లు మంజూరు చేయడం వంటి సంఘటనలు జరిగాయి. జన్మభూమి కమిటీలు ఇచ్చిన పేర్ల ను నేరుగా ఆన్‌లైన్ చేయడం వంటి వ్యవహారాలు చోటు చేసుకున్నాయి. దీనిపై జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు కాకినాడ ఆర్డీవో ఎల్.రఘుబాబు ఆధ్వర్యంలో రెవిన్యూ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. సుమారు వందమంది అనర్హులకు పెన్షన్లు మంజూరయినట్లు నిర్ధారించారు. వీరు విచారణలో ఏ విధమైన ధృవీకరణ పత్రాలు చూపలేకపోయారని అప్పట్లో కలెక్టరుకు నివేదిక ఇచ్చారు. దీనిపై మునిసిపల్ అధికారులు మరోమారు విచారణ జరిపి అనర్హులను పింఛన్ లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించారు. ఈ వ్యవహారంలో జూనియర్ అసిస్టెంటు యర్రంశెట్టి వేణుగోపాల్‌ను సస్పెండ్ చేయగా, కంప్యూటర్ ఆపరేటర్ రాజేష్‌ను మెప్మా కార్యాలయానికి సరెండర్ చేశారు. అనంతరం దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పురపరిపాలనాశాఖ రీజనల్ డైరెక్టరు భీమవరం మునిసిపల్ కమిషనరును


పిఠాపురంలో విచారణ జరుపుతున్న మునిసిపల్ కమిషనరు నాగనరసింహారావు

ఆదేశించారు. ఆర్డీ ఆదేశాల మేరకు భీమవరం కమిషనరు విచారణ చేపట్టారు. పింఛన్ల మంజూరులో నిబంధనలు పాటించనట్లు గుర్తించారు. జూనియర్ అసిస్టెంటు వేణుగోపాల్, కంప్యూటర్ ఆపరేటర్ రాజేష్, మేనేజరు మూర్తిల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. పిఠాపురం కమిషనరు ఎం.రామ్మోహన్ నుంచి వివరాలు తీసుకున్నారు. వారం రోజుల్లోగా ఆర్డీకి నివేదిక సమర్పిస్తామని కమిషనరు నాగనరసింహారావు తెలిపారు.

13న అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

కాకినాడ స్పోర్ట్స్: జిల్లా బాలుర, బాలికల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపికను నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి కె.కిరణ్‌రాజు మంగళవారం తెలిపారు. రంగరాయ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో ఉదయం 8.30 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. 1-9-2003 తర్వాత జన్మించినవారు ఈ ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు తమ పేర్లు కాకినాడలోని సంఘ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 91600 00005 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో చేనేత కార్మికుడి మృతి

కొత్తపల్లి: విద్యుదాఘాతంతో చేనేత కార్మికుడు మరణించాడు. కొత్తపల్లి మండలం గాజులదొడ్డికి చెందిన వడిగే సన్యాసిరావు(54) కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం మగ్గం నేస్తుండగా, మగ్గానికి ఉన్న జరీ కందెకు తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అక్కడిక్కడే మరణించాడు. భార్య సత్యవతి, కుమార్తె సూర్యకళకు గాయాలయ్యాయి. కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల అదృశ్యంపై కేసు నమోదు

ప్రత్తిపాడు : మండలంలో రాచపల్లి, ధర్మవరం గ్రామాల్లో ఇద్దరు బాలికలు వేర్వేరుగా అదృశ్యమైనట్టు మంగళవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు పెద్దాపురం మండలం కట్టమూరుకు చెందిన దాసరి వీరలక్ష్మి(8) ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఐదు రోజుల నుంచి బాలిక కనిపించడం లేదని బాలిక తండ్రి దాసరి సత్తిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ధర్మవరంలో ఏలూరు నాగలక్ష్మి(17) అదృశ్యమైంది. బాలిక నానమ్మ సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు యూనిసెఫ్ కృషి'

పెద్దాపురం రూరల్ : చిన్నారుల విద్య, ఆరోగ్య పరిరక్షణకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్‌నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యూనిసెఫ్) కృషి చేస్తోందని సంస్థ ప్రతి నిధి అమిత్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కాండ్రకోట, కట్టమూరు, ఆర్‌బీ కొత్తూరు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఆర్‌బీ కొత్తూరులో ఎంపీ యూపీ పాఠశాల, గాయత్రీ ఇంగ్లిషు మీడియం స్కూల్, కట్టమూరులో అమరావతీ పబ్లిక్ స్కూల్‌ను ఆయన సందర్శించి మీజిల్స్ రూబెల్లా వాక్సినేషన్ అమలు తీరును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది చిన్నారుల ఆరోగ్య పరిరరక్షణకు యూనిసెఫ్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాండ్రకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సీహెచ్ ధనలక్ష్మి, ఎంపీ హెచ్‌ఈవో ఎం. ఏలియా, శ్రీనివాస్, కరస్పాండెంట్లు ఎలిశెట్టి వెంకటేశ్వరరావు, జీవీవీ వీర్రాజు, హెచ్ ఎం కొత్త నాగశంకర్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గాయత్రీ పాఠశాలను సందర్శించిన యూనిసెఫ్ బృందం

గ్యాస్ లీకేజీతో ప్రజల ఆందోళన

అంతర్వేది: అంతర్వేది గునిశెట్టివారి పుంతలో స్వల్పంగా ఓఎన్‌జీసీ గ్యాస్ లీకైంది. అంతర్వేది తీర ప్రాంతంలో ఉన్న 7, 12, 29 బావుల నుంచి మోరి జీసీఎస్‌కు వెళ్లే పైపులైన్ మంగళవారం ఉదయం లీకవడంతో స్థానికులు భయబ్రాంతులకు గురయ్యారు. సమీపంలోని పాఠశాలకు సెలవు ప్రకటించి విద్యార్థులను ఇంటికి పంపించారు. స్థానికుల సమాచారం మేరకు మోరి జీసీఎస్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

అనంతరం పైపులైన్ మరమ్మతు పనులు చేశారు. ఈ విషయమై స్థానిక సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్, భాస్కర్ల గణపతి మాట్లాడుతూ తరచూ గ్యాస్ లీకేజీలపై ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారని, ఓఎన్‌జీసీ అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు ట్రైకార్ రుణాలకు ఇంటర్వ్యూలు

వరరామచంద్రాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లోని షెడ్యూల్ తెగల అభ్యర్థులకు ఈనెల 10వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.రామలింగేశ్వరరావు తెలిపారు. మండలంలోని సుమారు 130 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ట్రైకార్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో స్ర్కీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు అభ్యర్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో అన్నారు.

సీసీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సీసీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు

రంపచోడవరం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మార్క్స్ ఏంగిల్స్ భవన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజన చట్టాలైన 1/70, పీసా, అటవీ హక్కులు, చట్టాలు అమలు చేయాలని, ఆదివాసీలపై నిర్బంధ చర్యలను మానుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ వ్యతిరేక విధానాలు విడనాడాలని, ఆదివాసీ సంపదలైన లెటరైట్, మైనింగ్‌లను విదేశి, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని మానుకోవాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకుడు పల్లాల అశోక్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బి.రమేష్, జిల్లా నాయకుడు ఐ.రమణ, పి.లచ్చిరెడ్డి, కంగల బాలుదొర, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి.అనసూయ, పీవైఎల్ జిల్లా కార్యదర్శి వలల వాసు, కె.బాపన్నదొర, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ఎస్.ప్రకాష్, కె.చంద్ర తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకే ఆదివాసీ దినోత్సవం

చింతూరు: ఆదివాసీలు, తమ హక్కులను సాధించుకునేందుకు, సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు జల్లి నరేష్ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతి ఆదివాసీ పండుగలా జరుపుకోవాలని ఆయన కోరారు. నాయకుడు కుంజా శ్రీను పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి తల్లిపాలే శ్రీరామరక్ష

తొండంగి రూరల్: పిల్లల ఆరోగ్యానికి తల్లిపాలే శ్రీరామరక్షని ప్రతి తల్లి తన బిడ్డకు పాలందించి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శారదాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం ఏవీ నగరంలో జీఎంఆర్ వరలక్ష్మి, ఫౌండేషన్, ఐసీడీఎస్ తుని రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను చాటుచెప్పేందుకు అన్ని గ్రామాల్లో వారోత్స వాలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్వాడీ వర్కర్లు అందించే సూచనలు పాటించి మెరుగైన ఆరోగ్యం పొందాలన్నారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల ద్వారా పిల్లల పోషకాహార విలువలు వాటిని కాపాడేందుకు తీసుకో వలసిన చర్యలపై అవగాహన ఏర్పడు తుందన్నారు. ప్రోగ్రాం అధికారి సుధాకర్ మాటాడారు. సీడీపీవో మాధవి, సర్పంచ్ యనమల వెంకటరమణ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం: జేసీ



నిర్వాసితుల సమస్యలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వరి

చింతూరు/కూనవరం: పోలవరం ప్రాజెక్టు మూలంగా ముంపునకు గురయ్యే నిర్వాసిత కుటుంబాలకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జాయింట్ కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం కూనవరం మండలం టేకులబోరులోని శ్రీరాజ్యలక్ష్మి కల్యాణ మండపంలో నాలుగు మండలాల నిర్వాసితులతో ఆయన అవగాహన సదస్సు ఏర్పాటు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి ఫేజ్‌లో కూనవరం, వరరామచంద్రాపురం మండలాల్లోని 11గ్రామాలకు పునరావాసం కల్పిస్తామన్నారు. 11గ్రామాల్లో 1011 గిరిజన కుటుంబాకు, 536 గిరిజనేతర కుటుంబాలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అందిస్తామన్నారు. గిరిజనులకు ఇదే మండలాల్లో ముంపునకు గురికాని ప్రాంతాలను ఇప్పటికే ఎంపిక చేశామని, ఎటపాక మండలం రాయినపేట, కాపవరం, నర్సింగపేట, భైరవపట్నం, ఎర్రబోరు ప్రాంతాలను గుర్తించామన్నారు. ఈప్రాంతాల్లో ఈ 11గ్రామాలకు చెందిన గిరిజన కొండరెడ్ల కుటుంబాలకు 2013 కొత్త ఆర్‌ఆర్ ప్యాకేజీ ప్రకారం పరిహారం అందజేస్తామన్నారు. గిరిజనేతరులకు గోకవరం మండలంలోని కృష్ణునిపాలెం ప్రాంతంలో పునరావాసం కల్పిస్తామన్నారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ క్రింద గిరిజనులకు రూ. 7.11 లక్షలు ఇంటిస్థలం, ఐఏవై పథకం క్రింద ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గిరిజనేతరులకు రూ.6.36 లక్షలు, మూడు సెంట్ల ఇంటిస్థలం, ఐఏవై క్రింద ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. చేతి వృత్తుల వారికి రూ.6.46 లక్షలు పరిహారం అందజేస్తామన్నారు. భూములు కోల్పోయే రైతులకు రూ.10.80 లక్షలు అందిస్తామన్నారు. అనంతరం ఈపునరావాసంపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు వివరాలు తెలియజేశారు.

మేము త్యాగమూర్తులం .... మేము ఇల్లు వాకిలి, భూమి పుట్రా విడచి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు సిద్ధపడ్డాం తమకు న్యాయం చేయండి, మీరిచ్చే పరిహారం ఎంతైనా కన్నతల్లి లాంటి భూమిని విడిచి పోవడమన్నది అంత తేలికైన విషయం కాదు, పట్టిసీమ, పురుషోత్తమపట్నంలో ఇచ్చినంతగా పరిహారం మాకెందుకు ఇవ్వడంలేదు, మమ్మల్ని కూడా మనుషులుగా చూడండని నిర్వాసితులు తమ గోడును అధికారుల ముందు వెలిబుచ్చుకున్నారు. మంగళవారం కూనవరంలో పోలవరం అవగాహన సదస్సును జాయింట్ కలెక్టర్ మల్లికార్జున నేతృత్వంలో నిర్వహించారు.

ఈసందర్భంగా పలువురు నిర్వాసితులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. గతంలో కేవలం ఎకరాకు రూ.1.15 లక్షలు మాత్రమే ఇచ్చారని, ఇది దారుణమని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి తమకు కూడానూతన చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని నిర్వాసితులు పట్టు పట్టారు. లేదంటే తమ బతుకులు కూలి బతుకులేనని ఆవేదన చెందారు.

మావి బంగారు భూములు: ఎమ్మెల్యే సున్నం రాజయ్య.

మావి బంగారు భూములు, అటువంటి భూములు విడిచి వెళ్తున్నామంటే మాకు ప్రభుత్వం ఎంత పరిహారం ఇచ్చినా తక్కువేనని భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య పేర్కొన్నారు. పట్టిసీమ, పురుషోత్తమపట్నం తరహాలో విలీన మండలాల్లోని నిర్వాసిత రైతులకు కూడా పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పునరావాసం కల్పించాకనే ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మించాలన్నారు. లేనిపక్షంలో నిర్వాసితులు నడి రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు.

వారి వెతలు చూస్తుంటే కళ్లల్లో నీళ్లు వస్తున్నాయి రంపచోడవరం ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

నిర్వాసితుల వెతలు, ఆందోళన చూస్తుంటే కళ్లల్లో నీళ్లు వస్తున్నాయి. సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని, అందుకు తగినట్లుగా పరిహారం చెల్లించాల్సిందేనని రంపచోడవరం ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి పేర్కొన్నారు.నిర్వాసితులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. ఉన్న ఊరు విడిచి వెళ్లడ మంటే అంత తేలికైన విషయమేమి కాదన్నారు. ఈవిషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు.

మమ్మల్ని విడదీయకండి: ఎంపీపీ పెంటయ్య.

తరాలుగా గిరిజనులు, గిరిజనేతరులు కలిసి, మెలిసి, అన్నదమ్ముల్లా ఉంటున్నాం, అటువంటిది చట్టం ఉందని గిరిజనేతరులకు ఇక్కడ పునరావాసం ఇక్కడ కల్పించలేమంటే సరికాదని కూనవరం ఎంపీపీ కొమరం పెంటయ్య అన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాన్ని ముంచేందుకు ప్రభుత్వానికి అడ్డురాని చట్టం పేద గిరిజనేతరునికి నివాసం కల్పించే విషయంలో అడ్డు వస్తుందా అని ఆయన ప్రశ్నించారు. ఇది సరికాదన్నారు. ఇక్కడ నివసిస్తున్న ప్రతి ఒక్కరికి ఇక్కడనే పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

సందేహాలు తీర్చాలి: ఎమ్మెల్సీ రత్నాబాయి

పోలవరం నిర్వాసితుల సందేహాలను ప్రభుత్వం తీర్చాలి, అదే దశలో వారికి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ఎమ్మెల్సీ రత్నాభాయి పేర్కొన్నారు. పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించాలన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ఇక్కడి నిర్వాసితులు అడుగుతున్న ప్రతి ప్రశ్నకు అధికారులు సమాధానం చెపాల్సి ఉందన్నారు.

ప్రభుత్వానిది ఆదివాసీలపై కపట ప్రేమ

ఆదివాసీలపై ప్రభుత్వం కపట ప్రేమ కనబరుస్తుందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రచార కార్యదర్శి దుమ్మిరి సురేష్ పేర్కొన్నారు. మంగళవారం రామన్నపాలెంలో సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకుందామన్నారు. ప్రతి ఆదివాసీ తరలిరావాలని ఆయన కోరారు. ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పండా కళ్యాణ్. ముత్తు, రామయ్య, మడకం రమాదేవి, వెంకట్రావు, వెంకట్, రాజయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మల్లికార్జున



08.chinturu 04.jpeg

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ రత్నాబాయి

అధికంగా తరలివచ్చిన ప్రజలు

కూనవరంలో జరిగిన పోలవరం అవగాహన సదస్సుకు నాలుగు మండలాల నుంచి ప్రజలు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తరలివచ్చారు. అధికంగా ప్రజలు రావడంతో హాలు సరిపోకపోవడంతో చాలా మంది ప్రజలు బయటే ఉండి నిరుత్సాహం చెందారు. సమావేశానికి కలెక్టర్ కార్తికేయా మిశ్రా హాజరవుతారని, తమ అనుమానాలు, ప్యాకేజీపై స్పష్టత వస్తుందని భావించిన ప్రజలకు కలెక్టర్ రాకపోవడంతో నిరుత్సాహం చెందారు. సమావేశానికి భారీగా ప్రజలు తరలిరావడంతో స్థానిక పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రంప చోడవరం ఐటీడీఏ పీవో దినేష్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో జి.చిన్న బాబు, ఎమ్మెల్సీ రత్నాబాయి, ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సున్నం రాజయ్య, పోలవరం స్పెషల్ కలెక్టర్ భానుప్రకాష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యల్లారమ్మ, టీడీపీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమరం ఫణీశ్వరమ్మ, కూనవరం, చింతూరు, ఎటపాక, వరరామచంద్రాపురం ఎంపీపీలు, జడ్పీటీసీలు కొమరం పెంటయ్య, చిచ్చడి మురళీ, కారం శిరమయ్య, యడవల్లి కన్యకాపరమేశ్వరి, సోయం అరుణ, ముత్యాల కుసుమాంబ, కూనవరం సర్పంచ్ కట్టం సునీత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఎస్ఐ అజయ్‌బాబు, తహసీల్దార్లు రవీంద్రకుమార్ జీవీఎస్ ప్రసాద్, తేజేశ్వరరావు, ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వీ.గాంధాబాబు, వివిధ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ వారోత్సవాలు



గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డతీగల: స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు కావస్తున్నా నేటికీ గిరిజన బతుకులు ఎక్కడిగొంగలి అక్కడే ఉన్న చందాన ఉన్నాయని గిరిజన సంఘ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి అచ్చారావు ఆరోపించారు. అడ్డతీగల మండలంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా సంఘ జెండాను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు రాజ్యాంగ పరంగా కల్పించాల్సిన హక్కులను కాలరాస్తు న్నాయని విమర్శించారు. నేటి పాలకులు సమస్యలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ వారోత్సవాల్లో నాయకుడు అబ్బాయి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని జీవో 3, పీసా చట్టాన్ని పూర్తిగా అమలుచేస్తే ఏజెన్సీలో గిరిజనేతరుల పెత్తనం సాగదని, ఈచట్టాలను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. సమస్యలపై పోరాటానికి ఆదివాసీలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో రాంబాబు, లోవరాజు, రాము, సురేష్, అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విదార్థినీలు

రంపచోడవరం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక గిరిజన గురుకుల బాలికల కళాశాల విద్యార్థినీలు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కళాశాల నుంచి ఐటీడీఏ వరకు నిర్వహంచారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సత్యనారాయణమూర్తి గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, వారి జీవనశైలీ గురించి విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



నేడు ఆదివాసీ దినోత్సవం

వై.రామవరం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను బుధవారం రంపచోడవరం ఐటీడీఏ వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. పీవో దినేష్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించనున్న వేడుకలకు మండలాల నుంచి జనసమీకరణకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. వై.రామవరానికి ఉదయం 7గంటలకు బస్సు వస్తాదని, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘ నాయకులు, ఆదివాసీలంతా బస్సుల్లో వేడుకలకు తరలిరావాలన్నారు. ఉదయం 9గంటల నుంచి ఈవేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఆదివాసీ దినోత్సవ వేడుకలు జయప్రదం చేసే దిశగా ఆదివాసీలంతా సహకరించాలని కోరారు.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

- ఐటీడీఏ పీవో

రంపచోడవరం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు బుధవారం స్థానిక పీఎంఆర్‌సీలో నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఏఎస్ దినేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆదివాసీ సంఘం సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈవేడుకలకు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

గిరిజనులందరికీ ఎన్టీఆర్ పక్కా ఇళ్లు

జడ్పీటీసీ చిన్నాలమ్మ



మాట్లాడుతున్న జడ్పీటీసీ చిన్నాలమ్మ

రాజవొమ్మంగి: గిరిజనులందరికీ ఎన్టీఆర్ పక్కా ఇళ్లు నిర్మించడమే ప్రధాన లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పని చేస్తోందని జడ్పీటీసీ సభ్యురాలు కొసూరి బుజ్జి చిన్నాలమ్మ అన్నారు. చెరుకుంపాలెంలో జరిగిన గ్రామ సభలో జడ్పీటీసీ చిన్నాలమ్మ మాట్లాడుతూ మండలంలోని 19పంచాయతీలకు 217 ఇళ్లు మంజూరు కాగా, 14మంది లబ్ధిదారులు చెరుకుంపాలెం వారు ఉన్నారన్నారు. మరో 17మందికి ఎన్టీఆర్ పక్కా ఇళ్లు కేటాయించేందుకు గ్రామ సభ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గిరిజనులందరూ పక్కా ఇంటిలో ఉండేవిధంగా ఎన్టీఆర్ ఇళ్లకు రూ.2లక్షలు ప్రత్యేక నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మడకం లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతారావు, హౌసింగ్ ఏఈ చలపతి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత దంతవైద్యశిబిరం

అడ్డతీగల: ఆంధ్రప్రదేశ్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలోఅడ్డతీగల కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 10వ తేదీన ప్రత్యేక దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అడ్డతీగల రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ తెలిపింది. గురువారం ఉదయం 9గంటల నుంచి వైద్యశిబిరం ప్రారంభిస్తామన్నారు.

సంఘటితంగా ఉద్యమించి హక్కులు, చట్టాలను పరిరక్షించుకోవాలి

సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి టాన్యా



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి టాన్యా

రంపచోడవరం: ఆదివాసీలు సంఘటితంగా ఉద్యమించి హక్కులు, చట్టాలను పరిరక్షించుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి పి.టాన్యా అన్నారు. మంగళవారం స్థానిక మార్క్స్ ఏంగిల్స్ భవన్‌లో ప్రపంచ ఆదివాసీల హక్కుల పోరాటదినం సభను డివిజన్ నాయకుడు పల్లాల అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా టాన్యా మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను, చట్టాలను తుంగలో తొక్కి అక్రమ కేసులు పెడుతూ ప్రభుత్వమే ఆదివాసీ దినోత్సవం నిర్వహించడం ఆదివాసీలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. గిరిజనుల సాగులో ఉన్న అన్ని రకాల భూములను గిరిజనులకు హక్కు కల్పిస్తూ శాశ్వత పట్టాలివ్వాలని, పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి బి.రమేష్, జిల్లా నాయకుడు ఐ.రమణ, పి.లచ్చిరెడ్డి, కంగల బాలుదొర, పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.అనసూయ, పీవైఎల్ జిల్లా కార్యదర్శి వలల వాసు, కె.బాపన్నదొర, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ఎస్.ప్రకాష్, కె.చంద్ర పాల్గొన్నారు.

గృహనిర్మాణ పథకంపై గ్రామసభలు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండలో మంగళవారం గృహనిర్మాణ పథకం గ్రామసభ నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో డివిజన్‌లో గృహనిర్మాణ పథకంలోని నిధులు మంజూరుకు సంబంధించి పలు పథకాలపై వివరించారు. ఎస్సీ, ఎస్టీ గృహ నిర్మాణ డేటాకు సంబంధించి నూరు శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధుసూదనరాజు, సర్పంచ్ సోమాలమ్మ, పలువురు గృహ నిర్మాణ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం

సీఎం ఆర్థిక సహాయంతో కంటి ఆపరేషన్



డొంకరాయి ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నాయకులను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

డొంకరాయి: సీఎం చంద్రబాబుకు తాము జీవితాంతం రుణపడి ఉంటామని డొంకరాయికి చెందిన సోబారాయ్ కుటుంబం తెలిపింది. డొంకరాయి ఎన్టీఆర్ భవన్ వద్ద మంగళవారం టీడీపీ నాయకులను కలిసి ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. సోబారాయ్‌ది బెంగాలీ కుటుంబం రెక్కాడితేనే కాని డొక్కాడని ఆ కుటుంబం చేపలు పట్టుకొని జీవిస్తున్నది. ఈఏడాది మేలో మోటారుసైకిల్ ప్రమాదంలో సోబారాయ్ చిన్నకుమారుడు రామ్‌రాయ్ తీవ్రంగా గాయపడ్డాడు. కంటికి బలమైన గాయం తగలడంతో కనుగుడ్డు బయటకు వచ్చేసింది. ప్రభుత్వాసుపత్రులకు వెళ్లినా ప్రయోజనం కనబడలేదు. మరోవైపు కంటి ఇన్ఫెక్షన్ తల మొత్తానికి వ్యాపించడం మొదలైంది. చేతిలో చిల్లి గవ్వ లేకపోవడంతో రామ్‌రాయ్ ప్రాణాలపై ఆకుటుంబం ఆశలు వదిలేసుకుంది. అదే సమయంలో డొంకరాయికి చెందిన టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కేవీ రమణ స్పందించి రామ్‌రాయ్ పరిస్థితిని రంపచోడవరం ఐటీడీఏ పీవోకు, కలెక్టర్‌కు వివరించారు. వారి సూచన మేరకు స్వయంగా రామ్‌రాయ్‌ను అమరావతిలోని సెక్రెటేరియట్‌కు తీసుకువెళ్లి సీఎం పేషి అధికారులకు రామ్‌రాయ్ పరిస్థితిని వివరించారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో వైద్యం చేయించుకోవడానికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుండి రూ.2లక్షలు మంజూరు చేశారు. రామ్‌రాయ్‌ను నిమ్స్‌లో చేర్చి వైద్యం అందించారు. ఆపరేషన్ కోసం మరో రూ.1.50 లక్షలు అవసరమని నిమ్స్ వైద్యులు చెప్పారు. రంపచోడవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి శీతంశెట్టి, ఉపముఖ్యమంత్రి చినరాజప్ప ద్వారా సీఎం చంద్రబాబు దృష్టికి రామ్‌రాయ్ పరిస్థితిని తీసుకువెళ్లడంతో మరో రూ.1.50 లక్షలు మంజూరు చేశారు. ఆపరేషన్ తర్వాత రామ్‌రాయ్ పూర్తిగా కోలుకున్నాడు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఎన్టీఆర్ భవన్‌కు వెళ్లి టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణాలు కాపాడిన సీఎం చంద్రబాబుకు, సహకరించిన పార్టీ నాయకులకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

సీపీఎంలో చేరికలు



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

వరరామచంద్రాపురం: విఆర్.పురం, వడ్డిగూడెం కాలనీలోని టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ నుంచి 50కుటుంబాలు మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య సమక్షంలో చేరారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన కొంత మంది కార్యకర్తలు మాట్లాడుతూ మండలంలో సీపీఎం నాయకత్వం మండల ప్రజల సమస్యలు తీర్చడంలో అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. గిరిజన, గిరిజనేతర అనే తేడా లేకుండా వారి దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తున్నారని, అందుకే సీపీఎంలో చేరుతున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ సీపీఎం మీద నమ్మకంతో పార్టీలో చేరిన వారందరిని అభినందించారు. మండలంలోని ప్రజా సమస్యలు పరిష్కరించడంలో సీపీఎం ఎల్లప్పుడూ మీవెంటే ఉంటుందన్నారు. రైతులు ఎండనక, వాననక పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైం దన్నారు. గిరిజన, గిరిజనేతర ప్రజల పక్షాన ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం శిరమయ్య, సీపీఎం మండల కార్యదర్శి పూనెం సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు గూటాల శ్రీనివాసరావు, రాము, పంకు సత్తిబాబు, జి.లక్ష్మణరావు, బొప్పెన కిరణ్‌కుమార్, తలగాని వెంకన్నబాబు, చక్రపాణి, కడుపు గాంధీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిపూడిలో ఫిజియోథెరపీ సేవలు



గంగవరం: సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో మండలంలోని నెల్లిపూడిలో మంగళవారం ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని నెల్లిపూడిలో భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్టు వెంకటరమణ ఆధ్వర్యంలో వైద్యసేవలు అందజేశారు. శిబిరంలో 31మందికి ఫిజియోథెరపీ సేవలందించి, పిల్లల తల్లిదండ్రులకు ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు లచ్చిబాబు, ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం ర్యాలీ, మానవహారం



గంగవరం మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

గంగవరం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మంగళవారం గంగవరంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గంగవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, ఆశ్రమ బాలుర పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, గిరిజన చట్టాలను సక్రమంగా అమలు చేయాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ఈసందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణ మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నాయని, వాటిని సక్రమంగా ఆదివాసీలకు అందేవిధంగా చూడాలన్నారు. పలువురు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం ఏర్పాటుచేసిన 1/70చట్టం జీవో3ను సక్రమంగా అమలు చేయాలని, పీసాచట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు నర్సయ్యమ్మ, శ్రీరాములు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లరెడ్డి, వెంకన్నదొర పాల్గొన్నారు.

జయప్రదం చేయాలంటూ ర్యాలీ



రాజవొమ్మంగిలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ర్యాలీ

రాజవొమ్మంగి: ఆగస్టు 9న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలంటూ రాజవొమ్మంగి గురుకుల కళాశాల గిరిజన బాలికలు మంగళవారం గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏలేశ్వరం నుంచి నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించారు. ప్రపంచ ఆదివాసీల హక్కులను కాపాడాలని, గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, గిరిజన సంప్రదాయాలను కాపాడాలంటూ నినాదాలు చేశారు. తొలుత గురుకుల కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ఉద్యోగుల కాలనీ మీదుగా అంబేద్కర్ సెంటర్, అల్లూరి జంక్షన్ వరకు నినాదాల హోరుతో సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ బాబూజీ, గిరిజన బాలుర ఆశ్రమోన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు బొడరపు కృష్ణ, గిరిజన సంఘం నేతలు సింగిరెడ్డి అచ్చారావు, లోతా రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థలవివాదం కొట్లాటలో వృద్ధురాలి మృతి

అల్లవరం మండలం ఓడలరేవులో ఘటన

అల్లవరం: ఓడలరేవు గ్రామంలో స్థల సరిహద్దు వివాదంపై కొట్లాట జరిగి వృద్ధురాలు మృతిచెంద డంతో హత్యకేసుగా నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఓడలరేవు దాటింపు రేవు దారిలో అవనిగడ్డ మహాలక్ష్మి, విశ్వనాధపల్లి వెంకట్రావు కుటుంబాల మధ్య గత కొంతకాలంగా సరిహద్దు వివాదాలున్నాయి. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో సరిహద్దు విషయమై ఉభయులు మధ్య మర్గణ చెలరేగి కొట్లాటకు దారితీసింది. ముందుగా పరస్పరం ఒకరిపై ఒకరు దూషణలకు దిగగా, పెద్దలు సర్దిచెప్పినా కొలిక్కిరాలేదు. ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో వృద్ధురాలైన అవనిగడ్డ మహాలక్ష్మి(65) తన ఇంటి వాకిట ముందు అపస్మారక స్థితిలో కనిపించగా, వెంటనే అమలాపురం ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. మహాలక్ష్మిని కొట్టడం వల్లే చనిపోయిందని వరుసకు అల్లుడైన రేకాడి గోవిందరావు అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. విశ్వనాధపల్లి వెంకట్రావు, రేకాడి లోవరాజు, విశ్వనాధపల్లి రాము, విశ్వనాధపల్లి ఈశ్వరమ్మ, కొల్లు లలితలు కొట్టడం వల్లే వృద్ధురాలు మహాలక్ష్మి చనిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అమలాపురం డీఎస్పీ ఏవీఎల్ ప్రసన్నకుమార్, సీఐ జి.దేవకుమార్, ఎస్ఐ డి.ప్రశాంత్‌కుమార్‌లు ఓడలరేవులో సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. విశ్వనాధపల్లి వెంకట్రావుతోపాటు ఐదుగురు నిందితులపై హత్యకేసు నమోదైందని పోస్టుమార్టం కోసం మహాలక్ష్మి మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రిలోఉంచినట్టు ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.



అవనిగడ్డ మహాలక్ష్మి మృతదేహం

పాఠశాలల్లో టింకరింగ్ ల్యాబ్‌లు

రామచంద్రపురం: జిల్లాలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులలో సృజనాత్మకతను ప్రయోగాత్మకంగా వెలికితీసేందుకు అవసరమైన బోధనోపకరణాలు, వారిలో కొత్తకొత్త ఆలోచనలు రూపకల్పన చేసేందుకు అవసరమైన పరికరాలను ఏర్పాటుచేస్తూ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటుచేయనున్నారు. ఈమేరకు మంగళవారం జిల్లా సైన్స్ అధికారి జి. వసంతకుమార్ విలేఖరులతో మాట్లాడుతూ నీతిఆయోగ్ కేంద్రంగా అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) వారి ఆర్థిక సహకారంలో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ రాష్ట్ర వ్యాప్తంగా 1000 పాఠశాలలను ఎంపికచేసి ఈ ల్యాబ్‌లను ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి నేతృత్వంలో ఈనెల 31వతేదీలోగా ఈ ల్యాబ్‌ల ఏర్పాటుకు పాఠశాలల నుంచి దరఖాస్తులను కోరుతున్నారని ఆయన చెప్పారు. పాఠశాలకు 1500చదరపు అడుగుల స్థలం ఉండి, ఇతర పరిస్థితులు అనుకూలంగా ఉంటే రూ.10లక్షలతో అత్యాధునిక సాంకేతిక విలువలతో కూడిన ల్యాబ్‌లను నిర్మిస్తారన్నారు. అంతేకాకుండా ఐదు సంవత్సరాలపాటు ఈ ల్యాబ్‌లకు అవసరమైన ఆర్థిక సహాయం కూడా ఈపథకంలో అందుతుందన్నారు. దరఖాస్తు విధానం ఇతర వివరాలకు తనను 9949282342నెంబరులో సంప్రదించాలని కోరారు.

అంతర్వేది స్వామిని దర్శించిన జబర్దస్త్ కమెడియన్ ఆర్పీ



అంతర్వేది ఆలయంలో ప్రధానార్చకులు కిరణ్‌తో కిరాక్ ఆర్పీ

అంతర్వేది: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి జబర్దస్త్ కమెడియన్ కిరాక్ ఆర్పీ విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకస్వాములు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి అంతర్వేది ఆలయ విశిష్టతను అర్చకస్వాములు ఆర్పీకి వివరించారు. అనంతరం ఆర్పీ విలేఖరులతో మాట్లాడుతూ జబర్దస్త్‌లో సుమారు 300 ఎపిసోడ్స్‌కుపైగా చేశామని, అదేవిధంగా పలు టీవీ షోలలో యాంకర్‌గా చేస్తూ అవకాశం వచ్చిన ప్రతి చిత్రంలోను కమెడియన్‌గా నటిస్తున్నానన్నారు. పూర్తిస్థాయి కమెడియన్ రోల్‌కోసం వేచిచూస్తున్నానన్నారు. అదేవిధంగా కోనసీమ అందాలు తననెంతో ప్రభావితం చేశాయని, ఇక్కడి అందాలు సినిమా ఇండస్ట్రీకే కాకుండా మనుష్యుల మనసులకు ఆహ్లాదాన్నిస్తాయన్నారు. అనంతరం సాగరసంగమం, లైట్‌హౌస్ తదితర ప్రదేశాలను సందర్శించారు.

ప్రజాసేవలో దేశవ్యాప్తంగా 8.18 లక్షల మంది వైద్యులు

అమలాపురం(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 8.18 లక్షల మంది వైద్యులు ప్రజలకు సేవలందిస్తున్నారని కేంద్ర వైద్య ఆరోగ్యమంత్రిత్వశాఖ లోక్‌సభలో వెల్లడించినట్టు అమలాపురం ఎంపీ డాక్టర్ పండుల రవీంద్రబాబు తెలిపారు. కుటుంబసంక్షేమం, దేశంలో ప్రజలకు అందే ఆరోగ్యసేవలపైన ఎంపీ రవీంద్రబాబు లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సమాధానమిచ్చారు. దేశంలో మెడికల్ కౌన్సిల్ ద్వారా ఈ ఏడాది మార్చి 31 నాటికి 10,22,859 మంది అల్లోపతి డాక్టర్లు రిజిష్టర్ కాబడి ఉన్నారని వెల్లడించారు. ప్రస్తుతం 8.18 లక్షల మంది డాక్టర్లు ప్రజలకు సేవలందిస్తున్నారని, ప్రస్తుత జనాభా ప్రాతిపదికన సుమారు 1625 మందికి ఒక్కొక్క వైద్యుడు చొప్పున అందుబాటులో ఉన్నట్టు మంత్రి ఎంపీకి తెలిపారు. సెక్షన్ 15 ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం 1956 ప్రకారం రిజిష్టర్ కాకుండా వైద్యసేవలు అందించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కూడా ఎంపీ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

న్యాయవాదుల హక్కులపై 26న సదస్సు

రామచంద్రపురం: దళిత గిరిజన న్యాయవాదుల హక్కులపై జరిపే పోరాటంలో భాగంగా అఆ ఫౌండేషన్ నాల్గవ రాష్ట్రస్థాయి సదస్సును ఈనెల 26వ తేదీన కాకినాడ అంబేద్కర్ భవనంలో నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ అధ్యక్షుడు పినిపే వెంకటరామకృష్ణ తెలిపారు. మంగళవారం ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈసదస్సులో 19అంశాలపై చర్చించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. న్యాయవాది భరత్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీఎస్టీ నాయకులంతా ఏకంకావాలని, న్యాయ వాదుల సంక్షేమ నిధికి రూ.150కోట్లు ఇవ్వాలని, దళితులపై జరిగే దాడులను అరికట్టాలని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు పలివెల సత్యనారాయణ, నేలపాటి వీరబాబు, శెట్టి రామ్మూర్తి, ఐ గంగాధర్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

అన్నవరంలో తలనీలాల విక్రయానికి దేవాదాయశాఖ అనుమతి

అన్నవరం: కొన్ని నెలలుగా అన్నవరం దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాల నిల్వలు పేరుకుపోవడంతో వాటిని విక్రయించేందుకు దేవాదాయశాఖ కమిషనర్ వైవీ అనురాధ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిల్వ ఉన్న తలనీలాల ద్వారా సుమారు రూ. 20లక్షల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తు ఏడాది తలనీలాల లైసెన్స్‌లకు ఈ టెండర్ ద్వారా నిర్వహించగా హెచ్చు పాటదారునికి కేటాయిస్తూ అనుమతి నిచ్చారు.

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయం

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ విజయ దుందుభి మోగించడం ఖాయమని చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయస్థానాలు స్పందించి కాకినాడ ఎన్నికలు నిర్వహించాలని తెల్పినందుకు కోర్టులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 73, 74 ప్రకారం స్థానిక సుపరిపాలన రావాలన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం అపహాస్యం చేస్తుందని, రాష్ట్రంలో పాలకమండళ్ల లేక ఖాళీగా ఉన్న మున్సిపాలిటీలకు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహించడం లేదని ప్రభుత్వానికి ఆ ధైర్యం సరిపోవడం లేదన్నారు. కోర్టు మొట్టికాయలు వేస్తే తప్ప కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు సిద్ధపడలేదన్నారు. కాకినాడ ఎన్నికలతోనే చంద్రబాబు ప్రభుత్వానికి పతనం ప్రారంభం కానుందని, అన్నివర్గాల ప్రజలు ప్రభుత్వ వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. కాకినాడలో పెద్దఎత్తున నాయకులు వైసీపీలోకి వస్తున్నారని, తమకు భారీ మెజార్టీ వస్తుందని చెప్పారు. నంద్యాల ప్రజలపై నమ్మకం లేకే రాష్ట్ర క్యాబినెట్ మొత్తాన్ని అక్కడకు చేర్చారని ఎద్దేవా చేశారు. సమావేశంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా అధికార ప్రతినిధి షర్మిలారెడ్డి, రాజమహేంద్రవరం కో ఆర్డినేటర్ రౌతు సూర్యప్రకాశరావు, రూరల్ కో ఆర్డినేటర్ ఆకుల వీర్రాజు, నాయకులు గౌతమ్, రజనీకాంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఉపాధి పనుల్లో అవకతవకలు ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

కోరుకొండ: కోరుకొండ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో సుమారు రూ.8లక్షల అవకతవకలు జరిగినట్టు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. దీంతో ప్రెసైడింగ్ అధికారిణి బి.శ్యామల కాపవరం ఫీల్డ్ అసిస్టెంట్‌కు సోకాజ్ నోటీసు ఇచ్చారు. అదేవిధంగా బొల్లెద్దుపాలెం ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధులనుంచి తొలగించారు. రూ45వేల 775 రికవరీ పెట్టారు. రూ.11,500 జరిమానా వేశారు. రూ. 5లక్షల64వేల 82 నిధుల ఖర్చుకు సంబంధించి పరిశీలనకు పంపినట్లు ఎస్ఆర్పీ గురుమూర్తి తెలిపారు.



సత్యదేవుని అన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

అన్నవరం: రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఒక భక్తుడు రూ. లక్ష విరాళంగా అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన వెంపర్ల వెంకటపద్మ నాభశేషగిరిరావు ఈమొత్తాన్ని ఈవో జగన్నాధరావుకు అందజేశారు. దినిపై వచ్చే వడ్డీతో ప్రతీఏటా వైశాఖశుద్ధ ఏకాదశి రోజున అన్నదానం జరిపించాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో, జాతీయ రహదారిపైన మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ట్రాఫిక్ డీఎస్పీ వైవీ రమణకుమార్ ఆధ్వర్యంలో సీఐలు సూరిబాబు, బాజీలాల్‌లు డ్రంక్అండ్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మద్యం తాగి ఉన్న 13మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పదిమందికి రూ.రెండువేల చొప్పున జరిమానా విధించగా జి.దుర్గారావుకు పదిరోజుల జైలు శిక్ష, వెయ్యి జరిమానా విధించారు. ప్రగడా రామకృష్ణ, జి.రవిరాజ్‌కుమార్‌లకు నాలుగురోజులు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

లాక్‌డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్ యాప్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు మాత్రమే తొలుతగా ప్రవేశపెట్టిన ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్ హౌస్‌మోనిటరింగ్ సిస్టమ్)ను రాజమహేంద్రవరం అర్బన్ ఎస్పీ బి.రాజకుమారి మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక పోలీస్ అతిథిగృహంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్‌శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన ఎల్‌హెచ్ఎంఎస్ ఏపీ పోలీస్ లాక్‌డ్ హౌస్‌మోనటరింగ్ సిస్టమ్ యాప్ ఉపయోగాలను వివరించారు. ఈ యాప్‌ను తొలుతగా ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇది 1.3 ఎంబీ ఉంటుందని యాప్‌లోకి వెళ్లి చిరునామా, సెల్‌నెంబర్ సంబంధించిన దరఖాస్తును పూర్తి చేసి ఆమోదిస్తే రిజిస్ట్రేషన్ యునిక్ఐడీ వస్తుందని, ఎప్పుడైనా ఎవరైనా ఊరు వెళ్లినప్పుడు ఈ యాప్ వినియోగించి దానిలో రిక్వెస్టు వాస్‌లో ఊరు వెళ్లే తేదీలను పొందుపరచాలని సూచించారు. ఈ సమాచారం అందుకున్న సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పోలీసులు ఆ రిక్వెస్టు చేసిన వారింటికి వెళ్లి ఇంటికి పైపై కెమెరా మోడెం అతికించి వెళ్తారని, అప్పటినుంచి వారి ఇంటిపై పోలీసుల నిఘా ఉంటుందని చెప్పారు. ఒకవేళ దొంగలు పడి తాళాలు పగలగొట్టగానే పోలీసులకు సమాచారం వెళ్తుందని ఎస్పీ చెప్పారు. అనుమానితులు వారి ఇళ్లకు ఇచ్చినా ఫొటోలు తీయడం, వీడియో రికార్డింగ్ చేసి సీసీ కెమెరాల పోలీస్ కంట్రోల్‌రూమ్‌లను చేరవేయడం వంటివి ఈ యాప్ ద్వారా జరుగుతాయని, ఈ అవకాశాన్ని రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాదయాత్రకు అనుమతి ఇవ్వండి

- ముద్రగడను మళ్లీ అడ్డుకున్న పోలీసులు
- చేతికి తాళ్లు కట్టుకుని నిరసన
- కాపు జేఏసీ నాయకుల భిక్షాటన
- కంచాలు వాయించి ఆందోళన



కిర్లంపూడిలో భిక్షాటన చేస్తున్న కాపు జేఏసీ నాయకులు

కిర్లంపూడి: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను మంగళవారం పోలీసులు మళ్లీ అడ్డుకున్నారు. ముద్రగడ కాపు జేఏసీ నాయకులతో కలిసి తన ఇంటి నుంచి గేటు వద్దకు వచ్చేసరికి పెద్దాపురం డీఎస్పీ రామారావు, జగ్గంపేట సీఐ కాశీవిశ్వనాధం అడ్డుకుని బయటకు వెళ్లనీయలేదు. దీంతో ఆగ్రహించిన ముద్రగడ మాట్లాడుతూ కాపు జాతికి ఈ రాష్ట్రంలో స్వేచ్ఛలేదా అని ప్రశ్నించారు. మాకు న్యాయం చేయండి లేదా పాదయాత్రకు అనుమతైనా ఇవ్వండి అదీకాకపోతే అరెస్టు చేసి జైలులో అయినా పెట్టండి అన్నారు. అనంతరం ముద్రగడ, కాపు జేఏసీ నాయకులు రెండు చేతులకు తాళ్లు కట్టుకుని ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన తెలిపారు. చంద్రబాబు పాదయాత్ర ప్రతులు తమకు అందించాలన్నారు. తమను తీవ్ర వాదుల్లా చూస్తున్నారన్నారు. చంద్ర బాబు పరిపాలనలో కాపులకు స్వేచ్ఛ లేకుండా పోయిందని కాపు జేఏసీ నాయకులు విమర్శించారు. అనంతరం ముద్రగడ, కాపు జేఏసీ నాయకులు ఇంట్లోకి వెనుదిరిగారు. మధ్యాహ్నం ముద్రగడ, కాపు జేఏసీ నాయకులు, మహిళలతో కలిసి తన నివాసం ముందు కంచాలను గరిటెలతో మోగించి కాపు ఆకలి కేకలు ప్రభుత్వానికి వినిపించారు. కాపులకు స్వేచ్ఛ కల్పించాలని భిక్షాటన చేస్తూ వినూత్న ప్రదర్శన చేశారు. దుర్గాడ, వేలంక, సింహాద్రిపురం, రాజుపాలెం, ముక్కొల్లు, తామరాడ పరిసర గ్రామాల నుంచి మహిళలు, కాపు నాయకులు భారీ సంఖ్యలో కిర్లంపూడి తరలివచ్చి ముద్రగడ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. వేలంక గ్రామంలో నీలగిరి చిట్టిబాబు, దోమాల కృష్ణజడ్జి ఆధ్వర్యంలో ముద్రగడ పాదయాత్రకు అనుమతివ్వాలని కాపులు పోలీసులకు పువ్వులిచ్చారు. స్థానిక శివాలయం వద్దకు చేరుకుని కోనేరులో జలదీక్ష చేపట్టారు. ముద్రగడ పద్మనాభంకు ముసిం సోదరులు సయ్యద్ సర్దార్, ఖయ్యుం బాషా, కాలీషా, ఇబ్రహీం కలిసి సంఘీభావం తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కాపు జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, వాసి రెడ్డి ఏసుదాసు, గౌతు స్వామి, ఆరేటి ప్రకాశ్, తుమ్మలపల్లి రమేష్, గుండా వెంకటరమణ, గోపు చంటిబాబు, గణేశుల రాంబాబు, లక్ష్మణ రావు, చల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.



అమలాపురంలో కాపుల బైక్‌ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



తుని రూరల్: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన రేఖవానిపాలెం శివారు మరువాడలో జరిగింది. రౌతులపూడి మండలం ఎస్.పైడిపాలకు చెందిన ఈగల రమణ (35)పామాలిన్ గెలలు సేకరణ పనికి మరువాడ వచ్చాడు. పామాలిన్ గెలలు తొలగిస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యనమల కృష్ణుడు ఆసుపత్రికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆస్తి కోసం..

తల్లినే హతమార్చాలనుకున్నాడు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగయమ్మ

తొండంగి అర్బన్: అడిగినంత ఆస్తీ ఇవ్వలేదని ఓ కసాయి కొడుకు కన్న తల్లినే ఉరివేసేందుకు యత్నించాడు. కొడుకు చేష్టలకు ఆ కన్నపేగు నిశ్చేష్టురాలైంది. ఆపై ప్రాణభీతితో కేకలు వేయగా చుట్టుపక్కల వారు రావడంతో బతికి బయట పడింది. వేమవరం గ్రామానికి చెందిన నేమాల నాగయమ్మ(70)కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. తనకున్న ఏడెకరాల 84సెంట్ల భూమిని సమానంగా పంచి ఇచ్చింది. తన వద్ద ఇంకా ఎకరం 84సెంట్ల భూమిని ఉంచుకుంది. అయితే ఆ భూమిని కూడా తనకు ఇచ్చేయాలని కుమార్డు కొన్ని రోజులుగా గొడవ పడుతున్నాడు. దీంతో తల్లి తాను చేసిన వ్యాపారాల్లో నష్టం వచ్చిందని మొత్తం భూమి ఇవ్వడం కుదరదని తాను చేసిన అప్పులు తీర్చగా మిగిలినది పంచి ఇస్తానంటోంది. దీనిపై కుమారుడు కుదరదంటూ గొడవకు దిగుతున్నాడు. ఈ నేపథ్యంలో కుమారుడు, కోడలు, అల్లుడు మంగళవారం తెల్లవారుజామున తల్లిని కొట్టి దాడికి దిగారు. ఆపై మెడకు ఉరి వేసేందుకు యత్నించారు. దీంతో ఆ తల్లి భయపడి కేకలు వేసింది. చుట్టుపక్కల వారు రావడంతో వారు వెళ్లి పోయారు. గాయపడ్డ నాగయమ్మను స్థానికులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. దీనిపై తొండంగి పోలీసులు కేసునమోదు చేశారు.

గ్రానైట్‌రాళ్ల ట్రాలీని ఢీకొన్న మరో లారీ

డ్రైవర్, క్లీనర్లకు గాయాలు

రాజానగరం: గ్రానైట్ రాళ్లతో ప్రయాణిస్తున్న ట్రాలీ లారీని మరొక లారీ ఢీకొనడంతో ట్రాలీపై ఉన్న బండరాయి రహదారిపై పడి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. రాజమహేంద్రవరం నుంచి గ్రానైట్ రాళ్లతో కాకినాడ వెళ్తున్న ట్రాలీ లారీ మార్గమధ్యలో మంగళవారం తెల్లవారు జామున రాజానగరం వద్ద హైవే నుంచి ఏడీబీ రోడ్డుకు మలుపు తిరుగుతోంది. ఈ సమయంలో వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వస్తున్న మరో లోడులారీ బండరాళ్ల లోడుతో వెళ్తున్న ట్రాలీ ఇంజన్‌ను ఢీకొన్నది. దీంతో లారీపై ఉన్న రెండు బండరాళ్లలో ఒకటి హైవేపై పడిపోయింది. దీంతో రాజమహేంద్రవరం వైపుగా వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం ట్రాఫిక్, మహిళా డీఎస్పీలు భరత్, రావణ్‌కుమార్, రాజానగరం ఇన్‌చార్జ్ సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ గ్రానైట్‌రాళ్ల లారీ డ్రైవర్ పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మునకాల ప్రభాకరరావుకు, క్లీనర్ రాపాక లక్ష్మణరావుకు స్వల్పగాయాలు కావడంతో సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు రాజానగరం పోలీసులు తెలిపారు. కేసును నమోదు చేశామని స్టేషన్ రైటర్ శ్రీనివాసరావు విలేకరులకు వివరించారు.

చీటింగ్ కేసులో

భార్యభర్తలకు జైలు, జరిమానా

కాకినాడ క్రైం: ఓ మహిళతో వ్యాపారం నిమిత్తం రూ.30 లక్షలు పెట్టుబడి పెట్టించి అనంతరం ఆమెను మోసగించిన కేసులో భార్యభర్తలకు రెండేళ్ల జైలు, రూ.22వేలు జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం తీర్పునిచ్చారు. కాకినాడ రూరల్ తూరంగి పంచాయతీ ఎమ్ఎస్ఎన్ చార్టీస్ వెనుక వీధికి చెందిన మోకా ఆనందసాగర్ అతని భార్య విజయలక్ష్మి 2009లో స్థానిక రామారావుపేటలో హండీ రెస్టారెంట్ పెట్టేందుకు రామారావుపేట శేషసాయి వీధికి చెందిన కేసరినేని రమాపృధీసత్యదేవ తారక్ అనే మహిళతో సుమారు రూ.30లక్షల మేర పెట్టుబడి పెట్టించారు. కొంతకాలం తర్వాత రెస్టారెంట్‌కు ఆమెకు ఏ సంబంధం లేదంటూ తారక్‌ను మోసగించి భార్యభర్తలిద్దరూ నెట్టేశారు. అనంతరం బాధితురాలు తారక్ 2013 మార్చి 7వ తేదీన టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును దర్యాప్తు చేశారు. భార్యభర్తలిరువుర్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో వాదోపవాదనల అనంతరం భార్యభర్తలకు రెండేళ్ల జైలు, రూ.22వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా సోమవారం రాత్రి జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాలు మూతపడగా మంగళవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం సర్వదర్శనాలకు అనుమతించారు. దీంతో ద్రాక్షారామ, అన్నవరం, అంతర్వేది, సామర్లకోట, అయినవిల్లి తదితర ఆలయాలతో పాటు జిల్లాలోని పలు ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ సిబ్బంది, ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.



సంప్రోక్షణ అనంతరం తెరుచుకున్న
సత్యదేవుని ఆలయం

అన్నవరం: చంద్రగ్రహణం సందర్భంగా సోమవారం మధ్యాహ్నం మూతబడిన సత్యదేవుని ఆలయం మంగళవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం అధికారులు తెరిచారు. పండితులు శాస్త్రోక్తంగా సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి వ్రతాలు సర్వదర్శనాలకు అనుమతించారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట: సామర్లకోట కుమారారామ భీమేశ్వరాలయంలో సోమవారం రాత్రి చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం ఆలయ ఆవరణను సంప్రోక్షణ చేసి శాంతికర పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను సర్ప వాహనంపై ఉంచి గ్రామోత్సవం చేశారు. మార్గమధ్యలో అధిక సంఖ్యలో భక్తులు మొక్కుబడులు అందజేసి ప్రసాదాలు స్వీకరించారు.



స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నికల పొత్తుపై నేడు సస్పెన్స్ తొలగేనా?

బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు

భానుగుడి (కాకినాడ): కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో టీడీపీతో పొత్తు విషయంపై బుధవారం సస్పెన్స్ వీడిపోతుందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10వ తేదీతో నగరపాలక సంస్థ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందన్నారు. దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, బీజేపీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు పెనుమత్స విష్ణుకుమార్‌రాజు బుధవారం కాకినాడ విచ్చేసి దీనిపై రాష్ట్ర నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా విజయవాడలో పార్టీని బూత్‌స్థాయి నుంచి సమీక్ష చేస్తారన్నారు. కార్యకర్తలకు, నాయకులకు దశాదిశా నిర్దేశం చేస్తారన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో బీజేపీ అలయన్స్‌లో ఆర్పీఐ కూడా చేరిందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఆ పార్టీతో కలిసి ప్రచారం చేస్తామన్నారు. కాకినాడ మున్సిపల్ మాజీ చైర్మన్ గాదం కమలాదేవి కుమారుడి కొడుకు కమలసందీప్ పార్టీలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో బీజేపీ జిల్లా, నగర అధ్యక్షులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, పెద్దిరెడ్డి రవికిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేటుకూరి సూర్యనారాయణరాజు, చోడవరపు పవన్, సర్వారాయుడు, సత్తిరాజు, శ్రీనివాసరావు, రమేష్, శివప్రసాద్, గంగాధర్ తదితరుల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఇతర నాయకులు



గండేపల్లి మండలం యల్లమిల్లిలో పొలాల గట్లపై గుట్టలు వేసిన పెద్ద పెండలం దుంపలు

పతనమైన పెద్ద పెండలం ధర

● గత ఏడాది రూ.10 నుంచి 15 వేలు ధరలు ● ఈ సంవత్సరం రూ.4వేలు నుంచి రూ.5వేలు ధర ● కొనే నాధుడే లేక రైతాంగం గగ్గోలు

గండేపల్లి: వ్యవసాయంలో లాభాలు రాకపోతే రైతాంగం అయోమయంలో పడిపోతారు. ఒక్కో సమయంలో పెట్టిన పెట్టుబడిలో సగం రాకపోయినా వారి అవస్థలు అంతాఇంతా కాదు. విషయానికి వస్తే... జిల్లాలోని గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన మదిరెడ్డి కృష్ణార్జున, బొడ్డు మురళీ 15 ఎకరాల్లో పెద్దపెండలం సాగు చేపట్టారు. ఈ సాగుకు దిగుబడి ఎకరానికి పది నుంచి 14 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి. ఎకరానికి రూ.50వేలు పెట్టుబడి రూపంలో అవుతుంది. రెండు సంవత్సరాలు మోస్తారు లాభాలు రాగా, ఈ సంవత్సరం 15 ఎకరాల్లో పంట సాగు చేశారు. ఈ పంటను కేరళ, అస్సాం, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. సాగు చేతికందే సమయంలో ధరలు ఒక్కసారిగా రూ.5వేలు నుంచి రూ.4వేలుకు పడిపోయింది. దీంతో రైతులు ధరలు పెరుగుతాయని పంటను పొలాల గట్టుపైనే ఉంచారు. ఎన్నిరోజులు చూసినా ధరలు పెరగకపోవడం మరోపక్క ఆభూమిలో మరో పంట సాగు చేయడానికి వీల్లేకపోవడంతో రైతులు పెద్దపెండలం దుంపను తొలగించేందుకు రూ.30వేలకు పైగా ఖర్చు పెట్టి పొలాల గట్లపై గుట్టలుగా పెట్టారు. గట్లపై ఉంచి పదిహేను రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ధరలు పెరగలేదు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటే దుంప పూర్తిస్థాయిలో పాడైపోయే అవకాశాలున్నాయి. సుమారు 200 టన్నుల దుంప నిరుపయోగంగా మారడంతో దాదాపు రూ.12లక్షలు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రెండు రోజులకు 12 నామినేషన్లు

కాకినాడ కార్పొరేషన్: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన నామినేషన్ల ప్రక్రియలో రెండు రోజులకు 12 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థులుగా ఏడుగురు, స్వతంత్ర్య అభ్యర్థులుగా నలుగురు, టీడీపీ అభ్యర్థిగా ఒకరు నామినేషన్లు వేశారు. వీరిలో 33వ డివిజన్‌కు వైఎస్ఆర్‌సీపీ నుంచి మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, 50వ డివిజన్ నుంచి మాజీ కార్పొరేటర్ ఇజ్జపురెడ్డి శ్రీనివాసు, 46వ డివిజన్ నుంచి మాజీ కార్పొరేటర్ కొలగాని దుర్గాప్రసాద్, 44వ డివిజన్‌కు మాజీ కార్పొరేటర్ ఇంటి గంగారత్నం, 35వ డివిజన్‌కు స్వతంత్ర అభ్యర్థిగా మాజీ కౌన్సిలర్ దూసర్లపూడి వెంకటేశ్వరరావు ఉన్నారు. నామినేషన్ వేసిన నాయకులలో 2వ డివిజన్‌కు స్వతంత్ర్య అభ్యర్థిగా సంగిశెట్టి అశోక్, 35వ డివిజన్‌కు వైసీపీ అభ్యర్థిగా బెండా విష్ణుమూర్తి, 26వ డివిజన్‌కు మచ్చా లోకేష్‌వర్మ ఉన్నారు. వీరితో కొత్త అభ్యర్థులు నామినేషన్లు వేశారు.



నామినేషన్ వేస్తున్న బెండా విష్ణుమూర్తి



వెయిట్ లిఫ్టింగ్ హాలులో శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులు

ఫలించిన పన్నెండేళ్ల నిరీక్షణ

• 'తూర్పు'న వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ ఏర్పాటు • ఈనెల15న ప్రారంభం

కాకినాడ స్పోర్ట్స్: వెయిట్ లిఫ్టర్లు కరణం మల్లేశ్వరి, నేరుబాల, వీరేంద్రసింగ్, విక్కిభట్టా, ఏకే పాండియన్, నందినీ వీరందరూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు. వారిని ఆదర్శంగా తీసుకుని వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించాలని జిల్లా క్రీడాకారులు ఆశపడ్డా సరియైన శిక్షణ సదుపాయాలు లేక ఆ స్థాయిలో పలువురు రాణించలేని దుస్థితి ఉంది. ఒకటి కాదు రెండు కాదు పన్నెండేళ్ల వారి నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఇటీవల మంజూరు చేసిన నూతన అకాడమీలలో బాలికల విభాగంలో జిల్లాకు రాష్ట్రస్థాయి బాలికల వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ మంజూరైంది. ఈనెల 15న అకాడమీ ప్రారంభానికి క్రీడాభివృద్ధి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతకాలం అకాడమీ లేదని నిరుత్సాహపడిన జిల్లా క్రీడాకారులు అకాడమీ మంజూరుపై సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయి అకాడమీ రాక సందర్భంగా వెయిట్ లిఫ్టింగ్ క్రీడ, జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ చరిత్ర పై 'ఆంధ్రజ్యోతి' కథనం ఇలా...

జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ ప్రారంభం ఇలా...

కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో 2005లో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభం అయింది. క్రీడా మైదానంలోని పాత జిమ్ భవనంలో జిమ్ ప్రక్కన హాలులో ఇద్దరు కుర్రాళ్ళు, ఒక వెయిట్ లిఫ్టింగ్ ఫ్లాట్‌ఫాంతో ప్రారంభమై నేడు రాష్ట్రస్థాయి బాలికల వెయిట్ లిఫ్టింగ్ స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం క్రీడా మైదానంలో ఇటీవల డిఎస్ఏ ఇండోర్ స్టేడియం వెనుక నిర్మించిన నూతన భవనంలో శిక్షణ కొనసాగుతోంది. పది వెయిట్ లిఫ్టింగ్ సెట్లు, 4 ఫ్లాట్‌ఫాంలు అందుబాటులో ఉన్నాయి. అండర్-10, 17 విభాగాలలో ఒక్కొక్క విభాగంలో 10, అండర్-17 పైబడిన విభాగంలో 20 మంది శిక్షణ పొందుతున్నారు. రాష్ట్రస్థాయి అకాడమీలో భాగంగా 20 మంది రాష్ట్రంలోని వివిధ జిల్లాలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారిణులకు ఉచిత విద్య, వసతి అందించి శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం అంతర్జాతీయస్థాయి క్రీడాపరికరాలు శాప్ కొనుగోలు చేసింది. ప్రారంభ సమయానికి పూర్తిస్థాయిలో క్రీడా సదుపాయాలు కల్పిస్తామని ఇటీవల కాకినాడ వచ్చిన శాప్ ఏడీ టెక్నికల్ ఎస్వీ రమణ తెలిపారు.



2019 జాతీయస్థాయి క్రీడల్లో పతకం సాధిస్తాం: జిల్లాకు రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ మంజూరు కావడం సంతోషంగా ఉంది. 2019 జాతీయ క్రీడల్లో కాకినాడ అకాడమీ క్రీడాకారిణులతో పతకం సాధించడమే తన ముందున్న లక్ష్యం అన్నారు 2020లో అంతర్జాతీయస్థాయి పతకం సాధించేలా ప్రణాళికలు రూపొందించుకుని శిక్షణ అందిస్తామని జిల్లా క్రీడా మండలి వెయిట్ లిఫ్టింగ్ కోచ్ సతీష్‌కుమార్ 'ఆంధ్రజ్యోతికి' తెలిపారు.



శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులు

నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

అడవి తల్లి బంధువులు

● ప్రకృతి ప్రేమికులు ● వృక్షాల ఆరాధకులు









వాగులో ప్రయాణం ఎంత కష్టమో..

అడవంటే వారికి ఎంతో ఇష్టం.. వేటంటే మరెంతో ఇష్టం..తరతరాలుగా అడవితో పెనవేసుకుపోయిన జీవితాలు వారివి. వృక్షాలే వారి ఆరాధ్య దైవాలు..ఆ వృక్షాలలో దేవతలను చూసుకోవడం వారికి అలవాటు..అడవి మృగాలను ఎదురించే ధైర్యం ఉన్నా చేతబడులంటే భయం.... సాగు నుంచి మొదలై పంట చేతికంది తినేంతవరకూ పండుగే .... పండుగ చేస్తేనే కానీ కొత్త పంట ముట్టని సంప్రదాయం. కొలుపులు, భూమి పండుగ చేసుకోవడంలో ఆనందం వారికి మాత్రమే తెలుసు.. పెళ్ళి, పుట్టుక, చావు ఏదైనా ఒకరికొకరు సహకరించుకోవడం వారి సంస్కృతి.. వరకట్నం తీసుకోకపోవడం వాళ్ల ఆదర్శతత్వం.. ఆదిమ తెగలైన ఆదివాసీలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో విస్తరించి ఉన్నారు. నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ....

● చింతూరు



ఇలవేల్పుల పండుగ... ఆ హడావుడే వేరు

● ప్రత్యేక శైలి వారిది

ఆదివాసీలది ఓ ప్రత్యేక శైలి, ప్రత్యేక భాష. ఆదివాసీలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలవబడుతుంటారు. ఆదివాసీలని, గోండులని పిలుస్తుంటారు.. వివిధ రాష్ట్రాలలో అడవి, కొండ ప్రాంతాల ఆధారంగా జీవిస్తున్నారు. అందుకే ఫలాలు ఇచ్చే చెట్లను పూజించడం వారి సంప్రదాయంగా మారింది. ఆదివాసీలు పూర్వం ఆదివాసీ రాజులుగా, ఆదివాసీ దొరలుగా పిలవబడేవారు. ఛత్తీస్‌గడ్‌లోని బస్తర్ జిల్లా వారి పూర్వ ప్రదేశం. కాలక్రమంలో రాష్ట్రాలు విడిపోయి .... అక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు విస్తరించారు. మొదట్లో వారంతా ఒకే భాషను మాట్లాడేవారు. ప్రాంతాలుగా విడిపోవడంతో భాష, జీవన విధానం మారింది.

● వాళ్ల పండుగలే వేరు..

ఆదివాసీల పండుగలకు ప్రాముఖ్యం ఇస్తుంటారు. భూమి పండుగ, కొలుపులు, ఇలవేల్పులు, పచ్చపండుగ లాంటి పేర్లతో వేడుకలు నిర్వహిస్తారు.పండుగ చేయనిదే ఏ పని ముట్టరు. సాగు మొదలుపెట్టాలంటే భూమి పండుగ చేయాల్సిందే. పండిన పంటను తినాలంటే పచ్చల పండుగ చేయాల్సిందే. అందరి క్షేమం కోరి కొలుపుల పండుగను చేస్తుంటారు. పూర్వీకులందరినీ కలుసుకోవడానికి ఇలవేల్పుల పండుగను నిర్వహిస్తుంటారు. ఇక పెళ్ళి అంటే ఊరంతా పండుగే. ఒకరికొకరు సహకరించుకోవడం వారి ఆనవాయితీ. వేటంటే వారికి ప్రాణం. భూమి పండుగ మొదలైతే చాలు ఊరిలోని పురుషులంతా వేటకు కదలాల్సిందే. మహిళలు రేలాటలు ఆడాల్సిందే.



ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయ విధానం కూడా అద్భుతమే



ఈ నీరే దిక్కు

● అందని సహకారం.. అవస్థలే జీవితం..

నేటికీ ఆదివాసీ గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేక అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో మారుమూల గ్రామాలకు చెందిన ఆదివాసీలు వాగులు వంకలు దాటుతూ కాలినడకన ఇళ్ళకు చేరుకోవాల్సిన దుస్థితి. వైద్యం కూడా ఆదివాసీలకు అందుబాటులో లేని పరిస్థితి ఉంది.. దీంతో కాళ్ళవాపు లాంటి వ్యాధుల బారిన పడి మృత్యువాత పడుతున్నారు.

● పోలవరంతో అడవికి దూరం??

పోలవరం ప్రాజెక్టుతో తమ ప్రాంతాన్ని వీడాల్సి వస్తుందనే ఆవేదన, ఆందోళన ఆదివాసీల్లో నెలకొంది. ఉన్న ఊరు, ఉన్న ఇల్లు వీడి మరో ప్రాంతానికి వలస వెళ్ళి తామెట్టా బతికేదన్న ప్రశ్న వారిని పట్టి పీడిస్తోంది. ఇప్పుడిప్పుడే కాసింత అభివృద్ధికి దగ్గరవుతున్న తమని మరో ప్రాంతానికి తరలిస్తే బతుకులు మళ్ళీ మొదటికొస్తాయన్న ఆవేదన ఆదివాసీలది.

● గోండ్వానా రాష్ట్రంతోనే అభివృద్ధి...

దేశంలోని ఐదో షెడ్యూలు ప్రాంతాలన్నింటినీ కలిపి గోండ్వానా రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఆదివాసీల నుంచి వెలువడుతోంది. తమను తాము పరిపాలించుకుంటే మినహా తమ జాతి అభివృద్ధి చెందదన్న వాదన ఆదివాసీ సంఘాల నుంచి వినిపిస్తోంది.

చట్టాలు ఉన్నా సంక్షేమం శూన్యం

● ఆరోగ్య భద్రత, అటవీ హక్కులూ అందని ద్రాక్షే!
● ఐటీడీఏల్లో అధికారులదే హవా
● 'పోలవరం'తో ఆందోళన

(రంపచోడవరం)

ఆదివాసీల అభివృద్ధికి, సంక్షేమానికి బ్రిటిష్ కాలం నుంచీ ఎన్ని ప్రణాళికలు రచిస్తున్నారు. కానీ ఉపయోగం ఉండడం లేదు. ఎన్నో చట్టాలు ఉన్నా వారి జీవన ప్రమాణాలు పెరగడం లేదు. ప్రభుత్వ పాలకులు, అధికారులే ఆదివాసీల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారు. అభివృద్ధి ముసుగులో కొన్ని విధానాలు ఆదివాసీల ఉనికినే లేకుండా చేస్తున్నాయి. ప్రాజెక్టుల పేరుతో ఆదివాసీల ఐక్యతను దెబ్బతీస్తూ, జాతి అంతానికే దారితీసే నిర్ణయాలను ప్రభుత్వాలు తీసుకుంటున్నాయి. అడవిని నమ్ముకుని జీవనం సాగించే వారికి నేటికీ పూర్తిస్థాయిలో హక్కులు దక్కలేదు కానీ, అడవిని అమ్ముకుని, ఖనిజాలు దోచేసే వ్యవస్థలకు మాత్రం ప్రోత్సాహం ఎక్కువైంది.

ప్రాణాలు కోల్పోతున్న గిరిజనులు

ఎందరో గిరిజనులు, బాలింతలు, పసిబిడ్డలూ ప్రాణాలు కోల్పోతున్నారు. రక్తహీనత సమస్య, పౌష్టికాహారం లోపం వారిని పట్టి పీడిస్తోంది. రక్షిత మంచినీరు నేటికీ వారికి దొరకడం లేదు. వాగులు, చలమల నుంచి వచ్చే నీరే వారికి దిక్కు.. చాపరాయి సంఘటన ప్రభుత్వానికి గుణపాఠం నేర్పినా అది శాశ్వత చర్యలకు బీజం వేయడం లేదు.

పోలవరంతో ప్రమాదం

పోలవరం ప్రాజెక్టు వారి జీవితాలను భయంలోకి నెట్టేసింది. ప్రభుత్వాలు పునరావాస విధానాన్ని పక్కాగా అమలు చేయకపోవడంతో గిరిజనుల జీవితాలు అంధకారంగా మారుతున్నాయి. సుమారు 276 గిరిజన గ్రామాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాలలో అటవీ హక్కులను పరిరక్షించాలని కేంద్రం గతంలోనే ఆదేశించినా ఇప్పటికీ శాశ్వత పరిష్కారం దొరకలేదు. ప్రాజెక్టు కారణంగా ఆదిమజాతిలో ముఖ్యమైన కొండరెడ్లు తమ స్వస్థలాల నుంచి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి నిర్దేశించిన ఐటీడీఏలు అవినీతికి నిలయాలుగా మారాయి. గిరిజన సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు పక్కదారి పడుతున్నాయి. అయినా ఎవరిపైనా చర్యలు ఉండవు. అధికారులు తీసుకునే ఏ నిర్ణయం కూడా పీసా చట్టం కింద సాగడం లేదు. ఐటీడీఏ పాలకమండలి కూడా అధికారులతోనే నిండిపోతోంది. ఏ రోజు అయితే గిరిజనుడు ఆ వ్యవస్థకు సారథ్యం వహిస్తాడో ఆరోజే తమ బతుకులు బాగుంటాయనే భావన గిరిజనుల్లో ఉంది.

● ఒక్కో అడుగు ముందుకు ......

ఆదివాసీలు తరాలుగా అడవినే నమ్ముకున్నారు. అంతే కాదు నదీ పరివాహక పరిసరాలలో నివాసాలు ఏర్పరచుకొనేవారు. పోడు సాగే వారి ప్రధాన జీవనాధారం. దీనికి తోడు అటవీ ఫలాలను వారు ఇష్టపడుతుంటారు. పంటలు పండని సందర్భాలలో అటవీ ఫలాలు తిని కడుపునింపుకొనేవారు. దీంతో ఆధునిక సమాజానికి దూరమయ్యారు. అయితే కాల క్రమంలో ఆదివాసీల జీవితాలలో కూడా మార్పులు వచ్చాయి. దశాబ్ద కాలంగా ఒక్కో అడుగు ముందుకేస్తున్నారు. అయినా ఇంకా ఎంతో ఎదగాల్సి ఉంది. మరెంతో సాధించాల్సి ఉంది. ప్రభుత్వాలు కూడా ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నాయి. ఐటీడీఏలను ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో ఆదివాసీ యువత నేడు చదువుల్లో పోటీ పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో రాణించడం మొదలుపెట్టారు. డాక్టర్లు, ఇంజనీర్లు అవుతున్నారు. అయితే అవకాశాలు అందిపుచ్చుకుంటున్న వాళ్లు కొంతమందే.. ఇంకా ఎంతో మంది విద్యార్థులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఇంకా చాలా మార్పు, అభివృద్ధి జరగాల్సి ఉంది. ఆ దిశగా ప్రభుత్వాలు మరింత చొరవ తీసుకోవాల్సి ఉంది. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వర్ణమాల అక్షరాల దిశలు తెలిస్తే జవాబు సులువే..!

అనాలజీ (పోలిక పరీక్ష)

మోడల్ - 1

1. **ఖురాన్: మహ్మదీయులు:: జెండ్ అవస్థా: -----**
ఎ) జొరాస్ట్రియన్ బి) షింటో సి) అజీవక డి) పారశీక
సమాధానం: ఎ
వివరణ: మహ్మదీయుల పవిత్ర గ్రంథం ఖురాన్. అలాగే జొరాష్ట్రియన్ల పవిత్ర గ్రంథం జెండ్ అవస్థా

2. **నవంబరు 14 : బాలల దినోత్సవం :: జూన్ 5 : ------**
ఎ) యువజన దినోత్సవం
బి) పర్యావరణ దినోత్సవం
సి) ఆహార దినోత్సవం డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: నవంబరు 14 బాలల దినోత్సవం. అలాగే జూన్ 5 పర్యావరణ దినోత్సవం

3. **శాకాహారి: ఆవు :: మాంసాహారి: ---------**
ఎ) జింక బి) మేక సి) గొర్రె డి) సింహం
సమాధానం: డి
వివరణ: ఆవు శాకాహారి. అలాగే ఇచ్చిన ఐచ్ఛికాల్లో సింహం మాంసాహారి

4. **రక్తం: ఎరుపు :: బొగ్గు : -----------**
ఎ) పసుపు బి) ఆకుపచ్చ సి) నలుపు డి) గులాబి
సమాధానం: సి
వివరణ: రక్తం ఎరుపు రంగులో ఉంటుంది. బొగ్గు నలుపు రంగులో ఉంటుంది

5. **ఉదయం: సాయంత్రం :: రాత్రి : -----**
ఎ) పగలు బి) సాయంత్రం
సి) మధ్యాహ్నం డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: ఉదయానికి వ్యతిరేకం సాయంత్రం, అలాగే రాత్రికి వ్యతిరేకం పగలు

6. **గడియారం: సమయం :: థర్మామీటర్ : -------**
ఎ) ఉష్ణం బి) ఉష్ణోగ్రత సి) శక్తి డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: సమయాన్ని తెలిపేది గడియారం, ఉష్ణోగ్రతను తెలిపేది థర్మామీటర్

7. **సిక్కిం: గాంగ్‌టక్ :: మణిపూర్ : ------**
ఎ) డిస్పూర్ బి) షిల్లాంగ్ సి) ఇంఫాల్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సిక్కిం రాష్ట్ర రాజధాని గాంగ్‌టక్. అలాగే మణిపూర్ రాజధాని ఇంఫాల్

8. **క్యాలెండర్ : తేదీలు :: నిఘంటువులు : ------**
ఎ) భాష బి) వాక్యాలు సి) పదాలు డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: క్యాలెండర్‌లో తేదీలు ఉంటాయి. అలాగే నిఘంటువులో పదాలు ఉంటాయి

9. **కిలోగ్రాం : క్వింటాల్ :: పైసా : ------**
ఎ) రూపాయి బి) నాణెం సి) సంపద డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: వంద కిలోగ్రాములు ఒక క్వింటాల్. అలాగే వంద పైసలు అంటే ఒక రూపాయి.

10. **సముద్రగుప్తుడు: ఇండియన్ నెపోలియన్ :: కాళిదాసు : ------**
ఎ) ఇండియన్ ఐన్‌స్టీన్
బి) ఇండియన్ మాకియవెల్లి
సి) ఇండియన్ షేక్‌స్పియర్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సముద్ర గుప్తుని బిరుదు ఇండియన్ నెపోలియన్ అలాగే కాళిదాసు బిరుదు ఇండియన్ షేక్‌స్పియర్

11. **నిరక్షరాస్యత : విద్య :: వరద : --------**
ఎ) వంతెన బి) సముద్రం సి) ఆనకట్ట డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: నిరక్షరాస్యత తొలగాలంటే విద్యావంతులు కావాలి. అదేవిధంగా వరదల నుంచి రక్షణకై ఆనకట్టలు నిర్మించాలి.

12. **ప్రొటీన్స్: పెరుగుదల:: కార్బోహైడ్రేట్స్: ------**
ఎ) శక్తి బి) బలం సి) వ్యాధి డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: పెరుగుదలకు ప్రొటీన్స్, తక్షణ శక్తికి కార్బోహైడ్రేట్స్ ఉపయోగపడతాయి.



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 2

వర్ణమాల అక్షరాలతో పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇచ్చి దానిని ఒక క్రమ పద్ధతిలో కొత్త అక్షరాలుగా మారుస్తారు. అంతేకాక మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇస్తారు. అభ్యర్థి మొదటి వర్ణమాల అక్షరాల సమూహం ఏ పద్ధతిలో మార్చారో పరిశీలించి ఇచ్చిన మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని అదే పద్ధతిలో మార్చి రాయాలి.

ఈ మోడల్‌కు సంబంధించిన ప్రశ్నలకు త్వరగా సమాధానం గుర్తించాలంటే వర్ణమాల అక్షరాల సవ్యదిశ, అపసవ్యదిశ సంఖ్యలు తెలిసి ఉండటం చాలా అవసరం.

సవ్యదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
A	B	C	D	E	F	G	H	I	J	K	L	M	N
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
O	P	Q	R	S	T	U	V	W	X	Y	Z		

అపసవ్యదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
Z	Y	X	W	V	U	T	S	R	Q	P	O	N	M
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
L	K	J	I	H	G	F	E	D	C	B	A		

1. **ADG: CFI :: MPS: ----------**
ఎ) PRU బి) OSU సి) ORU డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: ఈ ప్రశ్నలో అక్షరాలు +2 సిద్ధాంతాన్ని అనుసరించినవి. ADG ని CFI గా రాశారు.
అంటే A మొదటి అక్షరం C(A + 2 = C) మూడో అక్షరం
D నాలుగో అక్షరం, F ఆరో అక్షరం (D + 2 = F)
G ఏడో అక్షరం, I తొమ్మిదో అక్షరం (G + 2 = I) అలాగే
M పదమూడో అక్షరం, O పదిహేనో అక్షరం (M + 2 = O)
P పదహారో అక్షరం, R పద్దెనిమిదో అక్షరం (P + 2 = R)
S పందొమ్మిదో అక్షరం, U ఇరవై ఒకటో అక్షరం(S + 2 = U)
కాబట్టి సమాధానం ORU అవుతుంది

2. **FDB: HFD :: NLJ : ------------**
ఎ) KLN బి) PNL సి) QNK డి) ఏదీకాదు
సమాధానం: బి

6	4	2		4	12	10
F	D	B		N	L	J
+2	+2	+2	అలాగే	+2	+2	+2
H	F	D		P	N	L
8	6	4		16	14	12

3. **FAME: JEQI :: LOVE: -------**
ఎ) PSZI బి) PRYK సి) PSXJ డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ:

6	1	13	5	12	15	22	5
F	A	M	E	L	O	V	E
+4	+4	+4	+4	+4	+4	+4	+4
J	E	Q	I	P	S	Z	I
10	5	17	9	16	19	26	9

4. **JOY: MQZ :: KNR : -----------**
ఎ) MMR బి)NPS సి) LMS డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ:

10	15	25	11	14	18
J	O	Y	K	N	R
+3	+2	+1	+3	+2	+1
M	Q	Z	N	P	S
13	17	26	14	16	19

5. **KIG : MMM :: MLK : ----------**
ఎ) QRP బి) PQR సి) OPQ డి) ఏదీకాదు
సమాధానం: సి

11	9	7	13	12	11
K	I	G	M	L	K
+2	+4	+6	+2	+4	+6
M	M	M	O	P	Q
13	13	13	15	16	17

6. **HEN : FCL :: IHG: ----------**
ఎ) GFE బి) EFG సి) FGE డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ:

8	5	14	9	8	7
H	E	N	I	H	G
-2	-2	-2	-2	-2	-2
F	C	L	G	F	E
6	3	12	7	6	5

7. **FENR: DILV :: SALT : ------------**
ఎ)PEJY బి) QFJY సి) QEJY డి) QEJX
సమాధానం: డి

6	5	14	18	19	1	12	20
-2	+4	-2	+4	-2	+4	-2	+4
D	I	L	V	Q	E	J	X
4	9	12	22	17	5	10	24

8. **TRK: QPJ :: NKF : ---------**
ఎ) KIE బి) KJF సి) JJE డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ:

20	18	11	14	11	6
T	R	K	N	K	F
-3	-2	-1	-3	-2	-1
Q	P	J	K	I	E
17	16	10	11	9	5

9. **BOLD: CQOH :: KITE : ----------**
ఎ) LWKJ బి) LKWI సి)KLXJ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ:

2	15	12	4	11	9	20	5
B	O	L	D	K	I	T	E
+1	+2	+3	+4	+1	+2	+3	+4
C	Q	O	H	L	K	W	I
3	17	15	8	12	11	23	9

10. **MNR: GJP :: KPT : ---------**
ఎ) ELR బి) EJP సి) DJP డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ:

13	14	18	11	16	20
M	N	R	K	P	T
-6	-4	-2	-6	-4	-2
G	J	P	E	L	R
7	10	16	5	12	18

11. **NF: SK :: GJ : ----------**
ఎ) NP బి) PQ సి) LO డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: N పద్నాలుగో అక్షరం, S పందొమ్మిదో అక్షరం (N + 5 = S)
F ఆరో అక్షరం, K పదకొండో అక్షరం (F + 5 = K)
G ఏడో అక్షరం, L పన్నెండో అక్షరం (G + 5 = L)
J పదో అక్షరం, O పదిహేనో అక్షరం (J + 5 = O)
కాబట్టి LO సమాధానం అవుతుంది

12. **RKNI : NHLH :: KIND : ---------**
ఎ) GFED బి) GFLC సి) JFEC డి) ఏదీకాదు
సమాధానం: బి

18	11	14	9	11	9	14	4
R	K	N	I	K	I	N	D
-4	-3	-2	-1	-4	-3	-2	-1
N	H	L	H	G	F	L	C
14	8	12	8	7	6	12	3

13. **NRKI : JUIJ :: TFNK : ---------**
ఎ) IUJJ బి) LIPL సి) PILL డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ:

14	18	11	9	20	6	14	11
N	R	K	I	T	F	N	K
-4	+3	-2	+1	-4	+3	-2	+1
J	U	I	J	P	I	L	L
10	21	9	10	16	9	12	12

JOBS ఉద్యోగాలు

యుఐఐసిఎల్

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యుఐఐసిఎల్)- **అసిస్టెంట్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 696
అర్హత: జూన్ 30 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రాంతీయ భాషల్లో ప్రావీణ్యం ఉండాలి.
వయసు: 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి
వేతనం: నెలకు రూ.23,000
ఎంపిక: ప్రిలిమ్స్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్ ద్వారా
ప్రిలిమ్స్ టెస్ట్: సెప్టెంబరు 22న
మెయిన్ ఎగ్జామ్: అక్టోబరు 23న
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 14 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28
వెబ్‌సైట్: www.uiic.co.in

ఒఐసిఎల్

ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఒఐసిఎల్)- **అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 300**
పోస్టులు - ఖాళీలు: అకౌంటెంట్స్ 20, యాక్చ్యురీస్ 2, జనరలిస్ట్స్ 223, లీగల్ 30, ఆటోమొబైల్ ఇంజనీర్స్ 15, మెడికల్ ఆఫీసర్స్ 10.
వయసు: 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
రాత పరీక్ష: అక్టోబరు 22న
దరఖాస్తు ఫీజు: రూ.600
దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 18 నుంచి
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.orientalinsurance.org.in/Career.jsp


బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర - సెక్యూరిటీ ఆఫీసర్ (మేనేజర్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది
ఖాళీలు: 13
అర్హత: డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఆర్మీ/ నేవీ/ ఎయిర్‌ఫోర్స్/ పారా మిలిటరీ/ పోలీస్ విభాగాల్లో కనీసం అయిదేళ్ల అనుభవం + కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. **వయసు:** 25 - 40 ఏళ్ల మధ్య
వేతనం: రూ.31,705 నుంచి రూ.45,950 వరకు
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ప్రొబేషన్: రెండేళ్లు **దరఖాస్తు ఫీజు:** రూ.600
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 12 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 2
దరఖాస్తు హార్డ్‌కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 12
వెబ్‌సైట్: www.bankofmaharashtra.in

భారతదేశ మొట్టమొదటి గవర్నర్ జనరల్?

భారత రాజ్యాంగం- చట్టాలు

1. ఈస్టిండియా కంపెనీ స్థాపన?
1) 1600 డిసెంబరు 28 2) 1600 డిసెంబరు 29
3) 1600 డిసెంబరు 30 4) 1600 డిసెంబరు 31
2. కలెక్టర్ పదవిని ఎప్పుడు సృష్టించారు?
1) 1770 2) 1771 3) 1772 4) 1773
3. మొట్టమొదటి గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్?
1) వారన్ హేస్టింగ్స్ 2) రాబర్ట్ క్లైవ్
3) మన్రో 4) ఎవరూ కాదు
4. బెంగాల్ గవర్నర్ పదవిని బెంగాల్ గవర్నర్ జనరల్‌గా మార్చిన చట్టం?
1) మొదటి చార్టర్ చట్టం - 1793
2) రెండో చార్టర్ చట్టం - 1813
3) మూడో చార్టర్ చట్టం - 1883
4) రెగ్యులేటింగ్ చట్టం - 1773
5. భారతదేశంలో మొట్టమొదటి మున్సిపల్ కార్పొరేషన్ 1687లో ఎక్కడ ఏర్పాటు చేశారు?
1) మద్రాసు 2) కలకత్తా 3) బొంబాయి 4) ఏదీకాదు
6. భారతదేశ మొట్టమొదటి గవర్నర్ జనరల్?
1) వారన్ హేస్టింగ్స్ 2) రాబర్ట్ క్లైవ్
3) విలియం బెంటింక్ 4) లార్డ్ మెకాలే
7. భారతదేశంలో ఆధునిక సివిల్ సర్వీస్ పితామహుడు?



1) నెహ్రూ
2) సర్దార్ వల్లభాయ్ పటేల్
3) సుభాష్ చంద్రబోస్
4) ఎవరూకాదు
8. ఇండియన్ పీనల్ కోడ్‌ను ఎప్పుడు చట్టం చేశారు?
1) 1858 2) 1859 3) 1860 4) 1861
9. ప్రస్తుత(21వ) లా కమిషన్ చైర్మన్?
1) ఎం.సి.సెతల్వాడ్ 2) ఎ.పి.షా
3) బల్బీర్‌సింగ్ చౌహాన్ 4) ఎవరూ కాదు
10. 'సతి'ని ఎప్పుడు రద్దు చేశారు?
1) 1853 2) 1828 3) 1829 4) 1830
11. ప్రపంచంలో తొలిసారిగా పోటీ పరీక్షలు నిర్వహించిన దేశం?
1) రష్యా 2) చైనా 3) భారత్ 4) బ్రిటన్
12. భారతదేశంలో సివిల్ సర్వీస్ పితామహుడు?
1) విలియం బెంటింగ్ 2) లార్డ్ మెకాలే
3) కారన్ వాలిస్ 4) లార్డ్ రిప్పన్
13. కలకత్తా, బొంబాయి, మద్రాసు విశ్వవిద్యాలయాలను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1856 2) 1857
3) 1859 4) 1860
14. భారతదేశంలో న్యాయ వ్యవస్థ పితామహుడు?
1) లార్డ్ మెకాలే 2) కారన్ వాలిస్
3) విలియం బెంటింగ్
4) లార్డ్ రిప్పన్
15. మొట్టమొదటి ఇండియన్ సివిల్ సర్వీస్ అధికారి?
1) రవీంద్రనాథ్ ఠాగూర్
2) సత్యేంద్రనాథ్ ఠాగూర్
3) సుభాష్ చంద్రబోస్
4) సురేంద్రనాథ్ బెనర్జీ
16. భారతదేశ మొట్టమొదటి వైస్రాయి?
1) లార్డ్ కానింగ్ 2) లార్డ్ మేయో
3) లార్డ్ రిప్పన్ 4) ఎవరూ కాదు
17. భారతదేశ మొట్టమొదటి రాజ్య కార్యదర్శి?
1) హంటర్ 2) చార్లెస్ ఉడ్స్
3) లార్డ్ మెకాలే 4) ఎవరూ కాదు

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ



తాళ్లపెల్లి సదయ్య
రామప్ప అకాడమీ
హన్మకొండ

18. 1833లో లా కమిషన్ చైర్మన్?
1) లార్డ్ మేయో 2) లార్డ్ మెకాలే
3) లార్డ్ విలియం బెంటింక్ 4) ఏదీకాదు
19. 1857 సిపాయిల తిరుగుబాటుకు ఆద్యుడు?
1) మంగళ్‌పాండే 2) తాంతియా తోపే
3) నానా సాహెబ్ 4) కున్వర్‌సింగ్
20. సిపాయిల తిరుగుబాటును జాతీయ తిరుగుబాటుగా అభివర్ణించింది?
1) సయ్యద్ అహ్మద్‌ఖాన్ 2) వి.డి.సావర్కర్
3) నెహ్రూ 4) ఎవరు కాదు
21. పోర్టుఫోలియో విధానాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1857 2) 1858 3) 1859 4) 1862
22. కలకత్తా, బొంబాయి, మద్రాసు హైకోర్టులను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1859 2) 1860 3) 1861 4) 1862
23. ప్రస్తుతం భారతదేశంలో హైకోర్టుల సంఖ్య?
1) 21 2) 22 3) 23 4) 24
24. రౌలత్ చట్టాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1909 2) 1917 3) 1918 4) 1919
25. బ్రిటిష్ పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి భారతీయుడు?
1) దాదాబాయి నౌరోజి
2) సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
3) సత్యేంద్రనాథ్ ఠాగూర్ 4) ఎవరూ కాదు
26. భారతదేశంలో 'విభజించు - పాలించు' అనే విధానానికి బీజం వేసిన చట్టం?
1) 1909 చట్టం 2) 1813 చట్టం
3) 1853 చట్టం 4) 1833 చట్టం
27. మత నియోజకవర్గాల పితామహుడు?
1) లార్డ్ మెకాలే 2) మార్లే
3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
28. ముస్లింలీగ్ స్థాపన?
1) 1905 2) 1906 3) 1907 4) 1908
29. సూరత్‌లో కాంగ్రెస్ చీలిక?
1) 1906 2) 1907 3) 1908 4) 1909
30. మాంటెగు ప్రకటన ఎప్పుడు వెలువడింది?
1) 1917 ఆగస్టు 20 2) 1917 ఆగస్టు 21
3) 1917 ఆగస్టు 23 4) 1917 ఆగస్టు 25
31. ద్వంద్వ పాలన పితామహుడు ఎవరు?
1) కారన్ వాలిస్ 2) విలియం ద్యూక్
3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
32. అలహాబాద్ హైకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?



1) 1861 2) 1863 3) 1855 4) 1866
33. జలియన్‌వాలాబాగ్ దుర్ఘటన ఎప్పుడు జరిగింది?
1) 1919 ఏప్రిల్ 13 2) 1919 ఏప్రిల్ 14
3) 1919 ఏప్రిల్ 15 4) 1919 ఏప్రిల్ 16
34. ప్రభుత్వ ఖాతాల సంఘాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1919 2) 1920 3) 1921 4) 1922
35. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటును సూచించిన కమిటీ?
1) లీ కమిటీ 2) హోలీ కమిటీ
3) మాడ్డిమాన్ కమిటీ 4) ఏదీకాదు
36. నెహ్రూ నివేదికను ఎప్పుడు ప్రకటించారు?
1) 1927 2) 1928 3) 1929 4) 1930
37. జిన్నా నివేదికను ఎప్పుడు ప్రకటించారు?
1) 1927 2) 1928 3) 1929 4) 1930
38. కమ్యూనల్ అవార్డును ఎప్పుడు ప్రకటించారు?
1) 1930 2) 1931 3) 1932 4) 1933
39. గాంధీ - అంబేద్కర్‌ల మధ్య పూనా ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
1) 1930 2) 1931 3) 1932 4) 1933
40. భారత్ నుంచి బర్మాను ఎప్పుడు వేరు చేశారు?
1) 1935 2) 1936 3) 1937 4) 1938
41. మౌంట్ బాటన్ ప్రణాళిక ఎప్పుడు వెలువడింది?
1) 1947 జూన్ 3 2) 1947 జూన్ 4
3) 1947 జూన్ 5 4) 1947 జూన్ 6
42. ఆర్‌బిఐని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1934 2) 1935 3) 1936 4) 1937
43. ఆర్‌బిఐకి తొలి భారతీయ గవర్నర్?
1) ఎం.సి.సెతల్వాడ్ 2) సత్యేంద్రనాథ్ ఠాగూర్
3) చింతామణి ద్వారకానాథ్ దేశ్‌ముఖ్
4) ఎవరూ కాదు
44. ప్రస్తుత(24వ) ఆర్‌బిఐ గవర్నర్ ఎవరు?
1) ఉర్జిత్ పటేల్ 2) రంగరాజన్
3) వై.వి.రెడ్డి 4) ఎవరూ కాదు
45. ఫెడరల్ కోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1935 2) 1936 3) 1937 4) 1938
46. భారతదేశంలో సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1950 జనవరి 26 2) 1950 జనవరి 27
3) 1950 జనవరి 28 4) 1950 జనవరి 29
47. స్థానిక సంస్థల పితామహుడు ఎవరు?
1) లార్డ్ మెకాలే 2) లార్డ్ రిప్పన్
3) లార్డ్ మేయో 4) ఎవరూ కాదు
48. సాధారణ బడ్జెట్ నుంచి రైల్వే బడ్జెట్‌ను ఎప్పుడు వేరు చేశారు?
1) 1920 2) 1921 3) 1922 4) 1923
49. కేంద్రంలో ద్విసభ విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
1) 1919 2) 1909 3) 1935 4) 1947
50. రాష్ట్రాల్లో ద్విసభ విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
1) 1909 2) 1919 3) 1935 4) 1947

సమాధానాలు

1) 4	9) 3	17) 2	25) 1	34) 3	43) 3
2) 3	10) 3	18) 2	26) 1	35) 1	44) 1
3) 1	11) 2	19) 1	27) 3	36) 2	45) 3
4) 4	12) 3	20) 3	28) 2	37) 3	46) 3
5) 1	13) 2	21) 3	29) 2	38) 3	47) 2
6) 3	14) 2	22) 4	30) 1	39) 3	48) 2
7) 2	15) 2	23) 4	31) 2	40) 3	49) 1
8) 3	16) 1	24) 4	32) 4	41) 1	50) 3
			33) 1	42) 2	

JOBS ఉద్యోగాలు

కెన్ ఫిన్ హోమ్స్

కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలోని కెన్ ఫిన్ హోమ్స్ లి. - క్లరికల్ కేడర్‌లో ప్రొబేషనరీ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 30
బ్రాంచ్‌ల వారీ ఖాళీలు: బెంగళూరు 8, చెన్నై 4, హైదరాబాద్ 5, ముంబై 4, జైపూర్ 2, భోపాల్ 1, ఇండోర్ 1, ఢిల్లీ/ నొయిడా/ గ్రేటర్ నొయిడా 5
అర్హత: మే 1 నాటికి డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డేటా ఎంట్రీలో ప్రావీణ్యం + కంప్యూటర్ అప్లికేషన్స్ పరిజ్ఞానం + ప్రాంతీయ భాషల్లో నైపుణ్యం ఉండాలి.
వయసు: 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
ప్రొబేషన్: ఏడాది
ఎంపిక: షార్ట్ లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.100
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 14
వెబ్‌సైట్: www.canfinhomes.com/jobapplication.php, www.canfinhomes.com

ఇస్రో



ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 128
పోస్టులు - ఖాళీలు: లైట్ వెహికిల్ డ్రైవర్ ఎ 50, హెవీ వెహికిల్ డ్రైవర్ ఎ 76, స్టాఫ్ కార్ డ్రైవర్ 2
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 28
వెబ్‌సైట్: www.isro.gov.in

ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ

ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ - అప్రెంటిస్‌ల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 24
డిగ్రీ అప్రెంటిస్‌లు: మెకానికల్ 3, మెటలర్జికల్ 2, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ 2
డిప్లొమా అప్రెంటిస్‌లు: మెకానికల్ 3, మెటలర్జికల్ 3, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్ 2
టెక్నికల్ ఒకేషనల్ అప్రెంటిస్‌లు: మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ 3, ఆఫీస్ సెక్రటరీ/ స్టెనోగ్రఫీ 3, పర్చేజింగ్ & స్టోర్ కీపింగ్ 3
అర్హత: అభ్యర్థులు సంబంధిత విభాగంలో డిగ్రీ / డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
ట్రైనింగ్: ఏడాది
స్టయిపెండ్: గ్రాడ్యుయేట్స్‌కు రూ.4984, డిప్లొమా అభ్యర్థులకు రూ.3542, టెక్నీషియన్స్‌కు రూ.2758 చెల్లిస్తారు.
ఎంపిక: అకడమిక్ మెరిట్, వైవా, మెడికల్ టెస్ట్
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 14
చిరునామా: General Manager/Grey Iron Foundry, Jabalpur - 482009

జెఎన్‌టిబిజిఆర్ఐ

జవహర్‌లాల్ నెహ్రూ బొటానికల్ గార్డెన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (జెఎన్‌టిబిజిఆర్ఐ)- తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 46
పోస్టులు - ఖాళీలు: జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో(బోటనీ 21, బయోటెక్నాలజీ/ బయో ఇన్ఫర్మాటిక్స్ 2, కెమిస్ట్రీ/ బయో కెమిస్ట్రీ/ అనలిటికల్ కెమిస్ట్రీ 4, మైక్రో బయాలజీ/ ఇంటిగ్రేటెడ్ బయాలజీ 2, జువాలజీ/ వైల్డ్ లైఫ్ బయాలజీ 1), ప్రాజెక్ట్ అసిస్టెంట్(బోటనీ/ అగ్రికల్చర్/ హార్టికల్చర్ 13), కంప్యూటర్ అసిస్టెంట్ (బోటనీ) 2, సిస్టం అడ్మినిస్ట్రేటర్ 1
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఫస్ట్‌క్లాస్ మార్కులతో ఎమ్మెస్సీ/ బీఎస్సీ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ అర్హత పొందినవారికి ప్రాధాన్యం ఉంటుంది.
స్టయిపెండ్: విభాగాన్ని అనుసరించి రూ.19000 నుంచి రూ.25000 వరకు ఇస్తారు.
వయసు: ఈ ఏడాది జనవరి 1 నాటికి 36 ఏళ్ల ఉండాలి.
ఇంటర్వ్యూ: ఆగస్టు 22, 23, 24న
వేదిక: JNTBGRI, Karimiancode, PO, Pacha Palode, Thiruvanthapuram 695562
వెబ్‌సైట్: www.jntbgri.res.in

ఎస్ఎఫ్ఐ బంద్ విజయవంతం చేయండి

రౌతులపూడి: విద్యారంగ సమస్యల పరిష్కారానికి 10న ఎస్ఎఫ్ఐ చేపడుతున్న బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు కోరారు. మంగళవారం ములగపూడిలో విద్యార్థులతో కలసి కరపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు విద్యా రంగానికి టీడీపీ ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడేందుకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్ పాటిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జె.ఆనంద్, కావ్య, జ్యోతి, శిరిష, దేవి తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరం మండలం జె.అన్నవరంలో మొక్కలు నాటుతున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల, డీసీసీబీ చైర్మన్ రాజా


ప్రత్తిపాడు-లంపకలోవ మార్గంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్, ఎంపీపీ తదితరులు

పచ్చదనంతోనే పర్యావరణానికి పూర్తి రక్షణ

ఏలేశ్వరం: పచ్చదనంతోనే పర్యావరణానికి పూర్తి రక్షణ కలుగుతుందని, ఆదిశగా మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. మంగళవారం జె.అన్నవరం గ్రామంలో డీఆర్‌డీఏ వెలుగుశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ వరుపుల రాజా, జడ్పీటీసీ జ్యోతుల పెదబాబుతో కలిసి ఎమ్మెల్యే వరుపుల ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో పంత రోడ్లు, ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకరపల్లి శారదా, ఎంపీటీసీ సీహెచ్ నాగమణి, బొరుసు శ్రీనివాసచక్రవర్తి, మందపాటి అలార్క్‌రాజు, కాకరపల్లి వీరంశెట్టి, గొంతిన సురేష్, బాజింకల సూర్యనారాయణ, కాకరపల్లి అర్జునరావు, చినబాబు తదితర ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ నడుం కట్టాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు-లంపకలోవ రహదారి మార్గంలో మంగళవారం నరేంద్రగిరి కొండ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఏడు గ్రామాల్లో 3400 మొక్కలు నాటే చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వరుపుల రాజా, ఎంపీపీ బత్తుల లోవకుమారి, సర్పంచ్ విశ్వేశ్వరరావు, ఏపీఎం సుశీలగ్రేస్, ఏపీవో కొండలరావు, ఎంపీడీవో రామకృష్ణ, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


కత్తిపూడిలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న కాపు నాయకులు


ప్రత్తిపాడులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం

శంఖవరం: రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని కాపు నేతలు అన్నారు. మంగళవారం రాత్రి కత్తిపూడి, శంఖవరం గ్రామాలలో కాపు ఉద్యమనేత ముద్రగడకు మద్దతుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శంఖవరం బస్టాండు సమీపంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా జరిపారు. కత్తిపూడి బంకు సెంటరు వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గౌతు సుబ్రహ్మణ్యం, గౌతు అర్జిబాబు, గౌతు వాసు, పడాల సతీష్, ఫణి, జీలకర్ర లక్ష్మణ్, గాబు కృష్ణ, గౌతు గోవిందరాజులు, దడాల బాబ్జీ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: కాపు రిజర్వేషన్లు కోరుతూ బంగారయ్యపేటలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జేఏసీ మండల నాయకుడు కూరగాయల వెంకటరమణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కుర్రా రమణ, వీరబాబు, కోన సత్యనారాయణ, కామిరెడ్డి గంగరావు, బుజ్జి, కీర్తి దొంగబాబు, బొజ్జా రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి, ధర్మవరం గ్రామాల్లో మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంకు మద్దతుగా ఈ రెండు గ్రామాల్లో పలువురు కొవ్వొత్తులతో ర్యాలీలు జరిపారు. కార్యక్రమాల్లో రామిశెట్టి చినబాబు, సానా నూకరాజునాయుడు నాయకత్వం వహించారు.


రౌతులపూడి మండలం బంగారయ్యపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

లబ్ధిదారులకు చంద్రన్న బీమా చెక్కులు అందజేత


చంద్రన్న బీమా చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు చంద్రన్న బీమా చెక్కులు అందజేశారు. ప్రత్తిపాడు మండలానికి సంబంధించి 21 మంది రూ.20.40 లక్షలు, ఏలేశ్వరం మండలానికి చెందిన ఎనిమిది మందికి రూ.21.20 లక్షల వంతున ఎమ్మెల్యే అందించారు. సమావేశంలో పాల్గొన్న మండల సమాఖ్య ముప్పిడి మేరి, ఏపీఎం సుశీలగ్రేస్ మాట్లాడుతూ చనిపోయిన వెంటనే చంద్రన్న బీమా కాల్ సెంటర్ 0884235331కు ఫోన్ చేస్తే వెంటనే రూ.5 వేలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వరుపుల రాజా, ఎంపీపీ బత్తుల లోవకుమారి, ఏఎంసీ చైర్మన్ కన్నబాబు, జడ్పీటీసీ పెదబాబు, టీడీపీ నాయకులు గొంతిన సురేష్, గుడాల రామకృష్ణ, సర్పంచ్ విశ్వేశ్వరరావు, ఎంపీడీవో వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పర్వత ప్రసాద్

నవరత్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళండి

శంఖవరం: వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రకటించిన నవరత్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైసీపీ నియోజవర్గ కోఆర్డినేటర్ పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం కత్తిపూడిలో బూత్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించి సభ్యులను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రకటించిన మేనిఫెస్టోను ఇంటింటీ తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గాబు కృష్ణ, గౌతు అర్జిబాబు, పెండ్యాల ఎల్లాజీరావు, అడపా సోమేష్, దడాల బాబ్జీ, రావూరి వెంకటేశ్వరరావు, పినకా సతీష్, గౌతు కృష్టారావు, మాదేపల్లి మహేష్, పిర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రత్తిపాడు: ప్రభుత్వ వైఫల్యాలను వైసీపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వత ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని రాచపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన వైసీపీ కార్యకర్తల బూత్‌లెవల్ కమిటీల సమావేశానికి మండల కమిటీ అధ్యక్షుడు చలగళ్ల దొరబాబు అధ్యక్షత వహించారు. సభలో పర్వత ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్ నవరత్నాల పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు దలే చిట్టిబాబు, రాసంశెట్టి చినబాబు, బొదిరెడ్డి హరిబాబు, ముత్యాల నూకరాజు, బాబ్జి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి రూ.16 కోట్లు నిధులు మంజూరు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల నిర్వహణ నిమిత్తం తాజాగా మరో రూ.16కోట్లు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు తెలిపారు. తోటవీధిలోని ఆప్కాబ్ ఉపాధ్యక్షుడు వరుపుల రాజా స్వగృహ ఆవరణలో మంగళవారం జరిగిన తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశానికి మండల కమిటీ అధ్యక్షుడు గొంతిన సురేష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే వరుపుల మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ వరుపుల రాజా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తామని రాబోయే రెండేళ్లలో నియోజకవర్గంలోని అన్ని రహదారులు అభివృద్ధి చేయడంతో పాటు అర్హులందరికీ పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యులు పర్వత రాజబాబు, ప్రత్తిపాడు ఏఎంసీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, టీడీపీ నాయకులు బత్తుల నాగార్జున, యాళ్ల జగదీష్, జల్లిగంపల ప్రభాకరరావు, పిల్లా పద్మరాజు, పర్వత సురేష్, జడ్పీటీసీలు జ్యోతుల పెదబాబు, పెన్నాడ సత్తిబాబు, ఎంపీపీ ఇతంశెట్టి భాస్కరబాబు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వరుపుల

• సినిమా గైడ్

ఏలేశ్వరం:	
వెంకటసూర్య	ఫిదా
జయశ్రీ	గౌతమ్‌నంద
కత్తిపూడి:	
సత్యనారాయణ	నక్షత్రం
రౌతులపూడి:	
శ్రీమహాలక్ష్మి	గురు



విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి

రౌతులపూడి: చిన్నారులకు తట్టు, రుబెల్లా వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని ఎంఈవో ఎస్వీ నాయుడు కోరారు. వైద్య సిబ్బంది శృంగవరం, ఎం.చామవరం, పి.చామవరం, పారుపాక గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఎంఈవో ఎస్వీ నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాక్సిన్ వేసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆదర్శనీయం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల, డీసీసీబీ చైర్మన్ రాజా

ఏలేశ్వరం: ప్రతీ ఒక్కరూ ఇతరుల పట్ల జాలి, దయ, ప్రేమ, కరుణ కలిగి ఉండాలన్న ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆదర్శనీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ఆప్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ వరుపుల రాజా అన్నారు. మర్రివీడు గ్రామంలో మంగళవారం జీసెస్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన చర్చి ప్రారంభోత్సవం నిర్వహించారు. స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్, జీసెస్ మినిస్ట్రీస్ సంస్థ కన్వీనర్ డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు నేతృత్వంలో ఏర్పాటైన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల, ఆప్కాబ్ వైస్ చైర్మన్ వరుపుల రాజా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాకినాడ హౌస్ ఆఫ్ ప్రేయర్ సంస్థ చైర్మన్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ విజయకుమార్‌తో కలిసి ఎమ్మెల్యే, ఆప్కాబ్ వైస్ చైర్మన్లు చర్చిను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసుకృప ఆధ్యాత్మిక గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, డాక్టర్ ఎలుచూరి పాపారావు, జి.జాన్‌విల్సన్‌బాబు, కాకరపల్లి వీరంశెట్టి, మందపాటి అలార్క్‌రాజు, బొరుసు శ్రీనివాసచక్రవర్తి, ఎస్.చిట్టిబాబు తదితులు పాల్గొన్నారు.


మర్రివీడులో ఏసుకృప పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరుపుల, డీసీసీబీ చైర్మన్ రాజా

రుణగ్రహీతలకు ఇంటర్వ్యూ తేదీల ఖరారు

గోకవరం: వివిధ రకాల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించే తేదీలు ఖరారు చేసినట్టు మంగళవారం ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. కొత్తపల్లి విజయబ్యాంకు పరిధి అభ్యర్థులకు ఈ నెల 16, పశ్చిమగోనగూడెం ఆంధ్రాబ్యాంకు అభ్యర్థులకు 17, గోకవరం ఎస్‌బీఐ బ్యాంకు పరిధి 18, మల్లవరం కార్పొరేషన్‌బ్యాంకులో 19, గోకవరం డీసీసీబీ బ్యాంకు పరిధి 21, ఇండియన్‌బ్యాంకు పరిధి 22, 23, మల్లిసాల ఆంధ్రాబ్యాంకు అభ్యర్థులకు 24న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పూర్తి సమాచారంతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె కోరారు.


విద్యార్థినికి ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న చిత్రం

'ఎంఆర్ వ్యాక్సిన్లు పిల్లలకు వేయించాలి'

కిర్లంపూడి: తొమ్మిది నెలల నుంచి 15ఏళ్ల పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని వీరవరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ తోట బాలు అన్నారు. మంగళవారం వీరవరం జడ్పీ స్కూల్‌లో వైద్యాధికారి ఆడారి అనూష ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ తోట వెంకటా చలం అధ్యక్షతన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తోట బాలు మాట్లాడుతూ పిల్లలు వ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు ఎంఆర్ వ్యాక్సిన్లు వేయించాలన్నారు. హెచ్‌ఎం రామకృష్ణారావు సమక్షంలో ఎంఆర్ వ్యాక్సిన్ విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ తోట వేణు గోపాలరావు, టీడీపీ గ్రామాధ్యక్షుడు తోట దొరబాబు, నేదూరి జనార్దన్, కార్యదర్శి రెడ్డి, గుమస్తా సుబ్ర హ్మణ్యం, దొడ్డిపట్ల నరేంద్ర, వైద్యాధికారులు కుమారి, ఏఎన్‌ఎం కె.సుందరమ్మ, శాంతి, విజయ, వరలక్ష్మి, ఆశ వర్కర్లు ఉన్నారు.

స్వామివివేకానందలో ఎంఆర్ వ్యాక్సినేషన్

జగ్గంపేట: స్థానిక స్వామి వివేకానంద స్కూల్‌లో విద్యార్థులకు తట్టు, రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వైద్యురాలు పి.సమంతా ఆధ్వర్యంలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆరుగురు సిబ్బందితో ఈ కార్యక్రమం చేపట్టారు. 1061మంది విద్యార్థులకు ఉచితంగా టీకాలు వేశారు. కార్యక్రమాన్ని కరస్పాండెంట్ డాక్టర్ ఒమ్మి రఘురామ్ దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం టీకాల వల్ల కలిగే ప్రయోజనాలను డాక్టర్ రఘురామ్ విద్యార్థులకు వివరించారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వెదురుపాక గ్రామస్థులు

అంకితభావంతో పని చేయాలి

గోకవరం: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసినపుడే ప్రజల మన్ననలు పొందగల్గుతామని వెదురుపాక గ్రామస్థులు అన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న వివిఎస్‌ఎన్ ప్రసాద్‌రావు, ప్రభాకర్‌రావు, ఉషారాణి, రామకృష్ణ ఉపాధ్యాయులను మంగళవారం గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బొట్టా రామకృష్ణ, గ్రామపెద్దలు కొల్లాటి రామకృష్ణ, బుజ్జి తదితరులు ఉన్నారు.

నీరుగారుతున్న 'అన్న అమృతహస్తం'

గండేపల్లి: గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యం దృష్ట్యా ప్రవేశపెట్టిన అన్నఅమృతహస్తం పథకం ముందుకు సాగడంలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడానికి నిరాకరిస్తున్నారు. ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది వారికి అవగాహన కల్పించకపోవడం వల్ల ఈ పథకం నీరుగారిపోతోంది. కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ అది నామమాత్రంగా ఉందని తెలుస్తోంది. గానుగనూనె, పాత బియ్యం వాడుతూ వారు జాగ్రత్తలు పాటిస్తారు. అంగన్‌వాడీ కేంద్రంలో రేషన్ బియ్యంతో అన్నం పెట్టడంతో సమస్యలు వస్తుండ డంతో వారు ఆసక్తి కనబరచడంలేదు. యల్లమిల్లి అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో 25 మంది బాలింతలుండగా ఆరు నుంచి ఏడుగురు మాత్రమే పౌష్టికాహారం తీసుకున్నారు. ఇదే పరిస్థితి మండలమంతా ఉన్నట్టు సమాచారం. ఇప్పటికైనా ఈ పథకంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తే పథకం విజయవంతమవుతుందని పలువురు అంటున్నారు.


అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన విద్యార్థులు

రాజపూడిలో 'పొలం పిలుస్తోంది'

జగ్గంపేట రూరల్: మండలంలోని రాజపూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏవో రాంబాబు మాట్లాడుతూ తొలకరి సాగు చేస్తున్న రైతులకు దుక్కిలో లేదా దమ్ములో చల్లు కోవడానికి జింకు సల్ఫేట్ ఎకరాకు 20 కిలోల వంద శాతం రాయితీపై ఇస్తున్నామన్నారు. వరికి 20 కిలోల చొప్పున, ఆరుతడి పంటలకు పది కిలోలు చల్లుకోవాలని తద్వారా జింకు లోపం రాకుండా ఉంటుందన్నారు. భూ సార కార్డులో సూచించిన సేంద్రియ, రసాయన ఎరువుల మోతాదు ప్రకారం వాడాలని, ఎరువులు ఎక్కువ, తక్కువ కాకుండా భూసార ఆరోగ్యకార్డులో సూచించిన మోతాదులో వాడితే మంచి దిగుబడులు రావడంతోపాటు చీడపీడల సమస్య తక్కువగా ఉంటుందని రైతులందరూ మూడేళ్లకు ఒక సారి పొలాన్ని భూ సార పరీక్ష చేయించాలని చెప్పారు. రైతుల పొలం గట్ల మీద, ఖాళీ స్థలాల్లో కంది పంటను సాగు చేయాలన్నారు. వంద శాతం రాయితీపై రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నామని, కావాల్సిన రైతులు ఆధార్, పాస్‌బుక్ నకళ్లతో వ్యవసాయ కార్యాలయంలో విత్త నాలు పొందవచ్చన్నారు. అనంతరం సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పొలాలు సందర్శించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి, ఎంపీఈవో తన్మయి, రైతులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

జగ్గంపేట: జగ్గంపేటలో ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థలో చేరుకున్నాయి. పాతభవనాల్లోనే అధికారులు, సిబ్బంది ఇప్పటికీ పనిచేస్తున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరుకుని గోడలు బీటలు వారి ప్రమాదకరంగా మారాయి. అధికారులు, సిబ్బంది నానాఅవస్థలు ఎదుర్కొంటున్నారు. గాలివీచిన, వర్షం పడిన భవనాలు పడిపోయే పరిస్థితిలో ఉన్నారు.

ఈ సమస్యలను ఎన్నో సార్లు ఉన్నతా ధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీ సుకెళ్లిన ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది. తహసీల్దార్, ట్రెజరీ, వ్యవసాయశాఖ, ఆర్‌అండ్‌బీ కార్యా లయాలు ఈ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. మరో పక్క ఈ కార్యాలయాలు పల్లపు ప్రాంతంలో ఉం డడంతో భారీ వర్షం పడితే నీరు పోవడానికి మార్గం లేకుండాపోయింది. నీరు కార్యాలయాలను చుట్టుముట్టడంతో వెళ్లడానికి, బయటకు రావడానికి అధికారులు, సిబ్బంది, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. భవనాల శ్లాబు పెచ్చులూడిపడడం, నీరు చుక్క చుక్కలుగా కార్యాలయంలో పడడంతో ఫైళ్లు, వివిధ రికార్డులన్నీ తడిసి పోతున్నాయి. రికార్డులన్నీ ఎక్కడ భద్రపరచాలో అర్థంకాక అధికారులు, సిబ్బంది తికమక పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్తభవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కింది స్థాయి సిబ్బంది కోరుతున్నారు.

రెండు నెలలైనా..వీడని మంగ హత్య మిస్టరీ

జగ్గంపేట: స్థానిక శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న పప్పల మంగ అలియాస్ పాలమంగ(56) హత్య మిస్టరీగా మారింది. ఆమె హత్యకు గురై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఈ కేసును పోలీసులు చేధించలేక పోయారు. హత్య జరిగిన వెంటనే క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ వివరాలు సేకరించినప్పటికీ నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మిస్టరీగా మారిన కేసుపై ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

గోకవరం: రిటైర్డ్ పెన్షనర్స్ భవనంలో మంగళవారం జరిగిన నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. రోగులను రాజమహేంద్రవరంలోని గౌతమీ నేత్రాలయానికి చెందిన వైద్యులు బాలకృష్ణ పరీక్షించి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. 9 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించినట్టు నిర్వాహకులు పెనికేటి తాతాజీ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

గోకవరం: ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. మండలంలోని కామరాజుపేటకు చెందిన పల్లాల రాజు(62) పశువులను పొలానికి తీసుకెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టి.వెంకటసురేష్ తెలిపారు.


ముద్రగడకు సంఘీభావం తెలుపుతున్న దుర్గాడ మహిళలు


ముద్రగడ ఇంటి ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న కాపులు


ముద్రగడకు మద్దతు పలుకుతున్న ముస్లిం సోదరులు

● సినిమా గైడ్

జగ్గంపేట	
స్క్రీన్-1	ఫిదా
స్క్రీన్-2	దర్శకుడు
రాజావేణి	మాయామాల్
కృష్ణవేణి	నక్షత్రం
వెంకటరత్నం	పెద్దలకు మాత్రమే
శ్రీ నాగేశ్వరా	గౌతమ్‌నంద

ఎస్సీ వర్గీకరణ కోరుతూ ధర్నా

గోకవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీక రణకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని కోరుతూ గోకవరంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ధర్నా, రాస్తారోకో చేసింది. ముందుగా దేవీచౌక్ సెంటర్ వద్ద ఆందోళనకారులు రాస్తారోకో చేపట్టారు. ర్యాలీగా రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకుని గంటసేపు ధర్నా చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గరబారపు శ్రీను మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని గత నెల 22 నుంచి ఈ నెల 7 వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టామన్నారు. ఎన్నికల సమయంలో సీఎం మాదిగలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీ నాయకుడు

పదాలు కనుక్కోండి

S	U	N	F	Z	H	P	A	S
V	A	C	A	T	I	O	N	W
S	W	O	M	F	H	O	T	I
U	T	F	I	A	Q	L	L	M
M	J	U	L	J	U	N	E	M
M	U	N	Y	A	R	H	S	I
E	L	A	U	G	U	S	T	N
R	Y	M	B	E	A	C	H	G

family
summer
vacation

sun
hot
fun

beac
pool
swim

June
July
August

నవ్వుల్ నవ్వుల్

టింకు : అరేయ్ బిట్టూ! మా టామీ మీ ఇంటి కన్నా ఎక్కువ ఎత్తు ఎగరగలదు తెలుసా?

బిట్టు : అంత సీను లేదు రా! నేను నమ్మను.

టింకు : చూడు మా టామీ ఎగిరింది. మరి మీ ఇల్లు ఎగురుతుందా?

బిట్టు : !!!!!!!!!!!!





బుల్‌ఫైట్ తెలుసు. స్ట్రీట్ ఫైట్ తెలుసు. కానీ ఫుడ్‌ఫైట్ గురించి తెలుసా! వేల మంది ఒకచోట గుమికూడి రోడ్లపై టన్నుల కొద్దీ టొమాటోలు కుమ్మరించి వాటితో కొట్టుకోవడమే ఫుడ్‌ఫైట్. స్పెయిన్ దేశంలోని బ్యునెల్‌లో ఈ ఫుడ్‌ఫైట్ జరుగుతుంది. ప్రతి ఏడాది ఆగస్టు నెల చివరి బుధవారంలో జరిగే ఈ ఫుడ్‌ఫైట్‌ను చూడటానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వెళుతుంటారు.



అతి పెద్ద టొమాటో ఫైట్

బ్యునెల్....

స్పెయిన్‌లో చిన్న ఊరు. అక్కడి జనాభా తొమ్మిది వేలే. కానీ, ఆగస్టు నెల చివరి బుధవారం వచ్చిందంటే చాలు రోడ్లన్నీ జనమయం అవుతాయి. ఎక్కడ చూసినా టొమాటోలే కనిపిస్తాయి. 'వరల్డ్ బిగ్గెస్ట్ ఫుడ్‌ఫైట్'గా పిలిచే ఈ వేడుకను తిలకించడానికి ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. 2013లో సుమారు 50 వేల మంది ఈ ఫైట్‌లో పాల్గొనడానికి వచ్చారట. అంత మంది పాల్గొనడం కష్టమని భావించిన నిర్వాహకులు లాటరీ సిస్టమ్‌ను పెట్టి 20 వేల మందిని ఎంపిక చేశారు. ఈ ఫుడ్‌ఫైట్‌కు ఉన్న క్రేజ్ అది.

ఎలా మొదలయింది?

ఈ టొమాటో ఫుడ్‌ఫైట్ సంప్రదాయంగా వస్తోంది. అయితే ఇది ఎలా మొదలయిందీ అనే విషయం కచ్చితంగా తెలియదు. రకరకాల కథనాలు చెబుతుంటారు. 1944-45లో మొదటిసారి ఫుడ్‌ఫైట్ జరిగింది. స్నేహితుల మధ్య ఆహారం కోసం జరిగిన పోరు అని చెబుతుంటారు. ప్రమాదవశాత్తు ఒక లారీ బోల్తా పడటం వల్ల మొదలయిందని అంటుంటారు. అన్నింటికన్నా ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న కథనం ఏమిటంటే ఒక రోజు టౌన్‌లో ఉత్సవాలు జరుగుతున్న సమయంలో సిటీ కౌన్సిల్‌మెన్ పాలనపై అసంతృప్తితో ఉన్న ప్రజలు టొమాటోలతో దాడి చేశారట. ఫుడ్‌ఫైట్ ఎలా మొదలయినా దాన్ని బాగా ఎంజాయ్ చేయడంతో మరుసటి సంవత్సరం కూడా నిర్వహించారు. అలా అది ప్రతి ఏడాది జరుగుతూ వచ్చింది. అయితే ఫ్రాన్సిస్కో ఫ్రాంకో పాలన సమయంలో ఫుడ్‌ఫైట్‌కు ఎలాంటి సంప్రదాయ ప్రాముఖ్యత లేకపోవడంతో ఆ రోజు సెలవును రద్దు చేశారు. అయితే 1970లో ఆయన తరువాత మళ్లీ సెలవును పునరుద్ధరించారు. పట్టణాన్ని రక్షించే దేవతలైన ల్యూయిస్ బెర్‌ట్రాన్, మారె ది డ్యూ డేల్స్ గౌరవార్థం ఈ పండుగను నిర్వహిస్తున్నారు.




సందడే సందడి

ఉదయం 11 గంటలకు టౌన్ సెంటర్‌లోకి టొమాటోలతో ట్రక్కులన్నీ చేరుకుంటాయి. తరువాత రెండు అంతస్తుల పొడవున్న ఒక పొడవాటి కర్రకు గ్రీజును పూసి సెంటర్లో పాతుతారు. దాన్ని పైకి ఎక్కిన తరువాతే ఫుడ్‌ఫైట్ మొదలవుతుంది. ఫుడ్‌ఫైట్ ప్రారంభానికి సంకేతంగా నీటి ఫిరంగులను ప్రయోగిస్తారు. దాంతో పండుగ మొదలవుతుంది. వేల మంది టొమాటోలతో కొట్టుకోవడం మొదలుపెడతారు. సరిగ్గా ఒక గంట తరువాత ఫైట్ ముగుస్తుంది. అప్పుడు ఎవ్వరూ కూడా టొమాటోలు విసరడం చేయరు. వెంటనే టౌన్‌లోని వీధులన్నీ శుభ్రం చేసే కార్యక్రమం మొదలవుతుంది. పర్యాటకులు దగ్గరలో ఉన్న బ్యునెల్ నదిలో స్నానం చేస్తారు. మొత్తంగా ఫుడ్‌ఫైట్ మరచిపోలేని మధురానుభూతిని అందిస్తుంది.

ఈ ఫుడ్‌ఫైట్‌లో పాల్గొనే వారు కొన్ని రూల్స్ పాటించాలి. అవి...

- పదునైన వస్తువులు, బాటిల్స్ తీసుకెళ్లకూడదు.
- ఇతరుల టీషర్టులు చింపకూడదు.
- టొమాటోలు విసిరే ముందు తప్పకుండా చిదమాలి.
- టొమాటోలను తీసుకొచ్చిన లారీలకు దూరంగా ఉండాలి.

దారి కనుక్కోండి



ఇది నిజం !



థాయ్‌లాండ్‌లో షాపింగ్ చేసినపుడు, బిల్లింగ్ కౌంటర్‌లో మిమ్మల్ని చూసి షాప్ యజమాని 'హాహాహ' అంటే.. అపార్థం చేసుకోవద్దు. ఎందుకుంటే థాయ్‌లో 'హ' అంటే ఐదు అని అర్థం. హాహాహ అంటే 555.

రంగులు వేయండి



టంగ్‌ట్విస్టర్స్

1. I feel a feel a funny feel a funny feel feel I,If I feel a funny feel a funny feel feel I.
2. If a fella met a fella in a field of fitchesCan a fella tell a fella where a fella itches?
3. It's a nice night for a white rice fight.



సూక్తి

ఓడిపోతామనే భయంతో ప్రయత్నించకుండా ఉండటం కంటే ప్రయత్నించి ఓడిపోవడం మేలు.

మీకు తెలుసా?

- పాలను తోడుబెట్టి పెరుగు తయారు చేయడం, వెన్న సేకరించడం వంటి ప్రక్రియలు క్రీస్తు పూర్వం 5000 సంవత్సరాల నాటికే మానవులకు తెలుసు.
- ప్రాచీన కాలంలోనే భారతీయులు పాలతో రకరకాల వంటకాలను తయారు చేసేవారు.

ఏపీ.. 'లాజిస్టిక్ హబ్'..!

ఆంధ్రజ్యోతి, కాకినాడ: కోస్తా తీరంలో నెల్లూరు నుంచి తడ వరకూ పరిశ్రమల స్థాపన పరిశీలిస్తే విశాఖపట్టణం అగ్రగామిగా ఉంది. మిగిలిన తీర ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రైవేట్ కార్పొరేట్ పరిశ్రమలే కనిపిస్తాయి. గడిచిన పద్నాలుగు ఏళ్ల నుంచి శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కాకినాడ తీరంలో ప్రభుత్వ రంగం పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వాలు శ్రద్ధ చూపలేదు. రిలయన్స్, జీఎమ్ఆర్, కేఎస్‌పీఎల్, జీఎస్‌పీసీ లాంటి ప్రైవేట్ సంస్థలే ఇక్కడ పాగా వేశాయి. రాష్ట్రంలో మైనర్ పోర్టుగా పేరుగాంచిన కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు మిలియన్ డాలర్ల ఉత్పత్తులు ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలు జరుగుతున్నాయి. కాని ఆశించిన స్థాయిలో వృద్ధి రేటు కనిపించడం లేదు. సరైన మౌలిక వసతులను ఇక్కడ ఏర్పాటు చేయకపోవడమే ఇందుకు కారణం. ప్రైవేట్ సంస్థల ప్రమేయాన్ని ఇక్కడ నియంత్రించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో ఎమ్‌వోయూ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ లాజిస్టిక్ హబ్ ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నామని ప్రకటించి ఏడాది పూర్తి కావొస్తుంది. ఇప్పటివరకు దీని ప్రతిపాదనే మరిచారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(కాంకర్) కాకినాడ పోర్టులో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్(ఎమ్ఎమ్ఎల్‌పీ) ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం దీని ఊసే ఎత్తడం లేదు.

● రూ. 450 కోట్లతో కార్యాచరణ

ఇప్పటికే దాదాపు 40 ఎకరాల భూమి ఈ హబ్ కోసం సేకరించారని అంటున్నారు. మొత్తం 89 ఎకరాల భూమి కావాల్సి ఉండగా, మిగిలిన భూసేకరణ ఏ పరిస్థితిలో ఉందో అంతుపట్టని పరిస్థితి. ఈ హబ్ వస్తే సరుకు భద్రం చేసే గోదాములను, వాటి వద్దకు వెళ్లడానికి రవాణా సౌకర్యం, పొడ వాటి రహదారులను నిర్మించడానికి సన్నాహాలు చేశారు.



రూ.450కోట్ల అంచనాతో చేపట్టే ఈ ప్రాజెక్టు 2017-18 నాటికి పూర్తవుతోందని భావించా రు. ఇప్పటి వరకు దీని పరిస్థితి ఏంటో అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పలేకపోతున్నారు. గోదాములతోపాటు సిబ్బందికి అవసరమైన భవంతుల నిర్మాణం కూడా ఇక్కడ చేపడతామన్నారు. సరుకు రవాణా చేసే రైల్వే వ్యాగన్లు నేరుగా హబ్ లోపలికి ప్రవేశించే వీలుగా ట్రాక్ నిర్మాణం చేపడతామన్నారు. దీనివల్ల కార్గో నౌకల నుంచి సరుకు ఎగుమతి, దిగుమతి చేయడానికి లారీల అవసరం ఉండదని, రైల్వే వ్యాగన్లు నేరుగా జట్టీ వద్ద ఆగి ఉన్న కార్గో నౌక వద్దకు చేరుకునే వెసలుబాటు కల్పిస్తూ ట్రాక్ నిర్మాణం చేస్తామన్నారు. ఇందులో ఏఒక్కటి ఇప్పటి వరకు ఇంచు కదల్లేదు. కాగితాల్లో మాత్రం చాలా వరకు రంగం సిద్ధమైనట్టు చూపుతున్నారు.

● మూడువేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి

సీపోర్ట్‌కు అనుసంధానంగా తలపెట్టిన ఈ హబ్ ఏర్పాటువల్ల ఇక్కడ దీనిపై ఆధారపడి జీవిస్తున్న కూలీలకు పనిలేకుండా పోతుందని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. ఆధునిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న హబ్‌తో కూలీల సంఖ్య తగ్గిపోతుందని, తద్వారా పని ఉన్న రోజుల్లో కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన కూలీల్లో సగానికి పైగా పని లేకుండా పోతుందనే భావన వ్యక్తమవుతోంది. పార్క్ ఏర్పాటువల్ల వసతులు, రవాణా పెరుగుతోందని, తద్వారా కూలీల సంఖ్య పెంచుతారని అధికారులు చెప్పుకొచ్చారు. ప్రత్యక్షంగా 500 మందికి ఉన్నత శ్రేణి ఉద్యోగాలు, పరోక్షంగా 2500మందికి కింది స్థాయి పనులు లభిస్తాయని, తద్వారా ఉపాధికి ఢోకా ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. యాంకరేజీ పోర్టుకు సరుకు రవాణా తగ్గుముఖం పట్టడంతో చాలా మంది కూలీలకు పనిలేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సదరు హబ్ ద్వారా ఉపాధి కల్పిస్తామన్నా ప్రకటనలు హుళక్కే అన్నట్టు కనిపిస్తోంది.

'కాపులకే'..మేయర్.. సీటు

(ఒకటోపేజీ తరువాయి) ఎగురవేయడం తథ్యమన్నారు.10న 48 డివిజన్లకు సంబంధించిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారని తెలిపారు. అన్ని సమీకరణాల ను దృష్టిలో పెట్టుకొని సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేశామని, సంబంధిత జాబితాను టీడీపీ అధిష్ఠానానికి పంపుతున్నామన్నారు.అందరూ ఐక్యతతో పనిచేయాలని శ్రేణులకు సూచించారు. టీడీపీకి దూరంగా ఉన్న కొందరిని సంప్రదించి కలిసి పనిచేసేలా కృషి చేస్తున్నామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి భవిష్యత్తులో పదవులు లభిస్తాయన్నారు. బీజేపీతో పొత్తు ఉంటుందని, కేటాయింపుల్లో బీజేపీ భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఎవరికి ఎన్ని స్థానాలనేది ఇరు పార్టీల నేతలు కూర్చుని చర్చిస్తారన్నారు. ముద్రగడ పద్మనాభానికి వైసీపీ మద్దతు తెలపడం ద్వారా కులాలమధ్య చిచ్చురేపేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి, పిల్లి అనంతలక్ష్మి, జడ్పీ చైర్మన్ నవీన్‌కుమార్, ఎమ్మెల్సీ చిక్కాల జిల్లా టీడీపీ అధ్యక్షులు నామన రాంబాబు,టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సత్తిబాబు నాయకులు సుంకర తిరుమల కుమార్, కటకం శెట్టి వెంకట సత్యప్రభాకర్, బోళ్ళ వెంకట కృష్ణ మోహన్, సుంకర విద్యాసాగర్, జహిరుద్దీన్ జిలానీ పాల్గొన్నారు.

గెలుపుపై.. ధీమా!

(మొదటిపేజీ తరువాయి) కంచుకోటగా ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో పార్టీని గెలిపించుకోవడం పెద్ద కష్టమేమీ కాదని ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు ఇప్పటికే ధీమాగా ఉన్నారు.

కాపు సామాజిక వర్గం నుంచి.. మేయర్ అభ్యర్థి

టీడీపీ ముందు నుంచీ అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వస్తున్న కాపు సామాజిక వర్గం నుంచే మేయర్ అభ్యర్థిని ఎంపిక చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం చినరాజప్ప ప్రకటించారు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఈ సామాజిక వర్గం ప్రభావిత వర్గంగా ఉంది. 30 వార్డులకుపైగా గెలుస్తామంటూ సిటీ ఎమ్మెల్యే కొండబాబు ఇప్పటికే ప్రకటించారు. ప్రతిపక్షంతో పోలిస్తే అధికార పార్టీకి ఎన్నికలలో గెలవడం కాస్త సులువే. గతంలో 2005లో కార్పొరేషన్ ఎన్నికలలో అప్పటి అధికార పార్టీ కాంగ్రెస్ గెలుపొందింది. అదే బాటలో అధికార టీడీపీ కూడా గెలుస్తామన్న ధీమాలో ఉంది.

అభ్యర్థుల ఎంపికలో అలకలు..

రాజకీయ పార్టీ అన్నాకా అలకలు, లుకలుకలు ఉండటం సహజం. కాకినాడ సిటీ ఎమ్మెల్యే తమకు ప్రాధాన్యం ఇవ్వడంలేదంటూ ఒక సామాజిక వర్గం నాయకులు ఈ ఎన్నికలలో దూరంగా ఉంటామని లోపాయికారిగా చెప్తున్నారు. 'టీడీపీ బలంగా ఉన్నందున ఆశావహుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆశించిన వాళ్లందరికీ టికెట్లు ఇవ్వలేం కదా..? ఇవ్వని వాళ్లకు సహజంగానే అలకలు వస్తాయి. యనమల వంటి నేత పిలిపించి మాట్లాడితే అవన్నీ సర్దుకుంటాయి..' అని టీడీపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ఈనెల16వ తేదీ నాటికి పార్టీలో అందరినీ సమన్వయం చేసి ఎన్నికలలో గెలుపుపైనే పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తామని సదరు నేత చెప్పుకొచ్చారు. రెండురోజులక్రితం జిల్లాకు వచ్చిన సీఎం చంద్రబాబుకు కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు కాకినాడ మేయర్ పీఠాన్ని గెలిపిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో చంద్రబాబు సైతం వీళ్ల హామీపై ధీమా వ్యక్తం చేశారు. కాకపోతే భారీమెజార్టీతో గెలిపించాలన్నది తమ వ్యూహంగా టీడీపీ నేతలు ధీమాగా చెప్తున్నారు.

పరుగులు తీస్తున్న గృహనిర్మాణ శాఖ

(ఒకటోపేజీ తరువాయి) హోదాల్లో ఉన్న అధికారులే లబ్ధిదారు ఇళ్లకు దగ్గరుండి మరీ శంకుస్థాపనలు చేయించడంతోపాటు గృహనిర్మాణంపై ప్రత్యేక అవగాహన కల్పించి వారిలో చైతన్యాన్ని పురికొల్పేందుకు అధిక సమయాన్ని వెచ్చిస్తున్నారు. జిల్లాకు మంజూరైన వేలాది గృహాలను త్వరితగతిన పూర్తిచేయాలన్న సంకల్పంతో అధికారులు ఆలస్యంగానైనా స్పందించారు. తీరా గృహనిర్మాణాలు చేసే లబ్ధిదారులకు శంకుస్థాపన ముహూర్తాలు లేక ఇళ్లు కట్టేందుకు ముందుకురాలేదు. శ్రావణమాసంలో ఉన్న ముహూర్తాలు అతి తక్కువ కావడంతోపాటు రాగల రెండు నెలల్లో కూడా ముహూర్తాలు లేకపోవడంతో పాల్గుణమాసం వరకు లబ్ధిదారులు వేచి చూడాల్సిందే. ఈ పరిస్థితిని గ్రహించిన అధికారులు ముహూర్తాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు లబ్ధిదారుల చేత హడావుడిగా శంకుస్థాపనలు చేయిస్తున్నారు.

అమలాపురం డివిజన్‌కే అగ్రతాంబూలం


జిల్లావ్యాప్తంగా నాడు జరిగిన సర్వే నేపథ్యంలో చెక్ డేటాను పరిగణనలోకి తీసుకున్న అధికారులు 56 వేల మంది లబ్ధిదారులు గృహనిర్మాణ పథకానికి అర్హులుగా గుర్తించారు. జిల్లాలో ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం కింద 14,189 గృహాలు మంజూరయ్యాయి. జిల్లావ్యాప్తంగా చెక్‌డేటా సర్వే కొన్ని ప్రాంతాల్లో నామమాత్రంగా జరిగినప్పటికీ అమలాపురం డివిజన్‌లో పూర్తిస్థాయిలో జరిగింది. దాంతో డివిజన్ పరిధిలో 10,400 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇళ్లను మంజూరుచేశారు. మిగిలిన 4వేలు జిల్లా వ్యాప్తంగా అమలుచేస్తున్నారు. రూ.2 లక్షలు వ్యయంతో నిర్మించే గృహనిర్మాణ పథకానికి రూ.1.30 లక్షలు ఆ శాఖ మంజూరుచేయగా, రూ.70వేలకు లబ్ధిదారుని పేరిట జాబ్‌కార్డు మంజూరుచేసి ఉపాధి హామీ ద్వారా నిధులు విడుదల చేస్తారు. ఈపథకాన్ని కలెక్టర్ కార్తికేయమిశ్రా ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్ ద్వారా కోనసీమ వ్యాప్తంగా ఇళ్లకు శంకుస్థాపన చేసే ప్రక్రియను హౌసింగ్ పీడీ జీవీ ప్రసాద్, ఆర్డీవో గణేష్‌కుమార్, ఇతర ప్రభుత్వశాఖల అధికారులు ఇటీవల గ్రామగ్రామాన ప్రారంభించారు. లబ్ధిదారులను వెతికి పట్టుకుని మరీ శంకుస్థాపనలు చేయించారు. మంజూరైన గృహాలను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తిచేసే బాధ్యతలను గ్రామస్థాయిలో కమిటీలకు అప్పగించారు. కమిటీల్లో గ్రామకార్యదర్శి, వీఆర్‌వో, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించి టీమ్‌లో ఒక్కొక్కరికి 5నుంచి 20 గృహాలను గ్రౌండ్ చేయించేవిధంగా లక్ష్యాలను నిర్దేశించారు. ఇక ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులే ముందడుగు వేయాల్సివుంది. ప్రస్తుతం ముహూర్తాలు లేకపోవడం ఒక కారణమైతే, రాగల రెండునెలల్లో వర్షాల పరిస్థితి వల్ల ఇళ్లు నిర్మాణం ముందుకుసాగదంటూ ఎంపికైన లబ్ధిదారులు చేతులెత్తేస్తున్నారు. ఎన్నికల మేఘాలు కమ్ముకొస్తుండడంతో ఇళ్ల నిర్మాణం ద్వారా లబ్ధిదారులను ప్రసన్నం చేసుకునేందుకు యావత్ అధికార యంత్రాంగం ఇకపై వీటిపైనే దృష్టిపెట్టే అవకాశముంది.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 8, 9



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సినీ, రాజకీయ, న్యాయ, ఉన్నత విద్యా రంగాల వారికి ఆర్థికంగా అనుకూలిస్తుంది. ప్రియతములకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ప్రయాణాలు, చర్చలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రదర్శనలు, సభలకు అనుకూలం. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి గురించి ఆలోచిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.



మిథునరాశి:(మే21-జూన్21): పెద్దలతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. సంకల్పం ఫలిస్తుంది.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పూర్వమిత్రులను కలుసుకుంటారు. మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంకు లావాదేవీలు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలపై స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. ఆత్మావలోకనం చేసుకునేందుకు తగిన సమయం.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సమావేశాలు, బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులతో అనుబంధం ఏర్పడుతుంది.భాగస్వామి గురించి ఆలోచిస్తారు. కొత్త పరిచయాలు లక్ష్య సాధనకు తోడ్పడతాయి.




తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆస్పత్రులు సందర్శిస్తారు. వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆహార నియమాలు పాటిస్తారు.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ప్రముఖులతో వేడుకల్లో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది. చిట్‌ఫండ్‌లు, డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బంధుమిత్రుల కలయికతో ఇంట్లో సందడిగా ఉంటుంది. ఇంటికి అవసరమైన వస్తువుల రవాణాకు అనుకూలం. బదిలీల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యం సాధిస్తారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిరకాల మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సన్నిహితుల స్టేషనరీ, రవాణా, బోధన, ఏజెన్సీ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామ్యాలు లాభిస్తాయి. స్నేహ పరిచయాల ఆధారంగా ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోలు చేస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ సంస్థలు, పరిశ్రమలు, వైద్య రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొత్త ప్రాజెక్టులు ప్రారంభానికి అనుకూల సమయం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

యల్లమిల్లిలో అన్నదాత సుఖీభవ



ఆర్. నారాయణమూర్తితో పాల్గొన్న సినీ నటులు

● 60 రోజులపాటు వివిధ ప్రాంతాల్లో చిత్రీకరణ
● పంటల మద్దతు ధర, రైతు ఆత్మహత్యలే ఇతివృత్తం

గండేపల్లి: మండలంలోని యల్లమిల్లిలో మదిరెడ్డి కృష్ణార్జున రాజు బొప్పాయితోటలో మంగళవారం సినీ సందడి నెలకొంది. సినీనటుడు ఆర్.నారాయణమూర్తి బ్యానర్ స్నేహచిత్ర పిక్చర్స్ పతాకంపై అన్నదాత సుఖీభవ చిత్రీకరించారు. మినుము, పత్తి, పొగాకు, మిర్చికి ధరలు లేకపోవడం, రైతుల ఆత్మహత్యలపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. జగ్గంపేట మండలం సీతానగరానికి చెందిన కరుటూరి వెంకట్రావు, వెంకటరత్నం, జాసిత సత్యనారాయణ, ముత్యాల వెంకట్రావు, కొండవీటి చిన్నయ్య, తాళ్లూరి కృష్ణారావు, నిడదవోలు వెంకన్న రైతులుగా నటించారు. ఈనెల 4న షూటింగ్ ప్రారంభమైందని, 60రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహిస్తామన్నారు. కథ, దర్శకత్వం, నిరాత్మ, హీరోగా ఆర్.నారాయణమూర్తి వ్యహరిస్తుండగా కెమెరా సురేష్, పాటలు వంగపండు ప్రసాద్‌రావు, గద్దర్, సుద్దుల అశోక్‌బాబు పాడతారన్నారు. యల్లమిల్లిలో ఇంకా కొంత చిత్రీకరించాల్సి ఉందని షూటింగ్‌కు సహకరించిన మదిరెడ్డి కృష్ణార్జునరావు, సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ(సీఎం)కు ఆర్.నారాయణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

ఇప్పటికి 90 సినిమాల్లో నటించా: జగదీశ్వరి



ఇప్పటికి 90 సినిమాలకు పైగా నటించి ప్రేక్షక ఆదరణ పొంది రెండు నంది అవార్డులు తీసుకున్నాను. ఈ చిత్రంలో సన్నకారురైతు భార్య పాత్ర పోషిస్తున్నాను. పాత్రపేరు సక్కుభాయి. భీమిలి కబడ్డీజట్టు, పిల్ల జమిందార్, సింహా, అ ల్లుడు శ్రీను, ఉల్లాసంగా ఉత్సాహంగా, అనసూయ వంటి చిత్రాలు నాకు పేరుతెచ్చాయి. ప్రస్తుతం ఏడు చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఆర్.నారాయణమూర్తితో కలిసి ఐదు సినిమాల్లో నటించా. 60 టీవీ సీరియల్స్, 300కుపైగా నాటక ప్రదర్శనలు చేశాను.

సన్నకారు రైతుల సమస్యపై చిత్రం

సినీనటుడు ఆర్.నారాయణమూర్తి



దేశంలో సకల జీవరాశుల మనుగడకు మూలకారణమైన రైతులు రోజురోజుకి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని నా సొంత బ్యానర్‌లో నేనే హీరోగా దర్శకత్వం వహిస్తూ చిత్రాన్ని నిర్మిస్తున్నా. మెట్ట ప్రాంతంలో ఎక్కువగా అపరాలు పండించి ధర లేక నష్ట పోయిన రైతులు ఈ ప్రాంతంలో ఎక్కువ ఉన్నారు. అందుకే ఇక్కడ చిత్రీకరణ చేపట్టాం.

పోలవరంపై స్పష్టత

● శాస్త్రీయ, శాటిలైట్ సహకారంతో ముంపు ప్రాంతాల గుర్తింపు
● పునరావాస కాలనీలకు సమీపంలోనే సాగు భూములు
● స్పష్టం చేసిన మోనటరింగ్ కమిటీ

చింతూరు/కూనవరం: పోలవరం పరిహారంపై స్పష్టత వచ్చింది. మంగళవారం కూనవరంలో నిర్వహించిన మోనటరింగ్ కమిటీ సమావేశం, పున రావాస ప్యాకేజి అవగాహన సదస్సులో జాయింటు కలెక్టర్ మల్లికార్జున్, పోలవరం పరిపాలనా అధికారి దినేష్‌కుమార్ నిర్వాసితుల సందేహాలను తీర్చే ప్రయత్నం చేశారు. ఈ మేరకు ఆ అధికారులు పలు అంశాలపై స్పష్టత ఇచ్చారు. విలీన మండలాల్లోని ఒక్కో ఎకరా పట్టా భూమికి రూ. 3 లక్షల 50 వేలు వంతున ప్రభుత్వం ధర కట్టిందన్నారు. పోలవరం ముంపులో ఎకరా రేటు భూమికి మూడు రెట్ల వంతున అంటే ఎకరానికి రూ.10 లక్షల 50 వేలు వంతున పరిహారంగా చెల్లించనున్నట్లు చెప్పారు. ఆర్‌ఆర్ ప్యాకేజీలో గిరిజనుల కుటుంబ యజమానికి రూ. 6 లక్ష 86వేలు, గిరిజనేతర కుటుంబానికి రూ. 6 లక్షల 36 వేలు వంతున చెల్లిస్తామన్నారు. భార్యాభర్తలతోపాటు 18 ఏళ్ల దాటని పిల్లలను కలపి ఒక కుటుంబంగా పరిగణిస్తామని, 18ఏళ్ల దాటిన పిల్లలను మాత్రం విడిగా పరిగణిస్తామని వారు స్పష్టం చేశారు. వారికి కూడా కుటుంబ యజమానితో సమానంగా ప్యాకేజీ ఇవ్వనున్నట్టు తెలిపారు. అదే దశలో గిరి జనులకు మాత్రం పునరావాసం కల్పిస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గ్రా మంలో మౌలిక వసతులు కల్పించి గృహసముదాయాలు నిర్మిస్తామన్నారు. గిరి జనుల ఆధీనంలోని అటవీ భూములకు పరిహారం చెల్లిస్తామన్నారు. ప్రభుత్వ భూమి (రెవెన్యూ భూమి)ని గిరిజన కుటుంబం పదేళ్లుగా సాగు చేస్తున్నట్టు రికార్డు ఉన్నట్లైతే ఆ వ్యక్తి అర్హతను బట్టి, ఆ భూ వివరాలను అనుసరించి పరిహారం చెల్లిస్తామన్నారు. భూ రికార్డుల సమస్యలు ఉన్నట్లైతే తమ కార్యా లయంలో సంప్రదించి పరిష్కారం పొందవచ్చన్నారు. సమస్యలు పరిష్కరించుకునే విషయంలో గ్రామసభలు నిర్వహించే అవకాశం పరిశీలిస్తామన్నారు. నిర్వాసితులను పునరావాసాలకు తరలించిన సందర్భంలో వారికి ఆ ప్రాంతంలో ఉపాధి కల్పిస్తామన్నారు. పదోతరగతి ఆపై చదివిన నిరుద్యోగులకు వృత్తి శిక్షణ ఇచ్చి ఉపాధి లేదా ఏదేని కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. పునరావాసం కల్పించడానికి ముంపు లేని ప్రాంతాలలో భూములు కొనుగోలు చేయనున్నామన్నారు. అవసరమైతే భూ బ్యాంక్‌లను ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. భూమి కొనుగోలు రేటు కూడా పరిహారంతో సమానంగా ఉంటుందన్నారు. నూతన భూసేకరణ చట్టం అనుసరించి మెరుగైన పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. ఇది మెరుగైన ప్యాకేజని అధికారులు అభివర్ణించారు. ముంపును శాస్త్రీయంగా, శాటిలైట్ సహకారంతో గుర్తిస్తామన్నారు. పునరావాస కాలనీలకు సమీపంలోనే సాగు భూములు ఇస్తామన్నారు. కాలనీలలో ఆట స్థలం, పాఠశాల, తదితర సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ పీవో చిన్నబాబు, ఆర్డీవో ఎల్లారమ్మ, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ మల్లికార్జున

హైటెక్ సొబగులు

రైతు బజార్లలో.. డిజిటల్ డిస్‌ప్లేలు



స్మార్ట్ సిటీలో రైతు బజార్లకు కొత్తలుక్ తీసుకువచ్చేందుకు డిజిటల్ డిస్‌ప్లేలు ఏర్పాటుచేశారు. కాకినాడలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని, గాంధీనగర్‌లోని రైతుబజార్లలో డిస్‌ప్లేలు ఏర్పాటు చేశారు. ఏ రోజుకారోజు రైతుబజార్లలో తాజా కూరగాయల ధరల పట్టికలో నమోదు చేయాల్సిఉన్నా, వ్యాపారులు నామమాత్రంగానే ధరల పట్టికను పట్టించుకుంటున్నారనే విమర్శలు వినిపించేవి. డిజిటల్ డిస్‌ప్లేలు రైతుబజార్ ముఖద్వారంలో ఏర్పాటు చేశారు. వినియోగదారులకు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో స్వాగతం పలుకుతూ ఎన్ని రకాల కూరగాయలు అందుబాటులో ఉన్నాయి. వాటి వివరాలు, ధరలను డిస్‌ప్లేలో చూపిస్తున్నారు. ఇవి వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

- నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ)

పూర్వ విద్యార్థులు.. కదలిరండి

11న నన్నయ హరితోత్సవంలో మొక్కనాటాలని పిలుపు

దివాన్‌చెరువు: నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 11న జరగనున్న హరితోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీసీ ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు కోరారు. వర్సిటీలో హరితోత్సవంపై మంగళవారం సమావేశం జరిగింది. జిల్లా అటవీ అధికారులు ప్రసూనా, వెంకట్ వర్సిటీ అధికారులు హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ 11న భారీ ఎత్తున నిర్వహించే కార్యక్రమానికి అటవీ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పికె సారంగి ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. విశ్వ విద్యాలయాన్ని ప్రకృతి బడిగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రిన్సిపాల్ శ్రీ రమేష్ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. వర్సిటీ పూర్వ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివిధ రాష్ట్రాలలో ఉన్న వారంతా 11న ఇక్కడికి వచ్చి తమ గుర్తుగా ఓ మొక్క నాటాలన్నారు. జియోట్యాగ్‌తో వీక్షిస్తూ యూనివర్శిటీతో అనుబంధాన్ని పెంచుకోవాలని ఆహ్వానించారు. విశ్వవిద్యాలయం చుట్టూ రెండు వేల మొక్కలు నాటుతున్నామని ఆచార్య రమేష్ అన్నారు. అన్ని రకాల మొక్కలు వర్సిటీలో ఉండేలా ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య ఎస్ టేకి ఇంజనీర్ ఏవీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హరితోత్సవ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ప్రభుత్వ తీరుకు నిరసనగా చేతికి తాళ్లు కట్టుకుని కిర్లంపూడిలో నిరసన తెలుపుతున్న కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం, కాపు నాయకులు

- కిర్లంపూడి

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

అమలాపురం టౌన్: లయన్స్‌క్లబ్ వశిష్ఠ ఆధ్వర్యంలో అమలాపురం ఎస్‌టీడీ కౌన్సెలింగ్ సెంటర్‌లో హెచ్ఐవీ బాధితులకు మంగళవారం పౌష్టికాహార కిట్లతోపాటు 150 మందికి విందు భోజనాలను ఏర్పాటు చేశారు. వశిష్ఠ అధ్యక్షురాలు మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డాక్టర్ వీఎస్ శర్మ, కొల్లూరి సుబ్బారావు, రీజనల్ సెక్రటరీ శ్రీరామరాజు, డాక్టర్ యర్రా నాగబాబు, సీహెచ్ మధుశ్రీ పాల్గొన్నారు. కొల్లూరి లక్ష్మీ జయంతిని పురస్కరించుకుని చేపట్టిన సేవాకార్యక్రమాలను పలువురు అభినందించారు.

● మినీ ఇంటర్వ్యూ



పాఠశాలలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు

ఆకుల మంగపతిరావు, మండల విద్యాశాఖాధికారి, ఉప్పలగుప్తం

● **పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు చేరారా?**

బదిలీల ప్రక్రియ అనంతరం రెండు పాఠశాలలు మినహా అన్నింటిలోను ఉపాధ్యాయుల నియామకం పూర్తిస్థాయిలో జరిగింది.

● **ఎంతమంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు?**

మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మొత్తం 161 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

● **విద్యార్థులు హాజరు శాతం ఎలా ఉంది?**

70 ప్రాథమిక పాఠశాలల్లో 2051 మంది, మూడు యూపీ పాఠశాలల్లో 342 మంది విద్యార్థులున్నారు.

● ఉప్పలగుప్తం

చౌడేశ్వరికి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న దృశ్యం

అమలాపురంరూరల్: బండారులంక వీరభద్రస్వామి గుడి ప్రాంగణంలో శ్రీ చాముండేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని చౌడేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కూర్మా మాచరయ్య, గౌరీకామేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు లక్కింశెట్టి నిత్యానందం, అంకం కాశి, పిచ్చిక మోహన్, అంకం గిరి, పిచ్చిక నాగేశ్వరరావు, దైవపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● సినిమా గైడ్

అమలాపురం

శ్రీవెంకటపద్మావతి	
స్క్రీన్-1	వైశాఖం
స్క్రీన్-2	బాహుబలి
గణపతి	నిన్నుకోరి
రమా	శమంతకమణి
శేఖర్ స్క్రీన్-1	శమంతకమణి
స్క్రీన్-2	మాయామాల్
శ్రీలలిత	దువ్వాడ జగన్నాథం
వెంకటరామ	దండుపాళ్యం-2
వెంకటరమణ	ఫిదా

సబ్సిడీ రుణాలతో 2400 కుటుంబాలకు లబ్ధి

ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

అమలాపురం రూరల్: నియోజకవర్గంలో రూ.24 కోట్ల కార్పొరేషన్ సబ్సిడీ రుణాలతో 2400 కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా గ్రూపులను ఏర్పాటుచేసి ఒక్కో గ్రూపునకు రూ.25 లక్షల మేర రుణాలు అందించేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు వివరించారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు సెప్టెంబరు 1 నుంచి ఇంటింటికీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మూడేళ్లలో రూ.300 కోట్లతో ఎన్నో అభివృద్ధిపనులు సాధించామన్నారు. ఈదరపల్లిలో రూ.3.50 కోట్లతో డ్రైనేజీ నిర్మాణానికి, పట్టణంలో రూ.9.50 కోట్లతో డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఈ నెల 16వ తేదీలోగా గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసుకోవాలని గృహనిర్మాణశాఖ ఏఈ బి.సువర్ణరాజు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉపాధి హామీ జేఈ పేరాబత్తుల వెంకటేశ్వరరావు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కొత్తగా చేపట్టబోయే పనులను గురించి వివరించారు. ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మిపై పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తల పోస్టులను ఎందుకు భర్తీచేయడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలెన్నో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే అమలు జరుగుతున్నందున వాటిని భర్తీచేసే విధంగా ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. అంతకు ముందు బ్రహ్మకుమారి ఈశ్వరీ విశ్వవిద్యాలయం అమలాపురం శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. బీకే స్వరూప తదితరులు రక్షాబంధనాలు కట్టారు. ఎంపీడీవో ఎ.శారారాణి, పర్యవేక్షకుడు స్వామినాయుడు, తహసీల్దార్ బండి బేబీజ్ఞానాంబ, సర్పంచ్‌లు బడుగు సత్యనారాయణ, నడిపల్లి ఉదయబాబు, చొల్లంగి సత్యసాయిబాబా, రాజులపూడి వెంకటేశ్వరరావు(బీముడు), ఎంపీటీసీ సభ్యులు మంద నాగలక్ష్మి, ఉద్దింక లక్ష్మి, పెనుమాల సునీత పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ప్రతిభ

అమలాపురంటౌన్: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో విద్యానిధి డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటినట్టు ప్రిన్సిపాల్ బి.సుధీర్‌బాబు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను విద్యానిధి విద్యాసంస్థల ఛైర్మన్ ఏబీ నాయుడు, డైరెక్టర్లు వై.నాని, ఎ.శ్యామలామహాలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

వెంకటేశ్వర కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో అమలాపురం శ్రీ వెంకటేశ్వరా కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటినట్టు ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎస్ మనోహర్ తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులను మంగళవారం కళాశాల ప్రాంగణంలో కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు, ఛైర్‌పర్సన్ మల్లిపూడి విజయలక్ష్మి, ఏవో కరాటం ప్రవీణ్, వై.వరప్రసాద్, అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.

రేపు విద్యా సంస్థల బంద్

అమలాపురం టౌన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపుమేరకు ఈనెల 10న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్టు పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.తిరుపతిరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల మూసివేతను ప్రభుత్వం విరమించుకోవాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్స్ చార్జీలు, ఉపకార వేతనాలు పెంచాలని జీవోనెం.14ను రద్దుచేయాలన్న ప్రధాన డిమాండ్లతో విద్యాసంస్థల బంద్ చేపట్టామన్నారు. విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, యాజమాన్యాలు సహకరించాలని కోరారు. డివిజన్‌కమిటీ అధ్యక్షుడు వి.దొరబాబు, జి.చిరంజీవి పాల్గొన్నారు.

తేతల సత్యనారాయణరెడ్డికి సత్కారం



తేతలను అభినందిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అంకితభావంతో కృషిచేస్తున్న వాకర్స్ జిల్లా గవర్నర్ తేతల సత్యనారాయణరెడ్డిని అంతర్జాతీయ వాకర్స్‌సంస్థ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య ఘనంగా సత్కరించారు. తునిలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన సత్యనారాయణరెడ్డిని అంతర్జాతీయస్థాయిలో గుర్తించి సత్కరించారు. కె.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ రాంబాబు, చోడిశెట్టి త్రిమూర్తిస్వామి, కుచిమంచి రాంబాబు, నల్లా రాధాకృష్ణ, కడలి తాతారావు, నల్లా నరసింహమూర్తి అభినందించారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ

గ్రామాల వారీగా అధికారుల నియామకం

అమలాపురం రూరల్: వర్షాకాలంలో అంటు వ్యాధులు, వైరల్ జ్వరాలు విజృంభించకుండా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను ప్రకటించింది. ఇందులో భాగంగా గ్రామాలవారీగా ప్రత్యేకాధికారులను నియమించారు. వారం రోజుల్లో ఆయా గ్రామాల్లో పూర్తిస్థాయిలో సంపూర్ణ పారిశుధ్యచర్యలు చేపట్టే విధంగా ప్రత్యేకాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రతి మండలంలోను ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ, డివిజనల్ పంచాయతీ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలని పంచాయతీరాజ్ కమిషనర్ బి.రామాంజనేయులు, ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డిలు ఉత్తర్వులు ఇచ్చారు. వారానికి మూడు గ్రామాల ముగ్గురు అధికారులు దత్తత తీసుకుని సంపూర్ణంగా పారిశుధ్య చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమలాపురం డీఎల్‌పీవో డీవై నారాయణ మండల పరిధిలోని సాకుర్రు గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అదేవిధంగా రెడ్డిపల్లి, నడిపూడి, ఎ.వేమవరప్పాడు గ్రామాలను వరుసగా ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్‌లు తీసుకున్నారు. ఆత్రేయపురంలో రాజవరం, లొల్ల, బొబ్బర్లంక, అల్లవరంలో బోడసకుర్రు, కొమరగిరిపట్నం, కోడూరుపాడు, రావులపాలెంలో రావులపాడు, కేతరాజుపల్లి, ముమ్మిడివరప్పాడు, అయినవిల్లిలో ఎస్.మూలపొలం, అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కాట్రేనికోనలో బంటుమిల్లి, పెనుమల్ల, లక్ష్మీవాడ, ముమ్మిడివరంలో గేదెల్లంక, కొమానపల్లి, సీహెచ్ గున్నేపల్లి, ఐ.పోలవరంలో పి.ఇంజరం, ఎదుర్లంక, గుత్తెనదీవి, ఉప్పలగుప్తంలో మునిపల్లి, భీమనపల్లి, కూనవరం, కొత్తపేటలో మందపల్లి, కండ్రిగ, వాడపాలెం, పి.గన్నవరంలో ముంగండ, వాడ్రేవుపల్లి, పోతవరం, అంబాజీపేటలో గంగలకుర్రు, ఇసుకపూడి, నందంపూడి, సఖినేటిపల్లిలో శృంగవరప్పాడు, టేకిశెట్టిపాలెం, మోరిపోడు, మామిడికుదురులో లూటుకుర్రు, బి.దొడ్డవరం, అప్పనపల్లి, మలికిపురంలో విశ్వేశ్వరాయపురం, మలికిపురం, మేడిచర్లపాలెం, రాజోలుమండలంలో పొదలాడ, సోంపల్లి, పాలగుమ్మి గ్రామాలను వరుసగా ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ దత్తత తీసుకున్నారు. ఈ వారాంతానికి ఆయా గ్రామాల్లో పూర్తిస్థాయిలో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలి. కచ్చా, సీసీ డ్రైన్లలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించి గ్రామంలో దూరంగా తీసుకెళ్లి వదలాలి. తాగునీటి సరఫరా వ్యవస్థలో ఎటువంటి లోపాలు లేకుండా రక్షిత మంచినీటిని అందించాలి. పారిశుధ్యపనులపై ఎప్పటికప్పుడు కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారులకు సమాచారం అందే విధంగా ప్రత్యేక ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు డీఎల్‌పీవో డీవై నారాయణ తెలిపారు.

మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణ

పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు విడుదల

అమలాపురం రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య రహితంగా వినాయక చవితి పండుగను జరుపుకునే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ బి.రామాంజనేయులు ఆదేశాలు జారీ చేశారు. మట్టి వినాయకుని ప్రతిమలే వినియోగించే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పాటు వివిధ రకాల కెమికల్స్ రంగులను వినియోగించి వినాయకుని ప్రతిమలను తయారుచేస్తున్నారని, అటువంటి విగ్రహాల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జల, వాయు కాలుష్యాలను నివారించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకొచ్చి ప్రతి ఇంట మట్టి వినాయకుని ప్రతిమలనే పూజించే విధంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహించాలని అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని అన్నారు. అవసరమైతే గ్రామాల్లో మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేయించాలని సూచించారు.

కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

అల్లవరం: ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా కల్పిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉపాధి మెరుగుపర్చుకోవాలని అల్లవరం ఎంపీపీ చింతా యూస్సీలక్ష్మిగౌరి అన్నారు. దేవగుప్తం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు కార్యాలయం వద్ద మంగళవారం బీసీ, కాపు కార్పొరేషన్ల లబ్ధిదారులకు రుణాల చెక్కులు అందజేశారు. ఆరుగురు బీసీ లబ్ధిదారులు, ఆరుగురు కాపు లబ్ధిదారులకు కార్పొరేషన్ రుణాల చెక్కులు అందజేసినట్టు సీజీజీ బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వి.శాంతామణి, కమిటీ సభ్యుడు సాధనాల వెంకట్రావు, బూల వెంకటరమణి, బళ్ల అబ్బాయి, ముత్యాల బాబి పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ బైక్ ర్యాలీ

కొనసాగుతున్న కాపుల నిరసనలు

అమలాపురం టౌన్: కాపు అనుబంధ కులాలకు బీసీ రిజర్వేషన్లు కల్పిస్తానని హామీనిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాట నిలుపుకోకపోవడాన్ని నిరసిస్తూ కాపు ఉద్యమనేత కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన కాపుయువత అధికసంఖ్యలో మోబర్లీపేటకు చేరుకున్నారు. అక్కడ సమావేశం నిర్వహించిన అనంతరం మోటార్‌సైకిల్ ర్యాలీని తాతాజీ ప్రారంభించారు. మోటార్‌సైకిల్ ర్యాలీ ఎర్రవంతెన, వెంకటేశ్వరస్వామి గుడిసెంబర్, గొల్లగూడెం, ముస్లింవీధి, గడియారస్తంభం సెంటర్, ముమ్మిడివరం గేట్ సెంటర్, నల్లవంతెన, గారపాటివీధి, గండువీధి, కల్వకొలనువీధి మీదుగా సాగింది. గండువీధిలో కాపు ఉద్యమనేత స్వర్గీయ నల్లా సూర్యచంద్రరావు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నల్లవంతెన వద్ద మోటార్‌సైకిల్ ర్యాలీని పోలీసులు అడ్డగించడంతో ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, యాళ్ల బాబి, ఎం.కృష్ణ, సుంకర పెదకాపు,గండురాజు, పినిశెట్టి భాను, వాకపల్లి శ్రీను, కొమ్మూరి త్రిమూర్తులు, నల్లా శ్రీను, అరళ్లపల్లి ముత్యం, యేడిద శ్రీను, చింతలపల్లి చిన్న, నల్లా ప్రవీణ్, సలాది చక్రి, పెద్దిరెడ్డి ప్రసాద్, దూలం శ్రీను, కల్వకొలను బాబి, మామిడిపల్లి సాయి, వలవల రామకృష్ణ,గోకరకొండ సంజీవ్, ముద్రగడ దొరబాబు, నల్లా మణికంఠ, సాధనాల మురళి, కల్వకొలను ఉమ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఆంజనేయస్వామి గుడిలో పూజలు

ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు

కాపు రిజర్వేషన్లు అమలు చేసే విధంగా ముఖ్యమంత్రి మనసు మార్చాలని కోరుకుంటూ కాపు జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం రవణం మల్లయ్యవీధిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం చేపట్టిన నిరవధిక సత్యాగ్రహ పాదయాత్రకు అడ్డంకులు తొలగించాలని స్వామివారిని వేడుకొన్నారు. కాపు రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ నల్లా పవన్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా బానిసలకంటే హీనంగా కాపు నాయకులను గృహనిర్బంధాలు చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమం ఆపేదిలేదని చెప్పారు. ఆంజనేయస్వామికి వందలాదిమంది కొబ్బరికాయలు కొట్టారు. నాయకులు బసవా సూర్యచంద్రరావు, చిక్కం సూరిబాబు, మామిడిపల్లి రాము, సలాది నాగేశ్వరరావు, అరిగెల నాని, వాండ్రపు లక్ష్మణరావు, నల్లా నాయుడు పాల్గొన్నారు.

చల్లపల్లిలో నిరసన

ఉప్పలగుప్తం: చల్లపల్లిలో మంగళవారం పోలిశెట్టి కిట్టయ్య ఆధ్వర్యంలో కాపులు ఆకలి కేకల కార్యక్రమం నిర్వహించారు. కంచాలు, గరిటెలతో శబ్దం చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కాపులకు రిజర్వేషన్లు కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు మనస్సును మార్చాలని వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో భోగిశెట్టి నర్సింగ్, పోలిశెట్టి సతీష్, ఆకుల పెద్ద, సుంకర బాబులు, సుంకర అబ్బాయి, నాగులపల్లి వీర్రాజు, సుంకర చిన్న, దంగేటి త్రిమూర్తులు, పోలిశెట్టి అయ్యప్పనాయుడు, సత్తి అమ్మిరాజు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం: చల్లపల్లిలో నిరసన

2206 మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యం

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం మండలాన్ని ఓడీఎఫ్‌గా ప్రకటించాలంటే 2206 మరుగుదొడ్లను నిర్మించాలని జిల్లా పంచాయతీ అధికారి టీవీఎస్‌కే కుమార్ అన్నారు. ఐఎస్ఎల్ నిర్మాణాలపై మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబరు నెలాఖరుకు నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఆగస్టు నెలాఖరునాటికి పెదగాడవిల్లి, వానపల్లిపాలెం, కిత్తనచెరువు గ్రామాల్లో ఐఎస్ఎల్ నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఆయా గ్రామాల్లో త్వరితగతిన నిర్మాణాలు చేపట్టి పూర్తిచేసేందుకు అవసరమైతే అడ్వాన్స్‌గా పంచాయతీ, మండల ప్రజాపరిషత్, జిల్లాపంచాయతీ కార్యాలయాల నుంచి సొమ్ము చెల్లించేలా ఏర్పాట్లుచేశారు. నిర్మాణాలు పూర్తయినవాటికి తక్షణం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఏరోజుకారోజు ఐఎస్ఎల్ ప్రగతిపై పంచాయతీ కార్యదర్శులు నివేదికలు సమర్పించాలన్నారు. డీఎల్‌పీవో డీవై నారాయణ, ఈవోపీఆర్‌డీ కేఎస్ గౌరీకుమారి, కార్యాలయ పర్యవేక్షకుడు జేఎల్ఎన్ దీక్షితులు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అరిగెల నానాజీ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎంవీ సీతారామ్, వెలుగు ఏపీఎం ఈ.సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ ఎన్.ప్రసాదరావు పాల్గొన్నారు.

మట్టి వినాయకుని ప్రతిమలే వాడాలి

ఉప్పలగుప్తం: వినాయక చవితి పూజల్లో ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని ప్రతిమలే ఉపయోగించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రోత్సహించాలని జిల్లా పంచాయతీ అధికారి టీవీఎస్‌కే కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉప్పలగుప్తంలో కాలుష్య నివారణపై ప్రజాప్రతినిధులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. గ్రామగ్రామాన మురుగునీరు పోయే ఏర్పాట్లు సమీక్షించేందుకు ప్రత్యేక అధికారుల నియామకం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల్లోను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేసేలా సర్పంచ్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న టాయిలెట్ల విషయంలో పూర్తి వివరాలను సమర్పించాలన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రతి ఒక్కరూ చెత్తరహిత గ్రామాల రూపకల్పనకు సహకరించాలని కోరారు.

1532 శాఖలతో ఎస్‌బీఐ ముందంజ



బ్రాంచిని ప్రారంభిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: రాష్ట్రంలోని 13 జిల్లాల్లో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 1532 శాఖలతో విస్తరించి ఉందని నెట్‌వర్క్-1 జనరల్ మేనేజర్ రవీంద్రపాండే తెలిపారు. కొంకాపల్లిలో నూతన భవనంలో ఎస్‌బీఐ బ్రాంచిని మంగళవారం ప్రారంభించారు. డిప్యూటీ జీఎం ఎస్.గిరిధర్, రీజనల్ మేనేజర్ ఎస్ఎస్‌వీ నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రవీంద్రపాండే మాట్లాడారు. కొంకాపల్లి బ్రాంచి ద్వారా ఆక్వారంగానికి అత్యధికంగా రుణాలు అందజేస్తామన్నారు. ఉందన్నారు. బీఎం ఆర్.సురేష్, కోలా వెంకటేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, ఎ.వెంకట్రావు, జె.నరేష్, ఎన్ఎస్‌జీవీ సోమయాజులు, ఎం.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి(క్వింటాల్)	8000-8500
కొత్తకొబ్బరి (రెండవరకం)	6500
కురిడీ కొబ్బరి(పాతవి)	
గండేరా (వెయ్యి)	10000
గటగట (వెయ్యి)	6500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	9000
గటగట (వెయ్యి)	6,000
నీటికాయ	
పాత(ముక్కుడు)(వెయ్యి)	7000-7500
కొత్త(పచ్చి) (వెయ్యి)	8000-8500
కొబ్బరి నూనె (15 కిలోలు)	2,500
ఒక కిలో	170

- అంబాజీపేట

రైల్ నెట్‌వర్క్ అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

అమలాపురం టౌన్: రాష్ట్రంలో రైల్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు రైల్వేమంత్రిత్వశాఖ, ఏపీ రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయం తీసుకోవడం పట్ల కోనసీమ జేఏసీ సమావేశం హర్షం ప్రకటించింది. మంగళవారం జేఏసీ చైర్మన్ వాసా ఎస్.దివాకర్ అధ్యక్షతన జేఏసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల్లో కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు తొలి ప్రాధాన్యం కల్పించడం పట్ల హర్షం ప్రకటించారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల రైల్వేలైన్‌కు నిధుల సమీకరణకు మార్గం సుగమమవుతుందని వక్తలు అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రైల్వే మంత్రిత్వశాఖ 49 శాతం, ఏపీ ప్రభుత్వం 51 శాతం నిధులు ఇవ్వాల్సి ఉంటుందని జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు పేర్కొన్నారు. కోకన్వీనర్లు మంత్రిప్రగడ వేణుగోపాల్, డాక్టర్ మధుర నరసింహమూర్తి, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, వీరిన గోపాలం, ఇళ్ల రామకృష్ణ, కరాటం ప్రవీణ్, ఉండ్రు బాబ్జి, మాచిరాజు నాగేశ్వరరావు, పమ్మి నాగేశ్వరరావు, జంగా రాజేంద్ర, నంద్యాల నాయుడు పాల్గొన్నారు.

13న క్రికెట్ జట్టు ఎంపిక

అంబాజీపేట: జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 13న అండర్ 14 బాలుర విభాగం కోనసీమ క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు అసోషియేషన్ కార్యదర్శి కె.కిరణ్‌రాజు, ఓ లెవిల్ కోచ్ మట్టా సత్తిబాబు తెలిపారు.. క్రీడాకారులు 2003 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. వయసు ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు.

సమాచారం...

అరటి మార్కెట్


(గెల రేటు)

రకం	కనిష్ఠ రూ.	గరిష్ఠ రూ.
కర్పూర	100	200
చక్రకేళి (తెలుపు)	150	350
ఎర్రచక్కర కేళి	200	400
అమృతపాణి	100	300
బుషావళి	100	200
అరటి (బొంత)	100	200

- రావులపాలెం

ఉపాధి అవకాశాల మెరుగుకు టీడీపీ కృషి

అల్లవరం: ఎస్సీ బీసీ కాపు కార్పొరేషన్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్నదే టీడీపీ లక్ష్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి కమిటీ సమావేశంలో మంగళవారం కార్పొరేషన్ రుణాల మంజూరుపై మాట్లాడారు. నిరుపేదలైన యువతీ యువకులు కార్పొరేషన్ రుణాలతో ఉపాధి పొంది ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 135 యూనిట్లు, బీసీ కార్పొరేషన్ ద్వారా 86 యూనిట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా 194 యూనిట్లు లక్ష్యంగా ఈనెల 16నుంచి బ్యాంకు మేనేజర్లు మండల కమిటీ సమావేశంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ఎంపీడీవో వి.శాంతామణి తెలిపారు. జడ్పీటీసీ సభ్యురాలు వేగిరాజు వెంకటసత్యప్రవీణ, కమిటీ సభ్యులు సాధనాల వెంకట్రావు, దొమ్మేటి రామకృష్ణ, మోకా బాలయోగి, బూల వెంకటరమణి, చింతా శ్రీను, ముత్యాల బాబి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

సింగంపల్లి పాఠశాలలో ఎమ్మార్ వాక్సిన్

రంగంపేట: సింగంపల్లి గ్రామంలోని గ్లోబల్ విజన్ స్కూల్‌లో రంగంపేట పీహెచ్‌సీ సిబ్బంది ఎఎన్‌ఎం రాజేశ్వరి ఆధ్వర్యంలో ఎమ్మార్ టీకాలు వేశారు. ఈ వాక్సిన్‌వల్ల పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తప్పనిసరిగా వాక్సిన్ వేయించాలని సిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సత్యవాణి, కరస్పాంటెండెంట్ జాన్ డీన్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

వైస్ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు:ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కొంకుదురు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే టీకాతో తట్టు, రూబెల్లా వ్యాధులు దరి చేరవన్నారు. రూ. రెండు వేలు విలువ చేసే టీకాను తమ ప్రభుత్వం ఉచితంగా పిల్లలకు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు టీకాలు వేశారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఉపసర్పంచ్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ వారానికి తప్పనిసరిగా మూడు గుడ్లు విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నేకూరి అబ్రహం, టీడీపీ గ్రామఅధ్యక్షుడు కర్రి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు అమ్మిరెడ్డి పాల్గొన్నారు. ఆరికరేవుల ప్రాథమికోన్నత పాఠశాలలోని 210 మంది విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేశారు. సర్పంచ్ కుక్కల రాఘవమ్మ, హెచ్‌ఎం సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొంకుదురు ఉన్నత పాఠశాలలో ఎంఆర్ టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది



గొల్లల మామిడాడలో మాట్లాడుతున్న ఎస్‌ఐ కిషోర్‌బాబు

ర్యాంగింగ్ భూతానికి చేరువైతే
జీవితం ముగిసినట్లే

పెదపూడి ఎస్‌ఐ కిషోర్‌బాబు

అనపర్తి(పెదపూడి) : ర్యాంగింగ్ భూతానికి చేరువైతే జీవితం ముగిసినట్టేనని, నేటి యువత వ్యసనాలకు లోనై జీవితాన్ని వ్యర్థంగా మార్చుకుంటున్నారని పెదపూడి ఎస్‌ఐ కిషోర్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లల మామిడాడ డీఎల్‌ఆర్ కళాశాలలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ అవగాహనా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. విద్యార్థి దశలో చెడు సావాసాల వల్ల చెడు మార్గంవైపు పయనిస్తున్నారన్నారు. దీని నుంచి బయటపడితే విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహిస్తారని ఆయన అన్నారు. ప్రస్తుతం ర్యాగింగ్ చట్టాలు కఠినతరంగా మారాయని , ర్యాగింగ్ ప్రోత్సహించిన వారికే శిక్ష ఎక్కువని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో యాంటీ ర్యాగింగ్‌పై ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నూరు శాతం వరినాట్లు పూర్తి: ఏవో

బిక్కవోలు: మండలంలో వందశాతం వరినాట్లు పూర్తి అయినట్టు వ్యవసాయాధికారి సీహెచ్ శివశ్రీనివాస్ తెలిపారు. ఆరికరేవుల గ్రామంలో మంగళవారం ఆయన పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో అక్కడక్కడా హిస్పాపురుగు(తాటాకుతెగులు) కనిపిస్తోందని, అయితే ఉధృతి తక్కువగా ఉంటే పురుగుమందులు పిచికారీ చేయనవసరం లేదని అన్నారు. దుబ్బుకు రెండు లేక ఎక్కువ పురుగులు ఆశిస్తే ప్రొఫినోఫాస్ రెండు ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తొలకరిలో వాతావరణం మబ్బుగా ఉన్నప్పుడు మాగుడు తెగులు ఆశించే ప్రమాదం ఉందని, అందువల్ల ముందు జాగ్రత్తగా పొలంగట్లపై గడ్డిని తీసివేసి శుభ్రంగా ఉంచాలన్నారు. అనం తరం గట్టు, దిబ్బలపై పెంచుకోడానికి రాయితీపై కంది విత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొమ్మన ఆనంద్, ఆత్మ డైరెక్టర్ రెడ్డి శ్రీను, కుక్కల వెంకటరమణ, మహిపాల వెంకటరావు, ఎంపీ ఈవో భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



మెళ్లూరులో రైతులకు కందివిత్తనాలు అందిస్తున్న ఏవో శ్రీనివాస్



బిక్కవోలులో అన్నదాన సమాజాన్ని శుద్ధి చేస్తున్న సమాజ సభ్యుడు

ఉపాధ్యాయుల బదిలీ

రంగంపేట: మండల పరిధిలోని పాఠశాలల నుంచి 29 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఇతర మండలాల నుంచి 48 మంది ఉపాధ్యాయులు రంగంపేట మండలానికి రానున్నారు. బదిలీ అయిన వారికి ఎంఈవో శ్రీనివాసరావు రిలీవింగ్ ఆర్డర్ అందజేశారు. 20 ఎస్జీజీ పోస్టులు యూపీ స్కూల్‌కు మంజూరైనట్టు ఎంఈవో తెలిపారు. ఈ బదిలీల వల్ల ఉపాధ్యాయుల కొరత తీరిందన్నారు.

జీబీఆర్ విద్యార్థుల ప్రతిభ

అనపర్తి : ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఇటీవల విడుదల చేసిన డిగ్రీ సెకెండ్ సెమిస్టర్ ఫలితాలలో జీజీఆర్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచినట్టు విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి తెలిపారు. బీఎస్‌సి ఎంపీఈఎస్‌లో కొవ్వూరి శ్రీలక్ష్మి 9.56 జీపీఏ పాయింట్లతో టౌన్ ఫస్ట్‌లో నిలవగా, బీఎస్‌సీ ఎంపీసిలో నల్లమిల్లి వరలక్ష్మి 9.48 జీపీఏ పాయింట్లతో టౌన్ టాపర్‌గా నిలిచినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పీజీ కోర్సుల డైరెక్టర్ బి. రత్నారెడ్డి, డిగ్రీ కళాశాల డైరెక్టర్ డీవీఆర్‌పి పాపిరెడ్డి తదితరులు అభినందించారు.



'ఉప ఎన్నికలలో టీడీపీ విజయం తథ్యం'

అనపర్తి : నంద్యాల ఉప ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి. భూమా బ్రహ్మానందరెడ్డి విజయం తథ్యమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గత పది రోజులుగా నంద్యాలలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం నంద్యాల నియోజకవర్గంలోని చేబోలు గ్రామంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా మహిళల సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. మహిళా సాధికారత తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల్లో సంతృప్తినిచ్చాయని అన్నారు. ప్రచారంలో తెలుగుదేశం పార్టీకి ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు పెండ్యాల నళినీకాంత్, బిక్కవోలు మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ద్వారంపూడి సూరారెడ్డి, తదితరులున్నారు



సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

తెరుచుకున్న ఆలయాలు..

యధావిధిగా భక్తులకు దర్శనాలు

బిక్కవోలు:చంద్రగ్రహణంతో మూసివేసిన గ్రామంలోని ప్రాచీన ఆలయాలు మంగళవారం ఉద యం తెరుచుకున్నాయి. గోలింగేశ్వర, కుమారసుబ్రహ్మణ్యేశ్వర, లక్ష్మీగణపతి, లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయాలను ఉద యం అర్చకులు కొడమంచిలి సత్యనారాయణశర్మ, సన్నిధిరాజు సుబ్రహ్మణ్యశర్మ, గొల్లపల్లి వెంకటరమణశర్మలు సంప్రోక్షణ నిర్వహించి శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి అన్నదాన సమాజాన్ని శుద్ధి చేశారు. సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్న 500 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.

అపరాల సాగుపై రైతులు దృష్టి సారించాలి



రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుధాకరరెడ్డి

అనపర్తి : అపరాల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలక్ష్మి రైతులకు సూచించారు. అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో మంగళవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మార్కెట్‌కు అను గుణంగా రైతులు అపరాల సాగుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ప్రభుత్వం అపరాల విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ తేతల సుధాకరరెడ్డి రైతులకు బయోమెట్రిక్ విధానం ద్వారా కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, పడాల నాగిరెడ్డి, మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత భవనాల కూల్చివేతకు సన్నాహాలు

రంగంపేట: పీహెచ్‌సీకి సంబందించిన పాతభవనాల కూల్చివేతకు ఆ శాఖ ఇంజనీర్ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది భవనాల కొలతలు తీసుకున్నారు. రంగంపేట వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చంద్రయ్య దృష్టికి పాత భవనాల విషయాన్ని తీసుకురాగా వైద్య సిబ్బందితో కొలతలు తీయించారని డాక్టర్ లక్ష్మీదేవి తెలిపారు.



పీహెచ్‌సీ పాత భవనాలను కొలుస్తున్న సిబ్బంది.

పలు గ్రామాలల్లో ఎమ్మార్ వాక్సిన్

పీహెచ్‌సీ పరిధిలోని రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి గ్రామాల పరిదిలోని 1358 పిల్లలకు ఎమ్మార్ వాక్సిన్ వేసినట్టు డాక్టర్ లక్ష్మీదేవి తెలిపారు. గ్రామాలలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని విద్యార్థులకు ఇంజక్షన్లు వేసినట్టు తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది ఈ కార్యక్రమాలను పర్యవేక్షించినట్టు తెలిపారు.

• సినిమా గైడ్

అనపర్తి:

సూర్యశ్రీ ఫిదా
సత్యగౌరి గౌతమ్‌నందా



బైక్‌లు రయ్..

హెల్మెట్ ఏదోయ్..?

రాజమహేంద్రవరం సిటీ/రాజమహేంద్రవరం అర్బన్/దేవీచౌక్:

ఏ రోడ్డులో చూసినా రయ్.. రయ్‌మంటూ దూసుకెళ్లే బైకులు. స్నేక్ కటింగ్‌లు, 8 అంకె పడేలా మలుపుల స్కిడ్లు చేసుకుంటూ దూసుకుపోయే కుర్రకారు పొంచి ఉన్న పెను ప్రమాదాన్ని ఊహించక కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికశాతం తలకు తీవ్రగాయాలు కావడం వల్లే ఎక్కువమంది మృత్యువాత పడ్డారు. 2016 సంవత్సరంలో 420 రోడ్డు ప్రమాదాలు జరిగితే వాటిలో అధికశాతం తలకు తీవ్రగాయాలైనవారు కాగా 30మంది మృత్యువాత పడ్డారు. బైకులపై వెళ్లేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలనే నిబంధన ఉన్నప్పటికీ రాజమహేంద్రవరం వంటి నగరాల్లో వాటిని అమలు చేసే పరిస్థితి కానరావడంలేదు. దీంతో ప్రమాదాల్లో ఊహించనిరీతిలో ఎక్కువశాతం యువకులే బలైపోతున్నారు. ఇంత నష్టం జరుగుతున్నా హెల్మెట్లు వినియోగించడంలేదు. రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా పరిధిలో 30 కిలోమీటర్లు వరకూ విస్తరించి ఉన్న జాతీయ రహదారిపైన మాత్రమే హెల్మెట్ తనిఖీలు అరకొరగా జరుగుతున్నాయి. నగరంలో వాటి ఊసేలేదు. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అప్పుడప్పుడూ హెల్మెట్ ధరించాలని వాహనదారులను చైతన్యవంతం చేయడం కోసం ర్యాలీలు నిర్వహిస్తున్నారే తప్ప కఠినంగా వ్యవహరించే పరిస్థితి లేదు. కనీసం ఈ-చలానా ఇచ్చేటప్పుడు కూడా హెల్మెట్‌ను పరిగణనలోకి తీసుకోవడంలేదు. దీంతో హెల్మెట్ వాడకపోయినా పెద్ద ఇబ్బందిలేదని వాహనదారులు హెల్మెట్లు ఉన్నా వాటిని బైకు క్యారేజీలకు లేదా ఇంట్లో హ్యాంగిలర్లకు తగిలించి వదిలేస్తున్నారు. హెల్మెట్లు తప్పనిసరని తెలిసినా చూసీచూడనట్లుగా ట్రాఫిక్, పోలీసులు వదిలేయడంవల్ల వాటిని యువత వినియోగించడం లేదు. జాతీయరహదారిపై మాత్రం హెల్మెట్ వినియోగంపై కచ్చితంగా శ్రద్ధ తీసుకుంటున్నారు. రహదారి భద్రత విభాగం పోలీసులు కొన్ని ముఖ్యమైన కూడళ్లలో తనిఖీలు చేస్తున్నారు. ప్రథమంగా పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరిస్తున్నారు. నగరంలో మాత్రం వదిలేశారు.

మోటారు వెహికల్ యాక్టు ఏం చెబుతుంది?

మోటారు వెహికల్ చట్టంలోని సెక్షన్ 129 ప్రకారం వాహనచోదకుడితో పాటు వాహనంపై ఉన్నవారు కూడా హెల్మెట్లు ధరించాలి. ఈ నిబంధన అతిక్రమిస్తే రూ.100 జరిమానా విధించే అవకాశం ఉంది. ఫైన్ స్వల్పంగా ఉండడంతో హెల్మెట్ల ధారణ కొంత పెడచెవిన పెడుతున్నారనే భావన ఉంది. పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న మోటారు వెహికల్ చట్టానికి సంబంధించిన బిల్ పాసయితే ఈ జరిమానాలు భారీగా పెరిగే అవకాశం ఉంది.

ప్రమాదాల్లో తలకు తీవ్రగాయాలతోనే అధిక మరణాలు
సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ వచ్చి ఏడాది పైనే
అయినా పాటించని హెల్మెట్ నిబంధన
పోలీసులూ పట్టించుకోరు

హెల్మెట్ల బిల్లులు ఎక్కడి నుంచి వస్తున్నాయి...

శిరస్త్రాణం(హెల్మెట్) తప్పనిసరి చేసినప్పటికీ అవి వినియోగించడంలేదని, వాహనం కొన్నప్పుడే హెల్మెట్ కూడా కొనుగోలు చేయాలని నిబంధన తీసుకొచ్చారు. వాహనం కొనుగోలు కాగితాలతోపాటు హెల్మెట్ బిల్లు పెడితేనే కానీ రిజిస్ట్రేషన్ చేయరాదనే నిబంధనను తప్పనిసరి చేశారు. దానికి అనుగుణంగానే వాహన కొనుగోలుదారులు హెల్మెట్ కొనుగోలు బిల్లులను సమర్పించడం జరుగుతుంది. ఆ హెల్మెట్లు ఎక్కడ పెట్టుకుంటున్నారనేది బోధపడని విషయం. ప్రతి ద్విచక్రవాహన చోదకుడికీ హెల్మెట్ ఉన్నట్లు రికార్డులపరంగా కచ్చితంగా ఉంటుంది. కాకపోతే ఆ హెల్మెట్లు ఏమయ్యాయో తెలియడంలేదు. హెల్మెట్ కొనకుండా బిల్లులు పుట్టుకొస్తున్నాయనేది బహిరంగ రహస్యంగానే ఉంది. వాహనచోదకులు హెల్మెట్ ధరించాలనేది బిల్లుల వెనుకున్న అంతరార్థం. అది అనుకున్న ఫలితాలు సాధించకపోగా దొంగబిల్లులు ఇచ్చేవారికి కల్పతరువుగా మారింది. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం ఆర్టీఓ పరిధిలో 2లక్షల76వేల500 ద్విచక్రవాహనాలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకూ 2వేల700 అధికారుల వద్ద నమోదై ఉండగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ అవుతున్నవి కలుపుకుంటే 5వేల వరకూ ఉంటాయి. ఈ లెక్కన చూసుకుంటే ఇన్నివేల హెల్మెట్లు ఏమైనట్లు?. దీనిపై ఎవ్వరూ దృష్టిపెట్టినట్టు కనిపించడంలేదు. దీంతో సిటీలతోపాటు హైవేలపై కూడా శిరస్త్రాణాల జాడ కనిపించడంలేదు.

ఈ-చలానాలతో కొంత ఫలితాలు...

విశాఖపట్నం, కేరళలోని కోచి వంటి నగరాల్లో క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలు, స్పీడ్ గన్స్ వంటివి ఏర్పాటు చేశారు. హెల్మెట్ లేకపోతే అవి ఫోటోలు తీస్తాయి. వీటి ఆధారంగా అధికారులు ఈ-చలానాలు జారీ చేసి నేరుగా ఆ వాహన యజమానుల ఇళ్లకు వెళ్లేవిధంగా ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు కూడా విధిగా నిబంధన పాటించడం అలవాటు చేసుకున్నారు. ఈ-చలానాలు కొంత సత్ఫలితాలనిచ్చాయి.



నగరంలో హెల్మెట్లపై అవగాహన కల్పిస్తూ పోలీసులు చేస్తున్న ర్యాలీ

బిల్లు తప్ప హెల్మెట్ ఊసులేదు...

వాహనం రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు హెల్మెట్ బిల్లు తప్పనిసరిగా చూస్తున్నారు. హెల్మెట్‌ను పట్టించుకున్న దాఖలా కనిపించడంలేదు. దీంతో వందకు 90 దొంగ బిల్లులు ఉంటున్నాయని తెలుస్తోంది. ఇక ఇప్పుడు ఆర్టీఓ కార్యాలయానికి వచ్చే పనేలేకుండా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్స్ అవుతున్నాయి. ఇది మరింత వరంగా మారింది. బిల్లు స్కానింగ్ చేసి అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. అది సంబంధిత అధికారులు చూసి అప్రూవ్ చేస్తారు. కాగితరూపంలో సమర్పించేవే దొంగబిల్లులు ఉంటుంటే స్కానింగ్ చేసి అప్‌లోడ్ చేసేవి ఎంతవరకూ నిజమైనవో అర్థం చేసుకోవచ్చు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపైనే పోలీసుల దృష్టి...

ప్రస్తుతం రాజమహేంద్రవరం పోలీసుల దృష్టంతా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపైనే ఉంది. ఎక్కడపడితే అక్కడ కాపుకాసి, ఎడా పెడా కేసులు రాసేస్తున్నారు. ఇప్పటికే వందలమందిని జైలుకు కూడా పంపించారు. కేసుల సంఖ్య చూస్తే ఏదో టార్గెట్ పెట్టుకున్నట్టు కనిపిస్తుంది. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయనేది కాదనలేని వాస్తవం. బాధితులు పెద్ద సంఖ్యలోనే ఉంటున్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్‌లు ధరిస్తున్నారా? లేదా? అనే విషయంలో మాత్రం పోలీసులు ఉదాశీనత చూపుతున్నారు. ఇది విమర్శలకు తావిస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలతో ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారనే కారణంతోనే సుప్రీం కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం హెల్మెట్ నిబంధన తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే.

కేసులు పెడుతున్నాం: ఆర్టీవో సిరి ఆనంద్

మోటారు వెహికల్ చట్టం ప్రకారం భద్రతాపరమైన విషయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. నిరంతరాయంగా వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్నాం. కేసులు పెట్టడంలో కూడా వెనుకాడడంలేదు. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ భద్రతాపరమైన నిబంధనలు పాటించనివారిపై పదివేల కేసులు నమోదు చేశాం. హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలి. వీటిపై కూడా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలనేదానిపై సుప్రీంకోర్టు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సిటీ, హైవే అనేతేడాలేమీ లేవు. వాహనచోదకులు నిబంధనల ప్రకారం హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ కొనుగోలు చేయకుండా దొంగబిల్లులు ఇచ్చేవారిపై కూడా నిఘా ఉంచాం. అది కూడా చట్టరీత్యా నేరమే.

ఇవేం రోడ్లు...?



అధ్వానంగా తయారైన జాంపేట మార్కెట్ రోడ్‌లు





లక్ష్మీవారపు పేట బ్రిడ్జి వద్ద గోతులు పడ్డ సీసీ రోడ్డు

నగరంలో రహదారులు అధ్వానంగా ఉంటున్నాయి. రోడ్లు వేసిన కొన్నాళ్లకే నాణ్యతా లోపాల కారణంగా పాడవుతున్నాయి. వర్షాలకు గోతులమయంగా మారి నగరవాసులకు నగరం చూపెడుతున్నాయి.

ఫొటోలు: ఇలియాసుద్దీన్/రాజమహేంద్రవరం



గంటాలమ్మ గుడి వీధి మొదట్లో కుంగుతున్న మ్యాన్ హోల్



లెఫ్టినెంట్ కల్నల్ నరేష్‌కు అభినందన

యానాం: భారత సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్‌గా విధులు నిర్వరిస్తున్న ఓలేటి లక్ష్మీవీరనరేష్‌ను యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు మంగళవారం నాడు అభినందించారు. వ్యక్తిగత కారణాలతో యానాం వచ్చిన నరేష్‌కు శాలువా కప్పి సత్కరించారు.



అధికారులకు నామినేషను పత్రాలు అందచేస్తున్న పసుపులేటి వెంకటలక్ష్మి, సంగిశెట్టి జాహ్నవి



రెండో రోజు పది నామినేషన్లు

కార్పొరేషన్: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రక్రియలో భాగంగా రెండో రోజైన మంగళవారం పది నామినేషన్లు దాఖలయ్యాయి. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కేంద్రాల నుంచి 305 మంది నామినేషను పత్రాలు తీసుకున్నారు. 2వ డివిజన్ నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా సంగిశెట్టి జాహ్నవి, సంగిశెట్టి అశోక్ నామినేషన్లు దాఖలు చేశారు. 26వ డివిజన్‌కు వైసీపీ నుంచి మచ్చా లోకేష్‌వర్మ, 34వ డివిజన్‌కు పసుపులేటి వెంకటలక్ష్మి, 35వ డివిజన్ నుంచి బెండా విష్ణుమూరి నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ నుంచి 46వ డివిజన్‌కు కొలగాని దుర్గాప్రసాద్, 49వ డివిజన్‌కు రమణాతి మురళి, కడియాల చినబాబు (మహాలక్ష్మి), 50వ డివిజన్‌కు ఇజ్జపురెడ్డి శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ నుంచి 36వ డివిజన్‌కు కె.నాగమల్లి నామినేషన్ వేశారు. అభ్యర్థులు తమ అనుచరులతో తరలివచ్చి అట్టహాసంగా నామినేషన్లు వేశారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది.



జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రమేష్, చంద్రమౌళి, లక్ష్మణరావు

వైసీపీలో మాజీ కార్పొరేటర్ల చేరిక

కార్పొరేషన్: నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్లు కంపర రమేష్, బసవా చంద్రమౌళి, దండుమహంతి లక్ష్మణరావు మంగళవారం వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. కాకినాడ లోక్‌సభ నియోజకవర్గ కన్వీనర్ చలమలశెట్టి సునీల్, కాకినాడ సిటీ నియోజవర్గ కో-ఆర్డినేటర్లు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ముత్తా శశిధర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓరియంటేషన్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ కృష్ణసుధాకర్

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

యానాం: స్థానిక యర్రా గార్డెన్స్‌లోని సాయి జూనియర్ కళాశాలలో జరిగిన ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ ఎం.లోవరాజు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, నీటి సంరక్షణ, పచ్చదనం-పరిశుభ్రత, ఆత్మహత్యకు పాల్పడకుండా విద్యార్థుల్లో చైతన్యం కల్పించడం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ కృష్ణసుధాకర్, కళాశాల చైర్మన్ నల్లం నాగబాబు, డైరెక్టర్ బాబీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సూర్యనారాయణ, రాజేష్, కళాశాల అధ్యాపకులు, సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.



చేతికి నల్ల రిబ్బన్లను సంకెళ్లలా కట్టుకుని నిరసన తెలుపుతున్న కాపు నాయకులు

పిఠాపురంలో కాపు నేతల నిరసన

పిఠాపురం: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ బస్టాండు వద్ద కాపు జేఏసీ నాయకులు మంగళవారం సాయంత్రం ఆందోళన నిర్వహించారు. చేతికి నల్లటి రిబ్బన్లను సంకెళ్ల మాదిరిగా కట్టుకుని నిరసన తెలిపారు. ముద్రగడ పాదయాత్ర పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కాపులను బీసీల్లో చేర్చాలని, ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని నినాదాలు చేశారు. ఆందోళనలో కాపు జేఏసీ నాయకులు గుండా వెంకటరమణ, కొండేపూడి శంకరరావు, బాలిపల్లి రాంబాబు, బొజ్జా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నాగమల్లితోట జంక్షన్: 21వ శతాబ్దంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు సాగాలని రాజుభవన్ ఎండీ వాకట్టు రాజేశ్వరి పేర్కొన్నారు. రాఖీ పండుగ, స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని వాసవీ క్లబ్ వనితా ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయ మండపంలో మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పురం రజని ముందుగా సూచించిన ప్రకారం మహిళలు, బాలబాలికలు డ్రెస్ కోడ్‌లో వచ్చి సందడి చేశారు. గత 12 ఏళ్లుగా మహిళల కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు రజని తెలిపారు. ఆటల పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం క్లబ్ మాజీ అధ్యక్షులను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.శ్రీదేవి, కోశాధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.



వాసవీ వనిత క్లబ్ మాజీ అధ్యక్షులను సత్కరిస్తున్న రాజేశ్వరి, రజని



విద్యార్థినికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

చీడిగలో ఎంఆర్ వ్యాక్సినేషన్

చీడిగ (ప్రతాప్‌నగర్):

కాకినాడ రూరల్ మండలం చీడిగ ఎస్‌కేవీఎస్ఎన్ మోడల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మీజిల్స్-రుబెల్లా (ఎంఆర్) వ్యాక్సినేషన్ నిర్వహించారు. సుమారు 290 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేసినట్టు ప్రధానోపాధ్యాయుడు కేపీవీ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీజిల్స్, రుబెల్లా వ్యాధులు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పిల్లలకు ఉచితంగా వ్యాక్సిన్ వేయించడం శుభపరిణామమన్నారు. తూరంగి పీహెచ్‌సీ వైద్యురాలు ప్రశాంతి, ఎంపీహెచ్ఈవో ప్రకాష్, ఏఎన్ఎంలు సత్యకుమారి, అమల, రాజ్యలక్ష్మి విద్యార్థులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎస్‌కేవీఎస్ఎన్ మోడల్ పాఠశాల కరస్పాండెంట్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు నాగబాబు, భాస్కర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

కస్టమ్స్, వస్తు సేవల పన్నుపై అవగాహన

కాకినాడ క్రైం: కాకినాడ కస్టమ్ హౌస్, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం డైరీ ఫారమ్ ప్రాంతంలో గల విముక్తి స్కూలులో స్కూల్ అవుట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. కస్టమ్స్ జాయింట్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి విద్యార్థులకు కస్టమ్స్, వస్తు సేవల పన్ను, వ్యక్తిత్వవికాసం, సాఫ్ట్‌స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ నిర్వహించి విజేతలకు, పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కస్టమ్స్ ఉప కమిషనర్ బీకే సింగ్, సూపరింటెండెంట్లు కె.స్టాన్లీ, కె.రామారావు, జీఏ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు వైఎస్ సునీల్, వీవీఎన్ ఆచార్యులు, స్కూలు ప్రధానోపాధ్యాయుడు కృష్ణస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆదర్శ్'లో టెక్నో జోన్ వర్క్‌షాపు

గొల్లప్రోలు రూరల్: మండలంలోని చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెకానికల్ టెక్నోజోన్ వర్క్‌షాపు ప్రారంభించారు. వారం రోజులు వర్క్‌షాపు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ధర్మరాజు తెలిపారు. వీరికి కెటియ వి.5 డిజైనింగ్ సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ట్రైనర్స్ దుర్గాప్రసాద్, శ్రీనివాస్, డాక్టర్ తుమ్మల రామలింగేశ్వరరావు, మెకానికల్ విభాగాధిపతి సీహెచ్ సూర్యనారాయణ, కో-ఆర్డినేటర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

13న బాలబాలికలకు వివిధ అంశాల్లో పోటీలు

నాగమల్లితోట జంక్షన్: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా కాకినాడ, పరిసర ప్రాంతాల పాఠశాలల బాలబాలికలకు వివిధ అంశాల్లో ఈ నెల 13న పోటీలు నిర్వహిస్తున్నట్టు వేణుగోపాల సంస్కృత ప్రచార సభ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మంగళవారం తెలిపారు. వేణుగోపాల సంస్కృత ప్రచార సభ, భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని భారతీయ విద్యాభవన్‌లో 13వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు 15వ తేదీన వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో నిర్వహించే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు.



కామర్స్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న ఆదిత్య కళాశాలల సమన్వయకర్త నాయుడు

'పోటీ ప్రపంచంలో కామర్స్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు'

ప్రతాప్‌నగర్ (కాకినాడ): ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థినుల ఆధ్వర్యంలో మంగళవారం కామర్స్ టెక్నో ఫెస్ట్ నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ కరుణ తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల సమన్వయకర్త బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కామర్స్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. నేటి ఆధునిక, వాణిజ్య ప్రపంచంలో కామర్స్ మేనేజ్‌మెంట్‌తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానంతో కూడిన అకౌంటింగ్‌లో పరిజ్ఞానం సాధించినట్లయితే దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా బిజినెస్ క్విజ్, మార్కెటింగ్ విభాగంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, కామర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కామర్స్ విభాగాధిపతి పీవీవీఎస్ ప్రసాద్, విద్యార్థినులు పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించాలి

వికాసభారతి వ్యవస్థాపకుడు కృష్ణప్రసాద్

కార్పొరేషన్: తెలుగు భాషను ప్రభుత్వాలు పరిరక్షించాలని, పాఠశాల స్థాయిలో తెలుగు భాషను తొలగించే నిర్ణయంపై పునరాలోచన చేయాలని వికాసభారతి వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ కృష్ణప్రసాద్ కోరారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో స్టూడెంట్ వికాస్ పేరిట రూపొందించిన లీడర్స్ డైరీని మంగళవారం నాడు కాస్మో సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో బ్రాహ్మణ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు భమిడిపాటి శ్రీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జొన్నలగడ్డ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లో అన్ని పాఠశాలలకు లీడర్స్ డైరీ అందించి విద్యార్థులకు మానసిక వికాసంతో పాటు విద్యా విషయాలపై అవగాహన కల్పిస్తామన్నారు. పాఠశాలల యాజమాన్యాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలుగు మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మాతృభాషకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుండగా మన రాష్ట్రంలో మాత్రం తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. తెలుగుభాష రాకపోతే ఏ భాషా అర్థం కాదన్నారు. లీడర్స్ డైరీలో పొందుపరిచిన విషయాలను వికాసభారతి ప్రత్యేక కమిటీ సభ్యులు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. సంస్థ రాజమహేంద్రవరం విభాగానికి కన్వీనర్‌గా భమిడిపాటి భీమశంకరం, కాకినాడ విభాగం కన్వీనర్‌గా వాడ్రేవు శ్రీనివాస్‌లను నియమించినట్టు తెలిపారు. భమిడిపాటి మాట్లాడుతూ ఇటువంటి డైరీల ద్వారా పిల్లల మానసిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించి నివారణ చర్యలు తీసుకోవడానికి వీలుకలుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ చైతన్య వేదిక జిల్లా కార్యదర్శి ఆకెళ్ల ప్రసాద్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నోరి బలరామకృష్ణ, వాడ్రేవు శ్రీనివాస్, భమిడిపాటి భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.



లీడర్స్ డైరీని ఆవిష్కరిస్తున్న కృష్ణప్రసాద్, శ్రీకృష్ణ

కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా నానాజీకి అదనపు బాధ్యతలు

కార్పొరేషన్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో భాగంగా డీసీసీ అధ్యక్షుడు పంతం నానాజీకి కాకినాడ నగర శాఖ అధ్యక్షుడిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఏపీ పీసీసీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పీసీసీ కార్యాలయం నుంచి ఆయనకు ఉత్తర్వులు పంపారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ద్వారా ప్రజాసేవ చేయడానికి అనుకూలమైన పరిస్థితి లేనందున పార్టీకి రాజీనామా చేస్తున్నానని కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు కంపర రమేష్ పేర్కొన్నారు. తన రాజీనామా లేఖను పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డికి పంపారు. పార్టీపై ఉన్న అభిమానం వల్ల గల నాలుగు సంవత్సరాలుగా పార్టీకి సేవలు అందించానన్నారు. అయితే ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో మాత్రమే రాజీనామా చేస్తున్నానన్నారు. తన రాజీనామాను సహృదయంతో ఆమోదించాలని కోరారు.

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు

'మీకోసం' వెబ్‌సైట్

రమణయ్యపేట (ప్రతాప్‌నగర్): కాకినాడ రూరల్ మండల పరిధిలోని ప్రజలకు మరింత చేరువయ్యేందుకు మీకోసం వెబ్‌సైట్ ప్రారంభించినట్టు ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పేర్కొన్నారు. ఎంపీడీవో కొత్తగా రూపొందించిన మీకోసం వెబ్‌సైట్‌ను కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలోని ఎన్టీఆర్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు చేరువలో ఉండాలని, ప్రజల నుంచి గానీ, అధికారుల నుంచి గానీ ఏ కార్యాలయానికి సంబంధించిన సమస్య వచ్చినా వాటన్నింటినీ ప్రజలకు తెలియపరిచే ఉద్దేశంతో ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారన్నారు. 1100 అనే ఫోన్ నెంబర్‌తో డైరెక్ట్‌గా కనెక్ట్ చేసి ఫిర్యాదు వచ్చే విధానాన్ని జిల్లాలోనే మొదటి సారిగా ప్రవేశపెట్టామన్నారు. భవిష్యత్తులో దీన్ని ఇంకా అభివృద్ధి చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఫిర్యాదులను www.meekosam.mpdokkdrural.comలో నమోదు చేసుకోవచ్చు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వనాథరెడ్డి, ఎంపీపీ పుల్ల సుధాచందు, జడ్పీటీసీ సభ్యురాలు సత్యవతీచలపతి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మట్టా ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మీకోసం వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంతలక్ష్మి

పండూరు పథకం పనులను వేగవంతం చేయాలి

పండూరు (ప్రతాప్‌నగర్): కాకినాడ రూరల్ మండలంలోని 16 గ్రామాలకు రక్షిత మంచి నీటిని అందించే పండూరు నీటి సరఫరా పథకం పనులను ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15 కోట్ల వ్యయంతో చేస్తున్న ఈ పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పండూరు చెరువులో రక్షిత నీటి సరఫరా పనులను గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ అప్పారావు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సత్తిబాబు పాల్గొన్నారు.



పండూరు నీటి సరఫరా పథకం పనులను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప

యువకుడి ఆత్మహత్యాయత్నం

కాకినాడ క్రైం: స్థానికులు తనను దొంగ అని వేధించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... కాకినాడ ఏటిమొగకు చెందిన అరదాడి దుర్గాప్రసాద్ (26) స్థానికంగా ఓ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో పని చేస్తున్నాడు. ఏటిమొగలో గతంలో జరిగిన ఓ మోటారు సైకిలు దొంగతనంలో ఇతడు నిందితుడు. అనంతరం అతడు సత్ప్రవర్తనతో మెలుగుతూ పనిచేసుకుంటున్నాడు. ఇటీవల ఏటిమొగలో మరో మోటారు సైకిలు దొంగతనం జరిగింది. దాంతో కొందరు స్థానికులు దుర్గాప్రసాదే దొంగతనం చేశాడంటూ వేధించసాగారు. వేధింపులు తీవ్రతరం కావడంతో తీవ్ర మనస్థాపానికి గురైన అతడు మంగళవారం ఫ్యానుకు కేబుల్ వైర్‌తో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన అతడి సోదరుడు సూర్యచంద్ర దుర్గాప్రసాద్‌ను కాపాడి 108 అంబులెన్సులో కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు. పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్

• సినిమా గైడ్

ఆనంద్	నక్షత్రం
అంజని	ఇదేం దెయ్యం
గీత్	జబ్ మేరీ మీట్ సీజల్ (హిందీ)
సంగీత్	గౌతమ్‌నంద
దేవీస్ర్కీన్1	గౌతమ్‌నంద
దేవీస్ర్కీన్2	ఫిదా
దేవీస్ర్కీన్3	జబ్ మేరీ మీట్ సీజల్ (హిందీ)
శ్రీప్రియ	వశం
పద్మప్రియ	డీజే దువ్వాడ జగన్నాథం
సీ1	దర్శకుడు
సీ2	నక్షత్రం
మయూరి	నక్షత్రం
సత్యగౌరి	వాయర్ (ఇంగ్లీషు)
తిరుమల	నిన్ను కోరి
వీర్‌కమల్	అమీతుమీ
లక్ష్మి	నక్షత్రం



ఘనంగా విఖనస మునీంద్రుల అవతరణ దినోత్సవం

యానాం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విఖనస మునీంద్రుల అవతరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరపగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, రఘురామ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అనంతలక్ష్మి



జడ్.బావారంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనంతలక్ష్మి

కరప: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను కల్పించడమే ధ్యేయమని ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని జడ్.బావారంలో రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రజావిశ్వాసం చూరగొనడానికి తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. సుస్థిరపాలన అందిస్తున్న తమ ప్రభుత్వానికి ఎల్లవేళలా ప్రజలు అండదండలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సత్తిబాబు, ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు బుంగా సింహాద్రి, కరప నీటి పంపిణీ సంఘం ఛైర్మన్ కోటగిరి మహేంద్రబాబు, వైస్ ఎంపీపీ గొల్లపల్లి ధనలక్ష్మీబుజ్జి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మట్టా ప్రకాష్‌గౌడ్, పసల భాస్కరసత్యం, సర్పంచ్ పంపన మణి, గుబ్బల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు

జిల్లా రిసోర్స్‌పర్సన్ రవిశంకర్



సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లపై చర్చిస్తున్న అధికారులు

కరప: మండలంలోని అన్ని గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల (సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్) ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా రిసోర్స్‌పర్సన్ ఎ.రవిశంకర్ తెలిపారు. కరపలో నిర్మితమవుతున్న ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గుత్తుల భీమశంకరరావు సమక్షంలో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ అధికారులతో సమావేశమై చెత్త నుంచి సంపద కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. రవిశంకర్ విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా ప్రతీ గ్రామంలోనూ చెత్త నుంచి సంపద వెలికితీసే కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే నడకుదురు, వలసపాకలలో అంచనాలు సిద్ధం చేశామన్నారు. ప్రతీ గ్రామంలో వెయ్యి మంది ప్రజలకు ఒక గ్రీన్ అంబాసిడర్ చొప్పున ఉపాధి కూలీలను నియమించి వారికి సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుంగా సింహాద్రి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎం.నాగమణి, పంచాయతీల కార్యదర్శులు జేవీ రమణమ్మ, కె.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రతిభా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: కేంద్ర మానవవనరుల మంత్రిత్వ శాఖలో ప్రతిభావంతులైన విద్యార్థులకు దేశవ్యాప్తంగా అందించే ప్రోత్సాహకాల్లో భాగంగా యానాం ప్రాంత విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్ తెలిపారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు మొదటి పది మందికి పుదుచ్చేరి ప్రభుత్వం రూ.10 వేలు, రూ. 5వేలు ప్రోత్సాహకాలు లభించనున్నాయి. ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసి అర్హత సాధించిన వారికి ప్రభుత్వం నుంచి నగదు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. దరఖాస్తులను విద్యా శాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

• సినిమా గైడ్

యానాం

శ్రీపద్మ	గౌతమ్‌నంద
శ్రీవీరేశ్వర	నక్షత్రం
సత్య (నీలపల్లి)	దర్శకుడు
దేవీమహల్(తాళ్లరేవు)	నక్షత్రం

విజిలెన్స్ అధికారుల దాడి : మూడు రేషన్ షాపుల సీజ్

కరప: మండలంలోని కరప, వేళంగి గ్రామాల్లో పలు రేషన్ షాపులపై మంగళవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి మూడింటిని సీజ్ చేశారు. కరపలో 12వ నెంబర్ రేషన్ షాపుతో పాటు వేళంగిలోని 43, 44 షాపులపై దాడులు నిర్వహించి రికార్డులను పరిశీలించగా ఉండాల్సిన స్టాక్ కంటే ఎక్కువ, తక్కువ వున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో వారిపై నిత్యావసర వస్తువుల చట్టం, 1955 సెక్షన్ 6(ఎ) కింద కేసులు నమోదు చేశారు. ఈ మూడు షాపుల్లో ఉన్న 7,186 కిలోల పీడీఎస్ బియ్యం, 39.440 కిలోల పంచదారను సీజ్ చేశారు. దాడుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రామమోహన్‌రెడ్డి, సాయిరమేష్, జి.గోపాలరావు, ఏఎస్‌వో పి.సురేష్, ఎంఎస్‌వో వైహెచ్ఎస్ సతీష్, ఆర్ఐ కె.అనిల్‌కుమార్, వీఆర్వోలు చాగంటి వాసు, పి.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



కరపలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

యానాం సమాచారం



యోగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎస్‌జీఎఫ్ఐ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

యానాం: పుదుచ్చేరిలో జరిగే స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) పోటీల్లో పాల్గొనేందుకు యానాంలో ఎంపికలు నిర్వహించినట్టు కార్యదర్శి ఐవీకే మోహన్ తెలిపారు. జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మంగళవారం యోగా, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, స్విమ్మింగ్ అంశాల్లో అండర్-14, 17, 19 బాలుర, బాలికల విభాగాల్లో ఎంపికలు జరిగాయి. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో 45 మంది క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. వీరిని ఈ నెల 24వ తేదీన పుదుచ్చేరి తీసుకువెళ్తారు. అక్కడ 26న జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొంటారు. పోటీలను విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామోపాధ్యాయులు పర్యవేక్షించారు.



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న శాయ్ విద్యార్థులు

శాయ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పకడ్వా ఉత్సవాలు

యానాం: యానాంలోని శాయ్ శిక్షణా కేంద్రంలో స్వచ్ఛతా పక్వాడ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి రాయుడు తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు పక్వాడ ఉత్సవాల్లో భాగంగా పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం సాయంత్రం మెట్టకూరు రమాబాయినగర్ పార్కులో విద్యార్థులంతా స్వచ్ఛభారత్ నిర్వహించారన్నారు. మొక్కలు సేకరించి ఒక్కో విద్యార్థికి రెండు మొక్కలు ఇస్తామని, స్టేడియం ఆవరణలోని వాటి నిర్వహణను విద్యార్థులే చూసుకోవాలన్నారు. ఈ నెల 14న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) విద్యార్థులు, అసోసియేషన్ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పలు పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులతో స్వచ్ఛతా రన్, స్వచ్ఛ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

రేపటి నుంచి నవోదయలో టేబుల్ టెన్నిస్ రీజనల్ మీట్

యానాం: మెట్టకూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 10, 11 తేదీల్లో హైదరాబాద్ రీజియన్ టేబుల్ టెన్నిస్ (టీటీ) మీట్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, వ్యాయామోపాధ్యాయుడు కె.కృష్ణ తెలిపారు. ఎనిమిది క్లస్టర్లకు సంబంధించి నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం నుంచి 240 మంది విద్యార్థులు, 30 మంది అఫీషియల్స్ పాల్గొననున్నారు. వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేస్తారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐటీఐలో ఖాళీల భర్తీకి రేపు కౌన్సెలింగ్

యానాం: స్థానిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్, మోటార్ మెకానిక్ ట్రేడ్లలో మిగిలిన సీట్ల భర్తీకి గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ప్రభాకరన్ తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు

ఆలమూరు: రాహుకేతు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు అభిషేకాలు నిర్వహించారు. శ్రావణమాస మంగళవారం కావడంతో భక్తులు ఆలయానికి అధికసంఖ్యలో విచ్చేశారు. ఆలయ ప్రధానార్చకులు వెలవలపల్లి చైతన్య ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



• మినీ ఇంటర్వ్యూ



12 నుంచి పవిత్రోత్సవాలు

వై.వెంకటేశ్వరరావు, ఈవో జగన్మోహినీ కేశవస్వామి ఆలయం

●స్వామివారి పవిత్రోత్సవాలు ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు?
ఈ నెల 12నుంచి 14వరకు సకలదోష పరిహారార్థం పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నాం.

●మూడు రోజులు ఆలయంలో ఏవిధమైన పూజలు నిర్వహిస్తారు?
శాంతి కల్యాణం, హోమం, పండిత సత్కారం, పవిత్రోత్సవ పూజలునిర్వహిస్తాం.

●ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారా?
ఆలయంలోని కార్యాలయంలో కంప్యూటరీకరణ చేపడుతున్నాం. ఆన్‌లైన్ ద్వారానే టిక్కెట్లు, అభిషేకాలకు సంబంధించి కంప్యూటర్ ద్వారా అందిస్తాం.

●అన్నదాన భవన నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయి?
దాతల సహకారంతో అన్నదాన భవన నిర్మాణ పనులు 90 శాతం పూర్తిచేశాం. కార్తీక మాసంలో భవన నిర్మాణం పూర్తిచేసి ప్రారంభిస్తాం.

●కల్యాణ మండపం నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నారా?
ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి గదులు, కల్యాణ మండపం నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించాం.

రైతులకు ఎలుకల బెడద

ఖరీఫ్ ప్రారంభ దశలోనే నష్టం

రావులపాలెం రూరల్: ఖరీఫ్ నాట్లువేసి నెల కూడా గడవకముందే ఎలుకలు వీరవిహారం చేస్తూ వరిమొక్కలను పాడుచేస్తున్నాయి. రావులపాలెం మండలంలోని వరిపంటపొలాలు నాట్లు పూర్తయి నెలగడవకముందే రైతులను ఎలుకల బెడద వేధిస్తోంది. విత్తనాల దశ నుంచే అధిక వ్యయ ప్రయాసలకోర్చి రైతులు స్వర్ణ తదితర వంగడాల రకాలను నాట్లు వేశారు. నాట్లు వేసిన నాటినుంచి ఎలుకల తీవ్రత పెరగడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం పంట పొలంలో సుమారు 20సెంట్లకు పైబడి ఎలుకలు పాడుచేస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రైతుకు ఎకరాకు మూడునుంచి ఐదు బస్తాల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు సామూహిక ఎలుకల నివారణా కార్యక్రమాన్ని చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



పంటపొలాల చెంతనే ఉన్న బొరియల్లో ఉన్న ఎలుకలు

ముద్రగడకు మద్దతుగా పూజలు



వాడపాలెంలో కంచాలు వాయిస్తూ నిరసన తెలుపుతున్న కాపు నాయకులు



గోపాలపురంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కాపుజేఏసీ నాయకులు

రావులపాలెం రూరల్: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కు సంఘీభావంగా గోపాలపురంలోని కాపు జేఏసీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాల్వగట్టు చెంతన ఆంజనేయస్వామి ఆలయంలో కాపు జేఏసీ నాయకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాపులకు రిజర్వేషన్ కల్పించాలంటూ శాంతియుతంగా పాదయాత్రను చేపట్టిన ముద్రగడ పద్మనాభంను ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి సద్బుద్ధి కలిగి ఎన్నికల సమయంలో బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. రిజర్వేషన్ సాధించేందుకు ముద్రగడ పద్మనాభం వెంట ఉంటామని తెలిపారు.

వాడపాలెంలో నిరసన

కొత్తపేట: ముద్రగడ పద్మనాభం పాదయాత్రకు ప్రభుత్వం నిరంకుశంగా అడ్డుతగులుతుందని ఆరోపిస్తూ మంగళవారం మండలపరిధి వాడపాలెంలో కాపు జేఏసీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దేవీ సెంటర్‌లో కంచాలను వాయిస్తూ కాపుల ఆకలికేకలు విని ప్రభుత్వం కళ్లు తెరవాలని నినాదాలు చేశారు. కమిషన్లతో కాలయాపన చేస్తూ మభ్యపెడితే కాపు సామాజికవర్గం ఆగ్రహానికి టీడీపీ గురవక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు పెదపూడి బాపిరాజు, నెంబరవన్ శ్రీను, సలాది బ్రహ్మాజీరావు, పాయసం సతీష్, పేపకాయల బ్రహ్మానందం, పెదపూడి శ్రీనివాస్, మట్టా బాబీ తదితరులున్నారు.



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

రావులపాలెం రూరల్: రావులపాలెం మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణ మంగళవారం పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సింధూర అభిషేకం, అర్చనలు, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయాల్లో పూజలు

ఆత్రేయపురం: ఆత్రేయపురం, లొల్ల, ర్యాలి, బొబ్బర్లంక ఆలయాల్లో మంగళవారం హనుమాన్‌కు గంధసిందూరం, తమలపాకులతో అభిషేకాలు నిర్వహించారు. వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయాల్లో చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 8గంటలకు ఆలయాల తలుపులు తెరిచి సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఉపాధి కూలీలకు నగదు పంపిణీ

రావులపాలెం రూరల్: మండల పరిధిలోని దేవరపల్లి, వెదిరేశ్వరం గ్రామాల్లో 2012-13 సంవత్సరంలో నిలిచిపోయిన ఉపాధి వేతనాలు మంగళవారం పంపిణీ చేశారు. రెండు గ్రామాలకు కలిపి సుమారు రూ.47036లు విడుదలైంది. ఆయా గ్రామాల్లో ఎంపీపీ కోట చెల్లయ్య, జడ్పీ ప్రతిపక్ష నేత సాకా ప్రసన్నకుమార్, ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు ఉపాధి కూలీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గన్నవరపు వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యులు నామాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



దేవరపల్లిలో నగదును అందిస్తున్న ఎంపీపీ

సంహిత విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం రూరల్: రావులపాలెం సంహిత డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ సెమిష్టర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ కె.వెంకటేష్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నన్నయ యూనివర్సిటీ నిర్వహించిన డిగ్రీ ద్వితీయ సెమిస్టర్‌లో బీఎస్సీ విభాగంలో మల్లిడి మణిదీపిక 9.44జీపీఏ, మేడపాటి దుర్గాశ్రీవేణి 9.44, రాధారాణి 9.28, ఇందుకూరి నాగవెంకట లలితశ్రీ 9.1 గ్రేడు పాయింట్లు సాధించారు. కళాశాల చైర్మన్ ఎ.దినేష్ బాబు, ఏవో డి.రాజ్‌కుమార్‌రాజా, ప్రిన్సిపాల్ కె.వెంకటేష్, జీడీ శ్రీనివాసరెడ్డి విద్యార్థులను అభినందించారు.



సెమిష్టర్‌లో ప్రతిభ కనబరిచిన సంహిత విద్యార్థులు

బీసీ విద్యార్థి అధ్యక్షుడికి పలువురి అభినందన

ఆలమూరు: కొత్తపేట నియోజకవర్గ బీసీ విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా నియమితులైన ఆలమూరుకు చెందిన గంగుల ఫణీంద్రను నియోజకవర్గ టీడీపీ యువనేత బండారు సంజీవ్ అభినందించారు. ఫణీంద్రను ఆల మూరులో కలిసి ఆయన అభినందనలు తెలిపి టీడీపీ పరంగా పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఈదల నల్లబాబు, కడియాల శ్రీను, వంటిపల్లి సతీష్, కేతా రాంబాబు, సలాది నాగేశ్వరరావు, గంగుల నల్లబాబు, ఎలుగుబండి సాయిబాబు పాల్గొన్నారు.



బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిని అభినందిస్తున్న నాయకులు

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి: బండారు

కొత్తపేట: టీడీపీ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు కోరారు. మంగళవారం వాడపాలెంలో జరిగిన బూత్ కమిటీ సమావేశాల్లో సత్యానందరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు బండారు సంజీవ్, ముత్యాల బాబ్జీ, పల్లికొండ సుధీర్‌కుమార్, బూశి భాస్కరరావు, బండారు వీరబాబు, బూత్‌కమిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండారు

ప్రతి చిన్నారికి వ్యాక్సిన్ అందించాలి

రావులపాలెం రూరల్: ప్రతి చిన్నారికి అంటు వ్యాధులు ప్రబలకుండా ఎమ్మార్ వ్యాక్సిన్ వేయించాలని సర్పంచ్ ఆణె లక్ష్మి అన్నారు. గోపాలపురం జడ్పీ పాఠశాలలో మంగళవారం వ్యాక్సినేషన్ నిర్వహించారు. పాఠశాలలో ప్రతి విద్యార్థికి గోపాలపురం పీహెచ్‌సీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో మైగాపుల గురవయ్యనాయుడు, ఆణె మునసలయ్య, వానపల్లి త్రిమూర్తులు, కొవ్వూరి ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ఆత్రేయపురం

గృహ నిర్మాణ గ్రామసభలు

ఆత్రేయపురం: అర్హులైన నిరుపేదలకు ఇళ్లు నిర్మించేదే ప్రభుత్వ లక్ష్యమని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ముద్దూరి సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం ర్యాలి పంచాయతీ కార్యాలయం వద్ద గృహనిర్మాణ గ్రామసభలు నిర్వహించారు. అలాగే వద్దిపర్రులో తహసీల్దార్ వరదా సుబ్బారావు గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పల్లేటి ధనలక్ష్మి, ఉప్పే కొండయ్య, హౌసింగ్ ఏఈ పరబ్రహ్మం పాల్గొన్నారు.



పథకాలపై సమీక్షిస్తున్న అధికారులు

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆత్రేయపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అంకంపాలెం సర్పంచ్ కరుటూరి నరసింహారావు పేర్కొన్నారు. మంగళవారం ఆత్రేయపురం పంచాయతీ వద్ద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు ఆటోలను అందజేశారు. పేద ప్రజల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న యూనిట్లు సద్వినియోగం చేసుకుని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ఆటోలను అందజేశారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ కుదప కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ కరుటూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అంకంపాలెంలో ఆటోలను అందజేస్తున్న సర్పంచి

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

ఆత్రేయపురం: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ప్రత్యేకాధికారి ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో అపారిశుధ్య నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు. మండలస్థాయి అధికారులను గ్రామాల్లో ఇన్‌చార్జీలుగా నియమిస్తున్నామని తెలిపారు. రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఏ రూఫస్, ఇన్‌చార్జి డీఎల్‌పీవో డివై నారాయణ తదితరులు పాల్గొన్నారు.

• సినిమా గైడ్

రావులపాలెం:

అక్షర-1	గౌతమ్‌నందా
అక్షర-2	నక్షత్రం
పద్మశ్రీ	దర్శకుడు
వెంకటేశ్వర	ఫిదా

నేడు అదనపు తరగతి గదుల ప్రారంభం

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం మండలంలోని టేకి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభిస్తారని ఆ పాఠశాల హెచ్ఎం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం పది గంటలకు అదనపు తరగతి గదులతోపాటు ఓ ఎన్ఆర్ఐ బహూకరించిన డిజిటల్ తరగతులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటారని ఆయన తెలిపారు.

కొనసాగుతున్న ప్రతిష్టంభన

కొలిక్కిరాని లారీ యూనియన్ చర్చలు

మండపేట: మండపేట పట్టణంలోని లారీ యూనియన్‌కు రైస్‌మిల్లర్లు పనికల్పించాలంటూ ఆ యూనియన్ తరపున జరిగే చర్చలలో ప్రతిష్టంబన కొనసాగుతోంది. మండపేట లారీయూనియన్‌కు స్థానిక రైస్ మిల్లర్లు పనికల్పించ కుండా స్థానికేతర లారీలకు పనికల్పిస్తున్నారని యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం తమకు లారీలు 110 ఉండగా వాటిపై సుమారు 600 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని యూనియన్ నాయకులు చెబుతున్నారు. తమకు లారీలకు కిరాయి లేక కుటుంబాలు వీధిన పడిపోతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైస్‌మిల్లర్లు తమకు పనికల్పించాలని లేకుంటే తమ యూనియన్‌ను వారి యూనియన్‌లో కలిపేసినా తమకు అభ్యంతరం లేదంటూ నాయకులు అంటున్నారు. రైస్‌మిల్లర్ల లారీ యూనియన్‌ను నిర్వహిస్తున్నారు. వారి మిల్లులో పని చేయించుకుంటూ బయట కిరాయిలను ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన వాటికి కిరాయి చెబుతున్నారు. దానిని స్థానిక లారీయూనియన్లు వ్యతిరేకిస్తున్నాయి. అయితే రైస్‌మిల్లర్లు మాత్రం ఇక్కడ లారీయూనియన్ కిరాయిధరలకు బయట ధరల మధ్య వ్యత్యాసం ఉండడంతో బయటి లారీలకు కిరాయిని మిల్లర్లు అప్పగిస్తున్నారు. ఇక్కడ లారీలకు పనిలేకుండా పోయిందని యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక స్థానిక లారీ యూనియన్ తరపున జిల్లా లారీయూనియన్ అధ్యక్షుడు అమ్మిరెడ్డి, అమలాపురం, రావులపాలెం, రాజోలుకు చెందిన లారి యూనియన్ నాయకులు కూడా మండపేటకు వచ్చారు. స్థానిక లారీ యూనియన్‌తో చర్చలకు రైస్‌మిల్లర్లు ససేమిరా అనడంతో చర్చలు జరగలేదు. మంగళవారం మండపేట పట్టణ సీఐ గీతారామకృష్ణ లారీ యూనియన్ వద్దకు చేరుకుని సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఇరు పక్షాలు మధ్య చర్చలు జరగకపోవడంతో ప్రతిష్టంబన కొనసాగుతోంది. తమ సమస్యను సత్వరమే పరిష్కరించి తమ కుటుంబాలకు బతుకు దెరువు కల్పించి లారీలకు కిరాయి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని 30 యూనియన్ల నుంచి మండపేటకు కిరాయికు పంపించకూడదని నిర్ణయించారు. లారీయూనియన్ వ్యవహారం మధ్య కార్మికులు వీధిన పడకుండా చర్యలు తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని లారీ యూనియన్ నాయకులు కోరుతున్నారు. మూడేళ్లనుంచి కొనసాగుతున్న ప్రతిష్టంభన ఎప్పటికి తొలుగుతుందోనని పలువురు వేచిచూస్తున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వేగుళ్ల జన్మదిన వేడుకలు





మండపేటలో వేగుళ్ల పుట్టినరోజును నిర్వహిస్తున్న అభిమానులు, ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం

మండపేట: మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు 64వ జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల అమరావతిలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడిని కలిసినపుడు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేగుళ్ల నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ఎమ్మెల్యేవేగుళ్ల అభిమానులు పట్టణంలోని వృద్ధాశ్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడి సత్యవతి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగ రాల రాంబాబు, వాణిజ్య విభాగపు అధ్యక్షుడు సంకా బాబ్జిల నేతృత్వంలో కేక్ కట్ చేసి వృద్ధులకు వేగుళ్ల జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల భవిష్యత్‌లో ఉన్నత స్థితికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలతో పాటు భోజనాలు పెట్టారు. కార్యక్రమంలో పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు గొడవర్తి సురేంద్ర, కంచర్ల మాణిక్యాలరావు(జిల్లా) మేకాశ్రీను, పాలచర్ల లక్ష్మణరావు, కాళ్లకూరి స్వరాజ్యలక్ష్మి, కోనే ఉమామహేశ్వరి, చావల వీరబాబు, ఎం.సుబ్రహ్మణ్యం, కోళ్ల శ్రీను, గనిశెట్టి వీర్రాజు, మచ్చా నాగబాబు, ఎంపీటీసీ యారమాటి గంగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగర గాంధీ సెంటర్‌లో..

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో నియోజకవర్గ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జన్మదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగర గాంధీసెంటర్‌లో వేగుళ్ల మిత్రమండలి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం అంగర పీహెచ్‌సీలో రోగులకు రొట్టె, పండ్లు అందజేశారు. గ్రామంలోని పలు ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేకపూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సొసైటీ ఉపాధ్యక్షుడు శనివారపు అచ్చన్న, వేగుళ్ల మిత్రమండలి అధ్యక్ష కార్యదర్శులు ఉండమట్ల వెంకటేశ్వరావు, వాసా కోటేశ్వరావు తదితరులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా వేగుళ్ల నియోజకవర్గ అభివృద్ధిలో జిల్లాలో ప్రథమస్థానం, రాష్ట్రంలో 5వ స్థానం, కైవసం చేసుకుని ప్రజాసంక్షేమంలో ముందుకు సాగుతూ అన్ని వర్గాల ప్రజల్లో మంచి గుర్తింపు సాధించారన్నారు. నవ్యాంధ్ర ప్రజానాయకుడిగా సంపూర్ణ ఆరోగ్యంతో వర్ధిల్లాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మిత్రమండలి నాయకులు ఉండమట్ల తాతాజీ, చిలుకూరి సత్తిబాబు, కొమ్మిశెట్టి నాగబుజ్జి, సంకాబత్తుల గాంధీ, తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం మండలం అంగరలో..



ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేస్తున్న చిత్రం

చిన్నారులందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

కపిలేశ్వరపురం: చిన్నారులందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ అందేలా చూడాలని ఎంపీపీ కాద వెంకటరాంబాబు అన్నారు. మంగళవారం కపిలేశ్వరపురం కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండు రకాల వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఈ వ్యాక్సిన్ అందజేస్తుందన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలలు, రామానుజన్ యూపీ స్కూల్ విద్యార్థులకు వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎంఆర్ వ్యాక్సిన్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వుల చిట్టిబాబు, సర్పంచ్ ఎంఎస్‌వీ మునిప్రసాద్, హెచ్ఎం శ్రీకృష్ణ, కరస్పాండెంట్ వి. వెంకట్‌కుమార్, ఉపాధ్యాయ, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా సొసైటీ భవన నిర్మాణ పనులు

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం పీఏసీఎస్‌లో భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సెంట్రల్ బ్యాంకు నిధులు రూ.10 లక్షలతో కింది భాగంలో గొడౌన్, పైభాగంలో ఆఫీస్ నిర్మిస్తున్నారు. గతనెల సొసైటీ అధ్యక్షుడు నెక్కంటి శ్రీరంజీ శంకుస్థాపన చేశారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికల్లా పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టినట్టు కార్యదర్శి కె.సత్యనారాయణ తెలిపారు.



చురుగ్గాసాగుతున్న సొసైటీ భవన నిర్మాణ పనులు

టీడీపీలో గుబులు మొదలైంది: వైసీపీ

మండపేట: రాష్ట్రంలో వైసీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అధికార టీడీపీలో గుబులు పుడుతోందని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వేగుళ్ల పట్టాభిరామయ్య ఆరోపించారు. మండపేట పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టాభిరామయ్య, వైసీపీ రాష్ట్ర రైతు విభాగపు కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ మాట్లాడారు. ఎమ్మెల్సీ శిల్పా చక్రవర్తి తన పదవికి రాజీనామా చేసి నైతికవిలువలకు కట్టుబడి టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారన్నారు. తమ పార్టీకి చెందిన 21 మంది ఎమ్మెల్యేలను అడ్డగోలుగా టీడీపీలో చేర్చుకున్న ఆ పార్టీకి నైతికత గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో టీడీపీ ఆల్ ఫర్ హౌసింగ్ పథకం లో పేదలకు నిర్మించే ఇళ్లలో అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ఇక్కడ వాతవరణానికి సంబంధించి ప్రజల అభీష్టం మేరకు నిర్మించే ఇళ్లను ఇవ్వాలితప్ప బలవంతంగా షీర్ వాల్ టెక్నాలజీతో నిర్మించి అదనపు వడ్డన ద్వారా డబ్బులు వసూలు చేయడం దారుణమన్నారు. కొత్తగా నిర్మించే ఇళ్లలో పేదలు ఉండడం వల్ల రోగాలబారినపడే ప్రమాదం ఉందని వారన్నారు. ఇప్పటికైనా టీడీపీ అసత్య ఆరోపణలు తమ పార్టీపై మానుకోవాలని వారు సలహానిచ్చారు. తమ పార్టీ ఎపుడు ప్రజ పక్షాన పోరాడుతుందని వారన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పెంకే వెంకట్రావు, పుట్టా ప్రసాద్, మహంతి అసిరినాయుడు, సాధనాల శివభగవాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

ఆంజనేయస్వామికి ఎల్ఈడీ లైట్ల వితరణ

పి.గన్నవరం రూరల్: పి.గన్నవరంలోని నూతన అక్విడెక్టు వద్ద ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి లైట్ల నిమిత్తం రూ.12వేలు విలువైన ఎల్ఈ డీ లైట్లను కొత్తపేట మండలం వాడపాలెం వాస్తవ్యులు అడ్డగళ్ల రాంబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ పడాల సూపర్ రాంబాబును అభినందించారు.

పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠం

ఏసీడీపీవో శారద

ముమ్మిడివరం: పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమని ఏసీడీపీవో పి.శారద పేర్కొన్నారు. అయినాపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తల్లిపాల ప్రాధాన్యం, విశిష్టతను ఏసీడీపీవో శారద వివరించారు. గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్యసూత్రాలు పాటించాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి రమణ, గర్భిణులు, బాలింతలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

19వ వార్డు గ్రామకమిటీ సమావేశం

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలోని 19వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని ఆ వార్డు టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. కడలి నాగు అధ్యక్షతన 19వ వార్డుగ్రామకమిటీ సమావేశం మంగళవారం జరిగింది. దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి సీసీ రోడ్డు నిర్మించాలని, వీధి లైట్లు ఏర్పాటుచేయాలని సమావేశం తీర్మానించింది. ఆయా సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సమావేశంలో జాగు రాంబాబు, విప్పర్తి కిశోర్, జి.వెంకటేశ్వరరావు, నడింపల్లి శ్రీనివాసరాజు, దాట్ల బాబు, దొమ్మేటి రమణకుమార్, సీహెచ్ నాగవేణి, డి.సతీష్, డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి ఎమ్మార్ వ్యాక్సిన్

- నియోజకవర్గంలోని పలు మండలాల్లో వ్యాక్సినేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే దాట్ల
- జిల్లాలో 12లక్షల మంది పిల్లలు
- జిల్లా కోఆర్డినేటర్



ఐ.పోలవరంలో వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ముమ్మిడివరంలో వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది



తాళ్లరేవులో వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఐ.పోలవరం: ప్రాణాంతక వ్యాధులను నిర్మూలించి పిల్లలను కాపాడేందుకు వేస్తున్న మీజిల్స్-రూబెల్లా టీకా తప్పక వినియోగించుకోవాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. మురమళ్ల జడ్పీ పాఠశాల వద్ద మంగళవారం ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైద్యఆరోగ్య సిబ్బందితో తల్లిదండ్రులు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎమ్మార్ వ్యాక్సినేషన్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పి.సుబ్బరాజు, సభ్యులు సాగిరాజు సూరిబాబు, కాకర్లపూడి రాజేష్‌వర్మ, ఏలూరి సూర్యనారాయణమూర్తి, గ్రామసర్పంచ్ చెయ్యేటి శ్రీనుబాబు, ఎంపీటీసీ ఉందుర్తి సుభద్ర, కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వాతి, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ప్రాణాంతకరమైన వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు 15 ఏళ్లలోపు పిల్లలకు మీజిల్స్-రూబెల్లా వ్యాక్సిన్ వేయించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ చెల్లి శాంతకుమారి సూచించారు. ముమ్మిడివరంలోని మాంటిస్సోరి పాఠశాలలో ఎమ్మార్ వ్యాక్సినేషన్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. మీజిల్స్-రూబెల్లా వైరస్ శాశ్వత నిర్మూలనకు ఎమ్మార్ వ్యాక్సిన్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బొజ్జా రమణశ్రీ, పాఠశాల కరస్పాండెంట్ పి.రవి, హెచ్ఎం అర్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే 12వ వార్డులోని కౌన్సిలర్ భీమవరపు విజయ్ ఆధ్వర్యంలో మల్లయ్యపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మీజిల్స్-రూబెల్లా వ్యాక్సిన్ వేయించారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లరేవు: చిన్నారులంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాలయలను వెచ్చించి ఎమ్మార్ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యేదాట్ల సుబ్బరాజు అన్నారు. మంగళవారం తాళ్లరేవు ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ 9నెలల నుంచి 15ఏళ్ల లోపు వారందరికీ ఎమ్మార్ వ్యాక్సిన్‌ను వేయిస్తే తట్టు, రుబెల్లా వ్యాధులు దూరమై పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి, జడ్పీటీసీ పొన్నమండ రామలక్ష్మి, ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ పెన్మెత్స లక్ష్మీనారాయణరాజు, సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, డాక్టర్లు గోపాలరావు, శ్రీనివాస, జిల్లామోనటరింగ్/విజిలెన్స్ కమిటీ సభ్యుడు ధూళిపూడి వెంకటరమణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు, కార్యదర్శి గాదిరాజు సతీష్, నున్న దత్తు, చోడే శ్రీనివాస్, రామచంద్రరావు, రాయపరాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సిన్ పంపిణీపై తనిఖీ

మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు వేస్తున్న మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్ పంపిణీపై రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ రాజేశ్వరి మంగళవారం తాళ్లరేవు ఆసుపత్రిలో పర్యవేక్షించారు. వ్యాక్సిన్ పంపిణీపై వైద్యాధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 9నెలలు నుంచి 15ఏళ్ల లోపు పిల్లలు 12లక్షల మందికి వేయాల్సిఉందని ఇందులో తాళ్లరేవు మండలంలో 25వేల మందికి వ్యాక్సిన్ వేయాల్సిఉందన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు, ఆసుపత్రి సిబ్బంది 30బృందాలుగా గ్రామాల్లో వ్యాక్సిన్ వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ చైర్మన్ పెన్మెత్స లక్ష్మీనారాయణరాజు, వైద్యాధికారులు, లయన్స్, వాసవిక్లబ్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో ఉపకులాలకు న్యాయం

ముమ్మిడివరం: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని ఎమ్మార్పీఎస్ ముమ్మిడివరం మండల నాయకులు డిమాండ్ చేశారు. ముమ్మిడివరంలో అయినవిల్లి రామారావు అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. లోక్‌సభ, రాజ్యసభలలో బీజేపీకి పూర్తి మెజార్టీ ఉన్నందున వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి రాజ్యాంగసవరణ ద్వారా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలన్నారు. ఎస్సీ వర్గీకరణతోనే 58 ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో ఉందుర్తి బాలకృష్ణ, సత్తాల సంపదరావు, నేదునూరి గోపి, మట్టా సత్యనారాయణ, వంగలపూడి నాగేశ్వరరావు, ఆకుమర్తి పండు, పెదపూడి రమణ పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు విజ్ఞప్తిచేశారు. ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ సవరపు భైరవమూర్తి ఆధ్వర్యంలో ఐ.పోలవరంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సీహెచ్ శివరామకృష్ణకు అందజేశారు. ఈ నెల 10న జరుపతలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి అధికసంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సవరపు భైరవమూర్తి, వీధి రవిబాబు, ఎస్.రమణ, యు.ప్రకాష్, ఏడుకొండలు, జొన్నాడ శ్రీను పాల్గొన్నారు.



ఐ.పోలవరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాపు మహిళల వినూత్న నిరసన

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించి కాపులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని లంకాఫ్ ఠాణేలంకలో మహిళలు మంగళవారం గోదావరి మాతకు పూజలు నిర్వహించారు. ముద్రగడ పద్మనాభం పాదయాత్రకు ప్రభుత్వం సహకరించి పోలీసు నిర్బంధాలు తొలగించాలని ప్రార్థించారు. గ్రామంలోని కాపు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే సీహెచ్ గున్నేపల్లిలో ముద్రగడ పద్మనాభానికి మద్దతుగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కాపులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో గోదశి నాగేశ్వరరావు, మందపల్లి లక్ష్మి, భూసారపు బాపిరాజు, కొప్పిశెట్టి రామలక్ష్మి, సౌదాల సత్యవతి, నల్లా తాతాజీ, రాయపురెడ్డి జానకిరామయ్య, గణేశుల బ్రహ్మానందం, యేడిద దొరబాబు, కొప్పిశెట్టి కృష్ణమూర్తి, గోదశి పుండరీష్, బొర్రా విష్ణు, గొలకోటి ఆంజనేయులు, మాదాల పరంకుశం పాల్గొనగా వీరికి దళిత నాయకుడు వడ్డి సత్యనారాయణ తదితరులు సంఘీభావం తెలిపారు.



కంచాలపై గరిటెలతో కొడుతున్న కాపు మహిళలు

కౌలురైతు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

తాళ్లరేవు: పి.మల్లవరం పరిధి పత్తిగొందిలో అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న పాటి ఏడుకొండలు కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన ఎక్స్‌గ్రేషియా రూ.3.50లక్షల చెక్‌ను ఏడుకొండలు భార్య సయేంద్రకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మంగళవారం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి, జడ్పీటీసీ పొన్నమండ రామలక్ష్మి, స్కూల్‌కమిటీ ఛైర్మన్ టేకుమూడి లక్ష్మణరావు, ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ పెన్మెత్స లక్ష్మీనారాయణరాజు, జిల్లామోనటిరింగ్/విజిలెన్స్ కమిటీ సభ్యుడు ధూళిపూడి వెంకటరమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పి.మల్లవరంలో ఎక్స్‌గ్రేషియాను అందిస్తున్న ఎమ్మెల్యే దాట్ల

• సినిమా గైడ్

ముమ్మిడివరం:

శ్రీవెంకటేశ్వర	ఫిదా
శ్రీకృష్ణ	దండుపాళ్యం-2

బాధితుల కుటుంబాలకు చంద్రన్నబీమా

తాళ్లరేవు: మండలంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాల నామినీలకు చంద్రబీమా ఇన్సూరెన్స్‌ను ఏఎంసీ డైరెక్టర్లు కుడిపూడి రామకృష్ణ, జక్కుల ప్రసాద్‌బాబు మంగళవారం అందజేశారు. తాళ్లరేవులో మట్టపర్తి హనుమంతు, గాడిమొగలో అంగాడి వీరవేణి, మల్లాడి సత్తియ్యమ్మ ప్రమాదాల్లో మరణించగా నామినీలకు రూ.5000చొప్పున నగదును బీమామిత్ర సీతారత్నం అందిచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గాడి వీరాస్వామి, మెంటర్ మందనక్క తనుకురాజు పాల్గొన్నారు.



చంద్రన్నబీమాను అందిస్తున్న నాయకులు

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరి అరెస్టు

పెద్దాపురం: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం గండేపల్లి మండలం నీలాద్రిరావు పేటకు చెందిన కాకి శ్రీను, యర్రంపాలెంకు చెందిన ఆండ్రు సువర్ణరాజులను మద్యం సీసాలు కలిగి ఉన్న అభియోగంపై అరెస్టు చేశారు. వీరి నుంచి 27మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారు. దాడులలో సీఐ పి.నాగభూషణం ఆధ్వర్యంలో ఎస్ఐలు ఎన్.కృష్ణప్రసాద్, పీఎస్.రాంబాబు, పి.నాగసుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ జాతర

పెద్దాపురం: స్థానిక పరదేశమ్మ అమ్మవారి 177వ జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి గరగ నృత్యాలు, పుల్ బ్యాండ్, కోయడాన్సులు, పులివేషాలు బుట్టబొమ్మల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నీలంసెట్టి శ్రీను, కిషోర్‌ల మ్యూజికల్ నైట్ విశేషంగా అలరించింది. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.


విజేతలకు బహుమతి ప్రదానం

'పిల్లలను క్రీడలలో ప్రోత్సహించాలి'

పెద్దాపురం: పిల్లలను క్రీడలలో ప్రోత్సహించాలని ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పోతాబత్తుల చినబాబు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక పరదేశమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. బాలుర విభాగం పోటీలలో విజేతలైన డి.సూర్యతేజ, పి.రవీంద్ర, బాలికల విభాగంలో విజేతలైన కె.దేవి, కె.కాత్యాయనీలకు, బీరక ఆది, కరణం ఉమ, సత్య, యశ్వంత్. తేజలకు బహుమతులు అందజేశారు. కౌన్సిలర్ కె.అరుణ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో మాల్లాడి ఏసుబాబు, పెనుపోతుల సత్తిబాబు, మల్లాడి వెంకట రమణ, బి.సాయికిరన్ త్రిపురార త్రినాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్ వ్యాక్సినేషన్

పెద్దాపురం రూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో మీజిల్స్ రూబెల్లా వాక్సినేషన్ కొనసాగుతున్నట్టు కాండ్రకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి పేర్కొన్నారు. కట్టమూరులో అమరావతీ స్కూల్ విద్యార్థులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు సుందరపల్లి శివనాగరాజు, జీవీవీ వీర్రాజు, అడపా గంగాధరం, గుత్తుల సూర్యావతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● సినిమా గైడ్

సామర్లకోట:

జయలక్ష్మి1	ఫిదా
జయలక్ష్మి 2	నక్షత్రం
సత్యకృష్ణ	గౌతమ్‌నంద
విఘ్నేశ్వర	---

పెద్దాపురం:

లలిత	నక్షత్రం
శ్రీలలిత	దర్శకుడు
అరుణ	రాధ
వీరభద్ర	నిన్ను కోరి
శోభ	ఫిదా

రూ.కోటి 10లక్షలతో

అంగన్‌వాడీ భవనాల నిర్మాణం: హోంమంత్రి

పెద్దాపురం: నియోజకవర్గ పరిధిలో కోటి, పది లక్షల రూపాయలతో అంగన్‌వాడీ భవనాలు నిర్మాస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. పెద్దాపురం పట్టణంలో వందేళ్ళ క్రితం నిర్మించిన ఆర్‌డీవో, తహసీల్దార్ కార్యాలయాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకారం తెలిపినట్టు రాజప్ప పేర్కొన్నారు. పాండవుల మెట్ట వద్ద క్రీడా స్టేడియం నిర్మాణానికి ఆరు ఎకరాల స్థలం తీసుకున్నామని, దీని నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. సామర్లకోట నుంచి పెద్దాపురం పాండవుల మెట్ట వద్ద బైపాస్‌రోడ్ వరకు రోడ్డు విస్తరణ వేగవంతం చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి విద్యుత్ స్థంభాల తొలగింపునకు అయ్యే 3 కోట్ల రూపాయలలో కోటి 50లక్షలు ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. మిగతా కోటి 50 లక్షల రూపాయలు రెండు మున్సిపాలిటీలు భరిస్తాయని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఏర్పాటు చేయడంలో భాగంగా పెద్దాపురం ఎంఆర్ కళాశాల ఎదురుగా తీసుకున్న స్థలంలో పక్కా భవనాల నిర్మాణానికి ఇంత వరకు డీఎస్పీ, ఎంపీడీవో, కమర్షియల్ టాక్స్, వ్యవసాయ శాఖ కార్యాలయాలకు అను మతి వచ్చినట్టు తెలిపారు. అనం తరం చినరాజప్ప ఎన్ఆర్‌జీఎస్ కూలీగా పనిచేసి ప్రమాదవశాత్తు మరణించిన పెద్దాపురం మండలం సిరివాడ గ్రామానికి చెందిన మధుర మంగరాజు భార్య సూర్యకళకు ఎన్‌జీఎస్ తరుపున రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సూరిబాబురాజు, ఎంపీపీ గుడాల నాగరాజు, వైస్ చైర్మన్ కొరుపురి రాజు, పెద్దాపురం దేశం రంధి సత్యన్నారాయణ, సామర్లకోట టీడీపీ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, కొత్తెం కోటి, కందుల విశ్వేశ్వరరావు, బి.బంగారుబాబు, కమ్మిల సుబ్బారావు, సర్పంచులు, ఎం పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


బీమా చెక్కు అందిస్తున్న రాజప్ప

పంటల సాగులో మెళకువలు పాటించాలి

పెద్దాపురం రూరల్ : పంటల సాగులో రైతులు మెళకువలు పాటించాలని వ్యవసాయాధికారిణి కొల్లి ద్వారకాదేవి అన్నారు. మండలంలోని గోరింట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విధంగా పంటల సాగులో విత్తన ఎంపిక చేసుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. సస్యరక్షణ చర్యలు రైతులు పాటించాలని పేర్కొన్నారు. చంద్రన్న రైతు క్షేత్రాలను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. పంటల సాగులో విత్తన ఎంపికే కీలకమని పేర్కొన్నారు. నూరుశాతం రాయితీపై సూక్ష్మపోషకాలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎన్‌వీవీ ప్రసాద్, రైతులు పచ్చిపాల ప్రసాదరావు (గోరింట ప్రసాద్), పచ్చిపాల సత్తిబాబు, కర్రి చిన్నారావు, పచ్చిపాల మాణిక్యం, జువ్వల నారాయణరావు, పచ్చిపాల సూర్యమూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గోరింటలో పంటలను పరిశీలిస్తున్న ఏవో ద్వారకాదేవి

కొవ్వొత్తులతో కాపు నాయకుల ర్యాలీ

సామర్లకోట: కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం పాదయాత్రను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సామర్లకోట పట్టణంలో కాపు నాయకులు మంగళవారం రాత్రి కొవ్వొత్తులు, కాగడాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కాపు సంఘం నాయకులు దవులూరి సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో రెడ్డం దాం బాబు, ఆకుల పెదబాబు, పాగా సురేష్‌కుమార్, సంగినీడి భావన్నారాయణ పాల్గొన్నారు. రింగ్ సెంటర్ నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సత్వరం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దాల శ్రీనివాస్, తుమ్మల ప్రసాద్, శెట్టిబత్తుల దుర్గ, కర్నీడి జలందర్, అడబాల వీరభద్రరావు, పెదిరెడ్ల కనకదుర్గాప్రసాదరావు, అమలకంటి శ్రీనివాసరావు అత్తిలి రఘు, ఎలిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.


సామర్లకోటలో కొవ్వొత్తులతో ర్యాలీ

అథ్లెటిక్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సామర్లకోట:సామర్లకోట మండలం, ఉండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురజాపు దుర్గాప్రసాద్, బత్తిన రాం బాబు, పోలవరపు ప్రసాద్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకట రెడ్డి తెలిపారు. ఇటీవల రంగరాయ మెడికల్ కాలేజీ ఆవరణలో ఓపెన్ అథ్లెటిక్ పోటీలలో జరిగిన అండర్-18, అండర్-14 విభాగాలలో విద్యార్థులు ప్రతిభ చూపినట్టు తెలి పారు. వీరిలో గురజాపు దుర్గప్రసాద్ ఈ నెల 17న కడపలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో క్రీడాకారులను స్టాఫ్ సెక్రటరీ నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.వెంకట్రావు అభినందించారు.


గురజాపు దుర్గాప్రసాద్

9నుంచి చదరంగం పోటీలు

సామర్లకోట:సామర్లకోటమండలం, ఉండూరులో బ్రిలియంట్ పాఠశాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 9,10,11 తేదీలలో మండలస్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎంఈవో ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలలో అండర్-9, అండర్-13, అండర్-15 ఓపెన్ చాలెంజ్ కేటగిరీలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 818486 4834, 7893453922 నెంబర్‌కు సం ప్రదించాలని తెలిపారు.

ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం అందజేత

సామర్లకోట: ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఎస్.సీ.ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మందపల్లి వెంకన్న, కొల్లి చైతన్యకుమార్, ఎం.భద్రయ్య, ఎం.వీరేష్, వి.నానిలు డిప్యూటీ తహసీల్దార్ ఎన్‌జెఎన్ ప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అఖిలపక్ష సమావేశానికి హాజరుకావాల్నారు. చంద్రబాబు నాయుడు హామీలకు కట్టుబడి ఉండాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ ఎన్‌జెఎన్ ప్రసాద్‌కు అందించిన వినతి పత్రంలో పేర్కొన్నారు.



ముమ్మరంగా వ్యవసాయ పనులు

సామర్లకోట: ఖరీఫ్ సాగులో రైతులు నిమగ్నమయ్యారు. కాకినాడ వ్యవసాయ సబ్ డివిజన్ సామర్లకోట, పెదపూడి, కాకినాడ రూరల్ మండలాల్లో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. అడపా, తడపా కురుస్తున్న వర్షాలు, సకాలంలో గోదావరి కాలువ ద్వారా సాగు నీరు వదలడంతో రైతులు వ్యవసాయ పనులతో బిజీగా ఉన్నారు. ఇప్పటికే వెదజల్లు పద్ధతిన సాగు జరిగిన పొలాలు నెల రోజుల వయస్సుకు చేరుకోగా, నాట్లు నాటిన పొలాలలో సాగు సుమారు 20 రోజుల వయస్సుకు చేరుకున్నాయి. జూలై మొదటి వారంలో వర్షాలకు కొంచెం ఇబ్బందిగా మారినా, తరువాత కురిసిన వర్షాలకు నారుమల్లు పోసుకొన్నారు. 60 శాతం పైబడి వెదజల్లు పద్ధతిన రైతులు సాగు చేపట్టారు. కాకినాడ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో సామర్లకోట, పెదపూడి, కాకినాడ రూరల్ మండలాల్లో 12881 హెక్టార్లలో వెదసాగు చేపట్టారని వ్యవసాయ సహాయ సంచాలకురాలు భవాని చెప్పారు. మూడు మండలాల్లో సామర్లకోట, పెదపూడి మండలాల్లో అధిక శాతం సాగు పూర్తికాగా కాకినాడ రూరల్ పెదపూడి మండలంలోని కొన్ని గ్రామాలలో లేఅవుట్లు, చేపల చెరువులు వంటి స్థల మార్పిడి పనులతో అయిదు శాతం సాగు పూర్తి కాలేదని ఏడీ చెప్పారు. వెదపద్ధతిన ఒక ఎకరాకు 12 కిలోలు విత్తనాలు సరిపోతుండగా, నారుమళ్ళ పద్ధతిలో 30 కిలోలు విత్తనాల వరకు అవసరం ఉంది. నాట్లు పద్ధతిలో ఎకరాకు రూ.5వేలు వరకు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొన్నారు. పంటపై చీడ, పీడలు లేకపోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యాంత్రీకరణ సామగ్రికి రూ.కోటి 56 లక్షలు-ఏడీ

కాకినాడ వ్యవసాయ సబ్ డివిజన్‌లో వ్యవసాయ యాంత్రీకరణ సామగ్రి పంపిణీ చేసేందుకు ఇప్పటి వరకు రూ.1కోటి56 లక్షల మేర రుణాలు రైతులకు అందించినట్టు ఏడీ భవాని చెప్పారు. మినీ ట్రాక్టర్లు, పవర్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, రోటా వేటర్లు తదితర పరికరాలు రైతులకు అందించినట్టు తెలిపారు.



సిద్ధివినాయక ఆలయంలో అన్నదానానికి విరాళం

అయినవిల్లి: సిద్ధివినాయక ఆలయంలో అన్నదాన ట్రస్టుకు ఓ భక్తుడు రూ.18వేలు విరాళం అందజేశారు. మంగళవారం రాజమహేంద్రవరానికి చెందిన మానుగ్రగ మల్లిఖార్జునరావు స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన ట్రస్టుకు రూ.18వేలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ దాతను అభినందించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఎల్ఈడీ లైట్ల వితరణ

పి.గన్నవరం రూరల్: పి.గన్నవరంలోని నూతన అక్విడెక్టు వద్ద ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి లైట్ల నిమిత్తం రూ.12వేలు విలువైన ఎల్ఈడీ లైట్లను కొత్తపేట మండలం వాడపాలెం వాస్తవ్యులు అడ్డగళ్ల రాంబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పడాల సూపర్ రాంబాబును అభినందించారు.

మండల సర్వసభ్య సమావేశం

మామిడికుదురు: మామిడికుదురు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.రామశివాజీ తెలియజేశారు. 16వ తేదీ ఉదయం 10.30గంటలకు ఎంపీపీ మద్దాల సావిత్రి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని అన్నారు. అన్నిశాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

తల్లిపాలే శ్రేష్ఠం

ముమ్మిడివరం: పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమని ఏసీడీపీవో పి.శారద పేర్కొన్నారు. అయినాపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యం, విశిష్టతను ఏసీడీపీవో శారద వివరించారు. ఆరోగ్యసూత్రాలు పాటించాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.

అమరావతి పాదయాత్రకు అనుమతివ్వాలి

● గన్నవరం నియోజకవర్గంలో కొనసాగుతున్న కాపుల నిరసనలు ● అయినవిల్లిలో వంటా-వార్పు ● పి.గన్నవరంలో కొవ్వొత్తుల ర్యాలీ



పి.గన్నవరంలోని పోతవరంలో కొవ్వొత్తుల ర్యాలీ



అంబాజీపేటలో పాదయాత్ర చేస్తున్న కాపునేతలు



అయినవిల్లిలోని వీరవల్లిపాలెంలో వంటా-వార్పు

పి.గన్నవరం రూరల్: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభానికి మద్దతుగా పి.గన్నవరం కాపుజేఏసీ పిలుపుతో పోతవరం శ్రీరామా తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముద్రగడ పాదయాత్రకు అనుమతినివ్వాలని, ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని, ముద్రగడకు మద్దతుగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే పి.గన్నవరం కాపు పోరాటసమితి శివాలయం సర్కిల్ ఆధ్వర్యంలో కాపునాయకులు, యువత కంచాలు, గరిటెలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాపు జేఏసీ అధ్యక్షులు కొమ్మూరి మల్లిబాబు, అడ్డగళ్ల వెంకటసాయిరాం, అప్పన సురేష్‌నాయుడు, నందెపు సోమేశ్వరరావు, అడ్డగళ్ల శ్రీను, సుంకర నంద, కె.శ్రీనివాసరావు, నిమ్మగడ్డ ప్రసాద్, కె.సుబ్బారావు, టి.విజయకృష్ణ, అడ్డగళ్ల మణి, సలాది ఈశ్వరరావు, పిల్లా రాము, అడ్డగళ్ల అమరేశ్వరరావు పాల్గొన్నారు.

అంబాజీపేట: కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం చేపట్టే పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంబాజీపేటలో కాపు నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. మాచవరం ఐటికాలమ్మ గుడి దగ్గర నుంచి అంబాజీపేట సెంటర్ వరకూ కాపులు పాదయాత్ర నిర్వహించారు. కాపునేతలు మాట్లాడుతూ హామీల కోసం చేసే పాదయాత్రకు అనేక ఆంక్షలను పెట్టి ప్రభుత్వం, పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. పాదయాత్రకు వెళ్ళే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పత్తి దత్తుడు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, కొర్లపాటి కోటబాబు, అరిగెల సూరిబాబు, వంగా రామకృష్ణ, రవణం హరిబాబు, యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, బండారు శ్రీను, అప్పన శ్రీను, సుదాబత్తుల రాము, అరిగెల బుజ్జి, పేరాబత్తుల రాజు, గాది నెహ్రూ పాల్గొన్నారు.

అయినవిల్లి: కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభానికి మద్దతుగా వంటా-వార్పు నిర్వహించారు. మంగళవారం వీరవల్లిపాలెంలో వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ముద్రగడ పాదయాత్రకు పోలీసుల ఆంక్షలు తొలగించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మిండగుదిటి మోహన్, నల్లా విష్ణుమూర్తి, అడపా మోహనరావు, కల్వకొలను తాతాజీ, కామిశెట్టి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు వారికి ఎమ్మార్



పి.గన్నవరంలో వ్యాక్సిన్ ప్రారంభిస్తున్న అభివృద్ధి కమిటీ చైర్మన్



మామిడికుదురులో మగటపల్లిలో వ్యాక్సిన్ వేస్తున్న నితేష్‌కుమార్

పి.గన్నవరం రూరల్: మండలంలోని పలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎమ్మార్ వ్యాక్సిన్లు వేశారు. నరేంద్రపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గన్నవరంలో సాయితేజా పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలతోపాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. నాగుల్లంక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద 585మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసినట్లు సిబ్బంది తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ సికిలే డేవిడ్‌రాజు, ఎంపీటీసీలు గ్రంధి గంగయ్య, కుముజు లక్ష్మీతులసి, వైద్యులు కేజే ప్రశాంత్, సీహెచ్‌వో కె.జయంతరాజు, పీహెచ్‌ఎన్ కె.నరసాయమ్మ, ఏకే దుర్గాబాయి, సీహెచ్ లలిత, ఎం.కాంతమ్మ, ఎంఎస్‌రాజు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రమాదకర వ్యాధులైన తట్టు, రుబెల్లా వ్యాధులను తరిమికొట్టాలని మగటపల్లి సర్పంచ్ నామన నాగమణి పేర్కొన్నారు. ఎమ్మార్ వ్యాక్సినేషన్ మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం జరిగింది. మగటపల్లి, నగరం, మామిడికుదురులలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. 9నెలలనుంచి 15ఏళ్లలోపు పిల్లలందరికీ విధిగా ఈ వ్యాక్సిన్ వేసేలా అందరూ కృషిచేయాలని పలువురు కోరారు. మగటపల్లిలో లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి నల్లి నితేష్‌కుమార్, నామన నాగేశ్వరరావు, నామన నరసింహారావు, నగరంలో జాలెం సుబ్బారావు, కొల్లాబత్తుల వెంకటరమణ, మొల్లేటి పార్వతి, ముజావర్ కల్మీఅబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

నివేశన స్థలాల్లో సర్కారు జెండా



పంచాయతీ రోడ్డులో ఖాళీస్థలాల్లో పాతిన ఎర్రజెండాలు

పి.గన్నవరం రూరల్: పి.గన్నవరం పంచాయతీ రోడ్డు 110సర్వేనెంబర్‌లో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాలపై ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక రెవెన్యూ అధికారులు ఎర్రజెండాలను ఏర్పాటుచేశారు. దీంతో స్థానికంగా స్థలాలు ఆక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలైంది. పంచాయతీ రోడ్డులో పలు ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. మరికొన్ని ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు చేసేందుకు అందుబాటులో లేవు. ప్రధాన రోడ్డుచెంతనే ఉన్న స్థలాలన్నీ ఆక్రమణకు గురవడంతో కార్యాలయాల ఏర్పాటుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రెవెన్యూ అధికారులు ఖాళీ స్థలాల్లో జెండాలు ఏర్పాటుచేశారు. అయితే ఈ స్థలాలపై ఎవరికైనా హక్కు ఉంటే సంబంధిత పత్రాలను రెవెన్యూ కార్యాలయానికి తీసుకురావాలని అధికారులు సూచించారు. జెండాలు ఏర్పాటుచేసినవారిలో ఆర్ఐ జి.ఉమాశంకర్, వీఆర్వో నరసింహారావు ఉన్నారు.

అవగాహనతో చేస్తే అధిక దిగుబడులు



పుల్లేటికుర్రులో రైతు సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ

అంబాజీపేట: రైతులు వ్యవసాయంపై పూర్తి పరిజ్ఞానం పెంపొందించుకొని సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని పి.గన్నవరం వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.నాగకుమార్ తెలిపారు. పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద ఆత్మా సౌజన్యంతో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ జీవామృతంతో ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అందరూ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. రైతులు పంటపొలాలలో అవసరం మేరకే ఎరువులను వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి సత్యనారాయణ, ఏవో ఎం.విజయలక్ష్మి, ఉపసర్పంచ్ ముత్తాబత్తుల సోమశేఖర్ ఏఈవోలు డి.దుర్గారావు, డి.ఎస్.సుధాకర్, ఆత్మా బీటీఎం ఎన్.ప్రసాద్, రైతులు కొల్లి వెంకట్రావు, అయ్యగారి సుబ్రహ్మణ్యం, కోట సత్యనారాయణ, ఆకెళ్ళ సూరిబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ

అయినవిల్లి: గ్రామాల్లో పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాలతో పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. మంగళవారం శానపల్లిలంకలో బ్లీచింగ్, క్లోరినేషన్ నిర్వహించారు. మురుగుగుంటల్లో దోమల నివారణకు ఎబెట్ మందు పిచికారీ చేశారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వైఎల్ కృష్ణబాబు, పంచాయతీ విస్తరణాధికారి బండారు సూరన్న, కార్యదర్శి కె.రామచంద్రరావు, సర్పంచ్ కొరిపల్లి రమదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.



శానపల్లిలంకలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

● సినిమా గైడ్

తాటిపాక:	
శ్రీలక్ష్మి	ఫిదా
పద్మప్రియ	ఏజెంట్ భైరవ
వెంకటేశ్వర	వాసుకి
శ్రీనివాస	గౌతమ్‌నంద
అంబాజీపేట:	
వీరభద్ర	దువ్వాడ జగన్నాథం

ఆంధ్రజ్యోతి
6
పోర్టు సిటీ
బుధవారం
9/8/2017
ఆంధ్రజ్యోతి సిటీ ప్లస్

పునాదులకే పరిమితం!

- 2013-14లో సర్వశిక్షా అభియాన్ నిధులు రూ.35 లక్షలు మంజూరు
- కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో ముందుకు సాగని అదనపు తరగతి గదుల నిర్మాణం
- ఉన్నవి చాలక రాజీవ్‌గాంధీ హైస్కూలు విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



పునాదుల దశలోనే నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

పోర్టు సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తున్నా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి నిర్మాణాలు పూర్తి కాక పునాదులకే పరిమితం అవుతున్నాయి. దీంతో చాలీచాలనీ గదుల్లో వందల మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు ఏళ్ల తరబడి పనులు చేపట్టకపోయినా అధికారులు మిన్నకుండిపోవడం వెనక ఆంతర్యం అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. పోనీ ఇదేదో నగరానికి



కంకరను గుట్టగా పోసి వదిలేసిన దృశ్యం

మారుమూల ప్రాంతమనకుంటే పొరపాటే. కాకినాడ నగర పాలక సంస్థ కార్యాలయానికి సరిహద్దుగా గల రాజీవ్ గాంధీ హైస్కూలు దుస్థితి ఇది... అసంపూర్తి నిర్మాణాల అసలు కథలోకి వెళితే...

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో గల రాజీవ్ గాంధీ హైస్కూలు ఏటా 750 మందికి పైగా విద్యార్థులతో నడుస్తున్నది. ఈ పాఠశాలలో ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణానికి సర్వశిక్షా అభియాన్ నిధులు రూ.35 లక్షలను 2013-14 సంవత్సరంలో అప్పటి కేంద్ర మంత్రి పళ్లంరాజు మంజూరు చేశారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు హడావుడిగా పనులు మొదలెట్టాడు. ఐరన్‌తో స్తంభాలుగా పోసి సగం వరకు పునాది వేసి వదిలేశాడు. దీనికి సంభందించి 2014 డిసెంబరు 26న రూ.6.20 లక్షలు తొలి విడత బిల్లు మంజూరయ్యింది. అనంతరం నిర్మాణ పనులకు గాను మార్చి 16, 2015లో రూ.5.39 లక్షలు, అదే నెల 18వ తేదీన మిగిలిన రూ.80,890 డ్రా చేసి తీసుకున్నారు. ఇంతకీ చేసిన పనులకు డ్రా చేసిన బిల్లులను పరిశీలిస్తే సగం కూడా ఖర్చు కాదని అక్కడి పనులను చూస్తే అర్థమవుతుంది. పోనీ నిధులు వాడటం మాటెలా ఉన్నా నాటి నుంచి నేటి వరకు కనీసం ఆ భవనాల నిర్మాణాన్ని ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. మరీ విడ్డూరంగా ఆ పక్కనే ఇటీవల ఇదే పాఠశాలకు మరో నాలుగు గదులు మంజూరు కావడం, అవి పూర్తయి వాడుకలోకి రావడం జరిగింది. పనులు దక్కించుకున్న వ్యక్తి నగరంలో బడా కాంట్రాక్టరు కావడంతో అతడి మాటే నగరపాలక సంస్థలో వేదం అన్న రీతిగా సాగుతోంది. దీంతో పనుల నాణ్యతతో పాటు, పూర్తి చేయడం వరకు అంతా ఆయన ఇష్టారాజ్యం మారిందని అంతా విమర్శిస్తున్నారు. పైగా నాలుగేళ్లు కావడంతో అంచనా వ్యయం కూడా పెరిగి పనులు చేయకపోవడానికి మరో కారణం అయి ఉండచ్చుని, అదీ కూడా అతనిదే బాధ్యత పనుల ఆలస్యం కావడం వల్లనే కాబట్టి వెంటనే పనులు పూర్తి చేసేలా నిబంధనల మేరకు చూడాల్సి ఉంది. అయితే ఆ దిశగా ఏ మాత్రం ప్రయత్నం చేయకపోవడంతో మరింత నిర్లక్ష్యానికి కారణంగా కనిపిస్తున్నది.

ఏళ్లు గడుస్తున్నా ఎందుకీ నిర్లక్ష్యం:

సర్వశిక్షాభియాన్, రాజీవ్ విద్యా మిషన్ నిధులతో పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి లోటు లేదని, ఇక్కడంతా కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తున్నది. కాంట్రాక్టరుపై అభిమానంతో అధికారులు చూసీ చూడనట్టు పోవడంతో గడువులోపు పని పూర్తి చేయకుండా తాత్సారం చేస్తున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి. వీరి నిర్వాకంతో గదులు చాలక ఇరుకుగా ఒక క్లాసులో 80 మంది విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోందని వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ భవనాల నిర్మాణానికి ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే ఏళ్ల తరబడి పనులు చేయకుండా వదిలేయంతో నాణ్యత లోపించిన ఐరన్‌ను కూడా మార్చి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలంటున్నారు.

కాంట్రాక్టరుకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు

ఎస్‌వీఎస్ రాజు, ప్రధానోపాధ్యాయుడు

పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టరు పట్టించుకోకపోవడంతో పునాది వరకు చేసి పనులను అసంపూర్తిగా వదిలేశారు. కాంట్రాక్టరుకు ఎన్నిసారి ఫోను చేసినా స్పందించట్లేదు. స్తంభాలకు వాడిన ఐరన్ కూడా తుప్పుపట్టి నాణ్యత లోపిస్తోంది. ఈ గదుల నిర్మాణం పూర్తయితే 250 మంది విద్యార్థులకు ఇక్కట్లు తప్పేవి.

బోటు క్లబ్ పార్కు వాకింగ్ ట్రాక్‌పై మురుగునీరు

రమణయ్యపేట (ప్రతాప్‌నగర్): కాకినాడ రూరల్ మండలం సర్పవరం జంక్షన్ సమీపంలో గల బోటుక్లబ్ పార్కు వాకింగ్ ట్రాక్‌పై మురుగునీరు నిలిచిపోయింది. ఆ నీటి నుంచి విపరీతమైన దుర్వాసన రావడంతో నడవడానికి వాకర్స్ పలు ఇబ్బందులకు గురవుతున్నారు. చెడు వాసన రావడంతో అనారోగ్యం పాలవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటిని బోటు క్లబ్ పార్కులోకి మళ్లిస్తున్న గృహాల యజమానులపై చర్యలు తీసుకోవాలని, మురుగునీరు రాకుండా చేయాలని నగరపాలక సంస్థ అధికారులను వాకర్స్, రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు కోరారు.



పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కాకినాడ (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ చిరకాల కోరిక తీర్చి, తమకు న్యాయం చేయాలని, వినతిపత్రాన్ని ప్రభుత్వానికి పంపాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కాకినాడ ఇన్‌చార్జి వల్లూరి సత్తిబాబు, నాయకులు ఎంవీ బాబు, ఎన్.ఆనందరావు, పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం

వలసపాకల (ప్రతాప్‌నగర్): తల్లి పాలతో బిడ్డకు చక్కటి ఆరోగ్యం కలుగుతుందని ఇన్నర్ వీల్ క్లబ్ కాకినాడ శాఖ అధ్యక్షురాలు ఎన్.అనిత పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా కాకినాడ రూరల్ మండలం వలసపాకల అంగన్‌వాడీ కేంద్రంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. హార్లిక్స్ సీసాలు, పండ్లు, డ్రైఫ్రూట్స్, స్వీట్లు, చీరలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శులభ, మాధవి, అనుప, గీత, ఉమ, ప్రవీణ పాల్గొన్నారు.



గర్భిణికి పండ్లు అందజేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

నేడు పిఠాపురంలో జాబ్‌మేళా

పిఠాపురం: పట్టణంలోని మున్సిపల్ ఆఫీసు ఎదురుగా గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పిఠాపురం ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. నెల్లూరి శ్రీసిటీలోని ఫాక్స్‌కాన్ మొబైల్ కంపెనీలో 18నుంచి 26 ఏళ్ల మధ్య వయస్సు గల మహిళలకు ఉద్యోగ అవకాశాల నిమిత్తం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపికైన వారు క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్ విభాగాల్లో, కంప్యూటర్ ఆపరేటర్లగా పనిచేయాలన్నారు. వీరికి నెలకు రూ.10,500 వేతనంగా చెల్లిస్తారన్నారు.

ఆలయాల్లో గ్రహణ అనంతర పూజలు



కోదండరామాలయంలో గ్రహణ అనంతరం అభిషేకాలు

పిఠాపురం: పట్టణంలోని పలు ఆలయాల్లో గ్రహణ అనంతర పూజలు జరిగాయి. పుల్లయ్యకాలువ వీధిలో వేంచేసి ఉన్న కోదండరామాలయంలో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు విజయ జనార్ధనాచార్యులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, కమిటీ ప్రతినిధి నల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేరుకు ఆదర్శ పాఠశాల.. నిలువ నీడ కరువు

కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు
ఖాళీ చేయమని ప్రత్యామ్నాయం చూపని అధికారులు



శిథిలావస్థకు చేరిన గొల్లప్రోలు మండల పరిషత్ నెంబరు-2 పాఠశాల



పెచ్చులూడిపోతున్న భవనాల పైకప్పు

గొల్లప్రోలు: అదొక ఆదర్శ పాఠశాల..ఇదంతా పేరుకే..అక్కడ చూస్తే శిథిలమయి ఎప్పుడు కూలిపోతుందో తెలియని భవనాలు.. తక్షణం ఖాళీ చేయమని చెప్పిన ఇంజనీరింగ్ అధికారులు, ప్రత్యామ్నాయం చూపకపోవడంతో చెట్లు కిందే తరగతులు నిర్వహిస్తున్నారు ఉపాధ్యాయులు.. ఎండకు ఎండి..వర్షం వస్తూ తడుస్తూ విద్యార్థులు చదువుకుంటున్న మనత వహించిన విద్యాశాఖాధికారులకు ఇవేమి పట్టడం లేదు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఆచరణలో అమలు కావడం లేదనేందుకు గొల్లప్రోలు పట్టణంలోని పాపయ్యచావిడి వీధి సమీపంలోని ఎస్సీ కాలనీ మండలపరిషత్ నెంబరు-2 ప్రాథమిక పాఠశాల నిదర్శనం. ఇక్కడ 126మంది విద్యార్థులు చదువుతుండగా ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాల ప్రారంభ సమయంలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి స్థానంలో నూతనంగా ఐదో తరగతి గదులు నిర్మించేందుకు 2010-11లో సర్వశిక్షాభియాన్ ద్వారా రూ.18లక్షల నిధులు మంజూరయ్యాయి. స్థల వివాదం కారణం పనులు ప్రారంభం కాలేదు. 2013 వరకూ ఇదే పరిస్థితి కొనసాగడంతో ఎస్ఎస్ఏ తాను ఇచ్చిన నిధులను వెనక్కి తీసుకుంది. అప్పటి నుంచి శిథిలభవనాల్లో తరగతులు నిర్వహిస్తూ వస్తున్నారు. కొద్ది రోజుల క్రితం మధ్యాహ్న భోజన సమయంలో భవనం పైకప్పు పెచ్చు ఊడిపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు అధికారులకు సమాచారమిచ్చారు. ఎస్ఎస్ఏ డీఈతోపాటు మండల ఇంజనీరింగ్ అధికారి వచ్చి పరిశీలన జరిపి ఇది ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదమున్నందున తక్షణం ఖాళీ చేయాలని సూచించారు. దీనితో ఉపాధ్యాయులు భవనాలను ఖాళీ చేశారు. వీరికి ప్రత్యామ్నాయం చూపకపోవడంతో పాఠశాలకు సమీపంలో ఉన్న చెట్లు కిందే తరగతి గదులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలను రెండేళ్ల క్రితం ఆదర్శ పాఠశాలగా గుర్తించి ఇంగ్లీషు మీడియం ప్రారంభించారు. పేరుకు ఆదర్శం కనిపిస్తున్నది..ఇక్కడ విద్యార్థులు మాత్రం ఎండకు ఎండుతూ వర్షం వస్తే తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులది అదే పరిస్థితి. ఇక్కడ వీరు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు గురవుతున్నది. తక్షణం జిల్లా అధికారయంత్రాంగం నూతన భవనాలు నిర్మించే వరకూ పాఠశాలకు ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటు తగదు

గొల్లప్రోలులో ఆందోళన



ఇళ్ల మధ్య బ్రాందిషాపు ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న మహిళలు, స్థానికులు

గొల్లప్రోలు: ఇళ్ల మధ్య బ్రాందిషాపు ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు పట్టణం గాంధీనగర్ శివారు వీధిలోని మహిళలు, స్థానికులు మంగళవారం ఆందోళనకు దిగారు. నివాసగృహాల మధ్య మద్యం షాపు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇళ్ల మధ్య షాపు ఏర్పాటు చేస్తే అనేక ఇబ్బందులకు గురవుతామన్నారు. నిబంధనలు పాటించకుండా అధికారులు షాపు ఏర్పాటుకు అనుమతిస్తే షాపు వద్దే టెంట్ వేసి నిరవధిక ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. తమ ప్రాంతంలో మద్యం షాపులు ఏర్పాటు తగదంటూ గతంలో ఆందోళన చేయగా అధికారులు ఏర్పాటు చేయబోమని హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గాంధీనగర్ శివారు వీధిలో బ్రాందిషాపు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మహిళలు మామిడాల నాగలక్ష్మి, పడాల కాశీఅన్నపూర్ణ, ఎమ్.సూర్యచక్రం, వీరమణి, మిరియాల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాపు నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన



కాపు నాయకులు కొవ్వొతుల ప్రదర్శన

గొల్లప్రోలు: మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంకు సంఘీభావం ప్రకటిస్తూ గొల్లప్రోలు పట్టణంలోని కొత్తపేట రామాయమ్మ రావుపేట సెంటర్‌లో కాపు నాయకులు మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ముద్రగడ పాదయాత్రను అడ్డుకోవడంపై నిరసన తెలిపారు. కాపులను బీసీల్లో చేర్చాలని, ముఖ్యమంత్రి కాపులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కాపు నాయకులు మొగలి అయ్యారావు, దాసం పూసలు, సోమిశెట్టి రాంబాబు, బలిరెడ్డి శ్రీను, చిన్నయ్య, నాగులాపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఆర్ వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు: పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మీజిల్స్-రూబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లప్రోలు పట్టణంలోని మాధురి విద్యాలయలో 2,302మంది విద్యార్థులకు వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమాన్ని కాకినాడ డివిజన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వరి, పిఠాపురం నియోజకవర్గ పర్యవేక్షణ అధికారి డాక్టర్ సురేష్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో మాధురి విద్యాలయ కరస్పాండెంట్ కడారి తమ్మయ్యనాయుడు, ప్రిన్సిపాల్ లూకోస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి,మిశ్రమ వ్యవసాయానికి ప్రోత్సహకాలు



సదస్సులో మాట్లాడుతున్న ఏడీ పద్మశ్రీ

పిఠాపురం రూరల్: ప్రకృతి, మిశ్రమ వ్యవసాయం చేసే రైతులకు ఆత్మ ద్వారా రూ.4వేలు నుంచి రూ.20 వేలు వరకూ ప్రోత్సాహం అందజేస్తున్నట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు జీవీ పద్మశ్రీ తెలిపారు. పిఠాపురం మండలం కోలం కలో ఆత్మ ఛైర్మన్ ఎలుబండి రాజారావు అధ్యక్షతన జరిగిన వ్యవసాయ మార్కెట్‌కమిటీ స్థాయి రైతుల వర్క్‌షాపు, పొలంబడి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. సూక్ష్మనీటిపారుదల సేద్యం చేసే రైతులకు ఆత్మ, పీఎంఎస్‌కైపై ద్వారా రూ.4వేలు ప్రోత్సాహం ఉంటుందన్నారు. సూక్ష్మ పోషకమైన బోరాన్‌ను 100శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. రైతులకు అవసరమైన పరికరాలను వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 50శాతం సబ్సిడీపై అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముంజవరపు విజయలత, ఏవో ఇంటి గంగాధర్, ఏఈవో ప్రశాంతి, ఆత్మ ఏటీఎంలు ఈశ్వరరావు, వి.ప్రసాద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎంఆర్ టీకాల కార్యక్రమం



ఎంఆర్ టీకా వేస్తున్న వైద్యురాలు శశికళ

కొమరగిరి(కొత్తపల్లి): మీజిల్స్, రూబెల్లా (ఎంఆర్) టీకాల కార్యక్రమం మండలంలో ముమ్మరంగా సాగుతోంది. కొమరగిరి పిహెచ్‌సీ పరిధిలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు పిహెచ్‌సీ వైద్యురాలు శశికళ మంగళవారం ఎంఆర్ టీకాలను వేశారు. 9నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలందరూ తప్పనిసరిగా ఎంఆర్ టీకాలను వేయించుకోవాలని శశికళ సూచించారు. తొలుత ఈకార్యక్రమాన్ని కొమరగిరి సర్పంచ్ కరారి రాజబాబు ప్రారంభించారు. పిహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మొగిలినీడి వరప్రసాద్(బంగారం) హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారావు, హెచ్‌వీ ఎస్.కృపాబాయి, ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయురాలు, పలువురు అంగన్‌వాడీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అపర్ణాదేవి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహించిన దృశ్యం

గొల్లప్రోలు రూరల్: మండలంలోని తాటిపర్తి గ్రామంలో అపర్ణా సమేత నాగేశ్వర స్వామి ఆలయంలోమంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేశ్వరస్వామి, అపర్ణాదేవీలకు గ్రహణ అనంతరం అభిషేకాలు నిర్వహించారు. మారేడు దళాలు, పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం అపర్ణా అమ్మవారిని వెండి ఆభరణాలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

దుర్గాడలో మహిళల నిరసన

గొల్లప్రోలు రూరల్: మండలంలోని దుర్గాడ గ్రామంలో మహిళల నిరసన కొనసాగుతున్నది. కాపులను బీసీల్లో చేర్చాలనే డిమాండ్‌తో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కాపు మహిళలు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం తక్షణం ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

• సినిమా గైడ్

పిఠాపురం:

పూర్ణా	ఏజెంటు భైరవ
అన్నపూర్ణ	దువ్వాడ జగన్నాథమ్
వెంకటేశ్వర	--
శివదుర్గ	రెండు రెళ్లు ఆరు
శ్రీసత్యా	నిన్ను కోరి



వైభంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కె.గంగవరం: మండల పరిధి సుందరపల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భజనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

● మినీ ఇంటర్వ్యూ



నేటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

గిడ్ల భీమారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో
కె.గంగవరం

● స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చేయనున్న కార్యక్రమాలు చెప్పండి?

స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం గ్రామాలను బహిరంగ మల విసర్జన నుంచి స్వాతంత్ర్యం కలిగించడానికి కార్యక్రమాలు ప్రకటించింది.

● ఎప్పుడు నిర్వహిస్తున్నారు?

బుధవారం నుంచి స్వాతంత్ర్యదినోత్సవం వరకూ కార్యక్రమాలు నిర్వహిస్తాం.

●ఏఏ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

బుధవారం మండల కేంద్రంలో ర్యాలి, మానవహారం, 10న పాఠశాల విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు వ్యక్తిగత మరుగుదొడ్ల వలన కలిగే ప్రయోజనాలు తెలుపుతూ లేఖ రాయడం, 11నగ్రామాల్లో ఐఎస్ఎల్ , హేండ్ వాష్ వలన ఉపయోగాలు వివరిసాం

●సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయా?

12న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు కృషి చేసినవారికి సన్మానం, 13న 5కే రన్‌తో పాటు, 14న ముగ్గుల పోటీలు నిర్వహించాం.

● ఈ కార్యక్రమాల్లో ఎవరెవరు పాల్గొంటూరు?

ఈ కార్యక్రమాల్లో మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులతో పాటు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలు భాగస్వామ్యంతో నిర్వహిస్తాం.

● కె.గంగవరం

ఇన్‌స్పైర్‌కు 9మంది విద్యార్థుల ఎంపిక

రామచంద్రపురం: కేంద్ర ప్రభుత్వం అందజేసే ఇన్‌స్పైర్ ఉపకార వేతనాలకు స్థానిక నారాయణ స్కూల్ విద్యార్థులు 9మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ జగదీష్ తెలిపారు. ఎంపికైన వారిలో ఎంపికైన విద్యార్థులను ఏజీఎం శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ జగదీష్, ఏవో పీ గోవిందరావు అభినందించారు.

● సినిమా గైడ్

రామచంద్రపురం

అన్నపూర్ణ	వాసుకి
రాజగోపాల్	పటేల్ సర్
కిషోర్	
సూర్య స్క్రీన్-1	గౌతమ్‌నంద
సూర్య స్క్రీన్-2	ఏజెంట్‌భైరవ

ద్రాక్షారామ

శివరంజని	వాసుకి
శ్రీలక్ష్మి	గౌతమ్‌నంద
సూర్య	డీజే

పేద ప్రజలందరికీ పక్కాఇళ్లు: చైర్మన్

రామచంద్రపురం:పురపాకలసంఘ పరిధిలోని పేద ప్రజలందరికీ పక్కాఇళ్ల నిర్మాణం చేపడతామని మున్సిపల్ చైర్మన్ ఎస్ఆర్‌కే రాజగోపాల్‌నరసరాజు అన్నారు. మంగళవారం చైర్మన్ రాజగోపాల్‌నరసరాజు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈసమావేశంలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, ఎన్‌టీఆర్ నగర్‌పథకంలో భాగంగా పట్టణానికి మంజూరైన 1088 ఇళ్లలో మొదటి విడతగా 400మంది లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఆఇళ్లను ఉట్రుమిల్లి రాజీవ్‌గృహకల్ప, ముచ్చుమిల్లి రాజీవ్‌గృహకల్ప, కవలవారి సావరం పబ్లిక్ టాయిలెట్స్ స్థలం, 23వ వార్డు గుబ్బలవారిపేట పబ్లిక్ టాయిలెట్‌స్థలం, శీలంవారి సావరం పబ్లిక్ టాయిలెట్ స్థలం, 17వ వార్డు గౌడ సంఘం స్థలంలలో నిర్మించడానికి ప్రభుత్వ అనుమతిని కోరుతూ వచ్చిన అంశాన్ని కౌన్సిల్ ఆమోదించింది. అదేవిధంగా ఆదేపథకంలో మరికొన్ని ఇళ్ల నిర్మాణాలకు కొత్తూరులో ఉన్న 33.66సెంట్ల ప్రభుత్వ స్థలంలో 18.25సెంట్ల స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ లేఅవుట్ అనుమతులు కోరగా కౌన్సిల్ ఆమోదించింది. ఈసందర్భంలో కౌన్సిల్ ఫ్లోర్‌లీడర్ వాడ్రేవు సాయిప్రసాద్ మాట్లాడుతూ ఇళ్ల కేటాయింపు లబ్ధిదారుల ఎంపికలో పార్టీ వ్యత్యాసాలు చూపుతున్నారని ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన పేర్లు ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో చోటుచేసుకోలేదని అన్నారు. లబ్ధిదారుల జాబితాలో ప్రతిపక్ష సభ్యులు సూచించిన ఒక్క పేరులేక పోవడాన్ని ప్రస్తావిస్తూ అందరికీ ఇళ్లని చెప్పడంలో అర్థంలేదని ప్రతిపక్ష సభ్యులు చింతపల్లి వెంకట్రావు విమర్శించారు. ప్రతిపక్ష విమర్శలపై చైర్మన్ సమాధానమిస్తూ నిజమైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని 1088ఇళ్లకు సంబంధించి లబ్ధిధారుల జాబితా ఇప్పటికే ఎంపికచేసినందున రెండవ విడతలో మిగిలిన వారికీ అవకాశం కల్పిస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపికలో పార్టీలకు రాజకీయాలకు తావు లేదని ఆయన స్పష్టంచేశారు. ప్రజారోగ్య విభాగంలో పదవీవిరమణ చేసిన వారి స్థానంలో నియమించిన 10మంది పనివార్లకు ఏప్రిల్‌నుంచి జూలై వరకూ వేతనాలు చెల్లించాలని చైర్మన్ తీసుకున్న ముందస్తు చర్య అంశం ర్యాటిఫికేషన్ కోరుతూ ఆమోదానికిరాగా ప్రతిపక్షనాయకుడు సాయిప్రసాద్ అభ్యంతరం చెప్పారు. అత్యవసర పనులకే ర్యాటిఫికేషన్ చేయాలని ఈవిధంగా ప్రతీ పనిని ర్యాటిఫికేషన్ పరిధిలోకి తీసుకురావడం నిబంధనలకు విరుద్ధమన్నారు. అంతేకాకుండా ఆ పదిమంది పనివారిని ప్రభుత్వ అనుమతిలేకుండా వేసుకున్నారని ఆయన అన్నారు. దానికి ఇన్‌చార్జి కమిషనర్ జి రాధాకృష్ణ సమాధానమిస్తూ పారశుధ్య పనులకు నిర్ధేశించిన 279జీవో అమలులోకి వచ్చేలోగా కౌన్సిల్ ఆమోదం మేరకే గ్యాంగ్‌వర్క్ చేయించుకొనేందుకుగాను వారిని నియమించారని చెప్పారు. చైర్మన్ రాజగోపాల్‌బాబు మాట్లాడుతూ రాటిఫికేషన్‌లోను నిబంధనలను అతిక్రమించలేదన్నారు. పాలక పక్షసభ్యుడు గడి గోవిందు ఈ అంశాన్ని ఆమోదించాలనగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటేందుకు కొంత స్థలాన్ని కేటాయించి సీసీ రోడ్డు వేయాలని 19వార్డు కౌన్సిలర్ వర్ధినీడి సీతామహాలక్ష్మి కోరగా మొక్కలను పెంచేందుకు ఇతర అవసరాలకు మీటరు స్థలాన్ని వదిలిపెట్టి రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు ఏఈ వై. నాగేశ్వరరావు తెలిపారు. చివరగా ప్రతిపక్షనాయకుడు సాయిప్రసాద్ మాట్లాడుతూ క్రైస్తవ బరియల్‌గ్రౌండ్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ప్రహారీగోడను నిర్మించారని ఇప్పటికే ఆస్థలానికి జిల్లా సర్వేయర్ కొలతలువేసి సర్వే రిపోర్టును ఇచ్చారని దానికి పరిశీలించి ఆగోడను వెంటనే తొలగించాని సభకు తెలిపారు. దానిపై చైర్మన్ మాట్లాడుతూ దానికి సంబంధించిన ఆధారాలను కమిషనర్‌కు అందజేయాలని పరిశీలించి చర్య తీసుకుంటామని అన్నారు. ఇంకా ఈ అంశంపై చర్చ జరుగుతుండగా అత్యవసర సమావేశంలో జీరో అవర్ ఉండదని అజెండాలోని అంశాలు తప్ప మిగిలిన సమైస్యలపై చర్చ ఉండకూడదని అధికారపక్ష కౌన్సిలర్ గంపల మల్లిఖార్జునరావు అనడంతో సభను ముగించారు. ఈసమావేశంలో వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, సభ్యులు అల్లం శ్రీనివాస్ వైట్ల ప్రకాశరావు, పసుపులేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఎస్ఆర్‌కే రాజగోపాల్‌నరసరాజు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

కాజులూరు: మండలానికి చెందిన తనుకువాడ పాఠశాల నుండి బదిలీ అయిన 7 గురు ఉపాధ్యాయులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన సాదారణ బదిలీల్లో భాగంగా హైస్కూలు నుంచి ఐవీవీ సత్యనారాయణ, కే రంగబాబు, పీ త్రిమూర్తులు, బీ సుజాకుమారి, వై. శ్వర్ణకుమారి, ఎంఏకే జ్యోతి, ఎంపీపీ పాఠశాల నుంచి హెచ్ఎం ఎం. భవానీరమేష్ బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం గ్రామస్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీ వీరభద్రరావు, గంధం వసంతరావు, స్థానిక సర్పంచ్ ఎంపీటీసీలు వాసంశెట్టి శ్రీనివాస్, నరాల మీనాక్షీ, టీడీపీ నాయకులు సూరంపూడి భాను, వల్లు అర్జునరావు, రాయుడు లీలాశంఖర్, వైసీపీ నాయకులు పితాని సుబ్రహ్మణ్యం, దెయ్యాల సత్యనారాయణ, స్కూలు కమిటీ చైర్మన్ వీరబ్రహ్మం పాల్గొన్నారు.



తనుకువాడ పాఠశాలలో వేదికపై సన్మాన గ్రహీతలు

రేపు విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

ద్రాక్షారామ: రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల స్థాయి నుండి యూనివర్శిటీ స్థాయి వరకు ఆగస్టు 10న తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు సాకా నాగార్జున కోరారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు మూసివేతను ఆపాలని, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టే సమగ్ర చట్టాన్ని చేయాలని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను ప్రభుత్వమే అమలు చేయాలని, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, వైద్యం అందించాలని, మధ్యాహ్న బోజన పథకం అమలు కార్పొరేట్ సంస్థలకు అప్పగించవద్దని, జీవో నెం 35ను రద్దు చేసి ఎయిడెడ్ విద్యాసంస్థలో పోస్టులు భర్తీ చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి బంద్ నిర్వహిస్తునట్లు వివరించారు. బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు సహకరించాలని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పిల్లలందరికీ వ్యాక్సిన్ వేయించండి

కె.గంగవరం: ఎంఆర్ వ్యాక్సిన్‌ను పిల్లలందరికీ వేయించాలని కోట సర్పంచ్ తాడి శాంతకుమారి, ఎంపీటీసీ ములకల రామచంద్రరావు అన్నారు. మంగళవారం గ్రామంలో దంగేరు వైద్యాధికారిణి ప్రియాంక ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో 9 నెలల నుంచి 15 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలందరికీ వ్యాక్సిన్ వేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గాంధీనగర్ వాసులు

పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం తోటపేట శివారు గాంధీ నగర్ వాసులు మంగళవారం తోటపేట పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తోటపేట శివారు గాంధీనగర్‌లో అనుమతి లేకుండా నిర్మించిన క్రైస్తవ ప్రార్థన మందిరంను తొలగించాలని, బలవంతపు మతమార్పిడి అరికట్టాలని, యువకులపై నమోదు చేసిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండు చేస్తూ గాంధీనగర్‌కు చెందిన పలువురు పంచాయతీ కార్యాలయం ముందు బైఠాయించారు. పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు. గ్రామ కార్యదర్శి శివప్రసాద్‌ను నిలదీశారు. చర్చి తొలగించాలని పిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. సీఐ కె.శ్రీధర్‌కుమార్, ఎస్ఐ సతీష్‌బాబు ఆందోళన కారులతో చర్చించారు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో ఆందోళన విరమించి రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ హింధులను వేదిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసనంద సరస్వతి, హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీరామ్ తురగా, జాతీయ ఎస్సీ రిజర్వేషన్ సంరక్షణ సమతి అధ్యక్షుడు కర్నే శ్రీశైలం, హిందూ ధర్మపరిరక్షణ పరిషత్ నాయకులు గవరయ్య, నల్లిమిల్లి రాంబాబు, సత్యానంద భారతి, శివానంద భారతి, తోటపేటగ్రామస్థులు గుబ్బల శ్రీనివాస్, పనసయ్య, దుర్గ, పార్వతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారుల సొమ్ము చెల్లింపునకు గడువుపెంపు

రామచంద్రపురం: పురపాలకసంఘ పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, ఎన్టీఆర్‌నగర్ అందరికీ ఇళ్ల పథకంలో ఎంపికైన లబ్ధిదారులు వారి వాటాగా చెల్లించాల్సిన సొమ్మును ఈనెల 15 లోగా డీడీ రూపంలో చెల్లించాలని ఇన్‌చార్జి కమిషనర్ జి. రాధాకృష్ణ తెలిపారు. ఇప్పటికే వారి వాటాగా చెల్లించాల్సిన సొమ్ముకు గడువుతేదీ ముగియడంతో ప్రభుత్వం మరొకసారి తేదీని పొడిగించిందని ఆయన చెప్పారు. అయితే ఈనెల 12నుంచి వరుస సెలవులు వస్తుండటంతో 11వతేదీ నాటికే లబ్ధిదారులు తమ సొమ్మును చెల్లించాలని ఆయన కోరారు.

'జాతీయ రహదారిపై తిరిగే ఆవులను గోశాలకు తరలిస్తాం'

దివాన్‌చెరువు: దివాన్‌చెరువులోని జాతీయ రహదారిపై సంచరించే ఆవులను తుని సమీపంలోని గోశాలకు తరలించనున్నామని దివాన్‌చెరువు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరం ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జాతీయ రహదారిపై పశువులు సంచరించకుండా వాటిని యజమానులు జాగ్రత్త పరచుకోవాలని గ్రామంలో దండోరా వేయించామని చెప్పారు. చాలా పశువులు రోడ్లమీదే సంచరిస్తున్నాయన్నారు. వీటిని తుని సమీపంలోని గోశాలకు ఈ ఆవులను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

ఏడు కోట్ల ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

కోరుకొండ: జూన్ 2016 నుంచి మే 2017 వరకూ కోరుకొండ మండలంలో 20గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన ఉపాధిహామీ పనులపై మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రిసైడింగ్ అధికారిణి బి.శ్యామల ఆధ్వర్యంలోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించిన బీఆర్‌సీలు తయారు చేసిన నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. అర్హతలేని వారికి పింఛన్లు ఇవ్వడం చదవని వారికి స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం తక్కువ పనులకు ఎక్కువ డబ్బు చెల్లించడం, నీటికుంటలు తవ్వకుండానే తవ్వినట్లుగా డబ్బులు డ్రా చేయడం, తక్కువ పనికి ఎక్కువ వేతనాలు చెల్లించడం, దొంగమస్తర్లువేయడం, అందరు వేలు ముద్రలు ఒకేలాగ ఉండటం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడటం, కాంట్రాక్టర్ల ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి లబ్ధిదారుల నుంచి అధనంగా డబ్బు వసూలు చేయడం, కచ్చా డ్రైన్లు, పంటబోదెలు, పండ్లతోటల పెంపకం, నీటికుంటలు, నాడప్ పనులు, డంపింగ్ యార్డు పనులు, వరదకట్టలు నిర్మాణం, వంటి పనుల్లో సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బంది, సాంకేతిక సిబ్బంది, పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న వాస్తవాలను సామాజిక తనిఖీ బృందాలు సమావేశంలో వెల్లడించాయి. కోరుకొండ మండలం గుమ్ములూరు గ్రామ సర్పంచ్ చిటికిన సత్యవతి భాస్కరరావు తమ గ్రామంలో జరిగిన ఏ ఒక్క పని గురించి తాము తీర్మానాలు చేయలేదని ఉపాధిహామీ సిబ్బంది కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వలేదని డీఆర్‌డీఏ ఎడిషినల్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్యామల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో సర్పంచ్‌కి తెలియకుండా పనులు చేయడం ఏమిటని జెడ్పీటీసీ మల్లా అప్పల నరసారావు ఉపాధిహామీ సిబ్బందిని ప్రశ్నించారు. అదే గ్రామంలో 257 పనులు చేపట్టామని రూ.15 లక్షల 26వేల 543 ఖర్చు చేశామని అధికారులు చెప్పడంతో సర్పంచ్ ఆశ్చర్యపోయారు. గాడాల గ్రామంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగాయని గ్రామస్థులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కాపవరం, గాదరాడ, కణుపూరు, గాడాల, గుమ్ములూరు, మధురపూడి తదితర గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు నివేదికలో తెలియజేశాయి. ఉదయం ప్రారంభమైన సామాజిక తనిఖీ సమావేశం సాయంత్రం పొద్దుపోయేవరకూ జరిగింది. ఈ సమావేశంలో ఏపీడీ ఎన్.సోమేశ్వరరావు, ఎస్‌ఆర్‌పి.గురుమూర్తి, టీవోటి కె.సత్తిబాబు, ఎంపీడీవో ఇ.మహేశ్వరావు, ఏపీవో బి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు రెయిలేసి లక్ష్మి, ఎంపీటీసీలు ఆర్.సత్తిబాబు, బి.పెదకాపు, పి.ప్రదీప్, డి.కాంతారావు, మళ్ళ అప్పలనరసారావు, టి.శ్రీనివాస్, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో అధికారిణి నిలదీస్తున్న ప్రిసైడింగ్ అధికారిణి శ్యామల

'ఉపాధి' పనుల్లో అవకతవకలు

● **ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు**

కోరుకొండ: కోరుకొండ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో సుమారు 8లక్షల రూపాయలు అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. దీంతో ప్రెసైడింగ్ అధికారిణి బి.శ్యామల కాపవరం ఫీల్డ్ అసిస్టెంట్‌కు సోకాజ్ నోటీసు ఇచ్చారు. అదేవిధంగా బొల్లెద్దుపాలెం ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధులనుంచి తొలగించారు. 45వేల 775 రూపాయల రికవరి పెట్టారు. 11,500రూపాయలు ఫైన్ వేశారు. రూ.5లక్షల64వేల 82 నిధుల ఖర్చుకు సంబంధించి రిఫరెన్స్‌కు పంపినట్లు ఎస్‌ఆర్‌పీ గురుమూర్తి తెలిపారు.

గాడాల ఉపాధి పనుల్లో రూ.56లక్షలు దుర్వినియోగం

కోరుకొండ: కోరుకొండ మండలం గాడాలలో జరిగిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి ఇప్పటివరకూ రూ.56లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయని జిల్లా ఎస్టీ, ఎస్సీ, బీసీ మైనార్టీ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు బొర్రా సుబ్బారావు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కోరుకొండ మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ అధికారికి లిఖి త పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఫీల్డ్ అసి స్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు, టెక్నికల్ అధికారి కుమ్మక్కై ఈ నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ఈవిషయమై చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని దుర్వినియోగం అయిన సొమ్మును రికవరీ చేయాలని సుబ్బారావు డిమండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



శ్రీరామ్‌పురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

దివాన్‌చెరువు: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని దివాన్‌చెరువు గ్రామంలోని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ బివీకే రా జు అన్నారు. శ్రీరామ్‌పురం గ్రామంలో మంగళవారం శ్రీచైతన్య స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలు పెంపకం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణ, మొక్కలు పెంపకాలపై ప్రజలను చైతన్యంచేస్తూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం వైఎన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

'మెలకువలు పాటిస్తే మేలైన దిగుబడులు'

రాజానగరం: ఆయిల్ పామ్ సాగులో రైతులు మెలకువలు మేలైన దిగుబడులు పొందవచ్చని నాగార్జున సంస్థ శాస్త్రవేత్త పి.సాంబయ్య పేర్కొన్నారు. నాగార్జున ఫెర్టిలైజర్స్, రుచి సోయా వారి సౌన్యంతో అయిల్ పామ్ సాగులో ఇంటెన్సివ్ అనే కార్యక్రమంలో భాగంగా రాజానగరంలోని అన్నదాన సత్రంలో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ రైతులకు పలు సూచనలు. సలహాలు అందించారు. ఆయిల్ పామ్‌లో తక్కువ ఖర్చుతో అధిక ఫలితాలు పొందటంతో పాటు ఎరువుల ప్రాధాన్యత అనే అంశాలను వివరించారు. ఈ సమావేశంలో అయిల్ రైతుల సంక్షేమ సంఘం సభ్యులు పెండ్యాల ముఖేష్, రుచి సోయశాస్త్రవేత్త వి.ఎం.రెడ్డి, ఉద్యానవన అధికారి పి.రిణి, కె.వి.కె.శాస్త్రవేత్త ప్రసాద్, నాగార్జున సంస్థ అధికారి బి.వి.జి రాజు, రీజనల్ మేనేజర్ పి.రామమోహన్‌రావు, రుచి సోయా మేనేజర్ డి.రవీంద్ర, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సాంబయ్య

ప్రపంచదేశాలకు మార్గదర్శకంగా 'భారత్'

● **ఎమ్మెల్సీ సోము వీర్రాజు**

దివాన్‌చెరువు: భారతదేశం నేడు ప్రపంచదేశాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని, ఇందుకు ప్రధాని మోదీ సాహసోపేతమైన నిర్ణయాలే కారణమని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. సంపత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో వీర్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గతంలో బీజేపీ అంటే రాజకీయపార్టీ అన్న విషయం చాలామంది గ్రామీణ ప్రజలకు తెలిసేది కాదన్నారు. ప్రధాని మోదీ పార్టీని పటిష్టపరచడంతోపాటు ప్రతి పేదవానికి ప్రయోజనం కలిగేలా పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. చైనా వస్తు బహిష్కరణ నినాదంతో చైనా ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయగలిగామన్నారు. ప్రతిపేదవానికి ఇల్లు ఉండాలన్న ఉద్దేశంతో అవాస్‌యోజనతోపాటు సామాజిక భద్రతా పథకాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ కన్వీనర్ మోదీ సత్తిబాబు పార్టీలో ప్రతి కార్యకర్త తానే బీజేపీ కార్యకర్తనని గర్వంగా చెప్పుకునే స్థాయికి పార్టీని ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా సత్తిబాబు సమక్షం లో మండల బీజేపీ ఉపాధ్యక్షుడు పెంటగట్ల విష్ణు ఆధ్వర్యంలో గ్రామంలో కొంతమంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. పార్లమెంట్ కన్వీనర్ సత్తిబాబు వారికి కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్ముల సతీష్, జిల్లా మెడికల్ విభాగం కన్వీనర్ నిడమర్తి సత్తిరాజు, పార్టీ మండల నాయకులు దొడ్డా అర్జునరావు, పెమ్మనబోయిన కాశీ విశ్వనాధ్, గేదెల రమేష్, సోడసాని సత్యనారాయణ పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం పార్లమెంట్ కన్వీనర్ సత్తిబాబు సమక్షంలో బీజేపీలో చేరిన కార్యకర్తలు

రుణగ్రహీతలకు ఇంటర్వ్యూ తేదీల ఖరారు

గోకవరం: వివిధ రకాల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించే తేదీలు ఖరారు చేసినట్టు మంగళవారం ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు.

కొత్తపల్లి విజయబ్యాంకు పరిధి అభ్యర్థులకు ఈనెల16, పశ్చిమగోనగూడెం ఆంధ్రాబ్యాంకు అభ్యర్థులకు 17, గోకవరం ఎస్‌బీఐ బ్యాంకు పరిధి 18, మల్లవరం కార్పొరేషన్‌బ్యాంకులో 19, గోకవరం డీసీసీబీ బ్యాంకు పరిధి 21, ఇండియన్‌బ్యాంకు పరిధి 22, 23, మల్లిసాల ఆంధ్రాబ్యాంకు అభ్యర్థులకు 24న ఇంటర్వ్యూలు నిర్వహి స్తామన్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పూర్తి సమాచారంతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె కోరారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక తమలపాకుల పూజ

కోరుకొండ: స్థానిక దేవుని కోనేటివద్ద గల అభయ ఆంజనేయస్వామివారికి పవిత్ర శ్రావణమాసం మంగళవారం సందర్భంగా ప్రత్యేక తమలపాకుల పూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇరగవరపు రఘురామ్‌ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పాంతరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గాదరాడ ఓం శివశక్తిపీఠం నందుగల ఆంజనేయస్వామివారి ఆలయం నందు, హరేరామ సమాజంనందుగల ఆంజనేయస్వామిఆలయం వద్ద, స్థానిక గాంధీ చౌక్ సెంటర్‌లో గల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.



సత్యదేవుని అన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం

అన్నవరం: రత్నగిరిపై ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యన్నదాన పథకానికి మంగళవారం ఒక భక్తుడు రూ. లక్ష విరాళంగా అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన వెంపర్ల వెంకటపద్మ నాభశేషగిరిరావు ఈమొత్తాన్ని ఈవో జగన్నాథరావుకు అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతీఏటా వైశాఖశుద్ధ ఏకాదశి రోజున అన్నదానం జరిపించాలని కోరారు.



విరాళం అందజేస్తున్న దాతలు

ప్రతి కుటుంబానికి సొంత ఇళ్ల కల్పనే లక్ష్యం

● ఎమ్మెల్యే డాక్టర్ ఆకుల సత్యనారాయణ

దివాన్‌చెరువు: సమాజంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలన్నదే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే డాక్టర్ ఆకుల సత్యనారాయణ అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకంలో శ్రీరామ్‌పురం వద్ద నిర్మిస్తున్న గృహ సముదాయం క్రెడిట్ లింక్‌డ్ సబ్సిడీ పథకం (సీఎల్‌ఎస్‌ఎస్) లబ్ధిదారుల సమావేశం మంగళవారం జరిగింది. గృహనిర్మాణ స్థలాలవద్ద బీజేపీ నాయకుడు క్షత్రియ బాలసుబ్రహ్మణ్య సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ ఆకుల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదరికం గురించి పూర్తిగా ప్రధాని మోదీకి అవగాహన ఉందని, పేదల అభ్యున్నతికి దోహదపడే అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. సీఎంఏవై పథకంలో పేద మధ్య తరగతి కుటుంబాలు తమసొంత ఇంటి కలను నిజం చేసుకోవచ్చన్నారు. ప్రతి పేద కుటుంబం ఆరోగ్యంగా, ఆనందమయ జీవితం గడపాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దేశ అభ్యున్నతి కోసం అందంహా ఆలోచించాలని కోరారు. ఇక్కడ జీ+4లో గృహాలు నిర్మిస్తున్నామని, ఇప్పటికే కొంతమంది లక్ష రూపాయలకుపైగా చెల్లించారని వారికి త్వరలో రిజిస్ట్రేషన్‌లు చేయిస్తామన్నారు.



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

కుటుంబ శ్రేయస్సు గురించి ఎక్కువగా మహిళలే ఆలోచిస్తారు. కాబట్టి వారి పేరునే ఈ రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడ నిర్మిస్తున్న 320 గృహాలలో ఎల్‌ఐజీలో 160, ఇడబ్ల్యూస్‌లో మరో 160గృహాలు నిర్మిస్తామన్నారు. తమ నియోజకవర్గ పరిధిలో 95శాతం మందికి పింఛన్లు వస్తున్నాయన్నారు. మిగిలిన అర్హులకు పింఛన్లు మంజూరుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం బొమ్మూరులోని డైట్‌వద్ద 4,200 గృహాలు, గత ఏడాది ప్రారంభించగా, ఈ ఏడాది 3వేల 300 గృహా లు, శాటిలైట్‌సిటీలో నిర్మాణం చేపడుతున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి మేనేజర్ టి. అరవింద్, గోదావరి గ్రామీణ చైతన్య బ్యాంకు మేనేజర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పీఎంఏవై పథకం కింద రూ.2.65 లక్షలు సబ్సిడీ పొందవచ్చన్నారు. సంవత్సరాదాయం రూ.6లక్షలలోపు ఉన్న వారికే ఇది అందుతుందని చెప్పారు. లబ్ధిదారులకు తమ బ్యాంకులు ద్వారా రుణాల మంజూరుకు తాము పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎన్‌ఎస్‌ఎస్ చంద్రశేఖర్, నాళం పద్మశ్రీ, క్రొవ్విడి సురేష్, మట్టా చిన్నా, లాల్‌బహదూర్ శాస్త్రి, నాగేశ్వరరావు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ అయ్యలగోపి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం లబ్ధిదారులు, బ్యాంకు అధికారులతో కలసి గృహ నిర్మాణాల పనులను ఎమ్మెల్యే డాక్టర్ ఆకుల పరిశీలించారు.

వైద్య శిబిరానికి స్పందన

గోకవరం: రిటైర్డ్ పెన్షనర్స్ భవనంలో మంగళవారం జరిగిన నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. రోగులను రాజమహేంద్రవరంలోని గౌతమీ నేత్రాలయానికి చెందిన వైద్యులు బాలకృష్ణ పరీక్షించి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. 9 మందిని శస్త్రచికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించినట్టు నిర్వాహకులు పెనికేటి తాతాజీ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

గోకవరం: ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. మండలంలోని కామరాజుపేటకు చెందిన పల్లాల రాజు(62) పశువులను పొలానికి తీసుకెళ్తుండగా ఈ ఘట న జరిగింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.వెంకటసురేష్ తెలిపారు.

స్థలవివాదం కొట్లాటలో వృద్ధురాలి మృతి

అల్లవరం: ఓడలరేవు గ్రామంలో స్థల సరిహద్దు వివాదంపై కొట్లాట జరిగి వృద్ధురాలు మృతిచెందడంతో హత్యకేసుగా నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఓడలరేవు దాటింపురేవు దారిలో అవనిగడ్డ మహాలక్ష్మి, విశ్వనాధపల్లి వెంకట్రావు కుటుంబాల మధ్య గత కొంతకాలంగా సరిహద్దు వివాదాలున్నాయి. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో సరిహద్దు విషయమై ఉభయులు మధ్య ఘర్షణ చెలరేగి కొట్లాటకు దారితీసింది. ముందుగా పరస్పరం ఒకరిపై ఒకరు దూషణలకు దిగగా, పెద్దలు సర్దిచెప్పినా కొలిక్కిరాలేదు. ఇరువర్గాలు బాహాబాహీకి దిగడంతో వృద్ధురాలైన అవనిగడ్డ మహాలక్ష్మి(65) తన ఇంటి వాకిట ముందు అపస్మారక స్థితిలో కనిపించగా, వెంటనే అమలాపురం ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. మహాలక్ష్మిని కొట్టడంవల్లే చనిపోయిందని వరుసకు అల్లుడైన రేకాడి గోవిందరావు అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. విశ్వనాధపల్లి వెంకట్రావు, రేకాడి లోవరాజు, విశ్వనాధపల్లి రాము, విశ్వనాధపల్లి ఈశ్వరమ్మ, కొల్లు లలితలు కొట్టడం వల్లే వృద్ధురాలు మహాలక్ష్మి చనిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అమలాపురం డీఎస్పీ ఏవీఎల్ ప్రసన్నకుమార్, సీఐ జి.దేవకుమార్, ఎస్ఐ డి.ప్రశాంత్‌కుమార్‌లు ఓడలరేవులో సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. విశ్వనాధపల్లి వెంకట్రావుతోపాటు అయిదుగురు నిందితులపై హత్యకేసు నమోదైందని పోస్టుమార్టం కోసం మహాలక్ష్మి మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రిలోఉంచినట్టు ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.



అవనిగడ్డ మహాలక్ష్మి మృతదేహం

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సీతానగరం: మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సనమండ్ర లాజరు బాబు ఆధ్వర్యంలో ఎంఆర్పీఎస్ నాయకులు కార్యకర్తలు మంగళవారం సీతానగరం తహసీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లాజరు బాబు మాట్లాడుతూ రాజకీయ నాయకులకు, అధికారుల కు, ప్రజాప్రతినిధులకు మా బాధలు విన్నవిచుకున్నా రిలే నిరాహార దీక్షలు చేపట్టినా పట్టించుకోకపోవడంతో మంగళవారం రెవెన్యూ కార్యాలయంవద్ద ధర్నా చేసి మా వినతులపై అధికారులకు పంపాల్సిందిగా తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కార్యక్రమలో స్టాలిన్, చిడిపి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆందోళన

రాజానగరం: ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరుతూ మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుమేరకు గత 15 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాజానగరంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు దీక్షలు చేపట్టినప్పటికీ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొల్లి రమణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెనుముచ్చి వెంకటేశ్వరరావు, మండల ఇన్‌చార్జ్ యార్లగడ్డ నరేష్, యువసేన అధ్యక్షుడు ముప్పన పల్లిరాజు, పనసయ్య, భద్రం, కోడి రాఘవ, కొల్లి వెంకన్న, రాములు, శ్యామ్ ప్రసాద్, పల్లేటి వినోద్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయించుకోవాలి

● జడ్పీటీసీ కాండ్రు త్రివేణి

సీతానగరం: వ్యాధుల బారినపడకుండా విద్యార్థులందరూ టీకాలు వేయించుకోవాలని జడ్పీటీసీ కాండ్రు త్రివేణీ విద్యార్థులకు సూచించారు. మంగళవారం విద్యార్థులకు మీజిల్స్-రుబెల్లా టీకా కార్యక్రమం సీతానగరం ప్రభుత్వోన్నత పాఠశాలలో ఎంపీపీ చిట్టూరి శారద, సీతానగరం ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ దూలం కృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పాఠశాలలోని విద్యార్థులకు టీకాలు వేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జ్యోతికుమారి ఆధ్వర్యంలో సీతానగరంలో 8 బృందాలుగా వెదుళ్లపల్లి, కూనరవరం గ్రామాలలో 9నెలల నుంచి 15 సంవత్సరాలలోపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో 2813మంది పిల్లలకు టీకాలు వేయాలన్న లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించామని జ్యోతికుమారి తెలిపారు.



సీతానగరం ప్రభుత్వోన్నత పాఠశాలలో వ్యాధినిరోధక టీకాలు వేస్తున్నదృశ్యం

'పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి'



దివాన్‌చెరువులో ఎమ్మార్ టీకా కేంద్రం సందర్శించిన మండల ఉపాధ్యక్షుడు

దివాన్‌చెరువు: పిల్లలందరికీ మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ తప్పక వేయించాలని రాజానగరం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వంకా మల్లిఖార్జునస్వామి (మల్లిబాబు) కోరారు. దివాన్‌చెరువు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఎంఆర్ వ్యాక్సిన్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. 9నెలల నుంచి 15సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఉచితంగా ప్రభుత్వం ఈ టీకా వేయిస్తోందన్నారు. తల్లిదండ్రులు అందరూ శ్రద్ధతో నిర్ణీత వయస్సు గల తమ పిల్లలకు ఈ టీకా వేయించాలని కోరారు. కార్యక్రమంలో దివాన్‌చెరువు ఎంపీటీసీ గంగరాజు, టీఎన్‌టీయుసీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బెజవాడ హరిబాబు, కందుల బాబూరాయుడు, మాజీ ఎంపీటీసీ గండి బ్రహ్మారాజు, జన్మభూమి కమిటీ సభ్యులు కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● సినిమా గైడ్

సీతానగరం:
గీతా బాలాజీ : నక్షత్రం
రామదుర్గ : పటేల్ సార్
కోరుకొండ:
రామకృష్ణ : శమంతకమణి

ఆంధ్రజ్యోతి 4
రాజమహేంద్రవరం సిటీ
బుధవారం 9/8/2017
రాజమహేంద్రవరం సిటీ । అర్బన్ । దేవీచౌక్ । ప్రకాష్‌నగర్ । కల్చరల్ । లీగల్

కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడిగా గరిమెళ్ల

రాజమహేంద్రవరం అర్బన్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గరిమెళ్ల చిట్టిబాబు నేషనల్ ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. అర్బన్ బీజేపీలో సీనియర్ నాయకుడిగా ఉన్న చిట్టిబాబు 1978లో బీజేపీపట్ల ఆసక్తితో యువమోర్చా కార్యదర్శిగా కొనసాగారు. సిటీ వైస్‌ప్రెసిడెంట్, సెక్రటరీగాను పనిచేశారు. గతంలో టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. చిట్టిబాబుకు పదవి రావడంపట్ల బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రేలంగి శ్రీదేవి, పొట్లూరి రామ్మోహనరావు, బూర రామచంద్రరావు, ధార్వాడ రామకృష్ణ, ఎనుముల రంగబాబు, సత్తి మూలారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సోము వీర్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఊరెళ్తున్నారా..?

ఈ యాప్ ఇన్‌స్టాల్ చేయండి.. పోలీసులకు రిక్వెస్ట్ పెట్టండి..
నగరంలో లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్ యాప్ ఆవిష్కరణ
ఇళ్ల దొంగతనాలకు చెక్: ఎస్పీ రాజకుమారి

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మూడుప్రాంతాలకు మాత్రమే తొలుతగా ప్రవేశపెట్టిన ఎల్‌హెచ్ఎంఎస్(లాక్ హౌస్‌మోనటరింగ్ సిస్టమ్)ను రాజమహేంద్రవరం అర్బన్ ఎస్పీ బి.రాజకుమారి మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక పోలీస్ అతిథిగృహంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్‌శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌హెచ్ఎంఎస్ ఏపీ పోలీస్ లాక్‌డ్ హౌస్‌మోనటరింగ్



పోలీసులు ఏర్పాటు చేయనున్న కెమెరా పరికరాలు

సిస్టమ్ యాప్ ఉపయోగాలను వివరించారు. ఈ యాప్‌ను తొలుతగా ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇది 1.3 ఎంబీ ఉంటుందని యాప్‌లోకి వెళ్లి చిరునామా, సెల్ నెంబర్ సంబంధించిన దరఖాస్తును పూర్తి చేసి ఆమోదిస్తే రిజిస్ట్రేషన్ యునిక్ఐడీ వస్తుందని, ఎప్పుడైనా ఎవరైనా ఊరు వెళ్లినప్పుడు ఈ యాప్ వినియోగించి దానిలో రిక్వెస్టు బాక్స్‌లో ఊరు వెళ్లే తేదీలను పొందుపరచాలని సూచించారు. ఈ సమాచారం అందుకున్న సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పోలీసులు ఆ రిక్వెస్టు చేసిన వారింటికి వెళ్లి ఇంటికి వైఫై కెమెరా మోడెం అతికించి వెళ్తారని, అప్పటినుంచి వారి ఇంటిపై పోలీసుల నిఘా ఉంటుందని చెప్పారు. ఒకవేళ దొంగలు పడి తాళాలు పగలగొట్టగానే పోలీసులకు సమాచారం వెళ్తుందని ఎస్పీ చెప్పారు. అనుమానితులు వారి ఇళ్లకు ఇచ్చినా ఫొటోలు



యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాజకుమారి

తీయడం, వీడియో రికార్డింగ్ చేసి సీసీ కెమెరాల పోలీస్ కంట్రోల్‌రూమ్‌లను చేరవేయడం వంటివి ఈ యాప్ ద్వారా జరుగుతాయని, ఈ అవకాశాన్ని రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ రెడ్డి గంగాధర్, డిఎస్పీలు రమేష్ బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మరో 4రోజులు ఎంఆర్ వ్యాక్సినేషన్

రాజమహేంద్రవరంసిటీ: ఈనెల 9 నుంచి 12వతేదీవరకూ మరో నాలుగురోజుల పాటు ఎంఆర్‌వ్యాక్సిన్‌లు వేస్తున్నట్లు కమిషనర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 8 అర్బన్ హెల్త్ సెంటర్లలోను, ఆర్యాపురం ఎఫ్ఆర్‌యులోను, ఈ నాలుగు రోజులు ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ ఈ వ్యాక్సినేషన్ వేస్తారన్నారు.

గణేష్‌చౌక్ రైతుబజార్ వద్ద బైకు చోరీ

రాజమహేంద్రవరం సిటీ: గణేష్‌చౌక్ రైతుబజార్ వద్ద పార్కుచేసిన బైక్‌ను గుర్తుతెలియని దొంగలు అపహరించుకుపోయారు. స్థానిక మంగళవారపుపేటకు చెందిన బంగారు వెంకటసత్యనారాయణ, అతడి బావ కలిసి గతనెల 23న స్థానిక గణేష్ చౌక్ రైతుబజార్‌కు వచ్చి వారి ఎపి05 బిక్యూ8407 నెంబర్ గల స్కూటీని పార్కుచేసి లోపలికి వెళ్లారు. బయటకు వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీని దొంగిలించుకుపోయారు. పరిసర ప్రాంతాలన్నీ వెతికినా కనిపించకపోవడంతో బాధితుడు మంగళవారం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ ఏఎస్ఐ ఎండీఎన్ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ విజయదుందుభి ఖాయం

చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ విజయ దుందుభి మోగించడం ఖాయమని చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయస్థానాలు స్పందించి కాకినాడ ఎన్నికలు నిర్వహించాలని తేల్చినందుకు కోర్టులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 73, 74 ప్రకారం స్థానిక సుపరిపాలన రావాలన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం అపహాస్యం చేస్తుందని, రాష్ట్రంలో పాలకమండళ్లు లేక ఖాళీగా ఉన్న మున్సిపాలిటీలకు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహించడం లేదని ప్రభుత్వానికి ఆ ధైర్యం సరిపోవడం లేదన్నారు. కోర్టు మొట్టికాయలు వేస్తే తప్ప కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు సిద్ధపడలేదన్నారు. కాకినాడ ఎన్నికలతోనే చంద్రబాబు ప్రభుత్వానికి పతనం ప్రారంభం కానుందని, అన్నివర్గాల ప్రజలు ప్రభుత్వ వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. కాకినాడలో పెద్దఎత్తున నాయకులు వైసీపీలోకి వస్తున్నారని, తమకు భారీ మెజార్టీ వస్తుందని చెప్పారు. నంద్యాల ప్రజలపై నమ్మకం లేకే రాష్ట్ర క్యాబినెట్ మొత్తాన్ని అక్కడకు చేర్చారని ఎద్దేవా చేశారు. సమావేశంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా అధికార ప్రతినిధి షర్మిలారెడ్డి, రాజమహేంద్రవరం కో ఆర్డినేటర్ రౌతు సూర్యప్రకాశరావు, రూరల్ కో ఆర్డినేటర్ ఆకుల వీర్రాజు, నాయకులు గౌతమ్, రజనీకాంత్ పాల్గొన్నారు.

ఎక్స్‌రే రిపోర్టులు అందక ప్రభుత్వాస్పత్రిలో రోగుల అవస్థలు

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు ఎక్స్‌రే రిపోర్టులు సకాలంలో అందకపోవడంతో వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. సోమవారం ఎక్స్‌రేలు తీయించుకుని మంగళవారం రిపోర్టుల కోసం ఆస్పత్రికి వచ్చిన వారికి ఈ పరిస్థితి ఎదురైంది. మధ్యాహ్నం రెండుగంటలవరకూ కూడా ఎక్స్‌రే రిపోర్టులు రాకపోవడంతో ఆస్పత్రికొచ్చిన రోగుల్లో చాలామందికి వైద్యం అందలేదు. కాగా, ఎక్స్‌రే తీయించుకున్న రోగులకు రిపోర్టుల్లో కచ్చితత్వం కోసం టెలిరేడియాలజీ విధానంలో ప్రింటవుట్లు అందిస్తున్నారు. ఇందుకోసం కృష్ణా డయాగ్నస్టిక్స్ అనే ప్రైవేట్ సంస్థకు ప్రభుత్వం ఈ పని అప్పగించింది. ఈ సంస్థ ఆన్‌లైన్‌లో రిపోర్టులు పంపిస్తుంది. ఇక్కడి ఎక్స్‌రే విభాగం ఉద్యోగులు ప్రింట్లు తీసి రోగులకు ఇస్తారు. వాటి ఆధారంగా ఆర్థోపెడిక్ వైద్యులు వైద్యం చేస్తుంటారు. ఈ మేరకు ఒక్కో రిపోర్టుకు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఈ మొత్తాన్ని కృష్ణా సంస్థకు చెల్లిస్తుంది. ప్రతిరోజూ వందకు పైగానే ఎక్స్‌రేలు తీస్తుంటారు. కృష్ణా సంస్థ సేవల్లో నిర్లక్ష్యం చూపడంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రిపోరుల్లో చోటుచేసుకుంటున్న జాప్యంపై గతంలోనే ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ రమేష్‌కిషోర్ పలుమార్లు కృష్ణా సంస్థ ప్రతినిధులతో మాట్లాడినా పరిస్థితిలో మార్పులేదు. తాజాగా మరోసారి రోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో, జాతీయ రహదారిపైన మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ట్రాఫిక్ పోలీసులు కథనం ప్రకారం.. ట్రాఫిక్ డీఎస్పీ వైవీ రమణకుమార్ ఆధ్వర్యంలో సీఐలు సూరిబాబు, బాజీలాల్‌లు డ్రంక్‌అండ్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మద్యం తాగి ఉన్న 13మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. వీరిలో పదిమందికి రూ.రెండువేల చొప్పున జరిమానా విధించగా జి.దుర్గారావుకు పదిరోజుల జైలు శిక్ష, వెయ్యి జరిమానా విధించారు. ప్రగడా రామకృష్ణ, జి.రవిరాజ్‌కుమార్‌లకు నాలుగురోజులు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గరిమెళ్ల నరసింహారావు తీర్పునిచ్చారు.

● సినిమా గైడ్

అశోక	బాహుబలి-2
స్వామి	ఇదేం దెయ్యం
గీతా అప్సర	నక్షత్రం
కుమారి	ఫిదా
నాగదేవి	వశం
శ్రీ శివజ్యోతి	రారండోయ్ వేడుక చూద్దాం..
రంభ	గౌతమ్‌నంద
ఊర్వశి	నిన్నుకోరి
మేనక	జబ్ హరి మెట్ సేజల్
అనూశ్రీ(సాయికృష్ణ)	దర్శకుడు
సూర్యప్యాలెస్	దర్శకుడు
సూర్యమినీ	జబ్ హరి మెట్ సేజల్
శ్యామల	నక్షత్రం
రాజా	నక్షత్రం

విజిలెన్స్ వ్యవసాయ అధికారిగా పదోన్నతి పొందిన గరిమెళ్ల



రాజమహేంద్రవరం సిటీ: జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న గరిమెళ్ల శ్రీనివాస్ పదోన్నతిపై అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారిగా నియమితులయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని సాయిల్‌టెస్టింగ్‌లేబొరేటరీకి బదిలీ అయ్యారు. దశాబ్ధకాలంపాటు జిల్లాలో విజిలెన్స్‌లో పనిచేసి అనేక పురుగు మందు అక్రమ నిల్వలు, అధిక ధరలకు అమ్మకాలపై దాడులు చేశారు. ఇంత బాధ్యతగల అధికారి పదోన్నతిపై వెళ్తున్నందున విజిలెన్స్ ఎస్పీ టి.రామ్‌ప్రసాదరావు, డీఎస్పీ పి.రాజేంద్రకుమార్ గరిమెళ్లశ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

అన్నవరంలో తలనీలాల విక్రయానికి దేవాదాయశాఖ అనుమతి

అన్నవరం: కొన్నినెలలుగా అన్నవరం దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాల నిల్వలు పేరుకుపోవడంతో వాటిని విక్రయించేందుకు దేవాదాయశాఖ కమిషనర్ వైవీ అనురాధ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిల్వ ఉన్న తలనీలాల ద్వారా సుమారు రూ.20లక్షల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఏడాది తలనీలాల లైసెన్స్‌లకు ఈ-టెండరు ద్వారా నిర్వహించగా హెచ్చు పాటదారుడికి కేటాయిస్తూ అధికారులు అనుమతులు ఇచ్చారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

8-8-2017 రేట్లు రూ.(కిలో)

ఉల్లిపాయలు	22-00
టమాట	36-00
వంకాయలు (నలుపు, గులాబి)	20-00
తెల్ల వంకాయలు	28-00
దొమ్మేరు వంకాయలు	36-00
పచ్చిమిర్చి	24-00
బెండకాయలు	16-00
కాకరకాయలు	28-00
బీరకాయలు	18-00
క్యాబేజీ	16-00
క్యారెట్	25-00
దొండకాయలు	18-00
బంగాళాదుంపలు	11-00
గోరుచిక్కుడు	30-00
దోసకాయలు	17-00
ఆనబకాయ	10-00
పొట్లకాయి	12-00
అరటికాయలు	6-00
చిక్కుళ్లు	30-00
చేమదుంపలు	28-00
పునాస మామిడి	---
చిలకడదుంపలు	24-00
పెండలం	--
కంద	20-00
ములక్కాడ	5-00
బీట్‌రూట్	28-00
కీర దోస	24-00
బీన్స్ కాయలు	46-00
బీన్స్ గింజలు	40-00
బొబ్బర్లు	30-00
అల్లం	50-00
మామిడికాయ	6-00
క్యాప్సికమ్	48-00
కొత్తిమీర కట్ట (హైబ్రిడ్)	12-00
ఆకుకూరలు (3 కట్టలు)	10-00

-రాజమహేంద్రవరం అర్బన్

ప్రకటనల బోర్డులకు అనుమతి లేకపోతే తొలగిస్తాం: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో ముఖ్యమైన కూడళ్లలోను, వివిధ ప్రాంతాల్లోను ఏర్పాటు చేసిన వ్యాపార ప్రకటన బోర్డులకు అనుమతి తీసుకోవాలని, లేకుంటే వాటిని తొలగిస్తామని కమిషనర్ విజయ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో 750 ప్రకటన బోర్డుల ద్వారా ఏడాదికి కార్పొరేషన్‌కు రూ.కోటి 75లక్షల ఆదాయం వస్తుందన్నారు. వీటిలో పాఠశాలలు, ఆస్పత్రులు, బ్యాంకులకు సంబంధించి ప్రకటనల బోర్డులు 445 ఉన్నాయన్నారు. అక్కడక్కడా ఉన్న బోర్డులు అనుమతి లేకపోతే వెంటనే తొలగిస్తామని, నగర సుందరీకరణకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా అనుమతి ఉన్నవారు సక్రమంగా పెట్టుకోవాలని సూచించారు.

నేడు ఆదివాసీల దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: ప్రపంచ మూల్‌నివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో బుధవారం ఆదివాసీల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని మూల్‌నివాసీ సంఘ్ కేంద్రకమిటీ సభ్యుడు నయనాల కృష్ణారావు తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు వెంకీస్ డిలైట్‌లో జరిగే ఆదివాసీ దినోత్సవ సమావేశానికి ఎల్ఐసీ ఉభయగోదావరి జిల్లాల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్.గన్నియ్య, డాక్టర్ జి.రాంబాబు, మూల్‌నివాసీ కర్మచారి కళ్యాణ్ మహాసంఘ్ ఏపీ కన్వీనర్ కె.తిలక్ కుమార్, మూల్‌నివాసీ రాష్ట్రప్రధాన కార్యదర్శి జి.శ్రీవాత్సవా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని చంటిబాబు హాజరౌతారన్నారు.

నేడు రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం సిటీ: 75వ క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో బుధవారం ఉదయం పది గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుబ్బల రాంబాబు తెలిపారు. ఈ శిబిరాన్ని గుడా చైర్మన్ గన్ని కృష్ణ ప్రారంభిస్తారన్నారు.

ప్రధాన మంచినీటి విభాగం పనితీరుపై మేయర్ సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ప్రధాన మంచినీటి విభాగం పనితీరుపై మేయర్ పంతం రజనీశేషసాయి మంగళవారం తన ఛాంబర్‌లో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోదావరిలో ఎర్రనీరు వస్తున్నందున టర్బిడిటిబట్టి ఆలం కలపాలని, ప్రజలకు సురక్షితమైన తాగనీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. క్లోరినేషన్‌శాతం కూడా సరైన మొతాదుల్లో కలపాలన్నారు. టింబర్ యార్డ్‌లోని 10ఎంఎల్‌డీ ప్లాంట్‌ను త్వరితగతిన ఈ నెలాఖరునాటికి సిద్ధం చేయాలని ఆదేశించారు. 8వ డివిజన్‌లో రెండురోజులుగా ఏర్పడిన తాగునీటి సమస్యలపై ఆరా తీశారు. అటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. మాస్టర్‌ప్లాన్ అమలైనందున నగరంలో కలిసిన 13 గ్రామాలకు నీటి సరఫరా చేసేందుకు శాశ్వత ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కార్పొరేటర్ తాతారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పంతం

వాహన తనిఖీలు ముమ్మరం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం దానవాయిపేట పరిసర ప్రాంతాల్లో వన్‌టౌన్ పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఇటీవల కాలంలో దానవాయిపేట గాంధీపార్కు పరిసర ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా పార్కింగ్ చేసన బైక్‌లను గుర్తు తెలియన దొంగలు అపహరించుకుపోతున్నారు. దీంతో బైక్‌చోరీలను అరికట్టడంకోసం వన్‌టౌన్ ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం దానవాయిపేటలో వాహన తనిఖీలను పెద్దఎత్తున చేశారు. ఎస్ఐ వద్దనున్న మొబైల్ ట్యాబ్‌లో బైక్‌ల నెంబర్లు సర్చి చేసి ఒక్కో వాహనాన్ని పరిశీలించి రికార్డులు సక్రమంగా ఉన్నవాటిని వదిలేశారు. లేనివాటిని స్టేషన్‌కు తరలించారు.



వాహన తనిఖీలు చేస్తున్న దృశ్యం

నగరంలో 'అమృతపథకం' పనులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ప్రజల కనీస అవసరాలు తీర్చి సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు అమృత పథకంలో భాగంగా వివిధ పనులు చేపట్టారు. 39వ డివిజన్‌లో ఆర్యాపురం చెరువు పనులు, మంచినీటి సరఫరాకు కుళాయిల ఏర్పాటు, కంబాలచెరువు అభివృద్ధి తదితర పనులు అమృత పథకంలోనే చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో 2,900 కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. మురుగునీటి పారుదల, డ్రైనేజీ నిర్మాణం, పాఠశాలలు, జంక్షన్‌ల అభివృద్ధి తదితర పనులు అమృతపథకంలోనే నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ ఉన్నతాధికారులు తెలిపారు.

నెలాఖరుకు 10 ఎంఎల్‌డీ ప్లాంట్ ప్రారంభం: ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం కోటిలింగాలపేట 10 ఎంఎల్‌డీ ప్లాంట్ పనులు త్వరితగతిన చేపట్టి ఈనెలాఖరు నాటికి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్నట్టు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కోటిలింగాలపేట టింబర్ యార్డ్‌లో ఉన్న 10 ఎంఎల్‌డీ ప్లాంట్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.8 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ పూర్తయితే స్థానిక 44, 45, 46, 47 డివిజన్‌ల్లో తాగునీటి సమస్య తీరుతుందని చెప్పారు. ప్లాంట్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని సూచించారు. శివారు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు ఈ ప్లాంట్ ఉపయోగపడుతుందని సూచించారు.

సుబ్రహ్మణ్య మైదానంలో 'వనం-మనం'

గోదావరి సిటీ: రాజమహేంద్రి అన్ఎయిడెడ్ కాలేజీస్, స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య మైదానంలో ఈరోజు ఉదయం 10 గంటలకు 30వేల పండ్ల మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు విచ్చేసి మొక్కల పంపిణీ చేస్తారని స్కూల్స్, కాలేజీల విద్యార్థులు పాల్గొననున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని అసోసియేషన్ కమిటీ చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు.

కార్పొరేటర్ పల్లి శ్రీనివాస్‌కు వెలమ సంఘీయుల సంతాపం

రాజమహేంద్రవరం సిటీ: 26వ డివిజన్ కార్పొరేటర్ పల్లి శ్రీనివాసరావు మృతిపట్ల రాజమహేంద్రవరం వెలమ సంఘీయులు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. కోళ్ల వీరాస్వామి కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన సంతాపసభలో ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, చల్లా శంకరరావు, వెలమ సంఘం అధ్యక్షుడు కోళ్ల అచ్యుత రామారావు, కార్యదర్శి సప్పా ఉమానాగేశ్వరరావు, రెడ్డి బాబు, ఆదిరెడ్డి వాసు, కిలపర్తి శ్రీను, సప్పా వెంకటరమణ, కొల్లి బుజ్జి, డాక్టర్ శాంతారామ్, మతల రమేష్, పొడిపిరెడ్డి శివ తదితరులు పల్లి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.



పల్లి శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెలమ సంఘీయులు

నేడు ఇన్నీస్ కోఆపరేటివ్ బ్యాంక్ హౌసింగ్ బోర్డు బ్రాంచ్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ఇన్నీస్‌పేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మూడో బ్రాంచ్‌ను లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తున్నామని ఆ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుతరామారావు (బాబు) తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1918లో స్థాపించిన ఇన్నీస్‌పేట బ్యాంక్ అంచెలంచెలుగా ఎదుగుతూ ఇప్పటికి మూడు బ్రాంచ్‌లుగా విస్తరించిందన్నారు. రూ.69కోట్ల డిపాజిట్‌లు, రూ.41కోట్ల అడ్వాన్స్‌లతో బ్యాంక్ ప్రగతి పథంలో నడుస్తుందని చెప్పారు. హౌసింగ్ బోర్డు కాలనీలో ఖాతాదారుల అభీష్టం మేరకు ఆర్‌బీఐ అనుమతితో అక్కడ ఒక బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా రాజానగరం ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, కోఆపరేటివ్ బ్యాంక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానం ఆంజనేయులు, చిట్టూరి రవీంద్ర, తణుకు వాణీ బ్యాంక్ చైర్మన్‌లు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు బొంతు వీర వెంటక సత్యనారాయణ, కటారి శ్రీనివాస్, కేతా వెంకటస్వామి, పిల్లి వీర వెంకట రమణ, సూరెడ్డి రమేష్, రెడ్డి సూర్యచంద్రరావు, పంచకట్ల శివప్రసాద్, మాకిరెడ్డి నారాయణరావు, రెడ్డి సూర్య సుబ్రహ్మణ్య, జామి వెంకటరమణమూర్తి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోళ్ల బాబు

వైసీపీ నాయకుడు గౌతమ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

రాజమహేంద్రవరం సిటీ: నగర వైసీపీ నాయకుడు గౌతమ్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధాశ్రమాలు, అనాధశరణాలయాల్లో అన్నదానాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే రౌతుసూర్యప్రకాశరావు, షర్మిలారెడ్డి పాల్గొని గౌతమ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



గౌతమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

'ఆదిత్య'లో సంస్కృత భాషా దినోత్సవం

దేవీచౌక్: ఆదిత్య డిగ్రీ కళాశాల, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సంస్కృత భాషా దినోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి మాట్లాడుతూ సంస్కృత భాష దేవభాషని, దాన్ని మార్కులకోసం కాకుండా శాస్త్ర విజ్ఞాన అధ్యయనం కోసం నేర్చుకోవాలని అన్నారు. భాషా దినోత్సవాలను ప్రతిఏటా జరుపుతూ ఆయా భాషల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల సంస్కృత విభాగాధిపతి డాక్టర్ ఆచార్యులు మాట్లాడుతూ మానవుడు జననం నుంచి మరణం వరకూ జరిపే సంస్కారాలు, పూజలు అన్నీ ఈనాటికీ సంస్కృత భాషలోనే నిర్వహిస్తామన్నారు. సంస్కృత భాష అధ్యయనం ప్రతి భారతీయుని కర్తవ్యమన్నారు. ప్రిన్సిపాల్స్ కె.సి.సాగర్, సి.హెచ్.ఫణికుమార్ మాట్లాడుతూ ఇంగ్లాండ్‌లో నేటికీ ఆ దేశీయులు సంస్కృత భాషను అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. సౌజన్య హాస్పటల్స్ అధినేత భాగవత విరించి డాక్టర్ టి.వి.నారాయణరావు మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదటిగా ఉద్భవించిన భాష సంస్కృత అన్నారు. ఈ భాష వ్యాకరణంలో ఉన్నన్ని సూత్రాలు మరే ఇతర భాషల్లో లేవన్నారు. దేశంలో జన్మించి సంస్కృత భాషను అధ్యయనం చేసినందుకు తాను గర్వపడుతున్నానన్నారు. వాల్మీకి, వ్యాస మహర్షి, కాళిదాసు, భారవి వంటి ఎందరో మహానుభావులు వేద విద్యతోపాటుగా యుద్ధ విద్య, ఖగోళ, వైద్య, సాంకేతిక శాస్త్రాల వంటి ఎన్నో విద్యలను సంస్కృతంలో నిక్షిప్త పరిచారని తెలిపారు. ఆదిత్య సంస్కృత విభాగాధిపతి ఉమాదేవి నివేదిక సమర్పిస్తూ తమ కళాశాలలో సంస్కృతంలో నూరుశాతం ఉత్తీర్ణులు అవుతున్నారని తెలిపారు. అనంతరం సంస్కృత వ్యాసరచన, శ్లోక పఠనం, రామాయణాలపై జి.కె.టెస్ట్ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులకు ముఖ్యఅతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ సభ జాతీయ గీతంతో ముగించారు. అధ్యాపకులు, 150మంది విద్యార్థులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డైరెక్టర్ గంగిరెడ్డి

కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడిగా గరిమెళ్ల

రాజమహేంద్రవరం అర్బన్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గరిమెళ్ల చిట్టిబాబు నేషనల్ ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. అర్బన్ బీజేపీలో సీనియర్ నాయకుడిగా ఉన్న చిట్టిబాబు 1978లో బీజేపీపట్ల ఆసక్తితో యువమోర్చా కార్యదర్శిగా కొనసాగారు. సిటీ వైస్‌ప్రెసిడెంట్, సెక్రటరీగాను పనిచేశారు. గతంలో టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. చిట్టిబాబుకు పదవి రావడంపట్ల బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రేలంగి శ్రీదేవి, పొట్లూరి రామ్మోహనరావు, బూర రామచంద్రరావు, ధార్వాడ రామకృష్ణ, ఎనుముల రంగబాబు, సత్తి మూలారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సోము వీర్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఊరెళ్తున్నారా..?

ఈ యాప్ ఇన్‌స్టాల్ చేయండి.. పోలీసులకు రిక్వెస్ట్ పెట్టండి..

నగరంలో లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్ యాప్ ఆవిష్కరణ

ఇళ్ల దొంగతనాలకు చెక్: ఎస్పీ రాజకుమారి

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మూడుప్రాంతాలకు మాత్రమే తొలుతగా ప్రవేశపెట్టిన ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్ హౌస్‌మోనటరింగ్ సిస్టమ్)ను రాజమహేంద్రవరం అర్బన్ ఎస్పీ బి.రాజకుమారి మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక పోలీస్ అతిథిగృహంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్‌శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ లాక్‌డ్ హౌస్‌మోనటరింగ్ సిస్టమ్ యాప్ ఉపయోగాలను వివరించారు. ఈ యాప్‌ను తొలుతగా ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇది 1.3 ఎంబీ ఉంటుందని యాప్‌లోకి వెళ్లి చిరునామా, సెల్ నెంబర్ సంబంధించిన దరఖాస్తును పూర్తి చేసి ఆమోదిస్తే రిజిస్ట్రేషన్ యునిక్‌ఐడీ వస్తుందని, ఎప్పుడైనా ఎవరైనా ఊరు వెళ్లినప్పుడు ఈ యాప్ వినియోగించి దానిలో రిక్వెస్టు బాక్స్‌లో ఊరు వెళ్లే తేదీలను పొందుపరచాలని సూచించారు. ఈ సమాచారం అందుకున్న సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పోలీసులు ఆ రిక్వెస్టు చేసిన వారింటికి వెళ్లి ఇంటికి వైఫై కెమెరా మోడెం అతికించి వెళ్తారని, అప్పటినుంచి వారి ఇంటిపై పోలీసుల నిఘా ఉంటుందని చెప్పారు. ఒకవేళ దొంగలు పడి తాళాలు పగలగొట్టగానే పోలీసులకు సమాచారం వెళ్తుందని ఎస్పీ చెప్పారు. అనుమానితులు వారి ఇళ్లకు ఇచ్చినా ఫొటోలు తీయడం, వీడియో రికార్డింగ్ చేసి సీసీ కెమెరాల పోలీస్ కంట్రోల్‌రూమ్‌లను చేరవేయడం వంటివి ఈ యాప్ ద్వారా జరుగుతాయని, ఈ అవకాశాన్ని రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ రెడ్డి గంగాధర్, డిఎస్పీలు రమేష్ బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు ఏర్పాటు చేయనున్న కెమెరా పరికరాలు



యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాజకుమారి

మరో 4రోజులు ఎంఆర్ వ్యాక్సినేషన్

రాజమహేంద్రవరంసిటీ: ఈనెల 9 నుంచి 12వతేదీవరకూ మరో నాలుగురోజుల పాటు ఎంఆర్‌వ్యాక్సిన్‌లు వేస్తున్నట్లు కమిషనర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 8 అర్బన్ హెల్త్ సెంటర్లలోను, ఆర్యాపురం ఎఫ్‌ఆర్‌యులోను, ఈ నాలుగు రోజులు ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ ఈ వ్యాక్సినేషన్ వేస్తారన్నారు.

గణేష్‌చౌక్ రైతుబజర్ వద్ద బైకు చోరీ

రాజమహేంద్రవరం సిటీ: గణేష్‌చౌక్ రైతుబజార్ వద్ద పార్కుచెసిన బైక్‌ను గుర్తుతెలియని దొంగలు అపహరించుకుపోయారు. స్థానిక మంగళవారపుపేటకు చెందిన బంగారు వెంకటసత్యనారాయణ, అతడి బావ కలిసి గతనెల 23న స్థానిక గణేష్ చౌక్ రైతుబజార్‌కు వచ్చి వారి ఎపి05 బిక్యూ8407 నెంబర్ గల స్కూటీని పార్కు చేసి లోపలికి వెళ్లారు. బయటకు వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీని దొంగిలించుకుపోయారు. పరిసర ప్రాంతాలన్నీ వెతికినా కనిపించకపోవడంతో బాధితుడు మంగళవారం త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ ఏఎస్‌ఐ ఎండీఎన్ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ విజయదుందుభి ఖాయం

చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ విజయ దుందుభి మోగించడం ఖాయమని చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయస్థానాలు స్పందించి కాకినాడ ఎన్నికలు నిర్వహించాలని తేల్చినందుకు కోర్టులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 73, 74 ప్రకారం స్థానిక సుపరిపాలన రావాలన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం అపహాస్యం చేస్తుందని, రాష్ట్రంలో పాలకమండళ్లు లేక ఖాళీగా ఉన్న మున్సిపాలిటీలకు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహించడం లేదని ప్రభుత్వానికి ఆ ధైర్యం సరిపోవడం లేదన్నారు. కోర్టు మొట్టికాయలు వేస్తే తప్ప కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలకు సిద్ధపడలేదన్నారు. కాకినాడ ఎన్నికలతోనే చంద్రబాబు ప్రభుత్వానికి పతనం ప్రారంభం కానుందని, అన్నివర్గాల ప్రజలు ప్రభుత్వ వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. కాకినాడలో పెద్దఎత్తున నాయకులు వైసీపీలోకి వస్తున్నారని, తమకు భారీ మెజార్టీ వస్తుందని చెప్పారు. నంద్యాల ప్రజలపై నమ్మకం లేకే రాష్ట్ర క్యాబినెట్ మొత్తాన్ని అక్కడకు చేర్చారని ఎద్దేవా చేశారు. సమావేశంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా అధికార ప్రతినిధి షర్మిలారెడ్డి, రాజమహేంద్రవరం కో ఆర్డినేటర్ రౌతు సూర్యప్రకాశరావు, రూరల్ కో ఆర్డినేటర్ ఆకుల వీర్రాజు, నాయకులు గౌతమ్, రజనీకాంత్ పాల్గొన్నారు.

ఎక్స్‌రే రిపోర్టులు అందక ప్రభుత్వాస్పత్రిలో రోగుల అవస్థలు

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు ఎక్స్‌రే రిపోర్టులు సకాలంలో అందకపోవడంతో వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. సోమవారం ఎక్స్‌రేలు తీయించుకుని మంగళవారం రిపోర్టుల కోసం ఆస్పత్రికి వచ్చిన వారికి ఈ పరిస్థితి ఎదురైంది. మధ్యాహ్నం రెండుగంటలవరకూ కూడా ఎక్స్‌రే రిపోర్టులు రాకపోవడంతో ఆస్పత్రికొచ్చిన రోగుల్లో చాలామందికి వైద్యం అందలేదు. కాగా, ఎక్స్‌రే తీయించుకున్న రోగులకు రిపోర్టుల్లో కచ్చితత్వం కోసం టెలిరేడియాలజీ విధానంలో ప్రింటవుట్లు అందిస్తున్నారు. ఇందుకోసం కృష్ణా డయాగ్నస్టిక్స్ అనే ప్రైవేట్ సంస్థకు ప్రభుత్వం ఈ పని అప్పగించింది. ఈ సంస్థ ఆన్‌లైన్‌లో రిపోర్టులు పంపిస్తుంది. ఇక్కడి ఎక్స్‌రే విభాగం ఉద్యోగులు ప్రింట్లు తీసి రోగులకు ఇస్తారు. వాటి ఆధారంగా ఆర్థోపెడిక్ వైద్యులు వైద్యం చేస్తుంటారు. ఈ మేరకు ఒక్కో రిపోర్టుకు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఈ మొత్తాన్ని కృష్ణా సంస్థకు చెల్లిస్తుంది. ప్రతిరోజూ వందకు పైగానే ఎక్స్‌రేలు తీస్తుంటారు. కృష్ణా సంస్థ సేవల్లో నిర్లక్ష్యం చూపడంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రిపోర్టుల్లో చోటుచేసుకుంటున్న జాప్యంపై గతంలోనే ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్ రమేష్‌కిషోర్ పలుమార్లు కృష్ణా సంస్థ ప్రతినిధులతో మాట్లాడినా పరిస్థితిలో మార్పులేదు. తాజాగా మరోసారి రోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో, జాతీయ రహదారిపైన మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ట్రాఫిక్ పోలీసులు కథనం ప్రకారం.. ట్రాఫిక్ డీఎస్పీ వైవీ రమణకుమార్ ఆధ్వర్యంలో సీఐలు సూరిబాబు, బాజీలాల్‌లు డ్రంక్‌అండ్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మద్యం తాగి ఉన్న 13మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. వీరిలో పదిమందికి రూ.రెండువేల చొప్పున జరిమానా విధించగా జి.దుర్గారావుకు పదిరోజుల జైలు శిక్ష, వెయ్యి జరిమానా విధించారు. ప్రగడా రామకృష్ణ, జి.రవిరాజ్‌కుమార్‌లకు నాలుగురోజులు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గరిమెళ్ల నరసింహారావు తీర్పునిచ్చారు.

● సినిమా గైడ్

అశోక	బాహుబలి-2
స్వామి	ఇదేం దెయ్యం
గీతా అప్సర	నక్షత్రం
కుమారి	ఫిదా
నాగదేవి	వశం
శ్రీ శివజ్యోతి	రారండోయ్ వేడుక చూద్దాం..
రంభ	గౌతమ్‌నంద
ఊర్వశి	నిన్నుకోరి
మేనక	జబ్ హరి మెట్ సేజల్
అనూశ్రీ(సాయికృష్ణ)	దర్శకుడు
సూర్యప్యాలెస్	దర్శకుడు
సూర్యమినీ	జబ్ హరి మెట్ సేజల్
శ్యామల	నక్షత్రం
రాజా	నక్షత్రం

విజిలెన్స్ వ్యవసాయ అధికారిగా పదోన్నతి పొందిన గరిమెళ్ల



రాజమహేంద్రవరం సిటీ: జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న గరిమెళ్ల శ్రీనివాస్ పదోన్నతిపై అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారిగా నియమితులయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని సాయిల్‌టెస్టింగ్‌లేబొరేటరీకి బదిలీ అయ్యారు. దశాబ్ధకాలంపాటు జిల్లాలో విజిలెన్స్‌లో పనిచేసి అనేక పురుగు మందు అక్రమ నిల్వలు, అధిక ధరలకు అమ్మకాలపై దాడులు చేశారు. ఇంత బాధ్యతగల అధికారి పదోన్నతిపై వెళ్తున్నందున విజిలెన్స్ ఎస్పీ టి.రామ్‌ప్రసాదరావు, డీఎస్పీ పి.రాజేంద్రకుమార్ గరిమెళ్లశ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

8-8-2017 రేట్లు రూ.(కిలో)

ఉల్లిపాయలు	22-00
టమాట	36-00
వంకాయలు (నలుపు, గులాబి)	20-00
తెల్ల వంకాయలు	28-00
దొమ్మేరు వంకాయలు	36-00
పచ్చిమిర్చి	24-00
బెండకాయలు	16-00
కాకరకాయలు	28-00
బీరకాయలు	18-00
క్యాబేజీ	16-00
క్యారెట్	25-00
దొండకాయలు	18-00
బంగాళాదుంపలు	11-00
గోరుచిక్కుడు	30-00
దోసకాయలు	17-00
ఆనబకాయ	10-00
పొట్లకాయి	12-00
అరటికాయలు	6-00
చిక్కుళ్లు	30-00
చేమదుంపలు	28-00
పునాస మామిడి	---
చిలకడదుంపలు	24-00
పెండలం	--
కంద	20-00
ములక్కాడ	5-00
బీట్‌రూట్	28-00
కీర దోస	24-00
బీన్స్ కాయలు	46-00
బీన్స్ గింజలు	40-00
బొబ్బర్లు	30-00
అల్లం	50-00
మామిడికాయ	6-00
క్యాప్సికమ్	48-00
కొత్తిమీర కట్ట (హైబ్రిడ్)	12-00
ఆకుకూరలు (3 కట్టలు)	10-00

-రాజమహేంద్రవరం అర్బన్

అన్నవరంలో తలనీలాల విక్రయానికి దేవాదాయశాఖ అనుమతి

అన్నవరం: కొన్నినెలలుగా అన్నవరం దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాల నిల్వలు పేరుకుపోవడంతో వాటిని విక్రయించేందుకు దేవాదాయశాఖ కమిషనర్ వైవీ అనురాధ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిల్వ ఉన్న తలనీలాల ద్వారా సుమారు రూ.20లక్షల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఏడాది తలనీలాల లైసెన్స్‌లకు ఈ-టెండరు ద్వారా నిర్వహించగా హెచ్చు పాటదారుడికి కేటాయిస్తూ అధికారులు అనుమతులు ఇచ్చారు.

మసీదు నిర్వాహకులకు చెక్కు అందజేత



అంతర్వేది: అంతర్వేదిపాలెంలో మసీదుకు రాజోలు ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు రూ.15వేలను దాని నిర్వాహకులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్వేదిపాలెంలో ఉన్న మసీదుకు రంగులు వేసి సుందరంగా అలంకరించాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి ముప్పర్తి నాని తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి

అంతర్వేది: తీరప్రాంతంలో ఉన్న పోతురాజు వెంకటనరసయ్య మెమోరియల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ పోతురాజు నాగేంద్ర కుమార్ అధ్యక్షతన విద్యార్థులకు తట్టు, రుబెల్లా వ్యాక్సిన్ల అందించారు. ముఖ్య అతిథిగా జడ్పీటీసీ రావి అలేంద్రమణి విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోలా వీరాస్వామి, మాజీ ఎంపీటీసీ రావి ఆంజనేయులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

240 మందికి టీకాలు: సఖినేటిపల్లి మండలంలో కేశవదాసుపాలెం, అంతర్వేదిపాలెం, గొంది, వీవీమెరక తదితర గ్రామాల్లో ఉన్న పాఠశాల విద్యార్థులు 240 మందికి వ్యాక్సిన్ వేశామని మండల వైద్యులు జి.వసంతభూషణ్ తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యగా ఈ టీకాలు వేస్తున్నామన్నారు.

రాజోలు: చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సోంపల్లి సర్పంచ్ పొలమూరి శ్యామ్‌బాబు సూచించారు. చిల్డ్రన్స్ పాఠశాలలో, తాటిపాక భాష్యం పాఠశాలలో విద్యార్థులకు పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ మాట్లాడుతూ శిశుమరణాలు తగ్గించేందుకు తట్టు, రుబెల్లావంటి ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టి.అయ్యప్పనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలికిపురం: ప్రతి ఒక్కరూ ఎంఆర్ వ్యాక్సిన్ వేయించుకోవాలని గుడిమెళ్లంక సర్పంచ్ చెల్లింగి సీతామహాలక్ష్మి కోరారు. గుడిమెళ్లంక హైస్కూలులో 150 మంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. విద్యార్థులు ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముత్యాల దుర్గాదేవి, ప్రధానోపాధ్యాయుడు చింతా బాలచింతామణి, చెల్లింగి సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసనలు

అంతర్వేది: సఖినేటిపల్లిలో ముద్రగడకు మద్దతుగా నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి కాపులపై కేసులు ఎత్తివేసి బీసీలకు అన్యాయం జరగకుండా బీసీల్లో చేర్చాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లెళ్ల బెన్నీ, నల్లి బాలరాజు, రావి ఆంజనేయులు, నామన నాగభూషణం, కూనపరెడ్డి రాంబాబు, గునిశెట్టి లక్ష్మణరావు, కొల్లాబత్తుల రవికుమార్, నల్లి ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ సమావేశం

మలికిపురం: ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 10న చేపట్టే విద్యా సంస్థల బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సమావేశం తీర్మానించింది. ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు వక్తలు తెలిపారు. అవసరమైనచోట ఉపాధ్యాయులను భర్తీ చేయాలని డిమాండు చేశారు. సమావేశంలో దేవ రాజేంద్రప్రసాద్, రాపాక మహేష్, తాడి రవీంద్ర, కె.నాని తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య ఎన్నికపై హర్షం

రాజోలు: ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఎన్నికవడం ప్రజలకు గర్వకారణమని బీజేపీ మండల అధ్యక్షుడు అడబాల జానకిరామ్ అన్నారు. కడలిలో గ్రామశాఖ అధ్యక్షుడు చిందూరపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెంకయ్యనాయుడును ఉపరాష్ట్రపతిగా ఎన్నుకున్న వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామశాఖ బీజేపీ కార్యకర్తల ఆధ్వర్యంలో కడలి మండల ప్రజా పరిషత్ నెంబర్ 2 పాఠశాల విద్యార్థులకు పలకలు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వడ్లమూడి ప్రకాశరావు, గ్రామశాఖ కార్యదర్శి పితాని శ్రీనివాస్, వి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పి.శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.



'అర్హులందరూ పక్కా గృహాలు నిర్మించుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ కుమార్ పట్నాయక్

తుని: పట్టణంలో అర్హులందరు పక్కా గృహాలు నిర్మించుకోవాలని గృహ నిర్మాణశాఖ ఈఈ కుమార్ పట్నాయక్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 1143 ఇళ్లు కట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుతం అందులో 110 ఇళ్లు నిర్మాణాలు పూర్తిచేశారన్నారు. ఈనెలాఖరి నాటికి 500 ఇళ్లనిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు వార్డుల్లో ప్రత్యేక బృందాలను నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ యినుగంటి సత్యనారాయణ, కౌన్సిలర్లతో చర్చించారు. అయితే ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకునేందుకు ముడిసరుకుల ధరలు పెరిగాయని ప్రభుత్వం అందిస్తున్న సిమెంట్ 150 బస్తాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, హౌసింగ్ డీఈ పరశురాం, కౌన్సిలర్లు మళ్ల గణేష్, కుక్కడపు బాలాజీ, షేక్ వల్లీ, చందక భాస్కరరావు, అల్లు రాజు, సప్పా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మార్ వ్యాక్సినేషన్ పక్కాగా అమలు చేయాలి



పెరుమాళ్లపురంలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి

తొండంగి రూరల్: మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పక్కగా అమలు చెయ్యాలని కార్యక్రమ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటరావు వైద్యులకు సూచించారు. మంగళవారం ఆయన పెరుమాళ్లపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో గల పాఠశాల విద్యార్థులకు వేస్తున్న ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. 9నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలందరూ తప్పని సరిగా వ్యాక్సిన్ పొందే విధంగా చూడా లన్నారు. గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఆరోగ్య కేంద్ర సిబ్బందితో సమన్వయపర్చుకొని కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్నప్రతిష్టాత్మక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్తులు కావాలన్నారు. ఈసం దర్భంగా ఆయన విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న విధానాన్ని పరిశీలించారు. వైద్యుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకూ అంతా అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చెయ్లలయన్నారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, డాక్టర్ నాగభూషణం, సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

'వ్యాక్సిన్‌తో రెండు వ్యాధులు దూరం'



గోపాలపట్నం పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

తొండంగి అర్బన్: ఎమ్మార్ వ్యాక్సిన్‌తో తట్టు, మీజిల్స్ రెండు అంటువ్యాధులను దూరం చేసుకోవచ్చని సర్పంచ్ యడ్ల సూరిబాబు అన్నారు. మంగళవారం గోపాలపట్నం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్దులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి చిన్నారికి వ్యాక్సిన్ వేయించాలన్నారు. తమ చిన్నారుల బంగారు భవిష్యత్తును కాపాడుకునేందుకు తల్లిదండ్రులు తమవంతుగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. ప్రతి ఒక్కరూ 5నెలల నుంచి 15ఏళ్ళ వయస్సున్న పిల్లలందరికీ వ్యాక్సిన్ వేయించవచ్చన్నారు. దీన్ని గుర్తించి అందరూ వ్యాక్సిన్ వేయించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల ఉపాధ్యాయులు సిబ్బంది అంతా వ్యాక్సిన్ వేయించే కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. గునిమానికల వెంకట్రాజు, విఏఓ, వీఆర్వోతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తొండంగి వద్ద రోడ్డు పక్కనున్న కాల్వలోకి జారిపడిన కారు



16వనంబరు జాతీయ రహదారి పక్కన లోయలోకి జారిపడ్డ కారు

చిన్న కార్లు.. పెద్ద ప్రమాదాలు..!

తొండంగి అర్బన్: ఇటీవల రోడ్డు ప్రమాదాలు మరింత పెరిగాయి. అందులోనూ చిన్న కార్ల ప్రమాదాల తీవ్రత మరింత హెచ్చింది. వాహనాలను నడిపేటపుడు నిబంధనలు పాటించకపోవడం, మద్యంతాగి డ్రైవింగ్ చేయడంతో పాటు పలు కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఒక్కోసారి వాహనం దెబ్బతినడం, ఇంకోసారి ప్రాణాలు పోగొట్టుకోవడం నిత్యకృత్యమైపోయింది. సురక్షిత డ్రైవింగు కోసం పోలీసులు, రవాణా శాఖాధికారులు పదేపదే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా ఫలితం కానరావడం లేదు. సురక్షిత డ్రైవింగుకోసం పోలీసులు ఎన్ని విధాలుగా చెబుతున్నా ప్రమాదాలు ఆగకపోవడంతో ప్రతి ఒక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తొండంగి వద్ద రోడ్డు పక్కనున్న కాల్వలోకి కారు జారి పడి కారు పూర్తిగా పాడైంది. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే 16వనంబరు జాతీయ రహదారిపై మరో కారు బోల్తాపడి ఒకరు మృతి చెందడంతో పాటు మరో నలుగురు గాయపడ్డారు. ఈ రెండు ప్రమాదాలు కూడా యాధృచ్ఛికంగా జరిగినవే కావడం విశేషం. అందులోనూ రెండూ ప్రమాదకర ప్రదేశాల వద్ద ఎటువంటి ముందస్తు సూచనల బోర్డులను ఏర్పాటు చేయకపోవడమే కారణమని అధికారులు తేల్చి చెప్పారు. తొండంగి వద్ద ఇప్పటికే చాలా ప్రమాదాలు జరిగాయి. అక్కడ ప్రమాదకరమైన మలుపు ఉంది. అయినా ఎటువంటి బోర్డులేకపోవడంతో చాలా ప్రమాదాలు జరిగాయి. ఇది పక్కాగా అధికారుల తప్పిదమే కావడం విశేషం. అలాగే జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదం కూడా. కారు టైరు పేలిన కారణంగా కారు ఒకవైపుకు లాగి ప్రమాదం జరిగింది. అక్కడా ప్రమాదకర మలుపుఉంది. అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడంతో సరిపెట్టకుండా తాము చేయాల్సిన పనులు చేయాలని గుర్తించాలి. రోడ్డు స్వభావం తెలిపే బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సత్కారం

తొండంగి అర్బన్: బదిలీపై వెళుతున్న పంపాదిపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. పంపాదిపేటలో 8ఏళ్ల పనిచేసిన కొంజర్ల రమణ గడ్డిపేట స్కూల్‌కు బదిలీపై వెళ్ళారు. దీంతో ఆయన్ను సహచర ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు సత్కరించారు. రమణ 8ఏళ్లపాటు పనిచేసి అందరి ఆదరాభిమానాలు పొందారన్నారు. భవిష్యత్తులోనూ రమణ అందరి ఆదరాభిమానాలు పొంది విద్యార్దులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఎం సిహాద్రి, మరళీకృష్ణ, ఉమాదేవి, జగన్నాధం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మజ్యోతి ఆలయ 12వ వార్షికోత్సవం

కోటనందూరు: మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో ధర్మజ్యోతి ఆలయం 12వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. ఈవారోత్సవానికి శాంతి ఆశ్రమం చిదానంద గిరి మాతాజీ, శ్రీహరిరాజు వస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

'వాతావరణ సమతుల్యతకు మొక్కలు దోహదం'



చామవరంలో మొక్కలు నాటుతున్న శేషగిరిరావు

తునిరూరల్: వాతావరణ సమతుల్యత కాపాడుటలో మొక్కలు ఎంతగానో దోహదపడ తాయని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పోల్నాటి శేషగిరి రావు అన్నారు. ఆమని ప్లాంటేషన్ పథకం ద్వారా వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసంద ర్భంగా చామవరం నామవరం గ్రామంలో మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని హరితాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఏపీఎం రఘు మాట్లాడుతూ మండలంలో 13న్నర కిలో మీటర్లు మేర ఆమని ప్లాంటేషన్ పథకం ద్వారా రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో లోవదేవస్థానం చైర్మన్ కరపా అప్పారావు, చామవరం సర్పంచ్ సగరపు నాగబాబు, గాది వరహాలబాబు, నడిగట్ల సూరిబాబు, వంగలపూడి బుజ్జి, ఏపీవో రాజుగోపాల్ తదితరులున్నారు.

'పేదవాడికి పక్కా ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం'



వి.కొత్తూరు గ్రామసభలో మాట్లాడుతున్న తాండవ షుగర్స్ చైర్మన్ లోవరాజు

తునిరూరల్: రాష్ట్రంలో ప్రతి పేదకుటుంబానికి పక్కా ఇళ్లు నిర్మించాలన్నదే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని తాండవ షుగర్స్ చైర్మన్ సుర్ల లోవరాజు అన్నారు. మండలంలో వి.కొత్తూరు గ్రామంలో తహసీల్దార్ సూర్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన హౌసింగ్ గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో ఆర్థికమంత్రి యనమల సోదరుల చొరవతో ప్రతి పేదకుటుంబానికి లబ్ధిచేకూర్చే దశగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. గ్రామ సభలు ద్వారా అర్హులైన వారి జాబితాను సిద్ధంచేసి ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ తమరాన వరలక్ష్మి, రామకృష్ణ, ఎంపీటీసీలు కర్రి తాతాలు, ఏడుకొండలు, లోవదేవస్థానం పాలక మండలి సభ్యులు కిల్లి శ్రీనివాసు, యాదాల లోవకృష్ణ, తమరాన సత్యనారాయణ తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి
4
తుని
బుధవారం 9/8/2017
తుని । తుని రూరల్ । తొండంగి అర్బన్ । తొండంగి రూరల్ । కోటనందూరు

ఉపాధ్యాయుల టెలీకాన్ఫరెన్స్ వాయిదా

తొండంగి రూరల్: ఈనెల 9నుంచి 11వ తేదీ వరకూ జరగాల్సిన ఉపాధ్యాయుల టెలీకాన్ఫరెన్స్ వాయిదా పడినట్లు ఎంఈవో షేక్ బాబ్జి తెలిపారు. ఈమేరకు సర్వశిక్షాభియాన్ అధికారుల నుంచి సమాచారం అందిందన్నారు. 9, 10 తేదీలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు, 11న హైస్కూల్ ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఉంటుందని ముందుగా ప్రకటించామన్నారు. దీనిని వాయిదావేసిన అధికారులు తదుపరి ఎప్పుడు నిర్వహించేది తెలుపుతామన్నారన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు రిలీవింగ్ ఆర్డర్లు ఇచ్చామన్నారు. 9వ తేదీ ఉదయం వీరంతా తాము కోరుకున్న నూతన పాఠశాలల్లో చేరి ప్రధానోపాధ్యాయుల ద్వారా జాయినింగ్ రిపోర్టు అందించాలన్నారు.

● మినీ ఇంటర్వ్యూ



పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

చింతకాయల రవికుమార్
ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్

●కోటనందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి పెంపుపై ఏం చర్యలు చేపట్టారు?
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. ఈమేరకు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు స్థాయి పెంచేందుకు హామీ నిచ్చారు.

●రోగులను సరిగా చూడటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి కదా?
ఆసుపత్రిలో రోగులను సరిగా చూడటం లేదని ఫిర్యాదులు రావటం వాస్తవమే నన్నారు. రోగులను సరిగా చూడని సిబ్బం దిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

● రోగులకు మందులు అందుబాటులో ఉన్నాయా?
రోగులకు కావల్సిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. పాము, కుక్క కాటుకు మందులు సిద్దంగాఉన్నాయి.

● వైద్య సిబ్బంది గ్రామాల్లో ఉండటం లేదని రోగులు నుంచి ఫిర్యాదులు పై ఏచర్యలు తీసుకున్నారు?
గ్రామాల్లో వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపట్టాం.

ఎండిపోతున్న పత్తి పంట

ఆందోళనలో రైతులు

తుని: వాతావరణం రోజుకొక్కరీతిలో ఉండడం వల్ల రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది గత నెలలో కురిసిన వర్షాలకు రైతులు ముందుగానే విత్తుపడుతుందని సంతోషంతో



తుని మండలం హంసవరంలో సాగుచేస్తున్న పత్తి చేలు

సాగుకు సన్నద్ధమయ్యారు. తీరా పత్తి విత్తు నాటేసరికి వర్షాలు ముఖం చాటేశాయి. దీంతో పత్తి విత్తిన రైతులు ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఈవారంలో వర్షం కురవకపోతే పత్తిమొక్కలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. దీంతో ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడులు నాశనమయ్యే అవకాశం కనిపిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరు అడపాదడప కురిసిన వర్షాలకు గట్టెక్కుతుందని రైతులు ఆశించారు. అయితే వరుణుడు కరుణించకపోవడంతో రైతుల్లో గుబులు మొదలయ్యింది. కొంతమంది రైతులు పత్తిమొక్కలను బతికించేందుకు బిందెలతో దూరప్రాంతాల నుంచి నీటిని తీసుకొచ్చి పోశారు. అయితే ఇప్పటివరకు వర్షాలు కురవకపోతాయా..అని కోటి ఆశలతో మొక్కలను చిన్నపిల్లలను చూసినట్లు పలు సేవలు చేశారు. ఇంక వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆశలు సన్నగిల్లాయి. దీంతో పత్తి పంటపై నమ్మకం కోల్పోతున్న రైతన్న భవిష్యత్‌లో వరి నమ్ముకోవడమే మంచిదని భావిస్తున్నాడు. ఎందుకంటే వర్షాలు ముమ్మరంగా కురిస్తే నాట్లు వేసుకోవచ్చు, లేకుంటే ఖాళీగా



నాట్లు పడక ఏపుగా పెరిగిన వరినారు

ఉండవచ్చునని భావిస్తున్నారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా కాస్తుండడంతో పత్తి చేలన్నీ బీడువారుతున్నాయి. దీంతో మళ్లీ వర్షం కోసం రైతులు గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. ఇక వరి నాట్లు పరిస్థితి కూడా అలాగే మారింది. ప్రస్తుతం నారుమళ్లు పూర్తిగా ఎదిగి ఉండడంతో చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో అరకొరగా నాట్లు వేస్తున్నారు. చెరువుల్లో ఉన్న నీటితో నాట్లు వేసినప్పటికి వర్షాలు పడకపోతే వరి పంట పండించే రైతులు పరిస్థితి కూడా దిక్కుతోచని స్థితిలోనే ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వాతావరణంలో మార్పులు జరిగి వర్షాలు కురిస్తే సాగు చేస్తున్న రైతుల్లో ఆశలు చిగురిస్తాయి.

● కోటనందూరు

'డ్రైవర్లను వేధించే విధానం మార్చుకోవాలి'

తుని: ఆర్టీసీ డ్రైవర్లను వేధించే విధానాన్ని అధికారులు మానుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ తుని డిపో సెక్రటరీ బి.రమణ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ పాసింజర్ ఫోన్ కాల్‌తో డ్రైవర్, కండక్టర్లను వేధించే చర్యలు మానుకోవాలన్నారు. కేసులపై డిపో మేనేజర్ పక్షపాతి వైఖరి మార్చుకోవా లన్నారు. డ్రైవర్ కేఆర్ కృష్ణపై విధించిన షోకాజ్‌రిమూవల్ ఉపసంహరించుకోవాల న్నారు.

'శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయండి'

తొండంగి అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయ సాగు చేయాలని తద్వారా లాభదాయకంగా మార్చుకోవాలని జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ చాంబర్ కన్వీనర్ యనమల కృష్ణుడు అన్నారు. మంగళ వారం ఆయన దానవాయి పేటలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో



సమావేశంలో మాట్లాడుతున్న యనమల కృష్ణుడు

పాటు సంక్షేమపథకాల ఫలాలను పంపిణీ చేశారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ సాగుతున్నందున రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తామన్నారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటి కపుడు సూచనలు, సలహాలు ఇచ్చి సహకరించాలన్నారు. రైతులకు జింక్‌ను ఉచితంగా పంపిణీ చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూసార పరీక్షలు జరిపించుకుని దాని ఫలితాల ప్రకారం పంటలు వేసుకోవాలన్నారు. మంచి దిగుబడులు పొంది లాభదాయకంగా మార్చుకోవాలన్నారు. కోడ వెంకటరమణ, సర్పంచ్ చొక్కా హరిబాబు తదితరులు మాట్లాడారు. తీరప్రాంతాల రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మత్స్యకారులకు ఇవ్వాల్సిన వేట నిషేద పరిహారాన్ని త్వరితగతిన మంజూరు చేసేవిధంగా ప్రభుత్వంతో మాట్లాడాలన్నారు. సూరాడ రమణ, నేమాల సత్యనారాయణ, పేకేటి హరికృష్ణ, పేకేటి యజమాని, నేమాల దండు తదితరులు మాట్లాడారు. నేమాల బాబూరావు, మచ్చర్ల నాగేశ్వరరావు, సారిపల్లి బాబూరావు, గోసల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి శారదాదేవి

పిల్లల ఆరోగ్యానికి తల్లిపాలే శ్రీరామరక్ష

తొండంగి రూరల్: పిల్లల ఆరోగ్యానికి తల్లిపాలే శ్రీరామరక్షని ప్రతి తల్లి తన బిడ్డకు పాలందించి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శారదాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం ఏవీ నగరంలో జీఎంఆర్ వరలక్ష్మి, ఫౌండేషన్, ఐసీడీఎస్ తుని రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను చాటిచెప్పేందుకు అన్ని గ్రామాల్లో వారోత్స వాలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్వాడీ వర్కర్లు అందించే సూచనలు పాటించి మెరుగైన ఆరోగ్యం పొందాలన్నారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల ద్వారా పిల్లల పోషకాహార విలువలు వాటిని కాపాడేందుకు తీసుకో వలసిన చర్యలపై అవగాహన ఏర్పరుస్తున్నారు. ప్రోగ్రాం అధికారి సుధాకర్ మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా మాతాశిశు సంరక్షణకు తమ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నా మన్నారు. ఈసందర్భంగా వెల్ బేబీ, ఉత్తమ తల్లుల పోటీలునిర్వహించి గ్రామ పెద్ద యనమల నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఫౌండేషన్ రూపొందించిన కరపత్రాన్ని తల్లులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో మాధవి, సర్పంచ్ యనమల వెంకటరమణ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

'రేపు ఎస్ఎఫ్ఐ బంద్ విజయవంతం చేయండి'



కోటనందూరులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కోటనందూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 10న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని తుని డివిజన్ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి జి.రాము పిలుపునిచ్చారు. మంగళవారం కోటనందూరు హైస్కూల్ ఆవరణలో విద్యార్థులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలను పెంచాలి. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్ మూసివేతను ఆపాలి, పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిధులు పెంచాలి. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి.నవీన్‌కుమార్, ఎన్. మణికంఠస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెరుమాళ్లపురంలో ప్రజాసాధికార సర్వే గ్రామ సభ



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్యనారాయణ

తొండంగి రూరల్: పెరుమాళ్లపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజా సాధికార సర్వే గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ టీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ గతంలో ఇంటింటికి తిరిగి ప్రజా సాధికార సర్వే ద్వారా సిబ్బంది పలు వివరాలు సేకరించారన్నారు. దీనికి సంబంధించిన మొత్తం వివరాలను గ్రామ సభలో చదివి వినిపించి గ్రామ సభ ఆమోదం పొందడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాలిబోయిన చంద్రరావు, సర్పంచ్ చవల లలితకుమారి, రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, కొండబాబు, శేషారావు, యాదాల సింహాచలం, అప్పారావు, మాధవ తదితరులు పాల్గొన్నారు.

● సినిమా గైడ్

తుని:

శ్రీరామ	డీజే
వీర్రాజు	ఫిదా
శ్రీనివాస	నక్షత్రం

పాయకరావుపేట:

గౌతమ్	దర్శకుడు
చిత్రమందిర్	రాధ
సాయిమహల్	గౌతమనంద
సూర్యమహల్	నక్షత్రం
శ్రీ శ్రీలక్ష్మి	ఫిదా

చంద్రన్న కానుకలుపై హర్షం

ధవళేశ్వరం: చంద్రన్న సంక్రాంతి కానుకలో చీరా, దోవతి అందించడానికి ప్రభుత్వం నిర్ణయించడంపై రాజమహేంద్రవరం పద్మశాలీయ సంఘం కోశాధికారి ఎర్రమోతు ధర్మరాజు హర్షం వ్యక్తం చేశారు. చేనేత సంక్షేమ మండలి, సంక్షేమ నిధి ఏర్పాటు, నేతన్నల రుణమాఫీకి రూ.75కోట్ల విడుదల వంటివి నేతన్నలపై ప్రభుత్వానికి గల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. చంద్రన్న సంక్రాంతి కానుకలో చీరా, దోవతి ఇవ్వాలనే నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగాఉన్న నేతన్నలకు ఉపాధి లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. నేతన్నలు ధీమాగా బతకడానికి ప్రభుత్వ పరంగా చేయూతనిస్తూ నిర్ణయాలుతీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి కింజారపు అచ్చేన్నాయుడుకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

● మినీ ఇంటర్వ్యూ



త్వరలో ట్రాక్టర్ల పంపిణీ

కె.శ్రీనివాస్, రూరల్ మండల వ్యవసాయాధికారి

●రైతులకు రాయితీపై ట్రాక్టర్లు ఇస్తున్నారా?
మండలంలో రాయితీపై ట్రాక్టర్లు సరఫరా చేయటానికి రైతుల వద్దనుంచి దరఖాస్తులు స్వీకరించాం. త్వరలో ప్రభుత్వ ఆదేశాలప్రకారం పంపిణీ చేస్తాం.

●వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నారా?
పవర్‌టిల్లర్లు, ఆయిల్ ఇంజన్లు సరఫరాకు రైతులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.

●ప్రస్తుతం వరిపంట పరిస్థితి ఎలా ఉంది?
మండలంలో వరిపంట ఆశాజనకంగా ఉంది. వరినాట్లు పూర్తయి 25రోజులుకావడంతో కాండం తొలుచు పురుగులపట్ల అప్రమత్తంగా ఉండాలి.

● టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయా?
ప్రస్తుతం అందుబాటులో లేవు.

●రాజమహేంద్రవరం రూరల్

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● రొయ్యసీడ్‌ను గోదావరిలోకి వదులుతున్న ఎమ్మెల్యే గోరంట్ల


రొయ్యసీడ్‌ను గోదావరిలోకి విడిచిపెడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం: మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ కృషి చేస్తుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మంగళవారం మత్స్యకారుల ఆధ్వర్యంలో రొయ్య సీడ్‌ను ధవళేశ్వరం కంచలైన్ రేవువద్ద రొయ్య పిల్లలను గోదావరిలోకి విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గోదావరిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారకుటుంబాలకు మత్స్య సంపద పెంపొందించి జీవనోపాధి కల్పించడానికి గోదావరిలో ప్రతిఏటా రొయ్యసీడ్, చేపపిల్లలను మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం గోదావరిలోకి విడుదల చేస్తుందన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి సబ్సిడీతో కూడిన వలలు ఐసుబాక్సులు, మోపెడ్‌లు, మెకనైజ్డ్ బోటులు, పంపిణీ వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో మూడు నెలల వ్యవధిలో కోటి రొయ్యపిల్లలను గోదావరిలోకి విడిచిపెట్టడం లక్ష్యంకాగా ప్రస్తుతం 20వేల సీడ్‌ను విడిచిపెడుతున్నామని మత్స్యశాఖ ఏడీ వి.కృష్ణారావు ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అభివృద్ధి అధికారులు ఎన్. నాగమణి, కె.రామకృష్ణ, పార్టీ పట్టణాధ్యక్షుడు పుకెళ్ళ సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి అడపాశ్రీను, జన్మభూమి కమిటీ సభ్యుడు వర్రె రాజేష్, మాజీ ఎంపీటీసీ ఆళ్ళ ఆనందరావు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో ఆనందలహరి


ఆనందలహరి పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ఒత్తిడి లేని విధంగా విద్యాబోధన
1, 2 తరగతులకు అమలు

రాజమహేంద్రవరంరూరల్: ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఒత్తిడిలేని విద్యాబోధన అందించేందుకు చర్యలు చేపట్టింది. ఎంపీపీ పాఠశాలల్లో ఆనందలహరి స్కూళ్లను ప్రారంభిస్తున్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు పంచాయతీ పరిధిలోని సంతోష్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఆనందలహరి స్కూల్‌ను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఒత్తిడి లేకుండా చిన్నారులకు విద్యాబోధన అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆడుతూ, పాడుతూ విద్యనభ్యసించే విధంగా చిన్నతనం నుంచి కంప్యూటర్ పరిజ్ఞానం, ట్యాబల పరిజ్ఞానంతో విద్యార్థులకు అందించనున్నారు. మొదటగా 1, 2 తరగతులకు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ విధానం చిత్తూరు జిల్లా మదనపల్లి రుషివ్యాలీ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఆ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను ట్రైనింగ్‌కు పంపారని వీరితో విద్యాబోధన చేస్తారన్నారు. దీనికి సంబంధించిన మెటీరియల్స్‌ను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణారెడ్డి, మండల విద్యాశాఖాధికారి నరసింహారెడ్డి, దండమూడి సత్యప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఆనందలహరి పాఠశాలలు త్వరలో తొర్రేడు, పిడింగొయ్యి, ఎంపీపీ పాఠశాలల్లో ప్రవేశపెడుతున్నట్టు ఎంఈవో తెలిపారు.

కడియం గ్రామానికి ఒక్కరూపాయి కేటాయించలేదు

● సర్పంచ్ గిరజాల రామకృష్ణతులసి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ గిరజాల తులసి

కడియం: మండల కేంద్రమైన కడియం గ్రామానికి ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి గ్రామ పంచాయతీని విమర్శించడం తగదని కడియం సర్పంచ్ గిరజాల రామకృష్ణతులసి, సొసైటీ అధ్యక్షుడు, రాజమహేంద్రవరం రూరల్ వైసీపీ కోఆర్డినేటర్ గిరజాల బాబు అన్నారు. కడియం పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామానికి ఎంపీ, ఎమ్మెల్యేలు ఒక్క రూపాయి నిధులు విడుదల చేయలేదన్నారు. 2014లో కడియం గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందంటూ శంకుస్థాపన చేశారని ఇప్పటివరకు అతీ, గతీ లేదన్నారు. తాను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటికీ గుజరాత్ పెట్రోలిమిటెడ్ (జీఎస్‌పీఎస్), ఇంటర్నేషనల్ పేపరుమిల్లు, రాందాసు పేపరుమిల్లు సహకారంతో నిధులు సమీకరించి గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల ముందు తాను ఎటువంటి హామీలు ఇవ్వలేదని, గ్రామాభివృద్ధికి 43 ప్రణాళికలు మాత్రం ఇచ్చానని గిరజాల బాబు తెలిపారు. వాటిలో ఏమేమి చేశానో బహిరంగంగానే ఆధారాలతో చెబుతానన్నారు. షాపింగ్‌కాంప్లెక్సు నిర్మాణానికి అడుగడుగునా అడ్డంకులు పెట్టారని ఆరోపించారు. ధవళేశ్వరం ఐటీఐ విద్యాసంస్థ స్థలాన్ని అర్బన్ హౌసింగ్ స్కీం పథకం కింద దారాదత్తం చేస్తున్నారని, తెలుగు యూనివర్శిటీ మాయమయ్యే పరిస్థితి ఉందని బాబు ఆరోపించారు. కడియం గ్రామ పంచాయతీకి నిధుల లోటు తీవ్రంగా ఉందని అయినప్పటికీ పారిశుధ్యాన్ని చక్కగా చేయిస్తున్నామని, 14వ ఆర్థికసంఘం నిధులు సక్రమంగా వినియోగిస్తున్నామని ఆ వివరాలు వెల్లడిస్తామని సర్పంచ్ గిరజాల తులసి, సొసైటీ అధ్యక్షుడు గిరజాల బాబు తెలిపారు. సాలిడ్‌వేస్ట్ మేనేజిమెంట్‌కు రూ.8లక్షల నిధులు ఇస్తామని కేవలం రూ.3లక్షల 30వేలు మా త్రమే మంజూరు చేశారన్నారు. తమ గ్రామ పంచాయతీకి డంపింగ్‌యార్డు లేదని ఎంతో కాలం నుంచి విన్నవిస్తున్నా స్థలం కేటాయించలేదన్నారు. భూగర్భజలాలు ప్రణాళికలు సుద్ద తప్పు అని గ్రామీణ ప్రాంతాలకు ఇవి ఎలా సాధ్యమని బాబు తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు యార్లగడ్డ ఎస్తేరురాణి, గోసాల సుకన్య, కందుకూరి వీర్రాజు, గారపాటి వీర్రాజు, దొడ్డా బుజ్జి, గ్రామాభివృద్ధికమిటీ చైర్మన్ ఉప్పులూరి హనుమంతరావు, కైలాసభూమి అభివృద్ధికమిటీ చైర్మన్ దంగుడు బియ్యం సత్యనారాయణ, రైతు నాయకుడు చిక్కాల ఉమామహేశ్వరరావు, సాకాసతీష్, వందనం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోరుతూ వినతి

కడియం: ఎంఆర్‌పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మందపల్లి రత్నరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. గత 23ఏళ్లగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని శాంతియుతంగా కొనసాగిస్తున్నామని ఇప్పటికైనా ఈ పార్లమెంట్ సమావేశంలో వర్గీకరణ బిల్లు పెట్టి అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, లేదంటే రానున్న రోజుల్లో ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకులపాటి సోమరాజు, ముమ్మిడివరపు మహాలక్ష్మి, పెనుమాక శ్రీను, కొమ్ము సత్తిబాబు, కందుకూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందజేశారు.


డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

● సినిమా గైడ్

వీఎస్ మహల్	నక్షత్రం
శ్రీవిజయాటాకీస్	ఫిదా
శ్రీవెంకటసూర్య	నక్షత్రం
మురళీకృష్ణ	నక్షత్రం

పాఠశాలల్లో ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమం



వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ధవళేశ్వరం: ధవళేశ్వరం కంచర్‌లైన్ ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ సభ్యులు చిర్రావూరి శివప్రసాద్, బాలేపల్లి మురళీధర్‌లు ప్రారంభించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బోను రాము పర్యవేక్షణలో పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థులకు ఎమ్మార్ టీకాలను వేశారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో రెండోరోజు ఎమ్మార్ టీకాల కార్యక్రమం కొనసాగుతోంది.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ తులసి

కడియం: రోగనిరోధకశక్తి ఎక్కువగా ఉండే తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని కడియం సర్పంచ్ గిరజాల రామకృష్ణ తులసి పేర్కొన్నారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేకలదిబ్బ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ గిరజాల తులసి మాట్లాడారు. అనంతరం సర్పంచ్ తులసి గర్భిణులకు పౌష్టికాహారకిట్లను అందజేశారు. జీఎంఆర్ ప్రతినిధులు శబరీనాథ్, మనోహర్, హెచ్ఎం టి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత రుతువు శోభా కార్యక్రమం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు పంచాయతీ పరిధిలోని నవభారత్ నగర్‌లో గల అక్షరశ్రీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వసంత రుతువు శోభా కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వసంత రుతు శోభను వర్ణిస్తూ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. చెట్లు ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు చేసిన మూకాభినయం, కలుషితమౌతున్న వాతావరణాన్ని పరిరక్షించేందుకు చెట్లు ఎంత ముఖ్యమో తెలుపుతూ హిందీ, ఇంగ్లీష్, తెలుగులో విద్యార్థులు చేసిన ప్రసంగాలు అబ్బురపర్చాయి. పాఠశాల డైరెక్టర్ టి.నాగరత్నం మాట్లాడుతూ పండిత వసంతరాయల కాలంనుంచి వసంతాల పండుగను జరుపుకోవడం ఆంధ్రుల ఆనవాయితీ అని తెలిపారు. ప్రతిఒక్కరూ చెట్లు నాటాలని, వాటిని పరిరక్షించడం ప్రధానం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ ఇన్‌చార్జి సిహెచ్‌ఉషా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

'జాతీయ రహదారిపై తిరిగే ఆవులను గోశాలకు తరలిస్తాం'

దివాన్‌చెరువు: దివాన్‌చెరువులోని జాతీయ రహదారిపై సంచరించే ఆవులను తుని సమీపంలోని గోశాలకు తరలించనున్నామని దివాన్‌చెరువు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరం ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జాతీయ రహదారిపై పశువులు సంచరించకుండా వాటిని యజమానులు జాగ్రత్త పరచుకోవాలని గ్రామంలో దండోరా వేయించామని చెప్పారు. చాలా పశువులు రోడ్లమీదే సంచరిస్తున్నాయన్నారు. వీటిని తుని సమీపంలోని గోశాలకు ఈ ఆవులను తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

ఏడు కోట్ల ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

కోరుకొండ: జూన్ 2016 నుంచి మే 2017 వరకూ కోరుకొండ మండలంలో 20గ్రామ పంచాయతీల పరిధి లో జరిగిన ఉపాధిహామీ పనులపై మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రిసైడింగ్ అధికారిణి బి.శ్యామల ఆధ్వర్యంలోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించిన బీఆర్‌సీలు తయారు చేసిన నివేధికలను సమావేశంలో చదివి వినిపించారు. అర్హతలేనివారికి పింఛన్లు ఇవ్వడం చదవని వారికి స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం తక్కువ పనులకు ఎక్కువ డబ్బు చెల్లించడం, నీటికుంటలు తవ్వకుండానే తవ్వినట్లుగా డబ్బులు డ్రా చేయడం, తక్కువ పనికి ఎక్కువ వేతనాలు చెల్లించడం, దొంగమస్తర్లువేయడం, అందరు వేలు ముద్రలు ఒకేలాగ ఉండటం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడటం, కాంట్రాక్టర్ల ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి లబ్ధిదారుల నుంచి అధనంగా డబ్బు వసూ లు చేయడం, కచ్చా డ్రైన్లు, పంటబోదెలు, పండ్లతోటల పెంపకం, నీటికుంటలు, నాడప్ పనులు, డంపింగ్ యా ర్డు పనులు, వరదకట్టలు నిర్మాణం, వంటి పనుల్లో సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బంది, సాంకేతిక సిబ్బంది, పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న వాస్తవాలను సామాజిక తనిఖీ బృందాలు సమావేశంలో వెల్లడించాయి. కోరుకొండ మండలం గుమ్ములూరు గ్రామ సర్పంచ్ చిటికిన సత్యవతి భాస్కరరావు తమ గ్రామంలో జరిగిన ఏ ఒక్క పని గురించి తాము తీర్మానాలు చేయలేదని ఉపాధిహా మీ సిబ్బంది కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వలేదని డీఆర్‌డీఏ ఎడిషినల్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్యామల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో సర్పంచ్‌కి తెలియకుండా పనులు చేయడం ఏమిటని జెడ్పీటీసీ మల్లా అప్పల నరసారావు ఉపాధిహామీ సిబ్బందిని ప్రశ్నించా రు. అదే గ్రామంలో 257 పనులు చేపట్టామని రూ.15 లక్షల 26వేల 543 ఖర్చు చేశామని అధికారులు చెప్పడం తో సర్పంచ్ ఆశ్చర్యపోయారు. గాడాల గ్రామంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగాయని గ్రామస్థులు సమావేశం దృష్టి కి తీసుకువచ్చారు. కాపవరం, గాదరాడ, కణుపూరు, గాడాల, గుమ్ములూరు, మధురపూడి తదితర గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు నివేదికలో తెలియజేశాయి. ఉదయం ప్రారంభమైన సామాజిక తనిఖీ సమావేశం సాయంత్రం పొద్దుపోయేవరకూ జరిగింది. ఈ సమావేశంలో ఏపీడీ ఎన్.సోమేశ్వరరావు, ఎస్ఆర్‌పి.గురుమూర్తి, టీవోటి కె.సత్తిబాబు, ఎంపీడీవో ఇ.మహేశ్వరావు, ఏపీవో బి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు రెయిలేసి లక్ష్మి, ఎంపీటీసీలు ఆర్.సత్తిబాబు, బి.పెదకాపు, పి.ప్రదీప్, డి.కాంతారావు, మళ్ళ అప్పలనరసారావు, టి.శ్రీనివాస్, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, వెలుగుసిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో అధికారిణి నిలదీస్తున్న ప్రిసైడింగ్ అధికారిణి శ్యామల

'ఉపాధి' పనుల్లో అవకతవకలు

● ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

కోరుకొండ: కోరుకొండ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో సుమారు 8లక్షల రూపాయలు అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. దీంతో ప్రెసైడింగ్ అధికారిణి బి.శ్యామల కాపవరం ఫీల్డ్ అసిస్టెంట్‌కు సోకాజ్ నోటీసు ఇచ్చారు. అదేవిధంగా బొల్లెద్దుపాలెం ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధులనుంచి తొలగించారు. 45వేల 775 రూపాయల రికవరి పెట్టారు. 11,500రూపాయలు ఫైన్ వేశారు. రూ.5లక్షల64వేల 82 నిధుల ఖర్చుకు సంబంధించి రిఫరెన్స్‌కు పంపినట్లు ఎస్ఆర్‌పీ గురుమూర్తి తెలిపారు.

'తెలుగు సాహిత్యంలో అజరామరుడు చెళ్ళపిళ్ళ'



చెళ్ళపిళ్ళ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

కడియం: తెలుగు సాహితీ చరిత్రలో అజరామరుడు చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి అని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి కళాసేవాసమితి అధ్యక్షుడు కొత్తూరి బాలనాగేశ్వరరావు అన్నారు. జంటకవుల్లో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి 147వ జయంతిని కడియంలో మంగళవారం నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న జంటకవుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.విష్ణుమూర్తి, డాక్టర్ దేవవరపు నీలకంఠరావు, చిలుకూరి శ్రీనివాసరావు, ఉంగరాల వీరభద్రరావు, అడపా సుబ్రహ్మణ్యం, తమ్మిశెట్టి ప్రసాదు, బడిగంటి బూసియ్య, సీతామహాలక్ష్మి, మీర్జా ఆలీ, టి.సత్యనారాయణ, కొత్తూరి కృష్ణ, కర్రిరాజు, జేఏఎస్‌వీ ప్రసాదు, బడిగంటి సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడు ఖాన్ దపంతులకు సత్కారం



ఖాన్ దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయసంఘనేతలు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలో వెంకయ్యపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వేరే ప్రాంతానికి వెళుతున్న ఉపాధ్యాయుడు ఎండీఏ ఖాన్ దంపతులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వారా పాప, వారా రాము, మాజీ సర్పంచ్ గట్టి నర్సయ్య, ఎంపీటీసీ ఆకుల రాజేశ్వరి, వార్డు సభ్యుడు గట్టి శ్రీను, షేక్ సలీం, ఎండీ సర్కార్‌భాషా, ఎంఈవో వి.లజపతిరాయ్, హెచ్‌ఎం సీహెచ్‌యూవీఎస్ భారతి, ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

రాజమహేంద్రవరంరూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ ఇందిరమ్మ కాలనీలో జరిగిన ఆదర్శ ప్రజా సంక్షేమ సంఘం ఎన్నికల్లో డాక్టర్ కన్నాబత్తుల శ్రీనివాస్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గం ఉపాధ్యక్షుడిగా మజ్జి సత్యశ్రీనివాస్, పగడం పోసిబాబు, ప్రధాన కార్యదర్శిగా డీఎస్‌వీ సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా బి.శ్రీనివాస్, ఎస్.సత్తిబా బు, కార్యనిర్వాహక కార్యదర్శిగా సజ్జా రాంబాబు, ట్రెజరర్‌గా ఎం.శ్యామలను ఎన్నుకున్నట్టు అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి సమస్యల పరిష్కారాన్ని నాయకులతోను, అధికారులతోను చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

మహిళల సంక్షేమానికి అనేక పథకాలు

కడియం: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు రూపొందిస్తుందని ప్రజాప్రతినిధులు తెలిపారు. మంగళవారం మురమండ, జేగురుపాడు గ్రామాల్లో ఐసీడీఎస్ కార్యక్రమాలు నిర్వహించారు.

●మురమండ గ్రామ సర్పంచ్ ఈదర పాపారావు సొంత నిధులు రూ.30వేలతో 7అంగన్‌వాడీ కేంద్రాలకు గ్రైండర్లు, మిక్సీలు, ఇతర సామాగ్రిని గ్రామ సర్పంచ్ ఈదర పాపారావు వాడీ టీచర్లుకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఈదర పాపారావు సేవాభావాన్ని అధికారులు, గ్రామస్థులు, అంగన్‌వాడీ టీచర్లు అభినందించారు.

ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి సూర్యకుమారి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, తహసీల్దారు కె.రాజ్యలక్ష్మి, వీఆర్‌వో ప్రసాదు, కార్యదర్శి ఏ శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

● జేగురుపాడులో జరిగిన అంగన్‌వాడీ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గారపాటి అమరనాద్ మాట్లాడారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని ప్రతి బాలిక విద్యావంతులైతేనే సమాజం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా ఇద్దరు ఆడపిల్లలకు రూ.60వేలు, ఒక్క ఆడపిల్ల అయితే రూ.లక్ష విలువచేసే బాండ్లను పిల్లల తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాతూరి సత్యనారాయణ, ఎంపీటీసీ నాగిరెడ్డి వీరశివాజీ, మర్రెడ్డి రమేష్, మాదారపు సూరిబాబు, ఐసీడీఎస్ ఏసీడీపీవో వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





మురమండలో అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి అందజేస్తున్న సర్పంచ్ పాపారావు, జేగురుపాడులో ఐసీడీఎస్ సర్టిఫికెట్లు అందజేస్తున్న గారపాటి అమరనాథ్

పీఎంఏవై లబ్ధిదారుల గుర్తింపు

కడియం: సామాజిక, ఆర్థిక గణన సర్వే ఆధారంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజనా గ్రామీణ పథకంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపికచేసి వారికి ఇళ్ల మంజూరు కోసం మంగళవారం జేగురుపాడు, మురమండ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

● జేగురుపాడులో కమ్యూనిటీ భవనంలో జరిగిన గ్రామసభలో గ్రామ ఉపసర్పంచ్ గారపాటి అమరనాద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు ఇవ్వాలన్నదే తెలుగుదేశం ప్రభుత్వం లక్ష్యం అన్నారు. సర్వే ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని అమరనాథ్ తెలిపారు. గ్రామసభలో మాజీ సర్పంచ్ పాతూరి సత్యనారాయణ, ఎంపీ టీసీ నాగిరెడ్డి శివాజీ, మాదారపు సూరిబాబు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్, పంచాయతీవార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● మురమండలో పంచాయతీ కార్యాలయంవద్ద జరిగిన గ్రామసభలో సర్పంచ్ ఈదర పాపారావు మాట్లాడుతూ సామాజిక ఆర్థిక గణన సర్వే ఆధారంగా పీఎంఏవై పథకం లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రత్తిపాటి సూర్యకుమారి, ప్రత్తిపాటిరామారావుచౌదరి, పంచాయతీ పాలకమండలి, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దారు కె.రాజ్యలక్ష్మి, హౌసింగ్ ఏఈ బీవీవీ సూర్యనారాయణమూర్తి, కార్యదర్శి ఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జేగురుపాడు గ్రామసభలో మాట్లాడుతున్న అమరనాథ్